
వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక : 1 హైదరాబాద్ 90 జనవరి 2009 పేజీలు : 84 రు. 10



❖ ఫోకస్ : సామాన్యుల కలలు - ఆశలు
యాభై మంది అభిప్రాయాలు


❖ ముంబయి దాడులపై అరుంధతీ రాయ్

❖ ఆసిడ్ దాడి - ఎన్‌కౌంటర్

❖ కోస్తా కారిడార్ - సెజ్‌లు

❖ బొగ్గు గనుల విధ్వంసం

❖ అమెరికా ఆర్థిక మాంద్యం


SUPRABHAT
GROUP OF INSTITUTIONS
TAKSHASILA
PUBLIC SCHOOL
(Affiliated to CBSE, New Delhi)
Shantinagar, Lallaguda, Secunderabad.
Phone : 040-27052267 / 27052268
SUPRABHAT
MODEL HIGH SCHOOL
(Recognised by Govt. of A.P.)
Habsiguda Main Road, Hyderabad.
Phone : 040-32935733 / 65161684
FIRST STEPS
PRE-PRIMARY SCHOOL
Habsiguda Main Road, Hyderabad.
Phone : 040-32935733 / 65161684
Making Education Enjoyable

పాఠకులకు, రచయితలకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు
2009 నూతన సంవత్సర శుభాకాంక్షలు

వీక్షణం 90
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

జనవరి 2009
సంపుటి : 7 సంచిక : 1

సమతా పబ్లికేషన్స్,
సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ /
సర్క్యులేషన్ మేనేజర్ :
వై. రామచంద్రం
9949391028

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

సబ్ఎడిటర్ :
పి. గాయత్రి ప్రసన్న

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	రు. 120
3 సంవత్సరాల చందా	రు. 350
5 సంవత్సరాల చందా	రు. 550
10 సంవత్సరాల చందా	రు. 1000

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు,
డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
reachcdrc@yahoo.com

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
98482 49695

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

నిందితులను సరే, వ్యవస్థనేం చేద్దాం?

డిసెంబర్ మొదటివారంలో వరంగల్‌లో జరిగిన రెండు దారుణ సంఘటనలు తెలుగు సమాజ జీవితం ఎంతగా పుచ్చిపోయిందో తేటతెల్లం చేస్తున్నాయి. రాష్ట్రంలో జనజీవన సహజీవన సంస్కృతి ఎంతగా పతనమవుతున్నదో, అవతలి మనిషికి భిన్నాభిప్రాయం ఉన్నప్పుడు, ముఖ్యంగా ఆ మనిషి స్త్రీ అయినప్పుడు, ఎంతగా హంతక దమననీతి అమలవుతున్నదో, చట్టబద్ధపాలన ఎంత పెద్దఎత్తున విధ్వంసం అవుతున్నదో, వ్యవస్థ పట్ల ప్రజాగ్రహాన్ని తప్పుదారి పట్టించడానికి ఎంత ఘోరమైన పరిణామాలు జరుగుతున్నాయో ఆ దారుణాలు చూపుతున్నాయి. నిజానికి యువతుల మీద ఆసిడ్ దాడి, ఆ దాడికి పాల్పడ్డారనే ఆరోపణపై ముగ్గురు యువకులను ఎన్‌కౌంటర్ పేరిట కాల్చిచంపడం వాటికవిగా హఠాత్తుగా జరిగిన సంఘటనలు కావు. ఆ రెండు దారుణాలకూ వెనుకా ముందూ ఎంతో చరిత్ర ఉంది. మన సమాజ సంస్కృతిలో, పాలనా విధానాలలో, ప్రజా ప్రతిస్పందనలలో విస్తరిస్తున్న ఎన్నో విషపరిణామాల ఫలితమే ఆ దురంతాలు. స్త్రీల మీద అన్ని రంగాలలోనూ పెరుగుతున్న చిన్నచూపు, వివక్ష, స్త్రీ అభిప్రాయానికి విలువ ఇవ్వకపోవడం, తన మనసు మీదా, శరీరం మీదా స్త్రీకి పూర్తి హక్కు ఉందని గుర్తించకపోవడం, స్త్రీ పురుషుడి భోగ్యవస్తువు మాత్రమేననే సాంస్కృతిక ధోరణులు, తమ అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయాన్ని ప్రకటిస్తే అవతలి వ్యక్తి మీద హంతకదాడి చెయ్యవచ్చుననే అసహనవైఖరి, ప్రేమ పట్ల, స్త్రీ పురుష సంబంధాల పట్ల సినిమాలలో, ప్రచార సాధనాలలో, మొత్తంగా సమాజంలో ప్రకటితమవుతున్న దుర్మార్గమైన అభిప్రాయాలు – అటువంటి మరెన్నో కారణాలు కలగలిసినప్పుడు జరిగినదే స్వప్నిక, ప్రణీతలపై ఆసిడ్ దాడి. తన కోరికను కాదన్నదనే కారణంతో స్వప్నిక మీద ఆసిడ్ దాడి జరపడంలో శ్రీనివాస్ అనే ఒకానొక నేరస్తుడు మన కళ్ల ఎదుట కనబడుతుండవచ్చు. కాని అటువంటి శ్రీనివాస్‌లను వేలాదిగా ఈ వ్యవస్థ అనుక్షణం తయారుచేస్తున్నది. తాను చేసిన నేరానికి శ్రీనివాస్ శిక్ష అనుభవించవలసిందే, కాని ఆ శిక్ష వల్ల అటువంటి నేరాలు ఆగిపోబోవడం లేదు. ఆ నేరస్తులకు తక్షణ, కఠిన శిక్షలు విధించాలని బాధితులకు, ఇటువంటి అత్యాచారాలు జరగగూడదని భావించేవాళ్లకు అనిపించవచ్చు. కాని 'కంటికి కన్ను, పంటికి పన్ను' ప్రతీకార శిక్షల ద్వారా సమాజంలో చెలరేగగలిగిన అల్లకల్లోలాన్ని తగ్గించడానికే మానవసమాజం అందరికీ సమానంగా వర్తించే చట్టబద్ధ పాలనను స్థాపించుకున్నది. ఎటువంటి నేరానికయినా పద్ధతిప్రకారం విచారణ జరిపి శిక్ష విధించే వ్యవస్థలను నెలకొల్పుకున్నది. అటువంటి స్వతంత్ర వ్యవస్థలు ఉన్నప్పుడు, కేవలం నేరారోపణ, నేరపరిశోధన, నేరనిరూపణ బాధ్యతలు మాత్రమే ఉన్న పోలీసు వ్యవస్థకు ఆ శిక్షలు విధించే అధికారం లేదు. అంతమాత్రమే కాదు, భిన్నాభిప్రాయాలు గలవాళ్లను, రాజకీయ ప్రత్యర్థులను ఎటువంటి విచారణ లేకుండా మట్టుపెట్టడానికి, హత్యలను ఒక పాలనావిధానంగా అనుసరించడానికి అలవాటుబడ్డ పోలీసు వ్యవస్థకు ఈ శిక్షలు అమలు జరిపే అధికారమే లేదు. పైగా, ఆ యువతుల మీద వేధింపులు జరుగుతున్న సమయంలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి చట్టబద్ధమైన చర్యా తీసుకోని పోలీసు వ్యవస్థ ఇప్పుడు ఒకేసారి అతి భయంకరమైన చట్టవ్యతిరేక చర్య తీసుకుని న్యాయదాత లాగ నటించడం దుర్మార్గం, హాస్యాస్పదం. ఇక తమ అదుపులో ఉన్న, న్యాయరక్షణలో ఉన్న ముగ్గురు యువకులను అతి క్రూరంగా, చట్టవ్యతిరేకంగా చంపిన పోలీసుల చర్యపట్ల కొన్ని ప్రజాసమూహాలలో వ్యక్తమయిన అభిప్రాయాలు భయంగొలుపుతున్నాయి. స్వప్నికలను నిస్సహాయులుగా చేస్తున్న వ్యవస్థే, శ్రీనివాస్‌లను దుర్మార్గులుగా మారుస్తున్న వ్యవస్థే, పోలీసులను మొదట చేయవలసిన పని చేయనివారుగా, ఆ తర్వాత చేయగూడని పనిచేసి ఘనకీర్తి పొందేవారిగా మారుస్తున్న వ్యవస్థే, ప్రజాభిప్రాయాలను ఈ దారుణాలకు అనుకూలంగా, ఈ దారుణాలను సమర్థించేదిగా, ఇంకా ఇంకా ఇటువంటి దారుణాలు జరగాలని కోరుకునేదిగా మారుస్తున్నది. సామాజిక అవ్యవస్థపట్ల ప్రజలలో పెరుగుతున్న ఆగ్రహావేశాలను నిజమైన లక్ష్యం వేపుగా కాక, ఇటువంటి చిల్లర మార్గాల్లోకి మళ్లించడం ద్వారానే జర్మనీలో నాజీజం, ఇటలీలో ఫాసిజం పెచ్చరిల్లాయి. నరహంతక పోలీసు అధికారులను, చట్టబద్ధ పాలనపట్ల, విధివిధానాల పట్ల బహిరంగంగా శిక్షార్హమైన నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులను ప్రశంసించడం, కానుకలివ్వడం తెలుగు సమాజం ఇంతకాలం సాధించిందని చెప్పుకుంటున్న ప్రజాస్వామిక, ఉదాత్త సంప్రదాయాలకు పట్టిన చీడ ఎంతగా విస్తరించిందో చూపుతున్నాయి. అన్ని రంగాలలోనూ సమూలమైన పునరాలోచనలతో కూడిన విప్లవ దృక్పథం, ఆచరణ తెలుగు సమాజానికి ఎంత అవసరమో వరంగల్ దురంతాలు మరొకసారి చూపుతున్నాయి. వీ

ముంబయిలో జన హననం

నవంబర్ చివరి వారంలో మూడు రోజులపాటు దేశ ఆర్థిక, వ్యాపార రాజధాని ముంబయి నగరం టెర్రరిస్ట్ దాడులతో అల్లకల్లోల మయిపోయింది. మొత్తం పది చోట్ల జరిగిన పేలుళ్లలో, తుపాకి కాల్పులలో దాదాపు నూట ఎనభై మంది చనిపోయారు. మరెంతో మంది తీవ్రంగా గాయపడ్డారు. దాడికి బాధ్యులుగా ప్రభుత్వ సంస్థలు చెపుతున్న పదిమందిలో తొమ్మిది మంది ఈ ఘర్షణలోనే చనిపోగా, ఒకరు పట్టుబడి విచారణలో ఉన్నారు. దేశంలో ముస్లింల మీద జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగానే ఈ ప్రతిదాడులు చేశామని ఆ నిందితుడు చెప్పాడని అంటున్నప్పటికీ, నిజానిజాలు ఇంకా బయట పడవలసే ఉన్నాయి. కారణమేదయినప్పటికీ, ఎంత సరయినదయి నప్పటికీ ఇంత పెద్ద ఎత్తున జననష్టం, అందులోనూ ఎక్కువమంది సాధారణ జీవనం గడుపుతున్న ప్రజలు బలి అయిపోవడం తీవ్రంగా ఖండించదగినది. ఈ దాడుల ద్వారా టెర్రరిస్టులు ఎంత అమానుషంగా, నిర్దాక్షిణ్యంగా, అమాయక ప్రజల ప్రాణాలపట్ల విలువలేకుండా ప్రవర్తించారో, పాలనా యంత్రాంగం కూడ సరిగ్గా అట్లాగే ప్రవర్తిస్తున్నది. ఈ దాడులకు లక్ష్యంగా రైల్వేస్టేషన్లలో, ఆస్పత్రులలో సాధారణ ప్రజానీకంతో పాటుగా, దేశంలోకెల్లా విలాసవంతమైన హోటళ్లు కూడ ఉండడంతో పాలకవర్గాల దృష్టి, ప్రచారసాధనాల దృష్టి మామూలుకన్న ఎక్కువగా ప్రసరించింది. ముఖ్యంగా రెండు హోటళ్లలో అతిథులను బందీలుగా పెట్టుకుని దాడులు జరగడంతో వాటికి మామూలు దాడుల కన్న ఎక్కువ ప్రాధాన్యత వచ్చింది. ఇప్పటికే ఎంతోమంది వ్యాఖ్యాతలు ప్రస్తావించినట్టుగా ఒక మురికివాడలోనో, ఒక మధ్యతరగతి నివాస ప్రాంతంలోనో, రైల్వేస్టేషన్లోనో జరిగిన దాడుల సందర్భంలో కన్న ఎక్కువగా పాలనాయంత్రాంగం ఈ దాడి సందర్భంలో స్పందించింది. ఈ దాడి పాకిస్తాన్ గాని, పాకిస్తాన్ ప్రేరేపిత టెర్రరిస్ట్ సంస్థలు గాని చేశాయా, ఈ దాడికి ప్రతిగా పాకిస్తాన్‌లోని టెర్రరిస్ట్ శిక్షణా శిబిరాల మీద దాడి చేయాలా, పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించాలా అని చర్చలు జరుగుతున్నాయి. సరిహద్దులలో సైనిక బలగాల మోహరింపు జరుగుతున్నది. టెర్రరిస్టులు అవలంబిస్తున్న పద్ధతులు, వారు సాగిస్తున్న నిర్హేతుక హత్యాకాండలను ఖండిస్తూనే, వారి దాడులకు అవకాశాన్ని సమకూరుస్తున్నది మన పాలకుల విధానాలేనని కూడ గుర్తించవలసి ఉంది. జరగవలసిన పని ఆ అవకాశాలను, కారణాలను నిర్మూలించడం. యుద్ధం ద్వారా అసలు కారణాలను మసిపూసి మారేడుకాయ చేయడం కాదు.

ఐదు రాష్ట్రాల ఎన్నికలు

ఈ సంవత్సరం జరగవలసిన లోక్‌సభ, శాసనసభల సార్వత్రిక ఎన్నికలకు రిహార్సల్ లాగ ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు తమకే అనుకూలంగా ఉన్నాయని వ్యాఖ్యానించడానికి అన్ని రాజకీయ పక్షాలూ ప్రయత్నిస్తున్నాయి గాని అవి అటు యుపిఎ ప్రగల్భాలనూ, ఇటు ఎన్‌డిఎ ప్రగల్భాలనూ కూడ పరిహాసం చేస్తున్నాయి. ఎన్నికల అంచనాల శాస్త్రం అనే ఒక కుహనా, జ్యోతిష్య శాస్త్రాన్ని తయారు చేసిన మేధావులు ఇప్పటికి ప్రవచించిన అన్ని సిద్ధాంతాలనూ ఈ ఎన్నికల ఫలితాలు అపహాస్యం చేస్తున్నాయి. అధికారంలో ఉన్నవాళ్లు కచ్చితంగా ఓడిపోతారనీ, తప్పనిసరిగా ప్రతిపక్షం గెలుస్తుందనీ, పాలకపక్షం చేసిన అభివృద్ధిని బట్టే ఓట్లు పడతాయనీ, ప్రభుత్వ అసమర్థ పాలనను ఓడించడానికి ప్రజలు ఓట్లను వినియోగించుకుంటారనీ, ఒకే కులం వారందరూ ఒకే రకంగా ఓట్లు వేస్తారనీ వగైరా వగైరా అన్ని సిద్ధాంతాలూ ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో అబద్ధమని మరొకసారి తేలిపోయింది. ఒక్కో రాష్ట్ర ఎన్నికల ఫలితాలలో ఒక్కో సిద్ధాంతం నిజమయి, మిగిలిన సిద్ధాంతాలన్నీ అబద్ధమయ్యాయి. మన సమాజంలో ఎన్నికలు నిజంగా ప్రజాభిప్రాయ సూచికలుగా లేవనీ, ఎన్నికల ఫలితాలను ప్రజాభిప్రాయం చాల తక్కువగా ప్రభావితం చేస్తున్నదనీ, అంతకన్న ఇతరేతర అంశాల పాత్ర హెచ్చుగా ఉంటున్నదనీ రుజువయింది. ఇదివరకు అనుకున్నట్టుగా కులాలవారీ, మతాలవారీ వోట్ బ్యాంకులు కూడ పనిచేయడం లేదని, కులాల, మతాల మధ్య రాజకీయ విభజనలు, ఇతర విభజనలు ఉన్నాయని కూడ ఈ ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలయినా, ఇంతకు ముందరి ఎన్నికల ఫలితాలయినా ఒక అంశాన్ని మాత్రం విస్పష్టంగా ప్రకటిస్తున్నాయి. ప్రజలు అన్ని రాజకీయ పక్షాల మీదా తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు, ఏ ఒక్క రాజకీయ పక్షం మీదా సంపూర్ణ విశ్వాసం ప్రకటించే స్థితిలో లేరు. ఏ పుట్టలో ఏ పాముందో అని అన్ని పాములకూ మార్చి మార్చి పాలు పోస్తున్నారు. అన్ని పాములూ సమానంగా ప్రజాజీవితంలో విషం చిమ్ముతూనే ఉన్నాయి.

బుష్‌కు బూట్ల సత్కారం

'అధికారాంతమునందు జూడవలె ఆ అయ్య సౌభాగ్యముల్' అని ధూర్జటి అన్నట్టుగా పదవి నుంచి దిగిపోవడానికి సరిగ్గా ఆరు వారాల ముందు యుద్ధోన్మాది జార్జి బుష్‌కు బాగ్దాద్‌లో పాదుకాఘాత సత్కారం జరిగింది. ఇరాక్‌ను దురాక్రమించి, సద్దాం హుసేన్ ను కూలదోసి, హత్య చేసి, లక్షలాది మంది ఇరాకీల జీవితాలను ధ్వంసం చేసి, ఇరాక్ ఆర్థికవ్యవస్థను అతలాకుతలం చేసిన అమెరికా అధ్యక్షుడు బాగ్దాద్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం అది. తేదీ డిసెంబర్ 14. అక్కడ ప్రపంచ సామ్రాజ్యాధిపతి మీదికి అల్ బాగ్దాదియా టెలివిజన్ ఛానెల్ విలేకరి ముంతజర్ అల్ జైదీ "కుక్కా, ఇదిగో వీడ్కోలు కానుక" అంటూ ఒకదాని తర్వాత ఒకటిగా తన రెండు బూట్లూ విసిరాడు. అరబ్ సంప్రదాయంలో ఒక మనిషి మీదికి బూటు విసరడమంటే ఆ బూటు కింద ఉన్న దుమ్ము కన్న నీచమైన వాడివి అని చెప్పినట్లు. అంటే అది అతి పెద్ద అవమానం. జార్జి బుష్ చేసిన యుద్ధ నేరాలకు ఈ అవమానం సరిపోతుందా లేదా అనీ, అది ఒక వ్యక్తి చేసే బదులు ప్రజలు చేస్తే బాగుండేది కదా అనీ చర్చించవచ్చుగాని, ఈ బూట్ల సత్కారం ఒక చారిత్రక సత్యాన్ని ప్రకటిస్తున్నది. అధికారంలో ఉన్నప్పుడు నాకేమని విర్రవీగిన నియంతలు, ధరాధిపతులు, నరహంతకులు ఏదో ఒకరోజున ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదు. ఆ ప్రజాగ్రహాన్ని సంఘటిత ప్రజా ఉద్యమ నిర్మాణాలు, ప్రపంచ ప్రజాభిప్రాయాలు, అంతర్జాతీయ సంస్థలు క్రమబద్ధంగా చేయలేనప్పుడు కనీసం వ్యక్తులుగానైనా కొందరు తమకు తోచిన పద్ధతులలో తమ ప్రతిస్పందన తెలుపుతారు. ఆ సమయంలో ఉద్యోగ విధి నిర్వహణా ధర్మాలు, పత్రికా సమావేశ సభామర్యాదలు ఏవీ అడ్డు నిలవవు. వీ


లోపలి పేజీల్లో...


ఫోకస్ :





వీక్షణం ప్రతి సంచికలోనూ ఫోకస్‌గా ఒక సమకాలీన ప్రత్యేక అంశాన్ని తీసుకొని దానిపై విభిన్న దృక్కోణాల మేధావుల అభిప్రాయాలు ప్రకటిస్తూ వస్తోంది. ఇప్పటికే సమాజంలో ఆలోచనపరులుగా పేరు తెచ్చుకుని వ్యక్తీకరణ శక్తి ఉన్న బుద్ధిజీవులు కాక అట్టడుగు సాధారణ ప్రజానీకం ఒక సామాజిక అంశంపైన ఎలా ప్రతిస్పందిస్తారో, తమ జీవితాల గురించి, సమాజం గురించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఈసారి వీక్షణం ప్రత్యేక ఫోకస్ అందిస్తోంది. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాలలో, విభిన్న జీవనరంగాలలో జీవన్మరణ సంఘర్షణలలో ఉన్న సామాన్యుల ఆశలూ, కలలూ ఏమిటి? కొత్త సంవత్సరంలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వంలో తమ భవిష్యత్తు గురించి ఆ సామాన్యులు ఏం ఆలోచిస్తున్నారు? చదవండి.


'వీక్షణం'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.













- **డా. ఎ. రామయ్య గారిని స్మరిస్తూ...** – వారితో మన జ్ఞాపకాల సంకలనం – డా. ఎ. రామయ్య మెమోరియల్ ఫౌండేషన్ ప్రచురణ – 52 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు : ఉచిత క్లినిక్, మెడికల్ గైడెన్స్ సెంటర్, ఆంధ్రప్రదేశ్ వీరభద్రయ్య సంఘం సెంట్రల్ ఆఫీస్, 16–11–28/బి, మేఘన డిగ్రీ కాలేజ్ ఎదురుగా, శైలజ ఆర్కేడ్ అపార్ట్‌మెంట్స్ పక్క సందులో, మూసారాంబాగ్, హైదరాబాద్, సెల్ : 9397888828; డా. బి.వై. ప్రవీణ్, ఎన్.వై.డి.సి. రూం, ఉస్మానియా మెడికల్ కాలేజ్, కోఠి, హైదరాబాద్, సెల్ : 9989947346
- **కర్ణాటక ఆంధ్ర సాహిత్య చరిత్ర** – ఆచార్య ఆర్. శంకరనారాయణరాజు – ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణ – 376 పేజీలు, 1/8 క్రౌన్, రు. 150
- **తెలుగన్నడ కథలు** – స. రఘునాథ – ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణ – 58 పేజీలు, 1/8 డెమీ, రు. 50
- **గుర్రం జాషువ** – కూర్పు : బి. భాస్కర చౌదరి – ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 50


  పై మూడు ప్రతులకు : రిజిస్ట్రార్, ద్రావిడ విశ్వవిద్యాలయం, శ్రీనివాసవనం, కుప్పం – 517425
- **వెన్నెల బలపం** – కవిత – కందుకూరి శ్రీరాములు – ఝరీ పొయిట్రీ సర్కిల్ ప్రచురణ – 175 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : ఝరీ పొయిట్రీ సర్కిల్, 16–2–740/75/40, వి.కె. ధాగెననగర్, గడ్డిఅన్నారం, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ – 500660, ఫోన్ : 24064195, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, నవోదయ బుక్ హౌస్, దిశ పుస్తక కేంద్రం, నవోదయ పబ్లిషింగ్ హౌస్
- **పరిష్కారం** – కథలు – రేగులపాటి విజయలక్ష్మి – విజయలక్ష్మి ప్రచురణ – 66 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : శ్రీమతి రేగులపాటి విజయలక్ష్మి, కవితా నిలయం, ఇ.నెం. 10–1–436, సంతోష్‌నగర్, రాంనగర్, కరీంనగర్ – 505 301, సెల్ : 9849246980
- **ఎగిరే క్లాస్‌రూమ్** – ఎరిక్ కాస్ట్‌నర్ – తెలుగు అనువాదం : బి.వి. సింగరాచార్య – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 162 పేజీలు, 1/8 క్రౌన్, రు. 70
- **గుండె జబ్బులు** – ప్రత్యామ్నాయ పరిష్కారాలు – డా. జి. లక్ష్మణరావు – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురణ – 121 పేజీలు, 1/8 క్రౌన్, రు. 40


  పై రెండు ప్రతులకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500067, ఫోన్ : 23521849
- **పరాయీకరణ గురించి.... మార్క్స్** – డేవిడ్ మాక్‌లెల్లన్ – అనువాదం : ఇంగువ మల్లికార్జునశర్మ – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ – 20 పేజీలు, 1/8 డెమీ, రు. 12
- **వర్గం గురించి.... మార్క్స్** – డేవిడ్ మాక్‌లెల్లన్ – అనువాదం : ఇంగువ మల్లికార్జునశర్మ – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ – 20 పేజీలు, 1/8 డెమీ, రు. 12


  ప్రతులకు : లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇ.నెం. 5–85–4/బి, పండరీపురం, 1వ లైను, గుంటూరు – 522 002, సెల్ : 9985377760; విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్, మైత్రి, దిశ, సహచర, నవయుగ, మణి బుక్‌స్టాల్











'వీక్షణం'లో 'నేర్చుకుందాం' శీర్షికన వస్తున్న అనువాదాలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. రాబోయే రోజుల్లో మార్క్సిస్ట్ తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం గురించిన మూల రచనలను సైతం సులభశైలిలో అనువాదం చేస్తే చాలా బావుంటుంది.

– చందు
శ్రీకాకుళం

'వీక్షణం' పత్రిక విశ్లేషణాత్మకమైన వ్యాసాలతో ప్రజోపయోగకరమైన సమాచారంతో బాగా వస్తోంది. వెబ్ పేజీలలో పెడితే మరింత మంది తెలుగు పాఠకులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది అందరూ చదవాల్సిన పత్రిక. వెబ్ పేజీలలో పెట్టడానికి మీకు కావల్సిన సాంకేతిక సహకారాన్ని నేను అందించగలను.

– సురేష్ కొలిచాల
అట్లాంటా, యు.ఎస్.ఎ.

ఇ-మెయిల్‌లో 'వీక్షణం' పత్రిక సాఫ్ట్ కాపీ అందుబాటులోకి తెచ్చినందుకు కృతజ్ఞతలు. దూర ప్రాంతాల్లో ఉండటం వల్ల పత్రిక అందుబాటులో లేని మాలాంటి వాళ్లకు ఈ సౌకర్యం చాలా ఆనందాన్నిచ్చింది. డిసెంబర్ 2008 సంచిక బాగుంది. కొన్ని వ్యాసాల శీర్షికలకు వాడిన ఫాంట్ వల్ల చదవలేక పోతున్నాను. బహుశా అక్షరాలు మరీ పెద్దగా ఉండడం వల్ల కావచ్చు. దీన్ని పరిష్కరించుకుంటే మరింత ఉపయోగకరంగా ఉంటుంది. గతంలో వచ్చిన సంచికలను సైతం ఈ విధంగా పెడితే బాగుంటుందని నా సలహా.

– భరత్
ఇ-మెయిల్ ద్వారా

వీలైనంతవరకు 'వీక్షణం'ను క్రమం తప్పకుండా చూసే ప్రయత్నం చేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో రెండోమూడో సాహిత్య పత్రికలు వెలువడుతున్నాయి కాని, సామాజిక రాజకీయ పత్రికల కొరత తీవ్రంగానే ఉంది. ఆ కొరతను తీర్చుతూ 'వీక్షణం' వెలువడుతున్నందుకు సంతోషం. వ్యాసాలు విలువైన సమాచారంతో, విశ్లేషణలతో పాటు భిన్నాభిప్రాయాలను తెలుసుకొనే వీలు కలుగుతున్నది. అయితే 'వీక్షణం' సంపాదకవర్గానికి, వ్యాస రచయితలకు చిన్న సవరణ సూచించదలచుకున్నాం. ఆదివాసుల గురించి రాసే వ్యాసాలు, ముఖ్యంగా కోయ ఆదివాసుల గురించి రాస్తున్నప్పుడు ప్రధానస్రవంతి మాధ్యమాలతో సహా అన్ని పత్రికలు 'గొత్తి కోయ'లనో, 'గోండు'లనో సంబోధిస్తున్నాయి. నిజానికి ఈ రెండు పేర్లు ఆదివాసేతరులు ఆదివాసులకు పెట్టినవి. వీటిలో వ్యతిరేకార్థముంది. గొత్తి చీమలు తింటారు కాబట్టి గొత్తి కోయలు అన్నారు. దండకారణ్యంలో నివసించే కోయ ప్రజలు తమను తాము కోయ గానే చెప్పుకుంటారు. కాబట్టి మిత్రులు ఈ సవరణను దృష్టిలో ఉంచుకొని ఇక ముందు రాయబోయే వ్యాసాలలో గొత్తి కోయ అని కాకుండా 'కోయ' అనే సంబోధిస్తారని ఆశిస్తున్నాం. 'నేర్చుకుందాం' శీర్షికన వస్తున్న వ్యాసాలు చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి. ఈ శీర్షికను ఇకముందు కూడా కొనసాగిస్తారని ఆశిస్తున్నాం.

– సమురు
చింతూరు, ఖమ్మం

ఆన్‌లైన్‌లో 'వీక్షణం' చూసి సంతోషం కలిగింది. అయితే మీ అభిప్రాయాలతో నాకు ఏకీభావం లేదు. ముఖ్యంగా 'హిందూ టెర్రరిజం' పేరుతో వచ్చిన వ్యాసాలు సత్యదూరంగా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో జరిగిన ఒరిస్సా అల్లర్లపై నిజనిర్ధారణ కమిటీ విడుదల చేసిన నివేదిక మీ దృష్టికి రాలేదనుకుంటాను. కందమల్‌లో స్వామీ సచ్చిదానంద, ఆయన ఇద్దరు సహచరులను క్రైస్తవులు హత్య చేయడం మూలాన అల్లర్లు చెలరేగాయని, కర్ణాటకలో సైతం క్రైస్తవ పత్రికలు హిందూ మతాన్ని కించపరుస్తూ రాతలు రాయడం వల్ల హిందువులు చర్చ్‌లు తగలబెట్టారని ఆ నివేదిక పేర్కొన్నది. ముస్లింల దుశ్చర్య అయిన 'గోధ్రా' ఇప్పటికీ ఎవరూ మరచిపోలేదనుకుంటాను. హిందువులు తమ మనోభావాలు దెబ్బతినేనంత కాలం మౌనంగా ఉంటారు. ఎక్కడ మనోభావాలు గాయపడినా అందుకు బాధ్యులైన వారిని తుదముట్టించే వరకు వారు నిద్రపోరు. కాబట్టి 'వీక్షణం' వాస్తవాలని గుర్తిస్తుందని ఆశిస్తాను.

– మధుసూదన్
ఇ-మెయిల్ ద్వారా

వివరణ

వీక్షణం మాతృసంస్థ సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్ రిసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ జరిపిన ఒక ప్రజాభిప్రాయ సర్వే నివేదిక గురించి డిసెంబర్ మొదటివారంలో కొన్ని తెలుగు, ఇంగ్లిష్ పత్రికలలో వచ్చిన వార్తలలో పొరపాట్లు దొర్లాయి. వాటిలో మరీ ముఖ్యంగా 'వార్త' దినపత్రికలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష గురించి సి.డి.ఆర్.సి. నివేదిక అంటూ పూర్తి అవాస్తవం అచ్చయింది. దాన్ని సరిదిద్దడానికి సి.డి.ఆర్.సి. ఇచ్చిన వివరణను, ఒకటికి రెండుసార్లు పంపినప్పటికీ ఆ పత్రిక అచ్చువేయలేదు. పాఠకుల వివరణ కోసం ఆ ప్రకటనను ఈ కింద యథాతథంగా ఇస్తున్నాం.

'మా పరిశోధనా ఫలితాలలో కొన్నిటిని విడదీసి ప్రచురించడం ద్వారా మా సంస్థను అనవసరంగా వివాదంలోకి లాగారు. అందువల్ల కొన్ని పొరపాటు వ్యాఖ్యానలను సవరించడం కొరకు మేం ఈ వివరణ ఇవ్వవలసి వస్తున్నది.

1. ప్రామాణికమైన, ఉన్నత నాణ్యతా ప్రమాణాలు గల పరిశోధనా సంస్థగా మా పరిశోధనా నమూనాలు శాస్త్రీయంగా, సమగ్రంగా ఉంటాయి. పరిశోధనా పద్ధతుల గురించి స్పష్టమైన సైద్ధాంతిక పరిజ్ఞానంతో, రెండు డజన్లకుపైగా సర్వేలు చేసిన అనుభవంతో మా పరిశోధనా చరిత్ర మచ్చలేనిది. మేం శాస్త్రీయంగా సమాచారాన్ని సేకరించి, విశ్లేషించి ఎటువంటి రాగద్వేషాలకు తావులేకుండా మా నివేదికలను తయారుచేస్తాం. ఆ నిర్ధారణలతో మా సంస్థకు ఏకీభావం లేకపోయినప్పటికీ, క్షేత్రసమాచారాన్ని యథాతథంగా అందించడమే మా బలం.
2. అన్ని పరిశోధనా సంస్థల లాగనే మేం కూడా విభిన్నమైన ఖాతాదారుల కొరకు సర్వేలు నిర్వహిస్తాం. వారితో మా సంస్థకూడా మిగిలిన సంస్థల లాగనే సమాచారాన్ని బహిర్గతం చేయకూడదనే ఒప్పందం చేసుకుంటుంది. పరిశోధన తరువాత మా నివేదికను ఖాతాదారుకు అందజేస్తాం. అది వారి ఆస్తి అయిపోతుంది. సాధారణంగా ఆ వివరాలను మూడో వ్యక్తితో పంచుకోం. ఈసారి కూడా మా నివేదికను మేం వెల్లడించలేదు.
3. దురదృష్టవశాత్తూ ఈసారి మా నివేదికలోని కొన్ని నిర్ధారణలు ప్రచార సాధనాలకు చేరాయి. అయితే అవి ఉన్నవి ఉన్నట్టుగా కాక వక్రీకరించబడి చేరాయి.
4. అలా చేరిన నిర్ధారణలలో సవరించవలసిన పొరపాట్లు ఎన్నో ఉన్నప్పటికీ తెలంగాణకు సంబంధించిన ఒక ముఖ్యమైన సవరణను మాత్రం ఇక్కడ చేయదలిచాం. పత్రికలో వచ్చినట్టుగా 88 శాతం రాష్ట్ర ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తున్నారని మా నివేదిక చెప్పలేదు. ఆ 88 శాతం అనే అంకె రాయలసీమ, కోస్తా ఆంధ్ర ప్రాంత ప్రజాభిప్రాయానికి సంబంధించినది. తెలంగాణకు సంబంధించి 2008 జనవరిలోనే మేం జరిపిన సర్వేలో 68 శాతం తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్నారని తేలింది. అందువల్ల ఈసారి మేం తెలంగాణ ప్రజలను వారు ఏ పార్టీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తుందని నమ్ముతున్నారనే ప్రశ్న అడిగాం. 27 శాతం తెలంగాణ రాష్ట్ర సమితి మీద, 24 శాతం కాంగ్రెస్ మీద, 20 శాతం తెలుగుదేశం పార్టీ మీద, 17 శాతం ప్రజారాజ్యం పార్టీ మీద, 9 శాతం భారతీయ జనతాపార్టీ మీద, 3 శాతం నవ తెలంగాణ పార్టీమీద తమ నమ్మకాన్ని ప్రకటించారు.'

– డైరెక్టర్, సి.డి.ఆర్.సి.

సాగుభూమి, నివేశన స్థలాల కోసం

ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు మరోసారి భూపంపిణీ, ఇళ్లస్థలాలు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై నవంబర్ 25న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం, వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, మెదక్, కరీంనగర్, కర్నూల్, తిరుపతి జిల్లా కలక్టరేట్ల వద్ద రాత్రి వరకు ధర్నా కొనసాగించాయి. ఆర్థిక సంక్షోభంతో అనేకమంది ఉపాధి కోల్పోతున్నారని, ఉపాధి కోసం కూడ ఉద్యమాలు చేయాలని ఈ సందర్భంగా ఆ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు.

'నిశా' బీభత్సం

నవంబర్ చివరివారంలో నిశా తుపాను రాష్ట్రంలోని నెల్లూరు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. లక్షలాది ఎకరాల్లో కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఎడతెగక కురిసిన వర్షాలకు పంటలు నీటమునిగాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. ఇరవై రెండు మంది చనిపోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. దీంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారు.

శ్రీరాం సాగర్‌ను రక్షించండి

శ్రీరాం సాగర్‌ను రక్షించాలంటూ డిసెంబర్ 1న కరీంనగర్‌లో వివిధ పార్టీల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. 'బాబ్లీ హఠావో... శ్రీరాం సాగర్ బచావో...' మహారాష్ట్ర నిర్మిస్తున్న బాబ్లీ సహా పన్నెండు ప్రాజెక్టుల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని టి.డి.పి., టి.ఆర్.ఎస్., సి.పి.ఐ., సి.పి.ఎం.లు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్‌ను ముట్టడించాయి. వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ బాబ్లీ ప్రాజెక్ట్ వల్ల శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ ఎడారిగా మారి 18 లక్షల ఎకరాలు బీడువారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

మా డిమాండ్లు పరిష్కరించండి

గౌరవ వేతనం పెంపుపై ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామనీ, భవిష్యత్తు ఉద్యమానికి కార్యాచరణ రూపొందించుకుంటున్నామనీ సర్పంచ్‌ల సంఘం డిసెంబర్ 1న ప్రకటించింది. తాము అడిగిన ముప్పై మూడు డిమాండ్లలో వేటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోగా, వేతనాలను పెంచుతున్నట్లు ప్రకటించడం సర్పంచులను అగౌరవపరచడ మేనని సర్పంచ్ సంఘం నేతలు ఆ ప్రకటనలో తమ నిరసన వెలిబుచ్చారు.

నాణ్యత ఏదీ?

రాష్ట్రంలో బడి పిల్లల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణలో భారీ అవకతవకలు బయటబడ్డాయి. పథకం పర్యవేక్షణ లోపభూయిష్టంగా ఉందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందడంలేదని ఆక్షేపించింది. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేకపోయిందని కాగ్ పేర్కొంది. 22 శాతం స్కూళ్లలో నీటి వసతి లేదనీ, 67 శాతం స్కూళ్లలో వంటశాలలు లేవనీ, 84 శాతం స్కూళ్లలో గ్యాస్ కనెక్షన్‌లు లేవనీ, కాగ్ పేర్కొంది. పిల్లల ఆరోగ్యంపై ఈ పథకం ప్రభావం ఎటువంటిదో అంచనాలు వేసే యంత్రాంగం లేదని ప్రభుత్వాన్ని కాగ్ తప్పుపట్టింది.

పోలీసుల వేధింపులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ నక్సలైట్లను పోలీసులు వేధిస్తున్నారని గుంటూరు జిల్లాకు చెందిన అరవై ఐదు మంది మాజీ నక్సలైట్లు డిసెంబర్ 7న ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. తమకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోయినా ఏదో కూలీ పనిచేసుకుని బతుకుతున్నామని ఇప్పుడు ఒక్కసారిగా పోలీసులు తమపై కేసులు వేసి అరెస్ట్ వారెంట్లు జారీ చేయడంపై తమ కుటుంబాలు చాలా ఆందోళనలకు గురౌతున్నాయని పేర్కొన్నారు. తమపై ఉన్న కేసులు ఎత్తివేయాలని కోరారు.

ఎస్.సి. రిజర్వేషన్‌ల వర్గీకరణ

పార్లమెంట్ ప్రస్తుత సమావేశంలో ఎస్.సి. రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తు ఎం.ఆర్.పి.ఎస్. వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిసెంబర్ 15న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఎస్.సి. రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా ఉన్నప్పటికీ పార్లమెంట్‌లో బిల్లు ఎందుకు పెట్టడంలేదని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఐదు రోజుల పాటు కొనసాగిన ఆమరణ దీక్షను డిసెంబర్ 19 అర్ధరాత్రి పోలీసులు భగ్నం చేసి మందకృష్ణ మాదిగను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

గద్దర్‌కు బెదిరింపులు

ప్రజా గాయకుడు గద్దర్‌ను వివిధ పేర్లతో చంపుతామని వస్తున్న లేఖలన్నీ ప్రభుత్వ సృష్టేనని, తెలంగాణ ఉద్యమ రథసారథి గద్దర్‌ను కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గద్దర్‌ను చంపుతామంటూ బ్లూటైగర్స్ పేరిట బెదిరింపు లేఖ రావడాన్ని నిరసిస్తూ డిసెంబర్ 10న ఉస్మానియా యూనివర్సిటీలో వివిధ విద్యార్థి సంఘాల, నేతల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. గద్దర్‌కి ఏమైనా హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు.

చిన్న నిర్మాతల డిమాండ్లు

పర్సెంటేజ్ విధానాన్ని కోరుతూ చిన్న సినిమా నిర్మాతలు రిలే దీక్షలు చేయడం, దరిమిలా ఏర్పడిన పరిణామాల నేపథ్యంలో థియేటర్లలో ఇప్పుడున్న అద్దె విధానానికి బదులు పర్సెంటేజ్ విధానాన్ని ప్రవేశపెడుతూ సినిమా పరిశ్రమలో ప్రధాన సంస్థ ఎ.పి. ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయాన్ని తీసుకుంది. దీంతో సినిమా థియేటర్ల అద్దె పర్సెంటేజ్ విధానానికి తెరపడింది.

అంతులేని అవినీతి

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న కేసులో అవినీతి నిరోధక శాఖకు చిక్కిన మత్స్యశాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ విచారణలో పెద్ద ఎత్తున అవినీతి బయటపడుతోంది. తాజా లెక్కల ప్రకారం ఆయన సుమారు రెండు వందల కోట్ల రూపాయల అక్రమ సంపాదనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ అవినీతిలో మంత్రులూ, అధికార్లతో పాటు పలువురికి సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. వీ

వీక్షణం ప్రతి సంచికలోనూ ఫోకస్‌గా ఒక సమకాలీన ప్రత్యేక అంశాన్ని తీసుకొని దానిపై విభిన్న దృక్కోణాల మేధావుల అభిప్రాయాలు ప్రకటిస్తూ వస్తోంది. ఇప్పటికే సమాజంలో ఆలోచనపరులుగా పేరు తెచ్చుకుని, వ్యక్తీకరణ శక్తి ఉన్న బుద్ధిజీవులు కాక, అట్టడుగు, సాధారణ ప్రజానీకం ఒక సామాజిక అంశంపైన ఎలా ప్రతిస్పందిస్తారో, తమ జీవితాల గురించి, సమాజం గురించి వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఈసారి వీక్షణం ప్రత్యేక ఫోకస్ అందిస్తోంది. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాలలో, విభిన్న జీవనరంగాలలో జీవన్మరణ సంఘర్షణలలో ఉన్న సామాన్యుల ఆశలూ, కలలూ ఏమిటి? కొత్త సంవత్సరంలో ఏర్పడనున్న కొత్త ప్రభుత్వంలో తమ భవిష్యత్తు గురించి ఆ సామాన్యులు ఏం ఆలోచిస్తున్నారు? చదవండి.

సామాన్యుల అభిప్రాయాలు

ప్రజలకు ఎన్నో పనులు చేస్తున్నట్లు ప్రభుత్వాలు చెప్పుకొన్నప్పటికీ సామాన్యులు సామాన్యులుగానే బతుకుతున్నారు. పెరుగుతున్న ధరలతో సామాన్యులకు ఇంకా ఇబ్బందులెక్కువయ్యాయి. అవినీతితో అమాయకులకు పథకాల ఫలాలు అందకుండా పోతున్నాయి. ఇలా అన్నిట్లో సగం ప్రయోజనాలుంటున్నాయి. పదిహేను సంవత్సరాల క్రితం కంటే ఇప్పుడు సౌకర్యాలు పెరిగినా ఎప్పటి తిప్పలు అప్పటివే. వ్యక్తిగతంగా అయితే అనుకున్న మంచి జీవితం ఇప్పుడు లేదు. చుట్టూ ఉన్న పరిస్థితుల వల్ల అప్పుడప్పుడు బాధనో, కోపమో వస్తుంది. గింతేలే అనుకొని సర్దుకు పోవటమే. ఎన్ని చేసినా సగం మంచి సగం తప్పుగానే ఉంటున్నాయి. అలాకాక మొత్తం మంచి చేసేవిగా ఉండాలి, కావాలి. అందరూ మంచి ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోవాలి.

కొమురవెల్లి రాజయ్య (50)
క్షురకుడు, బందారం, మెదక్

అసలు ప్రభుత్వాలు ఏమి చేయాల్నో, ఏమి చేస్తుండ్రో చాలా మందికి తెలియదు. ఏదో దగ్గరలో తెల్సిన గ్రామ నాయకులు ఎటంటే గటే ఓట్లేస్తిమి. అయినా అమాయకుల గురించి ఎవరూ పట్టించుకోరు. పనుల ఫలితాలు అమాయకులకు, నోరు లేనోళ్లకు అందాలి. ఉపాధి పథకాల్లో ఎక్కువ పనికిరాని పనులే చేస్తుండ్రు. ఫలితం దక్కేది చేయాలె. అప్పుడు యాభై రూపాయల విలువ ఇప్పుడు వెయ్యి రూపాయల్తో సమానం. కాని లాభమెవ్వరికి? రైతులకు ఏమాత్రం లాభం జరుగలేదు. పొద్దనక – రాత్రనక ఎవుసాన్ని నమ్ముకున్నా అమాయక రైతుల జీవితాలు ఇంకా ఇబ్బందిగానే ఉన్నాయి. ఒకప్పుడు మనం అనే భావన నుండి క్రమంగా మనోళ్లు, నేను, నాది అనే పరిస్థితులేర్పడ్డాయి. అలా మనమనుకొని స్వార్థం విడిచేస్తే బాగుటుంది. తెలంగాణ వస్తే మంచిగైతదనుకుంటున్నాం.

రాయమల్లారెడ్డి (60)
రైతు, బందారం, మెదక్

ప్రభుత్వాలు ఎన్ని పనులు చేస్తున్నా ఎక్కువగా వాళ్ల పొట్టలు నింపుకుంటున్నారు తప్ప మామూలోడికి మిగిలింది లేదు. ప్రజల అవసరాలు తీర్చేవిగా ఉండాలి. కష్టం చేసేవారికి ఏదో పని దొరుకుతుంది కాని తృప్తి కల్గట్లేదు. భవిష్యత్ దిగులు. ధరలు బాగా పెరిగి ఇబ్బందులు పెరిగాయి. అవినీతి బాగా పెరిగింది. అనుకున్నది, కావాల్సింది అందటం లేదు. గతంలో 'పైసా పుట్టువడి' తక్కువ. అప్పటి అవసరాలకు సరిపోయేది. ఇప్పుడు డబ్బు సంపాదన పెరిగినా సరిపోవట్లేదు. శారీరకంగా సుఖపడే సౌకర్యాలు వచ్చినా తృప్తి మాత్రం లేదు. సమాజంలో, మనుషుల్లో స్వార్థం పెరిగి ఎవరికి వారే గిరిగీసుకుంటున్న పరిస్థితుల్లో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి. నీతితో కూడిన పాలనరావాలి. అలా జరిగితే పరిస్థితులు కొంతవరకు చక్కబడొచ్చు.

కుమ్మరి పోచయ్య (58)
రైతు, నర్మెట, మెదక్

ప్రభుత్వాలు మంచిగనే ఉన్నాయి. కాని తెలంగాణ ఏర్పాటు చేస్తే ఇంకా బాగుంటుంది. మనది మనకిచ్చే ప్రభుత్వాలు ఉండాలి. రైతులకు కరెంట్ కోత లేకుండా ఇవ్వాలి. ఉపాధి హామి పథకం కూలీలకు బాగానే ఉంది. చిన్న ఎవుసాలు దెబ్బతింటున్నాయి. రైతులు అంతకూలీ ఇస్తే గిట్టుబాటు లేక యంత్రాలతో చేయించుకోలేక చిన్న చిన్న ఎవుసాలు మూలపడుతున్నాయి. అవినీతి, ధరలు బాగా పెరిగాయి. ఆశించిన ఫలితాలు అందటం లేదు. పదిహేను సంవత్సరాల క్రితం కంటే పరిస్థితులలో ఇప్పటికీ మంచిగనే మార్పులు జరిగినాయి. చాలా మార్పులు వచ్చినాయనుకుంటున్నాను. మంచివి వచ్చినవి, జరగకూడనివి కూడా జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలతో పని చేయాలి. అన్యాయం జరగొద్దు.

గుర్రం రాందాసు (65)
నర్మెట, మెదక్

ప్రభుత్వాలు కొంతమంచి చేస్తున్నయ్. కానీ బాగా స్వార్థం నిండిపోయింది. వ్యవసాయాలకు మంచి ప్రోత్సాహమిచ్చే ప్రభుత్వాలు ఉండాలి. అవినీతి, ధరలు విపరీతంగా పెరగటం వల్ల మధ్యతరగతి బతుకులు చాలా కష్టంగా మారుతున్నాయి. అప్పటికంటే ఇప్పుడు 'సౌలతులు' (సౌకర్యాలు) బాగా పెరిగినట్లుగానే రోగాలు కూడా పెరుగుతున్నయ్. రకరకాల రోగాలొస్తున్నయ్. చుట్టూ పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. రావాల్సినవి ఉన్నవి. రాకూడనివి ఉన్నాయి. సౌకర్యాలు, సుఖాలు రావడంతో అన్నీ నాకే కావాలనే స్వార్థం లాంటివి వచ్చాయి. పట్టణాల కంటే పల్లెలే నయం. స్వార్థం, అవినీతికి స్థానంలేని సమాజం రావాలి. మంచి సదువులతోనే అది సాధించాలి.

గౌండ్ల నర్సయ్య (70)
నర్మెట, మెదక్

ప్రజలకు ప్రభుత్వాలు చేసే సహాయం ఎప్పుడూ ఆధారపడి జీవించేలా చేయడం కన్నా స్వయంగా బతికే మార్గాలు చూపించాలి. తాత్కాలిక పథకాలు, హామీల బదులు శాశ్వతంగా ఉపయోగపడగలగాలి. తప్పుడు దోవపట్టిస్తున్నాయి. సరైన మార్గం చూపించగలగాలి. గూడుకోసం ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నా సరిపోక అప్పులు చేస్తున్నారు. తీర్చలేక అమ్ముకుంటున్నారు. మళ్లీ ఇల్లు ఉండదు. పూర్తిగా కట్టించాలి. ధరల పెరుగుదల సామాన్య, మధ్యతరగతి ప్రజలకు శాన కష్టమైతంది. అవినీతి బాగా పెరిగింది. పదిహేనేళ్లకు, ఇప్పటికీ ఎన్నో మార్పు లొచ్చినయ్. మంచిగున్నవి, చెడుగున్నవి. ఈ మార్పులు సామాన్య మధ్యతరగతి కష్టాల పాల్జేసేటివే. సావలేక, లేవలేక అన్నట్లుగా ఉన్నది. ఒకరికొకరు గౌరవించుకునే పరిస్థితి ఇది వరకుండేది. ఇప్పుడది లేకుండా పోయింది. స్వార్థం, ఈర్ష్య, ద్వేషాలు, అరాచకాలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితులు మారాలంటే నీతి, నిజాయితీ, నిస్వార్థం లాంటి విలువల సంస్కృతి ఏర్పడాలి. సమాజం, తల్లిదండ్రులు, ప్రభుత్వాలు ఎవరి స్థాయిలో వారు కృషి చేయాలి.

మౌలానా (45)
ట్రాక్టర్ మెకానిక్, సిద్ధిపేట, మెదక్

(పై ఐదు అభిప్రాయాలు సేకరించినవారు ***ఎన్. భగవాన్‌రెడ్డి,***
గ్రామం బందారం, మెదక్ జిల్లా)

సామాన్యులకు ఏమీ అందడంలేదు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందంలేదు. పథకాలు బాగున్నాయి. కాని మాకు సరిగా చేరడం లేదు. గ్రామ కార్యదర్శులు సరిగా అందుబాటులో లేరు. (ఒక్కరికి ఐదు నుంచి ఆరు గ్రామాలు ఇన్‌చార్జ్ ఉండటం.) ఇందిరమ్మ ఇళ్లు బాగున్నాయి. నేరుగా ప్రభుత్వం గ్రామస్థాయిలో ప్రతి గ్రామంలో ముఖ్య గ్రామ కార్యదర్శులను నియమించాలి. అవినీతి లేకుండా ప్రభుత్వాలు ఉంటేచాలు. ధరలు 'బొచ్చెడు' పెరిగినయి. ధరలు తగ్గించాలి. ఆధికారులకు భయంలేదు. కాబట్టి అవినీతి బాగా పెరిగింది. పదిహేను సంవత్సరాల క్రితం జీతం ఉండేవాళ్లం. ఇప్పుడు కొద్దిగా ఉన్న భూమిని సాగు చేసుకుంటున్నాం. అయినా మూడు సంవత్సరాల నుంచి వర్షాలు లేవు. ఈ రెండు మూడు సంవత్సరాల నుంచి వర్షాలు ఉన్నా పంటలు సరిగా పండటం లేదు. గిట్టుబాటు ధరలు ఉండవు. ప్రస్తుతం వ్యవసాయకూలిగా, హమాలీగా, చిల్లర వ్యాపారం చేసుకుంటున్నాను. డబ్బులు ఉంటేనే చుట్టాలు, బంధువులు, గరిబోనికి ఎవ్వరు సాయం చేయరు. చదువుకున్న మీలాంటి యువకులు రాజకీయాలలోకి రావాలి. రాజకీయ అవినీతి అంతం చేయాలి. మన పని మనం 'సక్కగా' (మంచిగా) చేయాలి. ఇలా అందరు అనుకుంటే మనమందరం బాగుంటాం.

తేజవత్ వీరన్న (25)
వ్యవసాయ కూలీ, సిరోల్, వరంగల్

అన్నీ ఉన్నవాడికి గవర్నమెంటు మళ్లీ మళ్లీ ఇస్తున్నది. గరిబోనికి ఇస్తే వాడికి భూమి కావాలంటే రెండు గుంటలు కొన్నా మిగతా సగం ప్రభుత్వాలు ఇల్లు మంజూరు చేయవు. మధ్యన ఆగిపోతుంది. జవాబుదారి అంటే 'కచ్చాగా ఉండాలి.' మంచి పథకాలు అందరికీ నిజమైన అర్హులకు చేరాలి. ఇల్లు ఉంది. ఈ వృత్తిద్వారా జీవనం సాగుతోంది. మా బోటి గరిబోళ్లకు టమాటాలు ముప్పై రూపాయలుంటే ఎలా గడుస్తుంది. అందుకే 'ధరలు' తగ్గాలి. తప్పు చేసినవాళ్లకు చట్టాలు అంటే భయంలేదు. పోలీస్ స్టేషన్ అంటే భయం లేదు. పట్టుబడితే జైలుపోయి వెంటనే మళ్లీ బెయిల్‌పై వచ్చి ఎవరిపని వారు యథేచ్ఛగా అవినీతి చేసుకుంటున్నారు. చదువుకున్న పోరగాండ్లకు ఉద్యోగాలు లేవు. ఉన్నవాటిని భర్తీ చేస్తే ఇంత నిరుద్యోగం ఉండదు. మాలాంటి కులవృత్తులు కూడా నేడు హైదరాబాద్ లాంటి సిటీలో కులం లేకుండా అందరూ ఒక వృత్తిగా బతుకుతున్నారు. వీటిని గౌరవించండి. పుట్టినప్పటినుండి వెట్టిచాకిరి చేసిన మా నాయినలు, తాతలు, కులం వృత్తిగా వస్తున్న ఈ పనిచేసి మా కష్టం ఏదో మేము పడుతున్నాం. కొత్తగా ఏమీలేదు. అయితే ఇప్పుడే కొంత ఇల్లు మంజూరు అయిందని అన్నారు. మరి చూడాలి. ఎవరి స్వార్థం వారికి. అలాగని అందరూ అలా లేరు. ఒక్కటి మాత్రం నిజం – 'బడితె ఉన్నోడిదే బర్రె' (బలవంతునిదే రాజ్యంగా) లాగుంది. రాజకీయాల్లో మంచి లేదు, నిజాయితీ లేదు. అవినీతిపరులు ఎక్కువగా ఉన్నారు. అందుకే యువత రాజకీయాల్లోకి రావాలి. కుళ్లును కడగాలి.

బాసిపంగు రాములు (55)
చర్మకారుడు, మరిపెడ, వరంగల్

తమవారికే పథకాలు అందిస్తున్నారు కొంతమంది స్థానిక నాయకులు. ప్రభుత్వం మంచిపనులు చేస్తున్నా అర్హులకు అందడంలేదు. దీనికి నేనే సాక్షి. నేను అంగవికలాంగుడిని కాని, నాకు ఇంతవరకు ఫించను మంజూరు కాలేదు. ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకున్న ఆ లెటర్‌ను అధికారులు, నాయకులు దాచేశారు. ఇలా ఉన్నరు నాయకులు. నిజమైనా నాలాంటి అర్హులందరికీ అందించే నిజాయితీ ప్రభుత్వాలు కావాలి. 'అవినీతిరహిత ప్రభుత్వం కావాలి.' మాది పేదకుటుంబం. మానాన్న వృత్తి వడ్రంగి. భూములు లేవు. ఇంటి స్థలం మాత్రమే ఉంది. నేనూ, మా నాన్న, అమ్మ కూలీ డబ్బులే నా చదువుకు, జీవనానికి ఆధారం. అవినీతి అధికారులు, నాయకులు అన్ని కొరతలు సృష్టించి 'ధరలు' పెంచుతున్నారు. బ్లాకుల్లో అమ్ముతున్నారు. అందుకే ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో నియంత్రణ చర్యలు తక్షణం చేపట్టాలి. ఖాళీలు ఉన్నా భర్తీ చేయరు. డి.ఎస్.సి. ఇంతవరకు వేయలేదు. ఈ నెలలో వేశారు. దీనికోసం లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఒక డి.ఎస్.సి. కాకుండా ఉన్న అన్ని ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగం తగ్గుతుంది. పరిపాలన సవ్యంగా జరుగుతుంది. గ్రామాల్లో గ్రామ కార్యదర్శి లేకుండా అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయి. ఒక్క కార్యదర్శి మూడు నుంచి ఐదు గ్రామాలకు ఇంచార్జ్‌లో నడుస్తుంది ప్రస్తుతం. మా జిల్లాలో ప్రతి మండలంలో కార్యదర్శుల కొరత ఉంది. చదువుకున్న యువత ఎంతోమంది ఉద్యోగాలు రాక ఉంటే ఉన్న ఈ ఖాళీలు భర్తీ చేయకుంటే 'ప్రభుత్వ పథకాలు' ఎలా అమలవుతాయి? అందరూ అభివృద్ధి అని మాట్లాడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖాళీలు ఉన్నాయి. వెంటనే పోయిన ఇంటర్వ్యూలలో వచ్చిన అభ్యర్థులతోనైనా భర్తీ చేయండి.

పర్యావరణ కాలుష్యం పట్టణాలకే గాక నేడు గ్రామాలకు కూడా పాకింది. ఒక్కటే దారి! ప్రతి ఒక్కరం ఒక్కొక్క మొక్కను పెంచుదాం. పూరి గుడిసె మా ఇల్లు. ఇందిరమ్మ ఆదర్శగ్రామం ఉన్నా ఇల్లులేదు. అధికారం ఉంటే నాయకులు ఏదైనా చేయొచ్చు అనే భావన పెరిగిపోయింది. ఇది మారాలి. పదవి 'సేవచేయడానికి అనే' భావన రావాలి. అందుకోసం యువత రావాలి ముందుకు. ఓటు హక్కు రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించింది. ఇది ఎంతో అమూల్యమైంది. అందరూ ఆలోచన చేసి మంచి వ్యక్తిత్వం ఉన్న నాయకుడిని, అందుబాటులో ఉండే నాయకులనే మనం 'ప్రజా ప్రతినిధులు'గా అసెంబ్లీకి, పార్లమెంట్‌కి ఎన్నుకుందాం! పంపిద్దాం! అప్పుడే 'అభివృద్ధి' చెందిన దేశాలలో భారత్ అగ్రస్థానంలో నిలబడుతుంది.

బాణాల సత్యనారాయణ (22)
వికలాంగుడు, మరిపెడ, వరంగల్

మంచి చేస్తే నేను ఇక్కడ ఎందుకు ఉంటాను? ఎవరు వచ్చినా కింద ఉన్నవాళ్లు పనిచేయరు. 'బద్మాషోళ్లు.' లంచం బాగా ఇచ్చే పథకాలు మంజూరు చేస్తారు. ఎవరన్నా రండి. కూకోండి, పాలించండి. గాని మాబోటి వాళ్లకి, వచ్చే పథకాలు 'లంచం' లేకుండా పని చేయండి. కిరాయి ఇంట్లో నేనూ నా భర్త, కోడలు ఉంటం. కోడలు పట్టణంలో వలస కూలీ పనులకు వెళ్లింది. పనులు ఉన్నా లంచగొండి నాయకులు, అధికారులు పనికి మనుషుల బదులు పొక్లేన్‌లనీ పెట్టించి డబ్బులు దోచుకుంటున్నారు. వలసలుపోవాలి. ధరలు మండిపోతున్నాయి, తగ్గాలి. అధికారులకు అస్సలు భయంలేదు. నాయకులకు బుద్ధి, సిగ్గు లేదు. చదువుకున్న బిడ్డలకు ఖాళీగా ఉన్న నౌకరులను ఇచ్చేయాలి. ఒక్క ఫించను వస్తుంది. ఈ చిల్లర అరటిపండ్ల వ్యాపారమే జీవనాధారం. లంచం తీసుకొని పని (నౌకరి) చేసే వాళ్లకు 'నౌకరి' (ఉద్యోగం) లేకుండా చేసే 'ధర్మం' చట్టాలు రావాలి. ఇగనుంచి ఎవ్వడు డబ్బులిచ్చినా 'మంచోళ్లకే ఓటు వేస్తా' అలా అందరు మారితే మీలాంటి చదువుకున్న బిడ్డలు కూడా అందరం కలిసి మంచి నాయకుడిని ఎన్నుకుందాం. 'లాభాలు లేకుండా పని జరగాలి!' మీలాంటి చదువుకున్న యువకులు రాజకీయాల్లోకి రావాలి.

జినక సుబ్బమ్మ (62)
బస్టాండ్ దగ్గర చిల్లర పండ్ల వ్యాపారం, తొర్రూర్, వరంగల్

(పై నాలుగు అభిప్రాయాలు సేకరించినవారు ***పి. లాల్‌చంద్***
పి.జి. కాలేజ్, సికింద్రాబాద్)

ఏ ప్రభుత్వమైనా ఎవరికీ చేసేదేమీ లేదు. కనీసం నిత్యావసర వస్తువులనైనా సామాన్యులకు అందుబాటులో ఉండేలా చేయాలి. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితులలో జీవిస్తున్నాం. అధిక ధరల వలన రోజువారీ కూరగాయలు కూడా కొనలేక పోతున్నాం. అవినీతి, అన్యాయం ఎక్కువవుతోంది. పథకాలు అర్హులకు కాక మిగిలిన వారందరికీ అందుతున్నాయి. చుట్టుపక్కల వారి సహాయ సహకారాలు బాగా తగ్గాయి. మనుషుల మధ్య సంబంధాలు కరువవుతున్నాయి. ఇప్పటికంటే పదిహేను సంవత్సరాల ముందు తినడానికైనా చింత లేకుండా ఉండేది. ఇప్పుడది కూడా కరువైంది. ఇలాంటివేమి లేకుండా అందరినీ సమానంగా చూసే ప్రభుత్వం వస్తే బాగుంటుంది.

గౌరి లక్ష్మి (50)
గృహిణి, హైదరాబాద్

ప్రభుత్వాలు ఎలా ఉన్నాయో ఎలా ఉంటాయో చెప్పలేం. ఎం.ఎ. చదివి టైలరింగ్ నేర్చుకుంటున్నాను. కష్టపడితే సంపాదించుకునే అవకాశాలు ఉన్నాయి. కాని అవినీతి బాగా పెరిగింది. ఒకసారి అలవాటైన వారికి అది మానమంటే సాధ్యమవుతుందా? ఉన్న కాలుష్యం తగ్గకపోయిన ఫర్వాలేదు. అది పెరగకుండా ఉండడానికి చెట్లను బాగా పెంచాలి. పదిహేను సంవత్సరాలతో పోలిస్తే మనదేశం చదువులోనూ, సంస్కృతిలోనూ బాగా అభివృద్ధి చెందింది. చుట్టుపక్కల వాళ్లు మంచి, చెడులు గ్రహించగలుగుతున్నారు. కానీ వచ్చే ప్రభుత్వాలు, ధరలకను గుణంగా జీతాలు పెంచితే అసమానతలు తొలగించే అవకాశం ఉంది. ఎవరికి పడితే వారికి పదవులు కట్టబెట్టకుండా అనుభవం కలిగిన వారికి పగ్గాలు ఇస్తే బాగుంటుంది.

గంగాధర్ (23)
నిరుద్యోగి, హైదరాబాద్

ప్రభుత్వాలు ఇలా ఉండడం ఇష్టం లేదు. పనిచేస్తే గాని తిండి దొరకని పరిస్థితి. ధరలు చాలా అన్యాయంగా ఉన్నై. అద్దెలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. పథకాలు అర్హులైన వారికి అందడం లేదు. అవినీతి ఘోరంగా ఉంది. బాగా పెరిగిపోయింది. నిరుద్యోగం ఎక్కువైంది. ఇప్పటికంటే పదిహేను సంవత్సరాల ముందే బాగుంది. మాకు పదిహేను సంవత్సరాల నుండి పక్కా ఇళ్లు ఇస్తామని ఇంకా తిప్పుతూనే ఉన్నారు. బాగా ఉన్నవారు తప్ప సామాన్యులు పరిస్థితులను ఎదుర్కొనలేక పోతున్నారు. వరంగల్ విషయంలో పోలిస్తే శిక్షలు అనేవి అరబ్ దేశాల వలె బహిరంగంగా అమలు జరగాలి. ఆ శిక్షలు సామాన్యులకు మాత్రమే కాక అధికారుల నుండి అమలు జరిపే ప్రభుత్వం రావాలి.

శేఖర్ (52)
టైలర్, హైదరాబాద్

ఏ ప్రభుత్వమైనా ఎవరికీ చేసేదేమీ లేదు. ఎంత సంపాదించినా సరిపోవట్లేదు. ఇప్పటికంటే చంద్రబాబు హయాం బాగుంది. వెంటనే ధరలు తగ్గాలి. కూరగాయలు కూడా కొనలేక పోతున్నాం. అవినీతి దారుణంగా ఉంది. రేషన్‌షాపుల్లో మరీ ఎక్కువైంది. నిరుద్యోగం పెరిగిపోయింది. టూ వీలర్స్ వాహనాల వల్ల కాలుష్యం మరీ పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువైనాయి. ఇంతకు ముందు గంట ప్రయాణం ఇప్పుడు రెండు గంటలు అవుతుంది. పదిహేను సంవత్సరాల ముందు పరిస్థితులే బాగున్నాయి. అప్పుడు పదిరూపాయలు మిగిలేది ఇప్పుడు తినడానికే పది రూపాయలు అప్పు చేయవలసిన పరిస్థితి. ఇంతకు ముందు ఒకరికొకరు సహాయంగా ఉండేవారు. ఇప్పుడు ఆ విధంగా లేదు. గవర్నమెంట్ మారాలి. వస్తు మార్పిడిని సమర్థించే

ప్రభుత్వం రావాలి. పూర్వంలాగా ఒకరికి అవసరమైంది మరొకరి దగ్గిర తీసుకుంటూ వారి అవసరాలను తీర్చే పద్ధతి వస్తే బాగుంటుంది.

జి. అశోక్ కుమార్ (50)
టైలర్, హైదరాబాద్

ప్రభుత్వాలు నిజాయితీగా లేవు. ఓట్లకు ముందున్న వినయం తర్వాత ఉండదు. ప్రభుత్వాలు సామాన్య ప్రజలకు అనుకూలంగా ఉండాలనుకుంటున్నాం. మండే అధిక ధరలతో సామాన్య ప్రజలు ఎవరూ ఏమీ అనుభవించలేకపోతున్నారు. ఇక పర్యావరణం గురించి అంటే కాలుష్య నివారణ అంటూ కాలుష్యం చేస్తున్నారు. పదిహేను సంవత్సరాల ముందు నాకు ఈ కాలుష్యం, ఇన్‌ఫ్లేషన్ గురించే తెలీదు. కానీ, దీనివల్ల ఇంతమంది బాధపడుతున్నారని ఇప్పుడు తెలుసుకున్నాను. ఈ పరిస్థితులన్నీ మారడానికి దారిద్ర్యరేఖ కింద ఉండే జనాలని తగ్గించి, అక్షరాస్యతను పెంచి, లంచాలు తగ్గించి, అందరికీ ఒకే విలువను ఇవ్వాలి. మనుషుల మధ్య సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఎటు చూసినా స్వార్థం, ఈర్ష్య. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, అవసరమైనప్పుడు సహాయం చేయాలనే ఇంకితజ్ఞానం కూడా లేకుండా పోతుంది. అందరూ నిజాయితీగా, మానవత్వంతో కలిసిమెలిసి ఉండి, సమస్యనే పెద్ద సమస్యగా కాకుండా సొల్యూషన్ ఆలోచించి, పనులు సక్రమంగా, సరియైన పద్ధతిలో, సరియైన సమయంలో చేసుకోవాలి. ఐక్యమత్యమే మహాబలం అన్నట్లు ఉండాలి.

జి. హరిత (23)
ఉద్యోగి, కానపల్లి, కడప

(పై నాలుగు అభిప్రాయాలు సేకరించినవారు **గాయత్రీ ప్రసన్న**, హైదరాబాద్)

ప్రభుత్వాలు అవినీతి మయమయినాయి. రాజకీయాలు, నాయకుల పైన పూర్తిగా నమ్మకం సన్నగిల్లిపోయింది. పారదర్శకమైన సుపరిపాలన కోరుకుంటున్నాం. అవినీతిని అరికట్టి, ప్రస్తుతం ఉన్న చట్టాలను, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయగలిగితే మిగతా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయి. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వాలు విఫలమైనాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకం నిరోధించాలి. మా జీవితాలలో మార్పులు రావడం జరిగింది. కాని ప్రభుత్వాలు ప్రచారం నిర్వహిస్తున్న స్థాయిలో రాలేదు. మార్పు కొందరికే పరిమితం అయ్యింది. అవినీతి, లంచగొండితనం పాలకుల్లోను, ప్రభుత్వ అధికారుల్లోను, ఉద్యోగుల్లోను పెరిగిపోయింది. ప్రతి విషయంలో ప్రభుత్వ పాలనలో రాజకీయ జోక్యం అధికమయ్యింది. నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం అందని ద్రాక్షలయినాయి. ముందుగా పారదర్శకమయిన పాలన అవసరం. దానితోపాటు సిఫార్సులు, రాజకీయ జోక్యం లాంటి వాటితో పాటు అవినీతిని నివారించాలి. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు అమలు చేయాలి. చట్టాలు కల్పించిన ఉద్యోగ భద్రత మూలంగా ఉద్యోగులలో అవినీతి పేరుకుపోయింది. డిస్మిస్ విధానం అమలుకావాలి.

మంచిర్యాల నుంచి స్థూలంగా పదహారు మంది వ్యక్త పరచిన అభిప్రాయాలు

(అభిప్రాయం సేకరించినవారు **జి. వెంకటేశ్వర్లు**, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా)

ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటూ వారి కోరికలను తీరుస్తుంది. తెలుగుదేశం హయాంలో పేదలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా రైతుల ఆత్మహత్యలు అధిక సంఖ్యలో ఉండేవి. నేడు ఉన్న ప్రభుత్వం రైతులను కొద్దో గొప్పో ఆదుకుంటుంది. అందుకే రైతుల ఆత్మహత్యలు తగ్గాయి. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో రైతుల ఉత్పత్తులకు రేట్లు పెంచింది. కాబట్టే ప్రస్తుత ధరలు పెరిగాయని నేను అనుకుంటున్నాను. అంతేకాక తెలుగుదేశం హయాంలో ఆరోగ్యశ్రీ, ఇల్ల పథకాలు లేవు. చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన నియంత పోకడలు పేద ప్రజలను కలచివేశాయి. చంద్రబాబు ఆర్థిక విధానాలు అతని ఓటమికి కారణం అయ్యాయి. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొన్ని తప్పిదాలు చేస్తోంది. వాటిని సరిదిద్దుకొని ముందుకు పోవాలని కోరుకుంటున్నాను. తెలుగుదేశం హయాంలో వృద్ధాప్య ఫించన్లు తక్కువగా ఉండేవి. వారికిచ్చే నెలసరి భృతి నెలవరకు కూడా సరిపోయేది కాదు. అవినీతి ఇప్పుడు ఎక్కువగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు బాగానే ఉన్నాయి. కాని, అవి కిందిస్థాయి సామాన్యులకు అందడంలేదు. తెలుగుదేశం హయాంలో దోచుకునేవారు ఎక్కువగా ఉండేవారు. నేడు నిరుద్యోగం ఎక్కువగా ఉంది. దీనిని రూపుమాపడానికి ప్రస్తుతం ఉన్న పథకాలను కఠినంగా అమలు జరిపి మరికొన్ని చట్టాల అమలుకు శ్రీకారం చుట్టాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అన్నం, కూడు, గూడు విషయంలో పేద ప్రజలను ఆదుకొంటోంది. కొంతమేరకు నిరుద్యోగులను ఆదుకొంటోంది. స్త్రీల విషయంలో కొన్ని చట్టాలు తేవాలి. ముఖ్యంగా డాక్టర్ల విషయంలో ప్రభుత్వం కఠినత్వం వహించాలి. పల్లెల్లోని పేద ప్రజలకు డాక్టర్లు అందుబాటులో ఉండాలి. పల్లెల్లో డాక్టర్లు సరిగ్గా సమయానికి రావడం లేదు. వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రభుత్వం మందులు ఇవ్వడం లేదు. దీనితో రోగాలు సరిగా నయంకాక ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే ఆ ఫీజులూ, ఈ ఫీజులని చివరకు ఏమీ లేదని తేల్చి చెప్పో లేదా ఏదో ఒక అవస్థ ఉందనీ, ఆపరేషన్ చేయాలని చెప్పి డబ్బు దోచుకుంటున్నారు. పర్యావరణ కాలుష్యం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. అవసరం లేకపోయినా వాహనాలు వాడడం వల్ల కాలుష్యం పెరుగుతోంది. వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ఇష్టం వచ్చినట్లు పోతున్నారు. దాని ద్వారా ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాక కార్లను రోడ్లపైన నిలుపుతున్నారు. తద్వారా బాటసారులకు ఇబ్బంది కలుగుతోంది.

కె. రాములు (65)
మేస్త్రీ, మహబూబ్‌నగర్

ఇన్ని సంవత్సరాలు గడిచాయి, ఎన్ని ప్రభుత్వాలు వచ్చాయి, ఎన్ని ప్రభుత్వాలు మారాయి, వాళ్లు వచ్చి అన్ని ప్రజల కోసమే అంటారు. ఇవన్ని పథకాలు ప్రజలకోసమే అంటారు. ఓ మీటింగుల మీద మీటింగ్‌లు పెడతారు. ఇన్ని ప్రభుత్వాలు వచ్చి ఇన్ని లచ్చలు ఇస్తున్నం అని ఒక్కటే నసపెట్టరు. ఇవన్ని లచ్చలూ, కోట్లూ ప్రభుత్వం విడుదల చేస్తే ఇంతమంది పేదోళ్లు ధనవంతులు ఎందుకు కాలే? ఇన్ని లచ్చలు ఎటుపోయినట్లు. ప్రభుత్వం ఎన్ని పథకాలు చేపట్టినా కిందిస్థాయి ప్రజలకు అందడం లేదు. మధ్య ఉన్న దళారీలే డబ్బులు దోచుకుతింటున్నారు. ఈ ప్రభుత్వం ఆ పథకాలు చేపట్టినం, ఈ పథకాలు

చేపట్టినం, మేమే రాబోయే ఎన్నికల్లో గెలుస్తాం అని చెప్పుకొంటున్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ గురించి ఒక్కొక్క నాయకుడు టి.వి.లల్లా, పత్రికలల్లా పోటీల మీద పోటీలు పడి చెపుతున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకొని పెద్ద పెద్ద ఆసుపత్రులకు పోతే అది చెల్లదట. గవర్నమెంట్ ఆసుపత్రిలనే చెల్లుతదట. గవర్నమెంట్ ఆసుపత్రులకు పోవాలంటే భయంగా ఉంది. అక్కడికి పోతే వైద్యం సరిగా అందదు. పట్టించుకొనే నాథుడే లేడు. మనిషి బతుకతడో, చస్తడో తెలువది. ఆసుపత్రి గేటు కాన్నుంచి మొదలు పెడితే బెడ్డు మీదికి పోయేదాకా ఒకడు కాకపోతే ఒకడు ఇరవై నుంచి వంద రూపాయల వరకు లంచం అడుగుతారు. నర్సులు కూడా రోజుకు వంద రూపాయల దాకా లంచం అడుగుతారు. గవర్నమెంట్ అసుపత్రులలో ప్రైవేట్ ఆసుపత్రులకంటే ఎక్కువ డబ్బులు అడుగుతున్నారు. కొన్నిసార్లు పెద్ద డాక్టర్లు వచ్చి చెయ్యికూడ పట్టి చూడరు. ఏవో గోలీలు రాసి ఇచ్చి పోతాడు. చంద్రబాబు హయాంలో గట్టి చర్యలు చేపట్టిండు. అధికారులు భయంతో పని చేసింద్రు. జన్మభూమి కార్యక్రమం అని పెట్టి అన్ని విభాగాలకు చెందిన అధికారులు మూడు నెలలకో, రెండు నెలలకో గ్రామాలలోకి వచ్చేవాళ్లు. మాకు ఏమన్నా సమస్యలుంటే అక్కడ్నే చెప్పుకొనేవాళ్లం. ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేకపాయే. చంద్రబాబుతో పాటు అధికారులు అకస్మిక తనిఖీలు చేసేవారు. దానితో కింద ఉన్న ఉద్యోగులు భయపడి పనిచేసేటోళ్లు. ఇప్పుడైతే అవినీతి బాగా పెరుగుతూ పోతుంది. నేటి ప్రభుత్వం కఠిన చర్యలు చేపడ్తలేదు. ఎక్కడికి పోయినా లంచం అడుగుతున్నారు. ప్రభుత్వమే పెద్ద లంచగొండు అయితే కింద స్థాయి వాళ్లు దొంగలు కారా? రాష్ట్ర ప్రభుత్వం రెండు రూపాయలకే కిలో బియ్యం అని బడాయి మాటలు చెప్పుకొంటుంది. రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ద్వారా కుటుంబానికి నెలకు వస్తున్న బియ్యం సరిపోతలేవు. బయట మార్కెట్‌లో కంటే పన్నెండు రూపాయల తక్కువగా కోపెన్ బియ్యం అమ్ముతలేరు. గ్రామాల్లో డీలర్ల దగ్గర సావుకార్లు రెండు రూపాయలకే కొని బయట పన్నెండు రూపాయలకు అమ్ముతున్నారు. ఆడపిల్లల్ని బయట ఇడిసిపెట్టాలంటేనే భయంగా ఉంది. వయసొచ్చిన ఆడపిల్లలు బయటికి వెళ్లి వచ్చేదాకా భయంగా ఉంటుంది. ఆడపిల్లలకు రక్షణలేదు. హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డుమీద వెళ్లేటప్పుడు భయంగా ఉంది. ఈ ప్రభుత్వం తమ లోటుపాట్లను గమనించి కఠిన చర్యలు చేపట్టి మంచి దారిలో నడవాలని కోరుకుంటున్నాం.

శ్రీలక్ష్మి (45)
రోడ్డు పక్కన టీకొట్టు, హైదరాబాద్

ఇప్పుడున్న ప్రభుత్వం మంచిపనులు చేస్తుంది కాని అందవలసిన వారికి అందడం లేదు. ఈ పథకాలన్నీ ఇలాగే ఉండి ఇంతకన్న మంచి ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వం ఇప్పుడు ఇన్ని పథకాలు చేపట్టిన నేను ఏ పథకాలలో ప్రయోజనం పొందలేదు. ఇందిరమ్మ ఇండ్ల పథకం వల్ల వచ్చే పైసలు ఎందుకూ సరిపోతలేవు. ప్రభుత్వం నుంచి వచ్చిన పైసల్లో కొన్ని మధ్య ఉండే అధికారులు, కొన్ని పైసలు గ్రామంలో ఉండే దళారులు దోచుకుంటున్నారు. పైగా అప్పుల పాలు అవుతున్నాం. అధిక ధరల వల్ల మేం సరైన సరుకులు కొనుకోలేక పోతున్నాం. కూలికిపోతే యాభై రూపాయల నుండి వంద రూపాయల దాకా వస్తున్నాయి. వాటితో సరుకులు ఏమీ రావడంలేదు. అందువల్ల కనీసవేతన చట్టం తేవాలనీ, ధరలను అదుపులో ఉంచాలనీ కోరుకుంటున్నాను. అవినీతి, లంచగొండితనం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

సి.ఎచ్. పెంటయ్య (40)
ఇస్త్రీ, హైదరాబాద్

(పై మూడు అభిప్రాయాలు సేకరించినవారు ***జి. యాదగిరి,*** హైదరాబాద్)

పదిహేను సంవత్సరాల క్రితం ప్రభుత్వాలు సామాన్యులకు చేసింది తక్కువ. ఇప్పుడు అందులో కొంత తేడా వచ్చింది కాని మా లాంటి (చాకలి) వాళ్ల జీవితాల్లో చెప్పుకోదగ్గ మార్పు రాలేదు. ఎందుకంటే మా పిల్లలు పెద్ద చదువులు చదివి పైకి వచ్చింది లేదు. రెండు రూపాయల కిలో బియ్యం ఇస్తున్రు. మిగిలిన వస్తువుల ధరలు బాగా పెరిగినయ్. దీంతోటి చేసిన పైసలు ఏ పూటకాపూటే అన్నట్లున్నది. మిగులు ఏమీలేదు. గట్లాంటప్పుడు మేమెట్లా బాగుపడతాము. ఇక్కడ మేము ఉండబట్టి ఇరవై ఐదు సంవత్సరాలు అవుతుంది. ఇండ్ల జాగలు ఇయ్యలేదు. ఇగమేం చేసే పనులు బట్టలుతుకుడు, పుట్టినప్పుడు మొదలుకొని చచ్చేవరకు అందరి బట్టల మైల మేం సాపు చేస్తే మమ్మల్ని మాత్రం చాలా నీచంగా చూస్తుంద్రు. చేసిన పనికి సరిగా పైసలియ్యరు. మేం ఒంటరిగయెల్లి ఉన్నోల్ల ఇండ్లల్ల బట్టలుతికేటప్పుడు మమ్మల్ని చాన రకాల బాధలు పెడుతుంద్రు. మాకు దోబిఘాట్‌లు కట్టించాలి. మంది పెరిగినట్లు ఉద్యోగాలు పెరుగతలేవు. అందరికి పనిదొరుకాలే. తొంభై మంది పనిచేస్తే పది మంది ఆస్తులు సంపాదించుకుని కూకొని తింటున్నారు. ఇవన్నీపోవాలి. మా పిల్లలకైనా న్యాయం జరగాలి. అందరిలా మేము మనుషులమే. సమాజంలో మమ్ముల్ని మనుషులుగా చూసి సమానగౌరవం ఇవ్వాలి. సబ్బండ వర్ణాలకు మంచిచేసే ప్రభుత్వాలు రావాలి. అట్ల చెయ్యకపోతే గతంలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఎట్ల దించింద్రో మళ్లీ సబ్బండ వర్ణాలందరు కలిసి ఈ ప్రభుత్వాన్ని కూడా అట్లనే దించుతము.

జి. ఉప్పలమ్మ (42)
లాండ్రీషాపు, మాణికేశ్వర్‌నగర్, హైదరాబాద్

(అభిప్రాయం సేకరించినవారు **యాటెల్లి రామచంద్రం,** హైదరాబాద్)

ప్రభుత్వాలు సామాన్యులకు అనుకూలంగా లేవు. ధరలు అధికంగా ఉన్నాయి. చేసుకున్న కూలీకి సరిపడ సరుకులు రావు. ఇండ్ల స్థలాలు ఇస్తామన్నారు. ఇవ్వడం లేదు. పథకాలు అర్హులైనవారికి అందడం లేదు. పావలా వడ్డీ ప్రచారం బాగుంది కానీ ఫలితం మాత్రం శూన్యం. అవినీతి బాగా పెరిగింది. బీడీలు చేసే మాకు కార్ఖానాలో ఆకు, తంబాకు తక్కువగా ఇస్తారు. మిలిగించుకొని అమ్ముకుంటారు. కంట్రోల్ షాపుల ద్వారా వచ్చే బియ్యం సరిపోవు. అధికధరకు ఇతరులకు అమ్ముకుంటున్నారు. పది లీటర్ల కిరోసిన్‌కు కూపన్‌లు ఇచ్చి రెండు లీటర్లు మాత్రమే పోస్తారు. పదిహేను సంవత్సరాల క్రితం ఉన్న సమస్యలు రెట్టింపై ప్రశాంతత కరువైంది. కేబుల్ టి.వి. వచ్చి సంస్కృతిని మార్చి కుటుంబ తగాదాలు సృష్టించి, వాటిని పెంచి పోషిస్తోంది. చుట్టూ

ఉన్న పరిస్థితులు తన అవసరం కోసం మనల్ని ఉపయోగించుకోవడం జరుగుతోంది. పగా, మోసం బాగా పెరిగాయి. పరిస్థితులు మారడానికి సామాన్యులను పట్టించుకునే ప్రభుత్వాలు రావాలి. సంస్కృతిలో, మీడియా విచక్షణలో మార్పురావాలి.

గంగామణి (35)
బీడి కార్మికురాలు, నిజామాబాద్

(అభిప్రాయం సేకరించినవారు **ఎం. నర్సయ్య,**
ఆదర్శనగర్, నిజామాబాద్)

ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చకుండా వాళ్లను యాచకులుగా తయారుచేస్తున్నది. ప్రజలకి అవసరం లేని వాటి పై శ్రద్ధ చూపెడ్తూ, అవసరం ఉన్నవాటిని పట్టించుకోని పరిస్థితి ఉంది. ప్రజల ఆకాంక్షలను తీర్చగలిగే విధంగా ప్రభుత్వాలు ఉండాలి. ప్రజల హక్కులను కాపాడే ప్రభుత్వాలు రావాలి. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజలకు సంబంధించి జీవనోపాధి, కూడు-గూడు-గుడ్డ, అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగం, పర్యావరణం అన్ని ప్రమాదకర స్థాయిలోనే ఉన్నాయి. వీటన్నింటిపై ప్రభుత్వాలకు నియంత్రణ లేదు. పాలకులే వీటికి జవాబుదారీ. అసమర్థ, స్వార్థ పాలన వల్లనే ఇన్ని సమస్యలు. పదిహేను సంవత్సరాల క్రితం ప్రజలు కొంతమేరకు జీవితాన్ని బాగానే గడిపేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కులవృత్తులు, వ్యవసాయం కొంతమేరకు నడిచినవి. ఇప్పుడు అంతరించి పోతున్న మానవ సంబంధాలు, కనుమరుగవుతున్న మానవతా విలువలు, సామాజిక స్పృహ ప్రజలు యంత్రంలాగా జీవితాన్ని గడుపుతున్నారు. చుట్టూ ఉన్న పరిస్థితులను తలుచుకున్నప్పుడు బతకడానికి అనువైన రోజులు కావు అనిపిస్తుంది. మొత్తంగా ఈ పరిస్థితులు మారడానికి విద్యావంతులూ, మేధావులూ నడుం కట్టాలి. స్వార్థ రాజకీయాలూ, అవినీతీ, అక్రమ నిర్బంధాలూ, ప్రజల హక్కులను కాలరాస్తున్న పాలకవర్గాల కుట్రను బయటపెట్టి నూతన సమాజ నిర్మాణంలో భాగంగా విద్యార్థి, యువతను చైతన్యం చేస్తూ అన్ని వర్గాల ప్రజలను ఉద్యమాల్లో పాలుపంచుకోవడం చేస్తే ఆశించిన స్థాయి కాకున్నా కొంతమేరకయినా మంచి ప్రభుత్వాలు రాగలవు.

సి.ఎచ్. శ్రీమన్నారాయణ
మంచిర్యాల్, ఆదిలాబాద్

ప్రభుత్వాలు ప్రజల కోసం ఉండాలి. ప్రజల కోసం ఏర్పడాలి. ప్రజల అవసరాలు గమనించకుండా అధికారం కోసం, పదవులను కాపాడుకోవడం కోసం ప్రభుత్వాలు ఏర్పడితే అవి ప్రభుత్వమెలా అవుతాయి? మద్యం, డబ్బుతో అధికారం సంపాయించి, అవినీతిపరులు అందలమెక్కితే ప్రజాపాలన ఎలా అవుతుంది? ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వాలు లేవని చెప్పాలి. అరవదేండ్ల స్వాతంత్ర్యం, అవినీతిని పెంచి పోషిస్తూ దారిద్ర్యాన్ని పెంచి ధనికులను మరింత ధనికుల్ని చేసింది. మనిషికి కనీస అవసరాలైన కూడు-గూడు-గుడ్డ, విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. గ్రామాల వృద్ధితోనే దేశాభివృద్ధి అవుతుంది. గ్రామాలు సుభిక్షంగా ఉంటే దేశాభివృద్ధి జరుగుతుంది. సెజ్‌ల పేరుతో భూ ఆక్రమణలు జరుగుతున్నాయి. అన్నదాతలు వీధిపాలవుతున్నారు. భూములన్నీ చేవల చెరువులవుతున్నాయి. ప్రకృతి సంపదంతా దోచుకోబడుతోంది. పర్యావరణ కాలుష్యం పెరుగుతోంది. ఉపాధి పోతోంది. మనిషి మనుగడకే ముప్పు వాటిల్లుతోంది. ఒకనాటి రాచరిక వ్యవస్థ, జమీందారీ పద్ధతి మొదలవుతున్నాయి. భూస్వాములు పెరుగుతున్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి చేయలేరు. స్వయం పోషకం కావాలి. ఉపాధి కల్పించాలి. ధరలనదుపు చేయాలి. గ్రామ రాజ్యమే స్వరాజ్యమన్న గాంధీ గారి సిద్ధాంతాన్ని అమలుపరచాలి. వలసలను నిరోధించాలి. టెర్రరిజాన్ని రూపుమాపాలి. స్వరాజ్యాన్ని సురాజ్యం చేయాలంటే ఇంకొక స్వతంత్ర పోరాటం జరపాల్సిన అవసరం ఉంది. అంతేగాని తాయిలాలు చూపించి సమస్యలను పరిష్కరించలేరు. కుల, మతాలతో, ప్రాంతీయ విభేదాలతో మనిషికి మనిషికి మధ్య చిచ్చుపెట్టె విధానాలతో సమస్యలు సాధించలేరు. మానవతా విలువలు కాపాడి, మనిషి మనిషిగా బతికే నైతిక విలువలను కాపాడుకోవాలి.

పి. సరళ
సీనియర్ సిటిజన్, హైదరాబాద్

ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు రూపొందించినాయి. వాటిలో చిత్తశుద్ధి లేదు. ప్రతిపక్షాలు, వ్యతిరేకులు వానిలోని లోపాలను అవినీతిని, అక్రమాలను వేనోళ్ల తెగతిడుతున్నారు. కాని వాటి పరిష్కారాలు, బాగోగులు గురించి ప్రస్తావించడం లేదు. పూర్వ కాలం రాజులు మారువేషాలతో వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేవాళ్లు. ఇప్పుడు ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలిసినా పట్టించుకోవడం లేదు. సుపరిపాలన అంటే ఏమీలేదు. అభివృద్ధి కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయకు నూరు పైసలు విలువైన పనిని సాధించడమే. ప్రజలవద్దకు పాలనలో ప్రజల ముఖతః వారి సాధక బాధకాలు తెలిసికొని, జీవనోపాధి కల్పించి కూడు, గుడ్డ, పక్కా ఇండ్లు అమరేటట్లు చూడాలి. పదిహేను సంవత్సరాల నాటికీ ఇప్పటికీ అన్యాయాలూ, అక్రమాలూ, క్రూరత్వం, హింస, హత్యలూ పెట్రేగిపోయినాయి. కసాయి వారిలా మనుష్యులను చంపుకొంటున్నారు. బహిరంగంగా, దర్జాగా లంచాలు తీసుకొంటున్నారు. దోషులు దొరబాబుల్లా తిరుగుతున్నారు. చుట్టూ (అన్ని విషయాలలో, అన్ని పరిస్థితులలో) అన్యాయమే అనిపిస్తుంది. మంచితనం, మానవత్వం కనిపించడం లేదు. మనషులలో చిత్తశుద్ధి కనిపించడంలేదు. ఈ సాగరకల్లోల పరిస్థితులు మారడానికి మార్పురావడానికి ఏం చేసినా బాగుపడే సూచనలు లేవు. ప్రతి ఒక్కరూ మనోవాక్కాయకర్మల మారాలి. ఒకరిని వేలెత్తి చూపితే మనవైపు మూడువేళ్లు ఉంటాయని గ్రహించాలి. అప్పుడు ఈ పరిస్థితులు మారడానికి అవకాశం ఉంటుందని అనుకుంటున్నాను.

తిరునగరి రేణుక (66)
తెలుగు పండిట్ (రిటైర్డ్), హైదరాబాద్

ప్రభుత్వాల లంచగొండితనం ముదిరిపోయింది. డబ్బు ఖర్చు పెడితేనే పనులవుతాయి. లేకపోతే ఎక్కడి ఫైళ్లు అక్కడే. ఎన్ని కోట్ల నిధులు విడుదలైతే బకాసురుల్లా దండుకొని, సామాన్య మానవుడు అలాగే ఉండి కొందరు మాత్రం నల్లధనంతో భవనాల మీద భవనాలు కడుతున్నారు. గుడ్డిలో మెల్ల అన్నట్లు కూడు-గూడు-గుడ్డకు అల్లాడేవారు

తక్కువే. తక్కువ ఆదాయం గలవాళ్లు గుడిసెల్లో ఉండగలుగుతున్నారు. ఇంట్లో అందరూ పనిచేస్తారు (పిల్లలతోసహా). వాళ్లకి చింతలేదు. పైవాళ్లు అంటే ధనవంతులు ప్లాట్ల మీద ప్లాట్లు కొంటారు, చెలామణీ అవుతారు. కాని మధ్యతరగతి వాళ్లు ఇళ్లు కట్టలేరు. అద్దెలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ రోజుల్లో మధ్యతరగతి పడుతున్న క్షోభ చెప్పనక్కరలేదు. ప్రభుత్వ ఉద్యోగం అసాధ్యం. బిజినెస్‌లో పెట్టుబడికావాలి. ఏమీలేని వాడికి అప్పు ఎలా పుడుతుంది? నానా బాధలు పడుతున్నారు మధ్యతరగతి వాళ్లు. పదిహేను సంవత్సరాల ముందు స్నేహితులు బంధువుల రాకపోకలతో అదొక ఆనందంగా ఉండేది. జీతం తక్కువైనా టెన్షన్ ఉండేది కాదు. ఇప్పుడు టి.వి. ఛానెల్స్ రకరకాల కార్యక్రమాలు. దానితో కాలం గడిపేయవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే జ్ఞానం పెరిగే కొద్ది మానవ సంబంధాలు తిరుగు దౌతున్నాయి. హైదరాబాద్ నగరం మరి ఇతర పట్టణాలలోని ప్రజలు బతుకు పెనుగులాటలు పరుగులెడ్తున్నాం. ఒకసారి బోల్తా పడుతున్నారు. కొన్నిసార్లు లాటరీ తగిలినట్లు కొందరు అత్యధిక లాభాలు సంపాదించి కన్ను మిన్ను కానకుండ ఉన్నారు. ఈ పరిస్థితులు విషమించడమే జరుగుతుంది. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు ఈ పరిస్థితులు మారాలంటే – యువత ఆలోచనలు మీద ఆధారపడి ఉంది. వీలైనంత వరకు అసెంబ్లీ పార్లమెంట్‌లకు వెళ్లే సభ్యులను ఎన్నుకొనేటప్పుడు తెలివితో వ్యవహరించి మంచి ప్రభుత్వం రావడానికి ప్రయత్నించాలి.

టి. సావిత్రి (72)
మహిళా సంక్షేమ శాఖ ఉపాధ్యాయిని (రిటైర్డ్), హైదరాబాద్

ప్రభుత్వాలు మారటతల్లి ప్రేమలా ఉన్నాయి. కన్నతల్లి ప్రేమలా ఉండాలి. జీవనోపాధి చాలీచాలని కూడు, గూడు, గుడ్డ లేని అభాగ్యులెందరో. అధికధరలు, అవినీతికి అంతులేదు. నిరుద్యోగం పెరుగుతూ ఉంది. పర్యావరణ కాలుష్యం పెరుగుతున్నది. పదిహేను సంవత్సరాల ముందు జీవనస్థితి దినంకు విలువ ఇరవై ఐదు రూపాయలుండగా, ఇప్పుడు వంద రూపాయలకు మించి మారింది. మా చుట్టూ ఉన్న పరిస్థితులలో అధిక శాతం ప్రజలు బతుకు జీవుడా అంటూ బతుకుతున్నారు. అవినీతి, కల్తీ, అక్రమార్జన, నేరాలు, ఘోరాలు చేయని, మానవత్వమున్నవారిని ఎన్నికలలో ఎన్నుకుంటే బాగుంటుంది.

దోర అప్పలస్వామి (70)
సీనియర్ సిటిజన్, హైదరాబాద్

పరిపాలనారాహిత్యం వల్ల నిజమైన అభివృద్ధి జరగటంలేదు. బహుళపార్టీ ప్రభుత్వం మేలు. అధికారంలో ఉన్నవారికి, లేనివారికి సంపాదనే లక్ష్యమైపోయింది. పరిపాలనకు సంబంధించినంతవరకు బ్రిటిష్ పాలకులే మెరుగనిపిస్తోంది. ఉపాధి కొరత పెరుగుతోంది. పరిపాలన బాగుంటే ఈ సమస్యలు పరిష్కారమవుతాయి. సమాజంలో అభద్రత ఎక్కువవుతోంది. నైతికత పూర్తిగా లోపించింది. విద్య, ఆరోగ్యం గురించి, పరిస్థితులలో మార్పు తీసుకుని రావాలి.

నాదెళ్ల రాఘవరావు (86)
సీనియర్ సిటిజన్, హైదరాబాద్

ప్రభుత్వాలు బొత్తిగా బాగోలేవు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లుగా ఉన్నాయి. ప్రజలపక్షం వహించేవాళ్లే ప్రభుత్వాలలోకి రావాలి. జీవనోపాధి, కూడు–గూడు–గుడ్డ, అధికధరలు, అవినీతి, నిరుద్యోగం పర్యావరణం వీటన్నిటికి కమ్యూనిజం ఒక్కటే పరిష్కారం. అది సాయుధ విప్లవం ద్వారానే సాధ్యం. నానాటికీ తీసికట్టు నాగంభట్టు అన్నచందంగా ఉన్నారు. ఇప్పుడు స్వార్థం, అసూయపెరిగిపోయాయి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉన్నాయి ఇప్పటి పరిస్థితులు. ప్రజలక్షేమం కోసం పాటుపడే, స్వార్థం విడనాడే ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నా. అందరూ స్వార్థం, అసూయ విడనాడి సాటివ్యక్తికి ఎంతో కొంత సాయపడాలని కోరుకుంటున్నా. అసూయ అన్నంపెట్టిన చేతినే కొరుకుతుందని షేక్స్‌పియర్ ఎప్పుడో అన్నాడు. అలా ఉన్నాయి పరిస్థితులు.

ఎస్. రఘుమాబాయి (71)
సీనియర్ సిటిజన్, హైదరాబాద్

ప్రస్తుత ప్రభుత్వాలు కుల, మత ద్వేషాలను రెచ్చగొడుతూ, కుక్కల దొడ్డిగా తయారై దోచుకుతినడంలో మహా నిపుణుల కూటమిగా ఉన్నయ్. ప్రజలకు కూడూ, గుడ్డ అందించడానికే తాము కృషి చేస్తున్నట్లు నటిస్తూ, ధరలు పెంచడానికి చాటుగా ప్రయత్నాలు చేస్తున్నారు. దోపిడీ విధానం పెరిగింది. నిరుద్యోగం పెరిగింది. జనాభా పెరుగుదలను అరికట్టాలి. అవినీతిపరులను, దోపిడీదారులను నిర్దాక్షిణ్యంగా ఉరితీయాలి. అదే మార్గం. మనచుట్టూ ఉన్న నాయకులు దేశభక్తుల వేష భాషలతో ప్రజలను రెచ్చగొడుతున్నారు. సామాన్యుడు అసహ్యించుకొనే నీచపు బూతుల సంస్కృతిని అవలంబించే నాయకులు, మంత్రుల పేరుతో అందలమెక్కి జనాన్ని మోసం చేసే పద్ధతులను అవలంబించడం శోచనీయం. పదిహేను సంవత్సరాల క్రితం ఈ ధరలు లేవు. రూపాయికి విలువ ఉండేది. ఇప్పుడు, ఒకటి, రెండు, ఐదు రూపాయల నోట్లు కనిపించడంలేదు. ఐదు వందల రూపాయల నోట్ల చలామణీ ఎక్కువగా ఉంది. కారణం ధరలు పెరిగాయి. జనంలో చలామణీ పెరిగింది. ప్రస్తుతం మన చుట్టూ పరిస్థితులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. ఇంకా దిగజారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మోసగాళ్లూ, రౌడీలూ, దోపిడీగాండ్లూ రాజ్యంలో ఉన్నారు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితుల నుండి దేశం రక్షించబడాలంటే – నీతి, నిజాయితీలు పెంపొందించే నాయకత్వం రావాలి. సమసమాజ నిర్మాణమే దీనికి మంచి తోవ.

ఎన్.వి. బసవయ్య
రిటైర్డ్ టీచర్, హైదరాబాద్

అభివృద్ధి పథకాలతో ఉత్తమంగా ఉన్నా అమలుపరచడంలో అవినీతిలో కూరుకుపోతున్నాయి. పారదర్శకత్వంగా, ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి. ప్రజలను చైతన్యమంతులను చేయాలి. జీవన విధానంలో అభివృద్ధిలో అనూహ్య మార్పులు రావాలి. మారుతున్న సమాజానికి తగ్గట్టుగా మారని మన ఆలోచనా విధానం, ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, యువశక్తి ద్వారా ప్రజలందరిని చైతన్యమంతులను చేసి, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసి, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కృషి చేయడం మన నైతిక బాధ్యతగా గుర్తించాలి.

చెన్నపనేని వెంకటేశ్వరరావు (67)
రైతు సంఘం, స్వచ్ఛంద సేవా సంఘాలు, హైదరాబాద్

ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారు. ప్రజల డబ్బుతో వారి ఓట్లను కొనుక్కునే కార్యక్రమాలకు 'సంక్షేమ కార్యక్రమాలు' అనే ముద్దుపేరు పెట్టుకొని మురిసిపోతున్నారు. ప్రభుత్వ ఆస్తులకు ధర్మకర్తలుగా ఉండాలి. అన్ని ప్రభుత్వ నిర్ణయాలలో 'ప్రజాసంక్షేమం' ప్రతిబింబించాలి. పౌరులను ఉచిత పథకాలకోసం ఎగబడే బిచ్చగాళ్లలాగా మార్చరాదు. వారిని, స్వయంశక్తిని నమ్ముకున్న ఆత్మాభిమానులుగా తీర్చిదిద్దాలి. ఇవన్నీ అన్ని ప్రభుత్వాల ప్రాధాన్యంశాలే. కార్యక్రమాలు, చట్టాలు కూడ ఉన్నాయి. పేదరికం ఎన్నాళ్లుంటే, నిరక్షరాస్యత ఎన్నాళ్లు ఉంటే, రాజకీయ నాయకులకు అంతమంచిది. ఈ రెండు అంశాలు మెదక్ పార్లమెంటరీ నియోజకరవర్గంలో పరిఢవిల్లుతూ ఉన్న కారణం చేతనే ఇందిరాగాంధీ మెదక్ నియోజకవర్గాన్ని ఎన్నుకుని పోటీచేసి, సునాయసంగా గెలిచింది. అందుచేత జీవనోపాధి, కూడు-గూడు-గుడ్డ, అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగం వంటి అంశాలలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండదు. గ్లోబలైజేషన్ కారణంగా కుటుంబ వ్యవస్థకు పట్టు జారిపోయింది. పైసల రూపంలో సంపాదన పెరిగినా విలువలకు 'విలువ' లేకుండా పోయింది. ఈ దేశం బాగుపడదనిపిస్తుంది. క్షమించండి. రెండుపార్టీల పద్ధతి - దామాషా ప్రాతినిధ్యం, ఎన్నికైన ప్రతినిధులను వెనుకకు పిలిచే పద్ధతి - ప్రవేశపెట్టి కొన్నాళ్లు ప్రయత్నించి చూడాలనిపిస్తుంది.

గోవిందు శౌరయ్య నాయుడు (77)
రాష్ట్ర విద్యాశాఖ, హైదరాబాద్

ప్రభుత్వమూ, ప్రతిపక్షాలూ బాగుండటంలేదు. నిజాయితీ, సత్యం, ధర్మంతో ఉండాలి. ప్రతివ్యక్తి కష్టపడి పనిచేయాలి. నిజాయితీ లోపించింది. ప్రతివ్యక్తిలో స్వార్థం పెరిగింది. సర్దుకు పోవటం నేర్చుకోవాలి. సంపదపైన సేవింగ్ ఉండాలి. ప్రతీరాజకీయ నాయకుడు రాష్ట్రపతి నుంచి సర్పంచ్ వరకూ ఛీఫ్ సెక్రటరీ నుంచి గుమస్తా వరకూ అన్ని మతాలకు సంబంధించిన ప్రశ్నల - జవాబులు ఉంటే బాగుండేది.

జి. కొండారెడ్డి (67)
జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్, హైదరాబాద్

జిద్దుకు దుకాన్ తెరుస్తున్న గాని ఏం ఎల్లదు. రెడీమేడ్ బట్టలు వచ్చినంక మాలాంటి టైలర్లను ఎవరు అడుగుతరు? అన్ని పార్టీలల్ల తిరిగిన, ఏమైనా ఫాయిదా ఉంటదేమోనని. సబ్ చోర్ బేటా హై. నక్సలైట్లు వాళ్ల జిందగీ ఖరాబ్ చేసుకుని జంగల్‌కు పోతున్నరు. పెండ్లాం పిల్లల్ని తల్లిదండ్రులని ఇడిసిపెట్టిపోతున్నరు. నాకేం ఫాయిదా అనిపిస్తలేదు. ఆజాద్ కోసం కొట్లాడిన దినాలు ఏర్పాటే. ఈ జమానా అలగ్ ఉన్నది. అయితే నక్సలైట్లు ఉన్నందుకు కొంచెం బెదురుతరు. డెవలప్ అయిందంటరు గాని సియాసత్ ల ఉన్నోళ్లు సంపాయించుడు అయింది గాని ఏం జరగలే. సబ్ చోర్ హై. దునియా బదలాయించేది చానా ముష్కిల్.

అఫ్జల్ (42)
టైలర్, మహబూబ్‌నగర్

నాది ఎమ్మిగనూర్. పదేండ్ల కింద ఇక్కడకు వచ్చిన. స్పిన్నింగ్ డిపార్ట్‌మెంట్ల పనిచేస్త. అంతకుమునుపు రాయలసీమ పేపర్ మిల్లుల పనిచేసేది. లాకౌట్ అయిపోయినందుకు ఈ గతి పట్టింది. మా అమ్మ, నాయన ఎమ్మిగనూర్‌ల మగ్గం నేసేది. ఆ పని కూడ బంద్ అయిపోయింది. చిన్నది ఒక రూం ఇచ్చింది కంపెనీ. అందులనే మా కుటుంబం మొత్తం ఉంటం. పనిలో సూపర్‌వైజర్లు ఊకే ఇబ్బంది పెడతరు. కంపెనీ క్వార్టర్స్‌లోనే ఉంటం కాబట్టి రాత్రి పగలు అనేది లేకుండా ఓవర్ టైం చేయిస్తరు. పర్మనెంట్ అయేందుకు టైం దగ్గర రాంగనే ఏదో వంక పెట్టి తీసేస్తరు. మల్ల క్యాజువల్ లెక్కనే చేరాలే. టి.బి. రోగం వచ్చి సచ్చిపోతమని భయమైతది. పిల్లలు ఏమైపోతరేమో అనిపిస్తది కాని తప్పదు. పిల్లల కోసం బతకాలె. బతకనీకి బుక్కెడు తినాలె.

రాఘవేంద్ర (38)
కాటన్ మిల్ వర్కర్, మహబూబ్‌నగర్

చానా అజీబ్ అనిపిస్తది. బుక్కెడు బువ్వ తినాలంటే పీతిల చెయ్యి పెట్టాలె. ఒకప్పుడు ఎత్తే సిస్టం ఉండె. ఐదు రూపాయలకంటే ఎక్కువ ఇచ్చేది కాదు. అంత గబ్బుగా ఉన్న గూడ పూట గడిచేది. ఇప్పుడు గలీజ్ సిస్టం పోయింది గాని, మాకైతే చాలా ఇబ్బంది అయితున్నది. చానామంది ఇళ్లల ఎవరంత వాళ్లు లాట్రీన్‌లు కడుక్కుంటున్నరు. మాకేమన్నా పని దొరుకుతున్నదంటే ఫంక్షన్ హాల్లల్లా, హాస్పిటల్లనే. మొత్తం మా పనే పోతున్నది. వేరే ఏం పనిచేయాలో తెలుస్తలేదు. మా మేతరోల్ల సంఘం పెట్టాలంటే ఎవ్వరూ ఏం అంటలేరు. గవర్నమెంట్ తోటి లడాయి చేస్తావురా? అంటరు.

మహేష్ (40)
పాకీ పనిమనిషి, మహబూబ్‌నగర్

మిల్లుల నేను సీనియర్ వర్కర్‌ని. ఇందులో జరగని అన్యాలం లేదు, దుర్మార్గంలేదు. అప్పటోల్లకు కొంతమందికి పర్మనెంట్ అయింది. అట్ల నాగ్గుడ అయింది. ఇప్పటోల్లకు ఎవరికి అయితలేదు. సూపర్ వైజర్లు ఆడపిల్లల్ని బాగా సతాయిస్తరు. పదేండ్ల కింద ఒకసారి ఇద్దరు డైలి వేజ్ అమ్మాయిలని రేప్ చేసి సంపేసి ఉరిబెట్టిండ్రు. అప్పటి ఎస్.పి. గూడ గ్యాంగ్‌రేప్ చేసి సంపేసిండ్రు అన్నడు. కాని వారం తిరగకముందే అదే ఎస్.పి. ఆత్మహత్యలు అన్నడు. ఇప్పటి వరకు వాళ్లని పాడు చేసి సంపిండెవరో బయటకు రానిస్తలేరు. అది చేసింది మిల్లు సేటు కొడుకులు. పట్నం నుంచి వచ్చి తాగి ఈ పని చేసిండ్రు. వాళ్లకి లొంగితే ఏం జెయ్యరు. అట్ల ఎంతమందిని పాడు చేసిండ్రో బయటికి రాలే. ఏమైనాగాని వాడు పైస ఉన్నోడు. ఎవన్నోరన్న మూపిస్తడు. ఎస్.పి. అంత పెద్దోడె అట్ల జేస్తే పేదోల్లం ఇక సచ్చిపోవుడె.

శివ (50)
కాటన్ మిల్ వర్కర్, మహబూబ్‌నగర్

1960 - 70ల అప్పుడు మిల్లు పడ్డది. మార్వడోంది. మిల్లు అయినంకనే ఊర్ల ఆత్మహత్యలు, అక్రమ సంబంధాలు ఎక్కువైనయ్. హత్యలు పెరిగినయ్. మిల్లు సైరన్ ఇన్నమంటెనే బుగులు బుగులు అయితది. మిల్లు పడింది మొదలు ఊరి పాలిట రాక్షసి అయింది. మిల్లు భూములు తీసుకున్నంక సేద్యం, గిద్యం అంతా పోయింది.

అందరు మిల్లు మొకాన పోతున్నరు. సంసారాలు కరాబు అవుడు, టి.బి. రోగంతో సచ్చిపోవుడు ఎక్కువై పాయే. సేట్లు మాత్రం ఈ మిల్లు అందానితోనే షాద్‌నగర్, కల్వకుర్తిల మిల్లులు పెట్టిండ్రు. ఇక్కటోల్లు మంచిగ పనిచెయ్యరని ఒరిస్సా వాల్లను తోలుకొస్తరు. వాల్లకు మాకు లొల్లి పెడ్తరు. మిల్లు ఏం చేసిందయ్యా అంటే ఉన్న భూములు తీసుకున్నది, ఊరు గబ్బులేపింది. మా ఊరి పిల్లను ఎవరు చేసుకుంటలేరు. మిల్లు రాక మునుపు ఊర్ల బొందల గడ్డ సిన్నగ ఉండేది. ఇప్పుడు ఊరికంటే అదే పెద్దదైంది.

శ్రీను (46)
కాటన్ మిల్ వర్కర్, మహబూబ్‌నగర్

మా నాయన, మా అన్న, నేను అందరం ఎద్దులకు నాడాలు కొట్టే పని చేస్తం. ఒకప్పుడు ఇంటికే ఎద్దులు తోలుకొచ్చేటోల్లు. ఇప్పుడు సంతల తిరుగుతం. సేద్యం పోయినంక ఎద్దులు ఎక్కడివి. అందుకే మా నాయన సచ్చిపోయినంక నేను ఆ పని ఎక్కువ చేస్తలేను. మా అన్న అదే పనిల ఉన్నడు. దేవరకద్ర, నాగర్‌కర్నూల్, ప్యాట సంతలకు పోతడు. నేను గూడ అప్పుడప్పుడు పోత. చిట్‌ఫండ్ కంపెనీల పనిచేస్తున్న. ఎట్ల బతకాల్నో ఏం తోస్తలేదు. ఎద్దులకు నాడలు కొట్టుడు కాదు, దమాక్కు కొట్టిండ్రు.

సుభాష్ (35)
ఎద్దులకు నాడాలు కొట్టే వృత్తి, మహబూబ్‌నగర్

తొమ్మిదేండ్ల నుండి మునిసిపాలిటి నల్లలిప్పుత. పర్మనెంట్ కాలే. జీతం కూడా సమంగా ఇయ్యరు. గల్లీల్ల పెండ్లిల్లు, ఫంక్షన్లు అయితే ఎక్కువ సేపు నీళ్లు ఒదిలితే వంద రెండొందలు ఇస్తరు. ఆ పైసలల్ల ఈ లైన్ చూసేటోనికి భాగం ఇయ్యాలే. లేకపోతే జీతం ఇయ్యకుండ సతాయిస్తరు. ఒక ఆఫీసర్ అయితే నౌకరి పర్మనెంట్ చేస్తానని ఇరవై వేలు తీసుకున్నాడు. చిట్టీ కట్టి, తిప్పలవడి ఇచ్చిన. ఈ పొద్దు రేపని దినాలు గడిపి పోయిండుగాని పర్మనెంట్ చెయ్యలె. ఇచ్చే నౌకరికి సంసారం ఎల్లక పైసలు తీసుకొని నీళ్లు ఇడుస్తున్న. పిల్లగాడు ప్రైవేట్ స్కూలుకు పోతడు. నెలకు ఒకసారి ఫీజుకు కట్టాలె. ఆ ఫీజూ, ఈ ఫీజూ అని ఊకే సతాయిస్తరు. ఒక్కతోన కాదు, యాడ చూడు పైసా, పైసా. స్కూలుకు పో, దవాఖానాకు పో, గుడికి, కలెక్టర్ ఆఫీస్‌కి పో యాడ చూసిన పైసలే. భగవంతుడు ఇదంతా సూడకుండ కండ్లు మూసుకున్నడేమో అనిపిస్తది.

కాంతారావు (40)
మున్సిపల్ వర్కర్, మహబూబ్‌నగర్

ఎనిమిదేండ్ల కింద నా మొగుడు సచ్చిపోయిండు. ఆటోల బడి పిల్లలని తీసుకపోతుంటే ఏనుగొండ కాడ రైలు గుద్ది సచ్చిపోయిండు. ముగ్గురు సాలే పిల్లలు కూడ సచ్చిపోయిండ్రు. ఫైనాన్స్ పెట్టి తెచ్చిన ఆటో పాయే. అప్పు మిగిలే. ఇన్సురెన్సు లేదు పైసలు రావన్నరు. వకీలు చెప్పి కేసు ఏపిస్తే వాడు నా కష్టం చేసిన పైసలు తిన్నడు కాని కేసు చెయ్యలె. సంసారం అంతా ఆగమాగం అయిపాయె. ఇగ అప్పటిసంది కళ్యాణ మంటపంల, ఇండ్లల అంట్లు తోముత. పెండ్లి సీజన్ల దినాం నూటయాభై వస్తై. అది కూడా పగలూ రాత్రి ఆడనే పడాలె. ఒక్కడే కొడుకు. సాలెకు పోతడు. పాన్‌పరాగ్ అలవాటు చేసుకున్నడు. సినిమాలు చూస్తడు ఊకే. మొగడు సచ్చిన నాడు వాడొచ్చి వీడొచ్చి ఇల్లిస్తం, నౌకరిస్తం అన్నడు. ఎవడు ఏమియ్యలే. రైల్వే వాళ్లు గేటు వేయలేదని కేసు వేస్తే వకీలు అట్ల చేసే. గవర్నమెంట్ ఇస్తుందని ఎం.ఆర్.ఒ. ఆఫీస్‌పోతే ఏందో సర్టిఫికెట్ కావాలన్నరు. కాలికేస్తే మెడకేస్తరు, మెడకెస్తే కాలికేస్తరు. సర్కార్ అంటే ఇంగ ఏం లేదు, పైసలు, పానాలు తినే దెయ్యం చూడయ్యా.

సరోజ (40)
ఇళ్లలో అంట్లు తొమె వృత్తి, మహబూబ్‌నగర్

బీడీ చేయవట్టి ఎన్నేండ్లు అయ్యిందో లెక్కలేదు. చేసిన కష్టం చేసినట్టే ఉన్నది. చేసి చేసి దమ్ముర్రోగం, టి.బి.రోగం పట్టుకున్నది గాని ఎర్రటి యాగాని గూడ మిగిలింది లేదు. పదేండ్ల కింద కొడుకు మంటిపనికి దేశాలు పోయిండు. కక్కుడకాల్లకు పెట్టి అక్కడే సచ్చిపోయిండు. తీసుకొచ్చి మన్ను చేయనీకె కూడ చాతకాలేదు. కొడుకు పోయినంక కోడలు, మన్మంగులు తల్లిగారింటికి పోయిరి. ముసలోడు యానాడో మంట్లె పడుకున్నడు. బొడ్రాయి లాగ బతుకుతున్న. సావన్న రాదు. కార్ఖానా తెరిచిన నాడు బువ్వ మెతుకులు దొరుకుతయి. దొంగ సేట్లు దేన్లు సమంగా ఇయ్యరు. ఆకు మంచిది ఇయ్యరు గాని బీడీ మంచిగ కావాలంటరు. ఓట్లప్పుడు, ఓట్ల కొడుకులు వస్తరు, కల్లుబొట్టు పోస్తరు, అంతే. అంత లఫూట్ కొడుకులు. పానగల్లు గుట్టలల్ల పండుగ సాయన్న ఎనకటికి బలిసినోల్లందర్కి నందికోల శావ చేసిండంట. అట్ల ఎవరన్నా రాకపోతరా బిడ్డా...

ఎంకటమ్మ (50)
బీడీ కార్మికురాలు, మహబూబ్‌నగర్

ఇరవైయేండ్ల సంది పాలమూర్ల పాలు వోస్త. మునుపటి దినాలు ఏర్పాటె. సైకిల్ మీద పొయ్యి పోసి వస్తే అరవై డెబ్బై రూపాయలు మిగిలేవి. అయిదు లీటర్లు పోసినగాని పొట్ట ఎల్లేది. ఇప్పుడు పది లీటర్లు పోసిన కూలి ఎల్తలేదు. పాల ప్యాకెట్ల కాలం, సైకిల్ మోటర్ల దినాలు. ఏం జెయ్యలేక పోయాలె గాని ఫాయిదా లేదు. కాపుదానం పాయే, బర్లు పోబట్టె, కూలి కూడ దొరకని దినాలు వచ్చె. ఇగ మ్యాత సంగతి అడగనవసరం లేదు. మా ఊరి నడుమ రైలుపట్టాలు ఉన్నై. పట్టాల అవతల పాలమూరు దునియా ఏర్పాటె. పట్టాల ఇవతల ఊరు ఇంకొక తీరు. ఊర్ల ఎంత మొనగాని సేద్యం చేసినోడైనా టౌన్ల పనికి రాకుండా అయిపోయిండు. ఓట్లకు వచ్చుడు పోవుడు చానా దినాలుగ నడుస్తున్నది గాని, ఓటు ఎయ్యకుంటే ఏమైతదో, ఏస్తే ఏమైతదో తెల్వకుంటున్నది. మా ఊళ్ల గవర్నమెంట్ అంటే పట్టాల మీన పీనుగ తీస్కపోయేటప్పుడే వస్తది. అంతకుమించి ఏంలేదు. బతుకుడు అంటే ఇయాల ఏమున్నది, పానం తోన ఉండుడే.

లక్ష్మయ్య (40)
పాలుపోసే వ్యక్తి, మహబూబ్‌నగర్

నాకు తెలివొచ్చినప్పటిసంది నక్సలైట్ల గురించి ఇన్న. మా

ప్రేమ్‌నగర్‌ల '93ల పోలీసులు ఒకాయనని సంపింఢ్రు. ఈయాల రేపు పేపర్ల చూస్తున్నం చానా మంది నక్సలైట్లు సచ్చిపోతున్నరని. కాని వాళ్లు ఎవ్వరికి ఏం చేసింఢ్రో తెల్వది. ఇప్పుడంత నడిచేది దొంగ రాజకీయం, లంగ రాజకీయం. కౌన్సిలర్ ఎలక్షన్ల నుంచి షురూ పైదాంక అంతా పైస ఉన్నోందే రాజ్యం. ఐదేండ్ల కింద కౌన్సిలర్ గా పోటీ చేసిన. పైసలు ఉన్నోడు ఒకడు బెదిరిచ్చిండు. ఏం చేస్తం వాపసు తీసుకున్న. పైలి కొన్ని దినాలు కాటన్ మిల్లుల పని చేసినా. ఆ పత్తికి రోగం పట్టుకోని మానేసిన. బుక్కెడు బువ్వ దొరుకుడే చానా కష్టి. ఎవ్వరన్నా వచ్చి పేదోళ్లకోసం ఏవన్న చేస్తరా అంటే ఎవ్వరు రారు. నక్సలైట్లు గూడ ఏం చెయ్యకపోయిరి.

చిన్న (38)
నిరుద్యోగి, మహబూబ్‌నగర్

మనుం పోయిన యాడాదికే మొగుడు సచ్చిపోయిండు. ఉన్న ఎకరం సేద్యం చెయ్యక మురికి తుమ్మచెట్లు మొలిచినై. అప్పటి సంది పిల్లగాన్ని పెట్టుకొని పెద్ద కులపోళ్ల ఇంట్ల బాసన్లు తోముకుని పొట్ట ఎల్లదీసుకుంటున్న. గవర్నమెంట్ ఇల్లు ఇస్తనని అంటనే ఉంది. ఇల్లు లేదు. ఇడుపు లేదు. ఇండ్లల సద్దిది బొద్దిది ఏస్తే తిని నేను నా పిల్లగాడు బతికినం. మునుపు నెలకు యాభై రూపాయలు వచ్చిన మంచో చెడో నడిచేది. ఇప్పుడు మున్నూరు వచ్చినా ఎల్తలేదు. బియ్యం తో దేఖిల్ అన్ని కొనాలె. ఓట్లప్పుడు మాత్రం రెండు మూడు సీసల కల్లు, ఇరవై ముప్పై రూపాయలు దొరుకుతాయి. అంతకుమించి ఎవరు వచ్చి అడిగింది లేదు, చేసింది లేదు. ఎండకాలం వస్తే మంచినీళ్లు పది దినాలకు ఒకసారి వస్తై. కంట్రోల్ బియ్యం గూడ సమంగా రావు. డీలరే అమ్ముకుంటడు. పోలీసోల్లు ఉన్నరంటే కల్లు తాగాలే, కోడికూర తినాలే అంతే. అంత సుడుగాడీ, బూడిదేనయ్యా.

మణెమ్మ (55)
ఇళ్లలో అంట్లు తోమే వృత్తి, మహబూబ్‌నగర్

సదువులేదు, ఏం లేదు. చిన్నప్పటి నుండి గీ మిల్లుకే వస్త. చిన్నగ ఉన్నప్పుడు మా అమ్మ కూలి వస్తే ఎంట వచ్చేది. అట్ల అల్వాటైంది. పెద్దగైనంక మిల్లు డ్రైవింగ్ నేర్చుకున్న. ఫస్టు ఫస్టు ఈ కూలే మంచి గనిపించేది. జేబుల నాలుగు పైసలు ఉండేవి. ఇప్పుడు వేలు వచ్చినా కూడ అప్పుకు పోక తప్పుతలేదు. అంత తుందాయి కాలం. డ్రైవర్ల సంఘం ఉన్నది గాని అన్న ఎవ్వడు కలిసి రాడు. కలిసి కల్లు తాగుదం అంటరు గాని సంఘం ఉండాలన్న దమాక్ లేదు. సేట్లేమో సంఘాలు పెట్టి ఫుల్లు పైసలు సంపాయిస్తరు. వర్కర్ల మీద జులుం చేస్తరు. మిల్లుల ఆక్సిడెంట్లు అయితే లేబర్ కోర్టుల కేసులేస్తం. సేట్లు పైసలిచ్చి రాజీ అయిదం అంటరు. లేకుంటే లేబర్ ఆఫీసర్లకు లంచాలిచ్చి కేసు నడవకుండా చేస్తరు. యాడ్కి పోయినా లంచాలు ఇయ్యాలే. ఇంట్లకెల్లి బయటికెలితే వస్తమో రామో తెలియని కాలం. నిన్న ఇంట్ల ఈపొద్దు మంట్ల, కాలం చెప్పొస్తలేదు.

శేఖర్ (37)
రైస్ మిల్ డ్రైవర్, మహబూబ్‌నగర్

సూడయ్యా! ఈ ముసల్తనంల గుడ పని చెయ్యాలే. బుక్కెడు పెట్టేటోడు దిక్కులేక కాదు, ఎంతమంది చేసినా సంసారం ఎల్లక. పైలి జమానాల ఇంత తిప్పల ఉండేటిది కాదు. సంపాదన తక్కువ గాని ఖర్చు ఇంత ఉండేది కాదు. ఇప్పుడు యాడికి పోవాలన్నా ఆటో ఎక్కాలె. మునుపు పెద్ద దవాఖానాకు పోవాలంటే పొద్దుగాల లేసి నడుసుకుంటూ పోయేది. ఇప్పుడు నడవనీకే సందు లేనంత ఇర్కుటం అయినై రోడ్లు. మనసొంటోల్లకు రోగం రొష్టు వస్తే సచ్చిపోవాలే గాని బత్కనీకె లేదు. బీడీ కార్ఖానాలు నెలల పదిరోజులు గూడ నడవ్వు. దేన్లు సమంగా ఇయ్యరు. ఒక్కొక్కసారి మూడు నాలుగు నెలలకు ఆకేస్తరు. పొగాకు తక్కువేస్తరు. అమ్ముకతిన్నారని మున్ని మననే బద్నాం చేస్తడు. ఆకు మనమే గీక్కోవాలే, కత్తిరీయాలే, కదుక్కోవాలే ఇంత చేస్తే దినాం ఐదు నూర్ల బీడీ కూడ కాదు. వెయ్యి బీడీ చేస్తే తప్ప పొట్ట గడవదు. ఒకటి కాదు నాయనా, కుదెన లేని పూట లేదు. భూమ్మీద ఉండేదానికంటే మంట్ల్య పండేదె మేలు.

ఖాజా బీ (46)
బీడీ కార్మికురాలు, మహబూబ్‌నగర్

ఇప్పుడు తీస్ సాల్ ఉంటయో, ఎక్కువ ఉంటయో తెల్వదు. కమ్‌సే కమ్ పదేండ్లకెల్లి దుక్నం నడుపుతా. అంతకుముందు కొన్ని దినాలు లారి మీద పనిచేసిన. ఇప్పుడు గుడ ఏం ఆందాని లేదు, పుర్సత్ లేదు. మా అమ్మ ఉండే. పానం బాగలేక సచ్చిపోయింది. సూపియనీకె చాతకాలె. గవర్నమెంట్ దవాఖాననే గాని, మందులు మస్తు పిరెం. ఇంగోటి ఏందంటే దవాఖానల ముసల్ది ఉంటే ఎవరో ఒక మనిషి ఉండాలె. ఈ ఎల్లని సంసారంల ఏద్దైతది? ముసల్ది ఏగి ఏగి ఎర్రమంట్ల్య గల్సిపాయె. ఏంజేస్తం. పరిస్థితిలేదు. ఉంటే ఏంటికి సంపుకుంటం. ఇంటి సుట్టు గట్టర్లు, వాసన, దోమలు. మనకేమైనా ఫరవాలేదు గాని, పిల్లలకు అయితే తిప్పలైతది. పిల్లల డాక్టర్ల తోనికి పోతే ఏం లేదు, కొంప ఆర్తది. ఆడికాడికి పొట్ట బట్ట ఎల్తున్నది. ముందుగతి ఏమైతదో తెల్వది. ఇది బేకార్ దునియా ఉన్నది.

షబ్బీర్ (35)
చిల్లర వ్యాపారి, మహబూబ్‌నగర్

(పై పదహారు అభిప్రాయాలు సేకరించినవారు **ప్రశాంత్** మహబూబ్‌నగర్)

కాంగ్రెస్ పార్టీ ఓట్లకోసం మా దిక్కు ఓట్లు వెయ్యాలని రేషన్ షాపుల ద్వారా కిలో బియ్యం రెండు రూపాయలకి, కిలో కందిపప్పు ముప్పై రూపాయలకి, గాస్ నూనె ఒక లిటర్ పది రూపాయలకి, పామాయిల్ నలభై ఐదు రూపాయలకి, గోధుమలు ఎనిమిది రూపాయలకి, పంచదార పదిహేను రూపాయలకి ఇస్తుంఢ్రు. ఇందుల పంచదార తప్ప మిగిలినవి ఏవి మనుషులు తినేటట్టు ఉండవు. ఓట్లు అడగడానికస్తున్న సార్లు తిని చూస్తే తెలుస్తది. నా భర్త బండలు మోసే పనికి పోతడు. నేను ఇండ్ల పనులకి పోతున్న. ఏది కొనేటట్టు లేదు, తినేటట్టు లేదు. ఎట్ల బతకాలె, పిల్లలకి ఏంబెట్టాలె?

బాలమ్మ (35)
పనిమనిషి, సరూర్‌నగర్, హైదరాబాద్

(అభిప్రాయం సేకరించినవారు **శివలక్ష్మి,** హైదరాబాద్) వీ

అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసాన్ని వివరిస్తూ, పాలకులు మారినా విధానాలు మారలేదని అంటున్నారు

ఎం. శ్రీనివాసరావు

కోస్తా ప్రజలపై కారిడార్ కార్చిచ్చు

కోస్తా కారిడార్ పేరుతో తీరప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పడానికి కల అవకాశాలను పరిశీలించడానికి గాను 11 ఫిబ్రవరి 2008న రాష్ట్ర ప్రభుత్వం జి.ఒ. నెం. 34ను జారీ చేసింది. దీని ముందు జి.ఒ. నెం. 126, 913లను కూడ జారీ చేసింది. నెల్లూరు జిల్లా తడ నుండి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు 972 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ప్రభుత్వ ప్రోత్సాహంతో, ప్రైవేట్ గుత్త సంస్థల ఆధ్వర్యంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల తీరంలో రైతులు, మత్స్యకారులు, చేతి వృత్తుల వాళ్లు తీవ్రంగా నష్టపోతారని, రైతుల నుండి భూసేకరణ బలవంతంగా అవసరానికి మించి జరుగుతోందని వివిధ ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు తీవ్రమైన ఆందోళనలు వ్యక్తం చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం జి.ఒ. నెం. 34ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకొంది. వాస్తవానికి తీరమంతా ఈ జి.ఒ.తో సంబంధంలేకుండానే ప్రజా ప్రయోజనాల పేరుతో బలవంతపు భూసేకరణ నిరాటకంగా కొనసాగుతోంది. జి.ఒ. నెం. 34 తర్వాత 46 జి.ఒ.లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. వివిధ కంపెనీలతో 19 ఎం.ఒ.యు.లు కుదుర్చుకుంది. వీటి గురించి మాట మాత్రం ప్రస్తావన కూడ లేదు. ఈ నేపథ్యంలో అసలు తీరప్రాంతంలో మొత్తం పరిస్థితిని పరిశీలించవలసిన అవసరం ఉంది.

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం కృష్ణపట్నం దగ్గరలోని రామలింగాపురం బేసిన్ వద్ద కృష్ణపట్నం పోర్టుకు 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. కండలేరు నది సముద్రంలో కలిసేచోట ఎడమవైపు ముత్తుకూరు మండలంలోని రామలింగాపురం బేసిన్, ఆదాలనగర్ పాదర్తి పాలెం గ్రామాల్లోని 240 కుటుంబాలు పూర్తిగా నిర్వాసితులై పోతున్నారు. అదే విధంగా కుడివైపు చిల్లికూరు మండలంలోని మిద్దిరేవు, గుమ్మళ్ల దిబ్బ గ్రామాల్లోని 200 కుటుంబాలు నిర్వాసితులౌతున్నారు. వీరిలో పాదర్తిపాలెంలోని ఉప్పు కొటాలు కార్మికులు అరవై కుటుంబాలు తప్ప మిగిలిన వారంతా మత్స్య కారులు. సముద్రం మీద ఆధారపడి బతికే వీరి జీవనం ప్రశ్నార్థకమైంది. అంతేకాక, మద్దిరేవు, గుమ్మళ్ల దిబ్బ గ్రామాలే కాక పక్కనే ఉన్న తమ్మనపట్నం, లింగవరం, వరగిలి గ్రామాల్లో కూడ బలవంతపు భూసేకరణ జరిపారు. పాదర్తిపాలెం పరిధిలోని సుమారు 750 ఎకరాల ఉప్పు పండే భూములు కూడ తీసుకోవడంతో ఆ కుటుంబాలు రోడ్డునపడి మత్స్యకారులు పోర్టులో కూలి పనులకు వెళుతున్నారు.

పోర్ట్‌కు దగ్గరలోనే నాలుగు వేల మేగావాట్ల అల్ట్రా మెగా థర్మల్ విద్యుత్ కేంద్రం ఒకటి పదహారు వందల మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఒకటి నిర్మించబోతున్నారు. వీటికి గాను శంభునితోపు, అయ్యావారపుకండ్రీగ, నక్కలమట్ట, నేలటూలు, పైనాపురం, కృష్ణపట్నం గ్రామాల్లోని నాలుగు వేల ఎకరాల భూమి సేకరిస్తున్నారు. ఇవి ముత్తుకూరు, టి.పి గూడురు మండలాల్లోని గ్రామాలు ఇక్కడ వరి, వేరు శనగ, సరుగుతోటల వ్యవసాయ భూములున్నై. కల్లుగీత కార్మికులున్నారు. మొత్తం పదిహేను వేల జనాభా ఈ గ్రామాల్లో నివసిస్తుంది. అదే విధంగా చల్లికూరు మండలంలో చింతవరం కొత్తపాలెం, ఏరూరు గ్రామాల్లోని ఏడువందల యాభై ఎకరాల్లో శ్రీలంకకు చెందిన మాన్‌హోల్డింగ్స్ టెక్స్‌టైల్ కంపెనీ ప్రారంభించ బోతున్నది. దీనికి భూసేకరణ జరిగింది. ఇలా నెల్లూరు జిల్లా తీరంలో భూములు పదిహేను వేల ఎకరాల భూసేకరణతో ప్రారంభమై తడ మండలం మాంబట్టు, నాయుడుపేట మండలం మేనకూరు, కొడవలూరు మండల ఇఫ్కో కిసాన్ సెజ్‌ల వరకు వేలాది ఎకరాల పంటలు పండే భూమి సేకరణ జరుగుతోంది.

అలాగే ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వాడరేవు, నిజాంపట్నం పోర్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ (వాన్‌పిక్) పేరుతో ఇరవై ఎనిమిది వేల ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకొన్నది. ఇందుకుగాను రస్ ఆల్ ఖైమా అనే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కు చెందిన కంపెనీతో 11 మార్చ్ 2008న ఒప్పందం కుదుర్చుకున్నది. ప్రకాశం జిల్లాలోని చినగంజాం, వేటపాలెం మండలాల్లో తొమ్మిదివేల ఎకరాలు, కొత్తపట్నం మండలంలో విమానాశ్రయం కొరకు రెండు వేల ఎకరాల భూసేకరణ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాని ఇప్పుడు భూసేకరణ పద్ధతి చూస్తే జిల్లాలో తీర ప్రాంతమంతా జరుగుతున్నది. గుండాయిపాలెం, గుండమాల, రామాయపట్నం, కరేడు, పాకల ప్రాంతాల్లో కూడ అధికారులు, దళారులు భూసేకరణ చేస్తున్నారు. ఈ ప్రాంతమంతా వేరుశనగ, వరి, పూల తోటలతో ఎప్పుడు పచ్చగా కనిపిస్తుంది. అదే విధంగా మత్స్యకారులు, ఉప్పు రైతులు ఉన్నారు.

గుంటూరు జిల్లాలో నిజాంపట్నం, పిట్టలవానిపాలెం, కర్లపాలెం, బాపట్ల మండలాల్లోని డెభై చిన్న పెద్ద గ్రామాల్లో భూసేకరణ ప్రారంభమై కొనసాగుతున్నది. ఇక్కడ కెమికల్ హబ్ ఏర్పాటుకు గాను పదివేల ఎకరాల భూసేకరణ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించి ఇప్పటికే దిండి పంచాయితీలో నాలుగు వేల ఎకరాల సేకరణ జరిగింది. మంత్రి మోపిదేని వెంకటరమణ ప్రోత్సాహంతో బలవంతపు సేకరణ

నిరాటకంగా సాగుతున్నది. ఈ భూసేకరణ ప్రకాశం జిల్లా వాడరేవు వరకు జరుగుతుందని తెలుస్తున్నది.

కృష్ణా జిల్లాలో మచిలీపట్నం దగ్గరలోని చినకర అగ్రహారం వద్ద నిర్మించబోయే పోర్టు, పోలాటతిప్ప, గోపువానిపాలెం గ్రామాల్లో నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్ ప్లాంట్‌కు గాను మొత్తం ఇరవై ఒక్క వేల ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టు నిర్మాణానికి మైటాస్ సంస్థకు చెందిన వజ్ర సీ పోర్ట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. పోలాటతిప్ప వద్ద టి. సుబ్బిరామిరెడ్డికి చెందిన పవర్‌టెక్ కంపెనీకి అనుమతినిచ్చింది. చినకర అగ్రహారం, పెదకర అగ్రహారం, పల్లెపాలెం, కెంపచెల్‌పేట, గొలకలదిండి, కోట గ్రామాలకు చెందిన రెండు వేల కుటుంబాలు పోర్టు వల్ల నిర్వాసితులౌతున్న పోలాటతిప్ప వద్ద పవర్‌ప్లాంట్ వల్ల ఐదు వందల కుటుంబాలు, గోపువానిపాలెం పవర్‌ప్లాంట్ వల్ల వెయ్యి కుటుంబాలు నిర్వాసితులౌతున్నాయి.

అలాగే విశాఖ జిల్లా భీమునిపట్నం నుండి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ వరకు 603 చ.కి.మీ. విస్తీర్ణంలో లక్షా యాభైవేల ఎకరాల్లో కోస్తా కారిడార్ ఫేజ్ – 1 కింద, పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (పిసిపిఐఆర్) ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికి గాను 24 ఏప్రిల్ 2008 న జి.ఓ. నెం. 913 జారిచేశారు. ఇప్పటికే 51,505 ఎకరాలకు రైతుల నుండి స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక కాకినాడ స్పెషల్ ఎకనామిక్ జోన్ (కె.ఎస్.ఇ.జెడ్.) పేరుతో కొత్తపల్లి, తొండంగి మండలాల్లోని పదహారు గ్రామాల పరిధిలో 12,400 ఎకరాలు తీసుకున్నారు. ఇది కాక మరో 4,800 ఎకరాలు సేకరించారు. ఈ మొత్తం వల్ల ముప్పై వేల మంది మత్స్యకారులు నష్టపోతున్నారు. 5,500 కోట్లతో ఓ.ఎన్.జి.సి. రిఫైనరీ ఏర్పాటు కోసం ఈ భూమి సేకరించారు.

ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం అర్శిలీం, అక్కవలస గ్రామాల్లో నిర్మించిన నాగార్జున అగ్రికెమ్ క్రిమిసంహారక మందుల పరిశ్రమలు, పొన్నాడ పంచాయితీలోని స్మార్టకెమ్ రసాయినక ఔషధ పరిశ్రమలు, రశీ స్థలం పైడి భీమవరం పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పరచిన అరబిందో ఫార్మా, రెడ్డీస్ లాబ్స్, ఆంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమల వల్ల సుమారు ముప్పై ఐదు గ్రామాలు ప్రభావితమౌతున్నై. ప్రస్తుతం నాగుర్జున, ఈస్ట్‌కోస్ట్ ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో 1,76,000 ఎకరాల భూసేకరణకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తున్నది.

విజయనగరం జిల్లాలో పుసపాటిరేగ మండలం గోవిందాపురం జంక్షన్‌లు నిర్మించిన వీరాల్యాబ్ రసాయన పరిశ్రమల్లో ఇప్పటికే ఇరవై మత్స్యకార గ్రామాలు సంకటస్థితి నెదుర్కొంటున్నై. బీచ్‌కాండ్ మైనింగ్ కంపెనీ పనులు ప్రారంభిస్తే నలభై గ్రామాలు జిల్లా అంతటా తీరం ఖాళీ చేయవలసిన పరిస్థితి రావచ్చుని తెలుస్తున్నది.

మొత్తంగా చూస్తే తడ నుండి ఇచ్ఛాపురం వరకు దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఏదో ఒక పేరుతో భూసేకరణ ప్రారంభమై పరిశ్రమల ఏర్పాటు కూడా జరిగింది. దీనిని చంద్రబాబు చేత ప్రారంభిస్తే రాజశేఖర రెడ్డి అత్యంత వేగంగా ప్రజలమీద సామ, దాన, భేద, దండోపాయాలతో అమలు చేస్తున్నారు. సముద్ర ఒడ్డు నుండి జాతీయ రహదారి వరకు ఇరవై కిలోమీటర్ల ప్రాంత సరాసరిన లెక్క వేస్తే 49.50 లక్షల ఎకరాలవుతున్నది. 'అతనికంటె ఘనుడు ఆచంటమల్లన్న' అన్నట్టుగా చంద్రబాబు వేసిన దానిని మరింత సువిశాలం చేసుకుంటూ రాజశేఖరరెడ్డి కొనసాగిస్తున్నారు. ఇందులో ముఖ్యమంత్రి, ఆయన అనుయాయులు దండుకొంటున్న కమిషన్లు, వాటాలు, లాభాలు చూసి ప్రజలపై అపారమైన ప్రేమకనబరుస్తూ చంద్రబాబు మొసలికన్నీరు కారుస్తున్నారు.

రాష్ట్రంలోని తొమ్మిది కోస్తాజిల్లాల్లో సముద్రతీరం పై మత్స్యకారులు, రైతులు, రైతుకూలీలు, చేతివృత్తిపనివారు, దళితులు, గిరిజనులు, పెద్ద సంఖ్యలో కల్లుగీత కార్మికులు మొత్తం కలిపి సుమారు రెండు కోట్ల నలభై లక్షలమంది జీవిస్తున్నారు. మత్స్యకారులు సంవత్సరానికి 6.7 వేల కోట్ల మత్స్య సంపద ఉత్పత్తి చేస్తున్నారు. సముద్రంలో లభించే సంపదే కాక తీరంలో ఐదు లక్షల ఎనభై రెండు వేల టన్నుల చేపలు, రొయ్యలు చెరువుల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే తొంభై ఆరు లక్షల టన్నుల బియ్యంలో అరవై ఏడు లక్షల టన్నులు కోస్తా జిల్లాల్లోనే పండుతాయి. పప్పు దినుసులైన పెసర, మినుము, కందులతో పాటు రాగులు, నువ్వులు, వేరుశెనగ, జీడిపప్పు, మిర్చి, పొగాకు ఉత్పత్తి లో ఈ జిల్లాలే ప్రథమ స్థానంలో ఉన్నాయి. మామిడి, జామ, పనస, సపోటా పండ్లు, కొబ్బరి ఈ ప్రాంతంలో పండుతాయి. పంటల ద్వారానే రు. 15,544 కోట్ల ఆదాయం సమకూరుతుందని గణాంకాలు తెలుపుతున్నాయి. ఇప్పుడు కోస్తా కారిడార్ ఫలితంగా ఈ ఉత్పత్తులన్నీ ఆగిపోయి సామాన్యునికి ఇప్పటికే అందుబాటులో లేని ధరలు ఇంకా పైకి పోయే ప్రమాదం ఉంది. ఆహార భద్రత ప్రశ్నార్థకమవుతుంది.

ఈ కోస్తా కారిడార్‌లో అధికశాతం రసాయన, ఔషధ పరిశ్రమలు, పెట్రోకెమికల్ పరిశ్రమలు, చమురు శుద్ధికర్మాగారాలు, నౌకానిర్మాణ, విచ్ఛేదన పరిశ్రమలు వస్తున్నాయి. దీనివల్ల అనేకరకాల పెట్రోలియం వ్యర్థాలు, రసాయన ఔషధపరిశ్రమల వ్యర్థాలు, పవర్ ప్లాంట్లవల్ల బయటకువచ్చే బూడిదవల్ల సముద్రం, భూగర్భ జలాలు కలుషిత మవుతాయి. ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల్లో ఏర్పడిన పరిశ్రమలవల్ల అక్కడ ప్రజలు తీవ్రమైన నరకాన్ని అనుభవిస్తున్నారు. 480 ఏళ్ల పాటు ఈ కాలుష్యం ఉండిపోతుందని పర్యావరణవేత్తలు తెలియజేస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఇప్పటికే 2008లో ముప్పై ఐదు టన్నుల చేపలు ఒడ్డుకు కొట్టుకు వచ్చాయి. విశాఖ జిల్లా పరవాడ మండలంలో నాలుగు వందలకు పైగా తాబేళ్లు మృత్యువాత పడ్డాయి. కలుషితమైన భూగర్భజలాలు తాగడంవల్ల అనేకరకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. రెండేళ్ల క్రితం ఈ ప్రాంతంలో ఉత్పత్తి చేసి ఎగుమతి చేసిన చేపల్లో, రొయ్యల్లో రసాయన అవశేషాలు ఉన్నాయని జపాన్, యూరప్ దేశాలు వెనక్కి పంపించాయి. సముద్రంలో చాలా సున్నితమైన జీవాలైన, పుష్పాల్లాంటి అందమైన కోరల్ రీఫ్ ప్రాణులు చచ్చిపోయి నీళ్లపై తేలుతూ కనబడుతున్నాయి. విశాఖజిల్లాలోని జింక్ పరిశ్రమ వల్ల వచ్చిన కాలుష్యంతో ములగడమంది, చుక్కరానిపాలెం గ్రామాలలో పుట్టిన పిల్లలో ఎదుగుదల క్షీణిస్తున్నది. చాలామంది మానసిక రోగులుగా తయారువుతున్నట్లు, అందరి శరీరాలలో సీసం ఎక్కువగా కనబడుతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

కోస్టల్ కారిడార్, ప్రత్యేక ఆర్థిక మండలాలు, సాగునీటి ప్రాజెక్టులు,

బాక్సైట్ తవ్వకాలు, యూరేనియం తవ్వకాలు, ఫీల్డ్‌ఫైరింగ్ రేంజ్‌లు, సింగరేణి బొగ్గుగనుల తవ్వకాలు (కొత్తగా చేపడుతున్న), ఓడరేవులు, విమానాశ్రయాలు ఇలా రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల చక్రాల కింద దాదాపు సగం రాష్ట్ర జనాభా నలిగిపోయే పరిస్థితి దాపురించింది. దశాబ్దాలుగా చారెడు సాగుభూమి కోసం కాళ్లరిగేలా తిరిగినా చలించని ప్రభుత్వాలు ఈ రోజు బహుళజాతి సంస్థల కోసం ప్రజలు సాగుచేసుకుంటున్న భూములను సేకరించి ఇస్తున్నది. ఇదంతా ఒక ఎత్తైతే జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్ట్‌ల జలాలన్ని ఈ పరిశ్రమల కోసమేననేది ఆ ప్రాజెక్ట్‌ల రూపకల్పనలను బట్టి తెలుస్తున్నది. కోస్టల్ కారిడార్‌లో భాగంగా పిసిపిఐఆర్ కోసం పోలవరం ప్రాజెక్ట్ ఎడమకాలువ నిర్మాణం జరుగుతుంది. విశాఖ ప్రజలు తాగునీరు అందిస్తున్న పీలేరు జలాశయం నీటిని కోస్టల్ కారిడార్‌కు మళ్లిస్తున్నారు. భూమి, నీరు, గాలి అంతా బహుళజాతి సంస్థలకే కట్టబెడుతున్నారు. తీరప్రాంత రక్షణ కోసం రూపొందించిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ చట్టాన్ని సవరించి కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్‌గా మారుస్తున్నారు.

ప్రభుత్వాలు ఈ విధమైన విధ్వంసక అభివృద్ధి నమూనాను ప్రజలపై రుద్దడానికి కారణాలు పరిశీలిస్తే ప్రపంచవ్యాప్తంగా అత్యధిక లాభాలు దండుకొంటున్న బహుళజాతి రసాయన పరిశ్రమలేనని తెలుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 27 దేశాలు మనదేశంతో సహా ఈ పరిశ్రమల వలన సముద్ర తీరప్రాంతాలలో ఏ జీవులు బతకలేని నిర్జీవ ప్రాంతాలు నాలుగు వందల యాభైకి పైగా ఏర్పడినై. అక్కడి ప్రజలు నిర్వాసితులై కూడ పీడితులై బాధలనుభవిస్తున్నారు. ఆ ప్రజల ప్రతిఘటన వల్ల అక్కడి పరిశ్రమలు మూసివేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. లాభాలే తప్ప మానవీయ కోణం తెలియని బహుళజాతి సంస్థలు అగ్రరాజ్యాలు, ప్రపంచ బ్యాంకులపై ఒత్తిడి తెచ్చాయి. ఆసియా దేశాల్లోని భారత, పాకిస్తాన్, బంగ్లాదేశ్, చైనా లాంటి ప్రభుత్వాధినేతల ద్వారా ఇక్కడ ప్రవేశిస్తున్నాయి. దళారీలైన ఇక్కడి పాలకులు ప్రజల ప్రయోజనాలను తుంగలో తొక్కి ఈ బలవంతపు విధ్వంస అభివృద్ధిని ప్రజలపై మోపుతున్నారు.

కనుక ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈ విధ్వంసక అభివృద్ధి వెనుక దాగిన సత్యాలను గ్రహించి దీనికి వ్యతిరేకంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమాన్ని నిర్మించడమే పరిష్కారం. ప్రజల నుండి ప్రతిఘటన లేనంత కాలం ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు తమ లాభాలకోసం ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతూనే ఉంటారు. నందిగ్రాం, సింగూరు ప్రజలు సాగించిన పోరాటాలను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమించినపుడు ఎన్ని జి.ఒ.లు ఏమీ చేయలేవు. లేకపోతే భావితరాలకు భవిష్యత్తు లేకుండా చేస్తారీ పాలకులు. వీ

ఆసిడ్ దాడి దారుణానికి తక్షణ ప్రతిస్పందన పేరు మీద పోలీసులు చేసిన చట్టవ్యతిరేక చర్యను తప్పపడుతున్నారు

కె.జి. కన్నబిరాన్

వరంగల్ 'ఎన్‌కౌంటర్' గురించి

వరంగల్ పట్టణంలో ఒక యువతి మీద ఆసిడ్ దాడి జరిగింది. ఆ సంఘటనను అన్ని తెలుగు వార్తా పత్రికలు రెచ్చగొట్టే పతాక శీర్షికలతో ప్రచురించాయి. ఇంగ్లీష్ వార్తా పత్రికలలో సూటిగా ఆ వార్తగురించి రాశారు గాని, అంత రెచ్చగొట్టే పద్ధతి లేదు. బహుశా ఇంగ్లీష్ భాషను మనకు నేర్పిన తీరులో ఒక అనవసరమైన క్రమశిక్షణ ఉండి అదే మేలు చేసిందేమో. ఆ మరునాడు వార్తలలో ఆ దురాగతానికి కారకులైన ముగ్గురు యువకులను నిర్బంధంలోకి తీసుకున్నారని, వారు పోలీస్ నిర్బంధంలో ఉన్నారని కూడా వార్తలు వచ్చాయి. ఆ సాయంత్రానికల్లా ఘటనకు సంబంధించిన వాస్తవాలు తెలుసుకోవడానికి నిందితులను వారి స్థావరాలకు తీసుకువెళ్లే మామూలు ప్రక్రియలో పోలీసులు ఆ ముగ్గురు నిందితులను చంపేశారు. అలవాటైన పద్ధతిలో కాకమ్మ కథలు ప్రకటించారు. ఒక ఏడాది కింద కూడా ఒక చిన్నారి పాప కిడ్నాప్ అయినప్పుడు అనుమానితుడిని ఈ రకంగానే చంపేసి ఈ రకంగానే నమ్మశక్యంకాని కథలు ప్రచారంలో పెట్టారు. ఈ దేశంలో న్యాయ వ్యవస్థ ఇటువంటి మరణాల గురించి ఎంతమాత్రమూ పట్టించుకోని స్థితిలో ఉంది. భారత శిక్షాస్మృతి పరిధిలోకి రాని నేరాలు ఇవి. నిజానికి కొన్ని సంవత్సరాల కింద అయిదుగురో ఏడుగురో న్యాయమూర్తులు కూర్చొని ఇటువంటి హత్యానేరాలు నేరశిక్షాస్మృతి కిందికి వస్తాయా రావా నిర్ణయించడానికి ప్రయత్నించారు. ఆ చర్చ చెక్కుచెదరని సంభాషణల్లో మునిగిపోయి అంతిమ నిర్ణయం ఇప్పటికీ వెలువడలేదు. మన పాత సామెతలు అన్నిటినీ మనం చాలా కాలం కిందటనే తిరగరాయడం మొదలుపెట్టాం. న్యాయం ఆలస్యమైతే అన్యాయమైనట్టే అనే పాత సామెతను ఇప్పుడు ఎంత ఆలస్యమైనా న్యాయం ఓడిపోదు అని మార్చినట్టున్నాం.

ప్రస్తుత వరంగల్ ఉదంతంలో అత్యంత బాధాకరమైన అంశమేమంటే బాధిత యువతి అటువంటి ప్రతీకార దాడికోసం తపించి పోయింది. ఆ ఆవేశాన్ని అర్థం చేసుకోవచ్చు. అటువంటి ప్రతిస్పందన వెనుక అవగాహన లేదుగనక నాకేమీ సమస్యలేదు. కోపావేశపూరితమైన స్పందనలిన్నిటినీ నేను అర్థం చేసుకుంటున్నాను. వాటిని తప్పుపట్టను కూడా. నేను తప్పుపట్టేదల్లా సమాజాన్ని. ఆసిడ్ చల్లిన ఆ ముగ్గురు యువకులూ, ఆ యువతీ ఎటువంటి సాంస్కృతిక విలువలలో పెరగడానికి ఈ సమాజం అవకాశం ఇచ్చిందో ఆ సమాజాన్ని నేను తప్పుపడుతున్నాను. పోలీసులు చేసిన పనిని పెద్దఎత్తున ప్రశంసించిన జనంలో ఉన్న మగవాళ్లు కచ్చితంగా తమ ఇళ్లలో స్త్రీలను అణచివేస్తూనే ఉంటారు. బయట సమాజంలో స్త్రీల మీద అత్యాచారాలు జరుగుతూ ఉన్నప్పుడు వీళ్లలో ఏ ఒక్కరూ ఎప్పుడూ గొంతెత్తి ఉండరు.

సమాజంలో జరిగే నేరాలకు కంటికి కన్ను పంటికి పన్ను అనే శిక్ష విధించే దశను దాటివచ్చి యుగాలు గడిచాయి. ఇక్కడ ఆ అమాయక యువతి మీద జరిగిన దారుణం తీవ్రంగా ఖండించవలసిన నేరం. దానికి శిక్ష విధించవలసిందే. చూపిన నిందితుల మీద ఆ నేరమే ఆరోపించబడింది. ఆ నేరం నేరశిక్షాస్మృతిలోని మిగిలిన అన్ని నేరాల వంటిదే. ఇవాళ సమాజాలు ఏ స్థాయికి చేరుకున్నాయంటే ఒకదేశం మీద మరో దేశం, ఒక జాతి మీద మరో జాతి చేసే నేరాలను, మొత్తంగా మానవజాతికి వ్యతిరేకంగా చేసే నేరాలను కూడా విచారించగలిగిన నేరశిక్షాస్మృతులను తయారు చేసుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం మరీ ప్రత్యేకించి వరంగల్‌లో మాత్రం చాలా రోజులనుంచే లాటిన్ అమెరికా మార్క్ పాలన సాగుతుంది. గత శతాబ్ది అరవైల చివరిభాగం నుంచి రాజకీయ భిన్నాభిప్రాయాలు ఉన్న వాళ్లను చంపిపారేయడం అనే ప్రక్రియ సాగుతోంది. చట్టాన్ని పక్కనపెట్టి ఇలాంటి చర్యలకు పూనుకోవడం ఒక చీడ అని, ఇది పొరుగు ప్రాంతాలకు వ్యాపిస్తుందని మేము అప్పటినుంచే హెచ్చరిస్తూ వచ్చాం. ఆ ధోరణిని వరంగల్ ఇంకా కొనసాగిస్తూనే ఉంది.

ఇలా జరుగుతున్నప్పుడు ఎంతో ఖర్చుపెట్టి, ఎన్నో ఇబ్బందులు పడి మనం నడుపుకొస్తున్న న్యాయవ్యవస్థ నిర్మాణాలను మూసేస్తే సరిపోదా? న్యాయం పోలీసువాడి తుపాకి గొట్టంలోనుంచే వెలువడుతుందని ప్రకటించేస్తే సరిపోదూ? ఇటువంటి ఫాసిస్ట్ పాలనా మానసిక ధోరణి ఎప్పటినుంచో కొనసాగుతోంది. ముంబయిలో జరుగుతున్న తుపాకి కాల్పులు కూడా ఇందుకు పురిగొల్పుతున్నాయి. ఇక మనం ఎదురుచూస్తున్నదల్లా దీన్నంతా అంగీకరించే నాయకత్వం రూపొందడం మాత్రమే. వీ

ఆసిడ్ దాడికి ఎన్‌కౌంటర్ పరిష్కారం కాదంటూ, ఈ దాడి వెనుక ఉన్న పితృస్వామిక భావజాలాన్నీ, దాన్ని పెంచిపోషిస్తున్న వ్యవస్థ స్వభావాన్నీ వివరిస్తున్నారు **పి. కృష్ణారావు**

నిందితుల ఎన్‌కౌంటర్ - అమ్మాయిల భద్రత?

వరంగల్‌లో స్వప్నిక, ప్రణీతలపై యాసిడ్ దాడి చేసిన ఉన్మాది శ్రీనివాసరావుతో పాటుగా అతనికి సహకరించిన మిత్రులు హరికృష్ణ, సంజయ్‌లను వరంగల్ పోలీసులు ఘటన జరిగిన 56 గంటల్లో పట్టుకొని ఎన్‌కౌంటర్ చేశారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా భిన్నమైన, వైరుధ్యపూరితమైన స్పందనలు వచ్చాయి. పోలీసులు గతంలో విప్లవకారుల దగ్గర నుంచి వృత్తి నేరస్తుల వరకు బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపడం చూశాం. కానీ ఇప్పుడిది అమ్మాయిపై దాడి చేసిన నిందితులను మొదటిసారిగా ఎన్‌కౌంటర్ చేయడంగా చెప్పవచ్చు. ఈ ఎన్‌కౌంటర్‌ను కొందరు స్వాగతించగా, పౌర ప్రజాస్వామిక సంఘాలు, కొన్ని రాజకీయ పక్షాలు ఖండించాయి. ఎన్‌కౌంటర్‌ను స్వాగతించిన వారు 'ఇటువంటి నిందితులకు వెంటనే శిక్ష పడిందని సంబరపడ్డారు.' ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకించిన వారు 'పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని, నేరస్తులను శిక్షించడానికి చట్టాలను కఠినతరం చేసి, విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని' అభిప్రాయపడుతున్నారు. అయితే కొద్దిమంది మాత్రం ఈ సమస్యలు ఉత్పన్నం కావడానికి గల మూలాల్లోకి వెళ్లి పరిష్కార మార్గాలు కనుగొనాలని కోరుతున్నారు.

మనదేశంలోనూ, రాష్ట్రంలోనూ అమ్మాయిలపైన, మహిళల పైన దాడి జరగడం, మానభంగాలు జరగడం, హత్యలకు గురికావడం ఇది మొదటిదీ కాదు, ఆఖరిదీ కాదు. ఇందుకు వ్యవస్థీకృతంగా ఉన్న లోపాలు స్త్రీలపట్ల పురుషులకు, సమాజంలోని ఆధిపత్య వర్గాలకు గల న్యూనతాభావమే కారణమని చాలామంది ఒప్పుకొంటున్నారు. ప్రభుత్వాలు కూడా సంఘటన జరిగినప్పుడు కొన్ని కంటితుడుపు చర్యలు చేపట్టడం, నేరస్తులపై కేసులు నమోదు చేయడం, అధికారులను సస్పెండ్ చేయడం తరువాత మరిచిపోవడం, ఎప్పుడో ఆ కేసుపై కోర్టులో తీర్పు వెలువడినప్పుడు మీడియాలో ఒక వార్త ఇవ్వడం జరుగుతోంది. జనాలు కూడా కాలంతో పాటుగా ఆయా సంఘటనలను మరిచిపోతుంటారు. సమస్య మూలాల్లోకి వెళ్లి, వాటిపై పోరాటాలు చేయరు. సామాజిక బాధ్యత గల పౌరప్రజాసంఘాలు పోరాడినా పాలకవర్గాలు మార్పును అంగీకరించడం లేదు. పై పరిస్థితులన్నీ పోలీసు యంత్రాంగానికి బాగా ఉపయోగపడుతున్నాయి. అందుకే ఒక సంఘటన జరిగిన తరువాత పోలీసులపై ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు వచ్చినప్పుడు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారు. అందుకే వీరు వృత్తి నేరస్తుల దగ్గర నుంచి ప్రేమోన్మాదుల వరకు అందర్నీ కాల్చి చంపుతున్నారు. ఇక విప్లవకారుల్ని బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం గురించి మరి చెప్పనక్కర్లేదు. 1969 నుంచి నిత్యకృత్యమైపోయాయి. ఇందుకు పాలక ప్రభుత్వాలు పూర్తిగా లైసెన్స్ ఇవ్వడమే కారణం. అందుకే పోలీసుల చర్యను వ్యతిరేకించే వారు దీన్ని ప్రజాస్వామ్యానికి ప్రమాదం అంటున్నారు.

ఇక్కడ మరో ప్రశ్న ఉత్పన్నమౌతోంది. పాలక ప్రభుత్వాలు పోలీసులకు ఎందుకిన్ని అధికారాల్ని కట్టబెడుతున్నారు అన్న ప్రశ్నకు సరైన జవాబు లేదు. పోలీసుల చర్యను స్వాగతిస్తున్న వారి నుంచి గానీ, ప్రభుత్వం నుంచి గానీ రాదు. అసలు అటువంటి చర్చను వీరు స్వాగతించరు. అలా చర్చ జరగకుండా మార్మికతను ప్రదర్శించడంలోనే పాలకుల ప్రయోజనాలు నెరవేరుతూ ఉంటాయి. ఇదీ అసలు విషయం. ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కావడానికి సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులలోకి లోతుగా వెళ్లి, అధ్యయనం చేసినప్పుడే కారణాలు, పరిష్కారమార్గాలు తెలుస్తాయి. పోలీసులను సమర్థించే ప్రజలు ఈ రకమైన అధ్యయనం చేయకపోవడం వలన, పాలకవర్గాల మార్మికతలో పడిపోవడంవలన, తక్షణ ప్రయోజనాలను ఆశించి, వారిని సమర్థిస్తుంటారు. వరంగల్ సంఘటనలో ఇదే జరిగింది.

ఇక సమస్య మూలాల్లోకి వెళ్లి చూస్తే, పురుషాధిక్య సమాజంలో స్త్రీల పట్ల పురుషునికి గల ఆధిపత్య ధోరణి, సమాజంలో స్త్రీలపట్ల న్యూనతాభావం ప్రధానమైనవి. ఇది మనువు కాలం నుంచి నేటి అర్ధవలస, అర్ధ భూస్వామ్య సమాజం వరకు కొనసాగుతూనే ఉంది. గ్రామాలలో భూస్వామ్య, పెత్తందారీశక్తులు స్త్రీలు అవమానాలకు, లైంగిక హింసకు గురిచేస్తుండగా, పట్టణాలలోని కర్మాగారాలు, కార్యాలయాలలో పెట్టుబడిదారుల, పెత్తందారీ అధికార్లచే హింసకు గురవుతున్నారు. అమ్మాయిలు చదువుకుంటున్న కళాశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ గ్రామీణ, పట్టణ పెత్తందారీవర్గాల పిల్లలు సైతం లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. ఈ వేధింపులు ఉన్మాదంగా మారినప్పుడు ఆయా సంఘటనలు బాహ్య ప్రపంచానికి తెలుస్తున్నాయి. అంతవరకు బాధిత మహిళలు, వారి తల్లిదండ్రులు పోలీసులకు గానీ, ఆయా యాజమాన్యాలకు గాని, అధికార్లకి గాని ఫిర్యాదు చేసినా ఫలితం

స్మైల్



ప్రముఖ సాహితీ విమర్శకుడు, కథా రచయిత స్మైల్ (66) డిసెంబర్ 5న మరణించారు. ఆయన అసలు పేరు మొహమ్మద్ ఇస్మాయిల్. ఆయన కృష్ణా జిల్లా తేలప్రోలులో 1942లో జన్మించారు. 'ఖాళీ సీసాలు' కథా రచయితగా ఆయన సుప్రసిద్ధులు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. పరిస్థితి మెరుగుపడక పోవడంతో వైద్యసేవలు నిలిపివేసి రాజమండ్రి నుంచి స్వస్థలం ఏలూరుకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మరణించారు. ఎన్నో సాహితీ వ్యాసాలూ, కథలూ రాసిన స్మైల్‌కు 'ఖాళీ సీసాలు' కథల సంపుటి సాహిత్యంలో సుస్థిర స్థానమిచ్చింది. ఈ సంపుటిలోని ఖాళీ సీసాల కథను సాహిత్య అకాడమీ అన్ని భారతీయ భాషల్లోకి అనువదించింది. ఆయన రాసిన 'హరివిల్లు' కవిత 1963 భారతిలో అచ్చయింది. ఖాళీసీసాలు, సముద్రం, వలవంటి విలక్షణమైన కథలూ, కనిపించని చావులు సముద్రాల్ని లేపవు, తూనీగ, డాలి, కాస్తగాలీ, ఒఖదే వంటి కవితలూ, ఆట వంటి నాటకం, జపనీయ హైకులతో పాటు ప్రపంచ కవిత్వ అనువాదాలు చేశారు. ఎందరో ప్రపంచ కవులను ఆయన తన అనువాదాలతో తెలుగువారికి పరిచయం చేశారు. 1983లో భోపాల్‌లో జరిగిన ప్రపంచ కవితోత్సవంలో పాల్గొని అనేకానేక దేశాల కవితలను కొన్నివారాల పాటు ఆదివారం ఆంధ్రజ్యోతి లో అందించారు. ఆయన వాణిజ్య పన్నుల శాఖలో ఉప కమిషనర్‌గా పనిచేశారు. రాజమండ్రిలో రైటర్స్ కార్నర్ అనే సాహితీ సంస్థను ఏర్పాటు చేసి కవులూ, రచయితలకు ఒక వేదికను ఏర్పాటు చేశారు. వీ

ఉండడం లేదు. ఆర్థికంగానూ, రాజకీయంగానూ బాగా పలుకుబడి గల వ్యక్తులు కేసులలో ఇరుక్కున్నప్పుడు, వారికి గల పలుకుబడితో సులువుగా తప్పించు కొంటున్నారు. ఏ పలుకుబడిలేని మధ్యతరగతికి చెందిన కుటుంబాల నుంచి వచ్చినవారు శిక్షలకు గురవుతున్నారు. ఇందుకు గల కారణం మనదేశంలోని పార్లమెంటరీ రాజకీయ నిర్మాణం. రాజకీయాలు వ్యాపారంగా మారిపోయి, లక్షలు, కోట్లు ఎన్నికలలో ఖర్చు పెట్టి అధికారం సంపాదించిన తరువాత ఖర్చు చేసిన దానికి రెట్టింపు సంపాదించడం వలన సమాజంలో అరాచకాలు, అన్యాయాలు, అవినీతి పెరిగిపోయి, నైతికవిలువలు పతనం అవుతున్నాయి. మన పాలకులు, మీడియా అంతా కలిసి ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలేనని, ఓటు హక్కు పవిత్రమైనదని ప్రచారం చేసి ప్రజల్ని మాయలో ఉంచుతుండడం వలన ప్రజాస్వామిక విలువలు ప్రచారం కావడంలేదు. ఫలితంగా నేరమే రాజ్యమై, నేరస్తులే రాజ్యమేలుతున్నారు. ఈ పరిస్థితులు ప్రజలపైన, విద్యార్థులపైన తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

బహుళజాతి కంపెనీల పెట్టుబడి, భూస్వామ్య వర్గాలైన పాలకులు మిలాఖత్ ఆయిన తరువాత బడుగు బలహీన వర్గాలపైన, ముఖ్యంగా స్త్రీలపైన దోపిడీ మరింత తీవ్రం కావడం జరుగుతున్నది. ఈ దోపిడీ రూపం శ్రమ దోపిడీగాను, శారీరక, మానసిక హింసగాను ఉంటున్నది. ఫలితంగా ప్రజలు జీవనం కోల్పోయి నిరాశ్రయులౌతున్నారు. అవమానాలకూ, లైంగిక వేధింపులకూ గురవుతున్నారు. అతి తక్కువ వేతనాలకు పనిచేయవలసి వస్తోంది. ఉద్యోగ భద్రతలేక దుర్భర జీవితాలు గడపవలసి వస్తోంది. ఈ పరిస్థితులలో పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువ బాధలు అనుభవిస్తున్నారు. ఇటు గృహహింస, అటు బయట వేధింపులు, అవమానాలు భరిస్తున్నారు. వీటన్నింటినీ పాలకులు పరోక్షంగా ప్రోత్సహించడం వల్ల పురుషులకు మరింత బలం చేకూరుతున్నది. మనదేశంలోని మతతత్వ శక్తులతో సామ్రాజ్యవాద శక్తులు సర్దుబాటు చర్యలు చేపట్టిన తరువాత విద్యారంగం, సాంస్కృతిక రంగం సామ్రాజ్యవాద కాషాయీకరణ చెందింది. ఫలితంగా స్త్రీలను విలాస వస్తువుగా చూస్తున్నారు. క్లబ్‌లు నైట్ క్లబ్‌లు గాను, హోటల్లు 'పబ్'లుగాను మారిపోయాయి. అర్ధనగ్న ప్రదర్శనలు, వీకెండ్ పార్టీలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. మద్యం ఏరులై పారుతున్నది. మధ్యతరగతి, శ్రామిక వర్గానికి చెందిన పురుషులు మద్యానికి బానిసలై భార్యలను హింసిస్తున్నారు. పాలకులు వీటిని అదుపు చేసే చర్యలు చేపట్టడంలేదు, సరికదా మరింత ప్రోత్సహిస్తున్నారు. సినిమాలు, టి.వి సీరియల్‌లలో హింస, సెక్స్ విపరీతంగా చూపెడుతున్నారు. పాఠ్యాంశాలు అశాస్త్రీయంగా బోధిస్తున్నారు. విద్యను విలువలతో బోధించడం లేదు. ర్యాంక్‌లు లక్ష్యంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ యువతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా యువకులు ఉన్మాదులుగాను, ప్రేమోన్మాదులుగాను మారిపోయి, నేరస్తులుగా తయారవుతున్నారు.

పోలీసులు ఫిర్యాదులు వచ్చినప్పుడు చూపలేని చొరవ, సంఘటన జరిగిన తరువాత అత్యుత్సాహం చూపెడుతున్నారు. చట్టబద్ధమైన పాలన జరగడంలేదు. కంటికి కన్ను పంటికి పన్ను సిద్ధాంతం అమలు చేస్తున్నారు. పోలీసు పాలన వలన ప్రజాస్వామిక వ్యవస్థలు ధ్వంసం అవుతున్నాయి. సామాజికన్యాయం కుంటుపడుతోంది. పోలీసుల పని నేరపరిశోధన, నేర నిరూపణ కోసం కృషి చేయడం తప్ప, వారే శిక్షలు విధించే విధంగా ప్రవర్తించడం సరికాదు. ఈ అవగాహన పెంపొందించి నప్పుడు ప్రజలు పోలీసు అధికార్లను భుజాలపైన మోయరు, బాధ్యతలను గుర్తుచేస్తారు. అందుకోసం ఉద్యమిస్తారు. ప్రజా ప్రతినిధులను నిలదీస్తారు. ప్రజలు ఈ చైతన్యంతో వ్యవహరించినప్పుడు ప్రజాస్వామిక సంస్థలు చట్టబద్ధ పాలన కొనసాగిస్తాయి. న్యాయస్థానాలు త్వరితగతిన తీర్పులు వెలువరిస్తాయి. అదే విధంగా ప్రజలు సామ్రాజ్యవాద సంస్కృతికి, పురుషాధిక్య వ్యవస్థకి, మతతత్వ భావజాలానికి వ్యతిరేకంగా పోరాడినప్పుడు స్త్రీలకు సమాజం లో గౌరవం పెరుగుతుంది. సమసమాజ స్థాపనతో మాత్రమే స్త్రీ పురుష సమానత్వం సాధ్యమౌతుంది తప్ప, నిందితులను హతమార్చినంత మాత్రాన మహిళలకు, విద్యార్థిని లకు రక్షణ దొరుకుతుందని అనుకోవడం, ఒక తప్పును ఖండించి, మరో తప్పును సమర్థించినట్లే అవుతుందే తప్ప, సామాజిక న్యాయం సాధించినట్లు కాదని గ్రహిద్దాం. వీ

ముంబై దాడులను అర్థం చేసుకోవడానికి అవసరమైన చారిత్రక, సామాజిక నేపథ్యాన్ని సమకూరుస్తున్నారు ప్రఖ్యాత నవలా రచయిత **అరుంధతీ రాయ్**

ముంబయి దాడులు - అద్దంలో రాకాసి

మనం మనహక్కులన్నిటినీ మన సొంత విషాదాలతో పోగొట్టుకుంటున్నాం. ముంబయిలో దురంతం ఇంకా రగులుతుండగానే, ఒక దారుణమైన రోజు తరువాత మరొక దారుణమైన రోజు సాగుతుండగానే మన ఇరవై నాలుగు గంటల నిరంతర వార్తా స్రవంతులు ఆ సంఘటన 'భారతదేశపు సెప్టెంబర్ 11'గా అభివర్ణించడం మొదలుపెట్టాయి. ఒక పాత హాలీవుడ్ సినిమాను అనుకరించిన బాలీవుడ్ సినిమాలోని నటులలాగా మనందరమూ మనకందిన పాత్రలను పోషించవలసి వచ్చింది. మనకందిన మాటలు అనవలసి వచ్చింది. అదంతా ఇదివరకు అన్నదేనని, చేసిందేనని మనకు తెలుసు.

దక్షిణాసియా ప్రాంతంలో ఉద్రిక్తత విస్తరిస్తూ ఉంటే అమెరికా సెనెటర్ జాన్ మెక్కెయిన్ పాకిస్తాన్‌కు ఒక హెచ్చరిక చేస్తాడు. ఆ 'ఘాతుకులను' నిర్బంధించడంలో పాకిస్తాన్ ప్రభుత్వం గనక తొందరగా చర్యలు తీసుకోకపోతే పాకిస్తాన్‌లోని 'ఉగ్రవాద శిబిరాల' పైన భారతదేశం వైమానిక దాడులు చేస్తుందని తనకు వ్యక్తిగత సమాచారం ఉందని అంటాడు. ముంబయి భారతదేశపు 'సెప్టెంబర్ 11' గనక ఈ విషయంలో అమెరికా కూడా చేయగలిగింది ఏమీ లేదంటాడు.

కాని నవంబరూ సెప్టెంబరూ ఒకటి కావు. 2008 అంటే 2001 కాదు. పాకిస్తాన్ అంటే అఫ్ఘనిస్తాన్ కాదు. భారతదేశం అంటే అమెరికా కాదు. అందువల్ల బహుశా మనం మన విషాదంనుంచి తేరుకుని మన సొంత మెదళ్లు ఉపయోగించి, మన విరిగిపోయిన హృదయాలు ఉపయోగించి, ఈ శిథిలాలను పరిశీలించి మన సొంత నిర్ధారణలకు రావలసి ఉంటుంది. నవంబర్ చివరివారంలోనే వేలాది భారత సైనికులు కాపలా కాస్తుండగా వేలాది కాశ్మీరీ ప్రజలు తమ ఓట్లు వేయడానికి బారులుగా నిలుచుని ఉండడమూ, భారతదేశపు అతి సంపన్న నగరంలోని అత్యంత ధనికుల భవనాలలో కూడ కాశ్మీర్‌లోని దారుణాలకు నిలయమైన కుప్వారా పట్టణంలో ఉన్నలాంటి స్థితే ఉండడమూ ఒక వింత.

ముంబై దాడులు భారతదేశపు నగరాల మీద, పట్టణాల మీద ఈ సంవత్సరం జరిగిన అనేక ఉగ్రవాద దాడుల వరుసలో అతి తాజావి మాత్రమే. అహ్మదాబాద్, బెంగళూర్, ఢిల్లీ, గువాహతి, జైపూర్, మాలేగావ్ వంటి పట్టణాలు ఎన్నో వరుస బాంబు దాడులను చవి చూశాయి. అక్కడ వందలాది మంది సాధారణ ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. గాయపడ్డారు. ఈ దాడులలో అనుమానితులుగా చూపుతూ పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో హిందువులూ, ముస్లింలూ అందరూ భారతపౌరులే ఉన్నారు. పోలీసుల ఆరోపణలు నిజమే అయితే ఈ దేశంలో ఎక్కడో ఏదో తీవ్రమైన పొరపాటు జరుగుతున్నదనుకోవాలి.

ముంబై దాడుల సందర్భంగా మీరు టెలివిజన్ చూసి ఉన్నట్టయితే ఆ దాడుల్లో సాధారణ ప్రజలు చనిపోయారని మీకు తెలిసి కూడా ఉండదు. ఒక జన సమ్మర్దమైన రైల్వే స్టేషన్‌లోనూ, ఒక సాధారణ ఆస్పత్రిలోనూ ఎంతో మంది ప్రజలు బలైపోయారు. అక్కడ టెర్రరిస్టులు పేదలకు ధనికులకు మధ్య తేడా ఏమీ చూడలేదు. ఇద్దరినీ సమానమైన కసితోనే చంపారు.

కాని భారత ప్రచార సాధనాలు మాత్రం ఈ దారుణమంతా 'వెలిగిపోతున్న భారత్' 'మెరిసిపోతున్న కంచెలను' పగులగొట్టిందని మాత్రమే బాధపడ్డాయి. ఆ దారుణపు దుర్వాసన నగరంలోని రెండు నమ్మశక్యంగానంత విలాసవంతమైన హోటళ్ల పాలరాతి నడవాలలో, స్ఫటికపు నాట్యశాలలో వ్యాపించిందనే బాధపడ్డాయి.

ఈ రెండు హోటళ్లలో ఒకటి ముంబై నగరానికి మూర్తీభవ రూపం అన్నట్టుగా మనల్ని నమ్మించారు. ఒకరకంగా అది నిజమే. సాధారణ భారతీయులు ప్రతిరోజూ భరించే అతి సులభమైన, అసహ్యకరమైన అన్యాయానికి ఆ హోటల్ ఒక మూర్తీభవరూపం. ఆ హోటల్లో తాము గడిపిన గదులు ఎంత బాగుండేవో, తాము తిన్న ఆహారశాలలు ఎంత అద్భుతంగా ఉండేవో, తమకు సేవలు చేసిన హోటల్ సిబ్బంది ఎంత ఆదరంగా ఉండేవారో చాలామంది అందమైన మనుషులు పత్రికల నిండా సంతాప ప్రకటనలు రాస్తున్న రోజునే ఒక జాతీయ దినపత్రికలో లోపలి పేజీలలో ఒక చిన్న ప్రకటన అచ్చయింది. బహుశా ఒక పిజ్జా కంపెనీ ఆ ప్రకటనను ఇచ్చిందనుకుంటాను. 'హంగ్రీ, క్యా' (ఆకలేస్తోందా) అని ఆ ప్రకటన. ఆ ప్రకటనలోనే బహుశా చాలా సదుద్దేశంతోనే కావచ్చు, అంతర్జాతీయ ఆకలి సూచికలో భారతదేశం సూడాన్ కన్న సోమాలియా కన్నా కింద ఉందనే సమాచారం ఉంది.

అది పోనీండి. ఇదేమీ యుద్ధ సమయం కాదు. ఆ యుద్ధమేదో ఇంకా మన గ్రామాలలో దళిత బస్తీలలో జరుగుతోంది. నర్మదా, కోయెల్‌కారో వంటి నదుల తీరాలలో జరుగుతోంది. చెంగారా వంటి రబ్బర్ ఎస్టేట్‌లలో జరుగుతోంది. నందిగ్రాం, సింగూర్, ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, ఒరిస్సా లలో, పశ్చిమ్ బెంగాల్‌లోని లాల్ ఘర్‌లో జరుగుతోంది. మన మహానగరాల మురికివాడలలో, పూరిగుడిసెలలో జరుగుతోంది.

అయితే ఆ యుద్ధం మన టెలివిజన్లకు పట్టదు.

బహుశా అందువల్లనే మిగిలిన వాళ్లందరిలాగే మనం కూడా టెలివిజన్ల మీద కనబడుతున్న యుద్ధం గురించే మాట్లాడుకుందాం.

టెర్రరిజం – నేపథ్యం తెలుసుకోవలసిన అవసరం

టెర్రరిజం గురించి సమకాలీన చర్చలన్నిటిలోనూ ఒక బలమైన, కలపడం అసాధ్యమైన అఖాతం కనబడుతుంది. ఒక పక్షాన్ని మనం పక్షం ఎ అందాం. అక్కడ ఉన్నవాళ్లు టెర్రరిజాన్ని ముఖ్యంగా ఇస్లామిక్ టెర్రరిజాన్ని ద్వేషపూరితమైనదిగా, ఉన్మాదభరితమైనదిగా, తన ఇరుసుమీద తానే, తన గుడుగుడు గుంచంలో తానే తిరిగేదిగా, చుట్టూ జరుగుతున్న ప్రపంచాన్ని పట్టించుకోనిదిగా, చరిత్రతో, భూగోళంతో, ఆర్థిక వ్యవహారాలతో సంబంధంలేనిదిగా చూస్తారు. అందువల్ల ఆ టెర్రరిజాన్ని ఒక రాజకీయ నేపథ్యంలో పెట్టాలనే ప్రయత్నాన్ని, కనీసం దాన్ని అర్థం చేసుకోవాలనే ప్రయత్నాన్ని ఈ పక్షం ఎ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఆ ప్రయత్నం చేసేవాళ్లను టెర్రరిజాన్ని సమర్థిస్తున్న వాళ్లుగా, నేరస్తులుగా చూస్తుంది.

మరొకపక్షాన్ని పక్షం బి అందాం. దాని ప్రకారం టెర్రరిజాన్ని ఎప్పుడూ, ఎక్కడా క్షమించడానికి, సమర్థించడానికి వీలులేనప్పటికీ అది ఒక నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట స్థలంలో ఒకానొక రాజకీయ సందర్భంలో పుట్టిపెరుగుతుందని వాదిస్తుంది. ఆ సందర్భాన్ని గుర్తించడానికి నిరాకరించడమంటే సమస్యను మరింత పెంచడమేనని, అంతకంతకూ మరింత మందిని ఆ ప్రమాదంలోకి తోయడమేనని అంటుంది. అది కూడా నేరమే.

1990లో లష్కర్ ఎ తొయిబా (పవిత్రుల సైన్యం) అనే సంస్థను స్థాపించిన హఫీజ్ సయీద్ ఇస్లాంలోని ఛాందసవాదులైన సలాఫి సంప్రదాయానికి చెందినవాడు. ఆయన మాటలు కచ్చితంగా పక్షం ఎ వాదనను బలపరుస్తాయి. హఫీజ్ సయీద్ ఆత్మాహుతి బాంబుదాడులను సమర్థిస్తాడు. యూదులనూ, షియాలనూ, ప్రజాస్వామ్యాన్నీ ద్వేషిస్తాడు. ఇస్లాం, తాను చెప్పే ఇస్లాం, ప్రపంచాన్ని పాలించేదాకా జిహాద్ (పవిత్ర యుద్ధం) జరపవలసిందే అని నమ్ముతాడు.

ఆయన అన్న మాటల్లో కొన్ని చూస్తే :

'భారతదేశం యథాతథంగా ఉన్నంతవరకు శాంతిలేదు. వాళ్లను ముక్కలు చేయాలి. ఎంత వరకు ముక్కలు చేయాలంటే, వాళ్లు మనముందు మోకరిల్లి మనను శరణు కోరాలి.'

అంతేకాదు.

'ఈ మార్గాన్ని మనకు భారతదేశమే చూపింది. మనం భారతదేశానికి కుక్క కాటుకు చెప్పు దెబ్బలాగా ప్రతిస్పందన చూపాలి. కాశ్మీర్‌లో భారతదేశం ముస్లింలను ఎట్లా చంపుతున్నదో, మనమూ అట్లానే హిందువులను చంపుతూ మన ప్రతిస్పందనను, ప్రతీకారాన్ని చూపాలి.'

మరి భారతదేశంలోని అహ్మదాబాద్ నుంచి బాబూ బజరంగీ అన్న మాటలు కూడా ఉన్నాయి. వాటిని పక్షం ఎ ఎక్కడ పెడుతుందో చూడాలి. ఆయనేమో తనను తాను ప్రజాస్వామిక వాదిగా భావించుకుంటాడు. ఎంతమాత్రమూ టెర్రరిస్టును అనుకోడు. 2002 గుజరాత్ మారణకాండ నిర్వాహకులలో ఆయన ముఖ్యుడు. ఆయన కెమెరా ముందు బహిరంగంగా అన్న మాటలు :

'మేము ఒక్క ముస్లిం దుకాణాన్ని కూడా వదిలిపెట్టలేదు. ప్రతి ఒక్కదాన్ని తగలబెట్టేశాం.... మేం ముస్లింలను నరికేశాం. తగలబెట్టాం. మంటల్లో విసిరేశాం. మేం వాళ్లని మంటల్లోకి ఎందుకు విసిరేశామో తెలుసా, ఆ లంజకొడుకులు చచ్చిపోయినాక దహనం చెయ్యొద్దు అనుకుంటారు. మంటకు భయపడతారు... నాకు ఒకే ఒక చివరికోరిక ఉంది... నాకు మరణశిక్ష అయినా వేయిండి... నన్ను ఉరి తీసినా సరే.... ఉరి తీసే ముందర నాకు ఒక్క రెండురోజులు ఇవ్వండి. జుహాపురాలో నా ఇష్టమొచ్చినట్లు చెయ్యనివ్వండి. అక్కడ ఏడెనిమిది లక్షల మంది ముస్లింలు ఉన్నారు... అందరినీ ఖతం చేసేస్తాను. కొంతమంది చావనీ... కనీసం ఇరవై ఐదు వేలమందినో, యాభై వేలమందినో చంపలేనా...'

అట్లాగే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు పరమ పవిత్ర గ్రంథమైన ఎం.ఎస్. గోల్వాల్కర్ రచన 'వీ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్' అనే పుస్తకంలో ఉన్న విషయాలను పక్షం ఎ ఎక్కడ పెడుతుంది? (ఆర్.ఎస్.ఎస్. అనేది హిందూ మత రాజకీయ పక్షమైన భారతీయ జనతా పార్టీకి, దాని ఇతర సైనిక సంస్థలకు భావజాలపరమైన నాయకత్వం అందించే సంస్థ. దాన్ని 1925లో ప్రారంభించారు. 1930ల కల్లా దాని స్థాపకుడు, బెనిటో ముసోలీనీకి అభిమాని అయిన డా. కె.బి. హెగ్డేవార్ తన సంస్థను స్పష్టంగానే ఇటాలియన్ ఫాసిస్ట్ సంస్థ తరహాలో నిర్మించడం ప్రారంభించాడు.)

ఆ పుస్తకంలో ఏముందంటే :

'ముస్లింలు హిందుస్తాన్ మీద అడుగుపెట్టిన ఆ దుష్ట దినం నుంచి ప్రస్తుత క్షణం దాకా ఈ దుర్మార్గులను ఓడించడానికి హిందూ జాతి వీరోచితంగా పోరాడుతోంది. జాతి ఆత్మ మేల్కొంటోంది.'

లేదా :

'తన జాతినీ, సంస్కృతినీ పరిశుభ్రం చేసుకోవడానికి, తన దేశం నుంచి యూదుల వంటి ఆర్యేతర జాతులను రూపుమాపడానికి ప్రయత్నించి జర్మనీ ప్రపంచాన్ని దిగ్భ్రాంతిపరిచింది. అత్యున్నత జాతి గర్వం ఆ చర్యలో వ్యక్తీకరణ పొందింది... హిందుస్తాన్‌లో మనకు నేర్చుకోవటానికీ, లాభంపొందటానికీ అది మంచి పాఠం.'

అయితే, హిందూ తీవ్రవాదుల తుపాకీ తూటాలకు లక్ష్యంగా ఉండేది ముస్లింలు మాత్రమే కాదు. ఆ దాడి దళితుల మీద నిరంతరాయంగా సాగుతోంది. ఇటీవలనే ఒరిస్సాలోని, కందమాల్‌లో క్రైస్తవులు లక్ష్యంగా మారారు. రెండున్నర నెలల హింసాకాండలో నలభై మంది మరణించారు. నలభైవేల మంది తమ ఇళ్లనుంచి వెళ్లగొట్టబడ్డారు. వారిలో సగం మంది ఇంకా శరణార్థి శిబిరాల్లో బతుకు ఈడుస్తున్నారు.

చాలా సంవత్సరాలుగా హఫీజ్ సయీద్ లాహోర్‌లో జమాత్ ఉద్ దావా అనే సంస్థ నాయకుడిగా గౌరవ ప్రదమైన జీవితం గడుపుతున్నాడు. ఆ సంస్థ లష్కర్ ఎ తొయిబాకు ముసుగు సంస్థ అని చాలామంది అంటారు. తన ఉద్రేకపూరితమైన, వక్రమైన బోధలతో ఆయన ఎంతోమంది యువకులను తన మూర్ఖపు జిహాద్‌వైపు ఆకర్షించాడు. డిసెంబర్ 11న ఐక్యరాజ్య సమితి జమాత్ ఉద్ దావా పై ఆంక్షలు విధించింది. అంతర్జాతీయ ఒత్తిడికి తలఒగ్గి పాకిస్తాన్ ప్రభుత్వం హఫీజ్ సయీద్‌ను గృహనిర్బంధంలో ఉంచింది.

కాని, బాబూ బజరంగీ మాత్రం ఇప్పుడు బెయిల్ మీద ఉన్నాడు.

గుజరాత్‌లో ఒక గౌరవనీయమైన నాయకుడుగా కొనసాగుతున్నాడు. గుజరాత్ మారణకాండ తరువాత కొన్ని సంవత్సరాలకు ఆయన విశ్వ హిందూ పరిషత్ వదిలేసి శివసేనలో చేరాడు. బజరంగీని గతంలో పోషించిన నరేంద్రమోడీ ఇప్పటికీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నాడు.

అంతేకాదు, గుజరాత్ మారణకాండను నిర్వహించిన వ్యక్తి రెండుసార్లు ఎన్నికల్లో గెలిచాడు. భారతదేశపు అతి పెద్ద పారిశ్రామిక గృహాలైన రిలయన్స్, టాటాలు నరేంద్రమోడీని ఎంతగానో గౌరవిస్తాయి. టెలివిజన్ కార్యక్రమాల నిర్వాహకుడూ, కార్పొరేట్ సంస్థల ప్రతినిధి సుహేల్ సేఠ్ ఈ మధ్యనే 'మోడీ భగవంతుడే' అన్నాడు. గుజరాత్ మారణకాండ సమయంలో హింసకు, అత్యాచారాలకు, హత్యలకు పర్యవేక్షణ జరిపిన, కొన్నిసార్లు సహకరించిన, పోలీస్ అధికార్లకు ఆ తర్వాత ప్రతిఫలాలు, పదోన్నతులు దక్కాయి.

దేశవ్యాప్తంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘానికి దాని విద్వేష సిద్ధాంతాన్ని ప్రచారం చేసే నలభై ఐదు వేల శాఖలు, డెబ్బై లక్షల మంది స్వయం సేవకులు ఉన్నారు. వారిలో నరేంద్రమోడీ మాత్రమే కాదు, మాజీ ప్రధానమంత్రి ఎ.బి. వాజ్‌పేయి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు ఎల్.కె. అద్వానీ, ఎంతోమంది సీనియర్ రాజకీయ నాయకులూ, ప్రభుత్వ అధికారులూ, పోలీసు, ఇంటిలిజెన్స్ అధికారులూ కూడా ఉన్నారు.

భారత లౌకిక ప్రజాస్వామికం గురించి మన చిత్రం ఎంత సంక్లిష్టమైనదంటే వీరితో పాటే దేశంలో ఎన్నో ముస్లిం సంస్థలు తమ సంకుచిత పరమత విద్వేషాన్ని రెచ్చగొడుతూ ఉన్నాయని కూడా చెప్పుకోవాలి.

కనుక ఈ స్థితిలో పక్షం ఎ ను ఎంచుకుంటావా, పక్షం బి ని ఎంచుకుంటావా అని నన్నెవరైనా అడిగితే నేను పక్షం బి నే ఎంచుకుంటాను. టెర్రరిజం పుట్టిపెరిగిన నేపథ్యం ఏమిటో అర్థం చేసుకోవాలి. ఎప్పుడైనా సరే.

ద్వేషం – సాన్నిహిత్యం – ప్రేమ సహజీవనం

అణ్వాయుధాలు నిండిన ఈ ఉపఖండంలో టెర్రరిజం సందర్భం దేశ విభజన. భారతదేశాన్ని, పాకిస్తాన్ని విభజించి రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య, గ్రామాల మధ్య, పొలాల మధ్య, ప్రజాసమూహాల మధ్య, జలాశయాల మధ్య, ఇళ్ల మధ్య, కుటుంబాల మధ్య రాత్రికిరాత్రి రాడ్‌క్లిఫ్ రేఖ గీయబడింది. బ్రిటన్ వెళ్లిపోతూ భారత ఉపఖండం మీద తన్నిన ఆఖరి తన్ను అది.

ఆ విభజన వల్ల పదిలక్షల మందికి పైగా ఊచకోత జరిగింది. సమకాలీన చరిత్రలో అతి పెద్ద మానవ సమూహపు వలస సాగింది. కొత్తగా ఏర్పడిన పాకిస్తాన్ నుంచి పారిపోయిన హిందువులు, కొత్త భారతదేశం నుంచి పారిపోయిన ముస్లింలు ఎనభై లక్షలమంది తమ కొంపా గోడూ కోల్పోయారు. ఒంటి మీది బట్టలతో, భుజాల మీది మూటలతో కొత్తదేశంలోకి వచ్చిపడ్డారు.

ఈ శరణాగతులలో ప్రతి ఒక్కరికి ఒక దుస్సహమైన బాధా గాథ ఉంది. ద్వేషం, భయం, కొత్త బతుకు కోసం ఆకాంక్ష నిండిన ఆ మనుషుల గాథలు తరం నుంచి తరానికి ప్రవహిస్తూనే ఉన్నాయి. ఆ గాయం, అప్పుడు తెగిపోయి ఇప్పటికీ ఇంకా అతుక్కోని కండరాలు, ఆ నెత్తురు, ఆ విరిగిన ఎముకలు మనను ఇంకా ద్వేషానికీ, భయపెట్టే సాన్నిహిత్యానికీ బందీలుగా ఉంచుతున్నాయి. ప్రేమకు కూడా బంధీగా ఉంచుతున్నాయి. ఆ విభజన కాశ్మీర్‌ను ఒక పీడకలలో ముంచివేసింది. ఆ పీడ కల నుంచి కాశ్మీర్ ఇంకా మేలుకోలేదు. ఒక్క కాశ్మీర్‌లోనే ఆ పీడకల అరవై వేల జీవితాలను బలితీసుకుంది.

విభజన తరువాత పాకిస్తాన్ (పవిత్ర భూమి) ఒక ఇస్లామిక్ గణతంత్రంగా మారింది. అతి త్వరలోనే అవినీతికరమైన, హింసాత్మకమైన సైనిక రాజ్యంగా మారింది. ఇతర మత విశ్వాసాల పట్ల బహిరంగ అసహనం కనబరిచింది.

మరొకపక్క భారతదేశం తనను తాను అందరిని సమ్మిళితం చేసుకునే లౌకిక ప్రజాస్వామికంగా ప్రకటించుకుంది. అది ఒక మహత్తరమైన వాగ్దానం. కాని, బాబూ బజరంగీ నాయకులు 1920ల నుంచీ భారత దేశపు రక్త ధమనులలోకి విషాన్ని ప్రవేశ పెట్టే పనిలో నిండా మునిగి ఉన్నారు. భారతదేశం పుట్టక ముందునుంచే దాన్ని ధ్వంసం చేసే పని మొదలుపెట్టారు.

1990 వచ్చేసరికల్లా వారు అధికారానికి కూడా పోటీ పడగల స్థితి వచ్చింది. 1992 లో ఎల్.కె. అద్వానీ ప్రేరణతో హిందూ మూకలు బాబ్రీ మసీదు మీద దాడి చేసి దాన్ని కూలగొట్టాయి. 1998 వచ్చేసరికి భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని చేపట్టింది. సరిగ్గా ఆ సమయానికే అమెరికా ప్రభుత్వం ప్రకటించిన టెర్రరిజం మీద యుద్ధం భారతీయ జనతా పార్టీకి బలాన్ని ఇచ్చింది. భారతీయ జనతా పార్టీ తన ఇష్టారాజ్యంగా ప్రవర్తించడానికి అది అవకాశం ఇచ్చింది. జాతి హననకాండను జరిపి తమ ఫాసిజాన్ని సుంక్షుభిత ప్రజాస్వామ్యపు సాధికార రూపంగా ప్రకటించుకునే అవకాశం ఇచ్చింది.

ఇదంతా జరగడానికి మరొక సందర్భం ఉంది. సరిగ్గా అప్పుడే భారతదేశం తన విశాలమైన మార్కెట్‌ను అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు అప్పగించింది. అంతర్జాతీయ కార్పొరేషన్లూ, ఆ కార్పొరేషన్ల చేతులోని ప్రచార సంస్థలూ భారతదేశం ఏ తప్పుచేయని దేశంగా ప్రచారం చేయడమే తమ ప్రయోజనాలకు అనువైనదనుకున్నారు. ఇక హిందూ జాతీయవాదుల శిక్షాతీత నేరప్రవృత్తికి ఆధారం దొరికింది.

ఉపఖండంలోని టెర్రరిజానికీ, ముంబై దాడులకూ ఉన్న విశాల చారిత్రక నేపథ్యం ఇది. ఇక్కడ ఒక విషయం మనను ఆశ్చర్యపరచ గూడదు. అదేమంటే లష్కర్ ఎ తొయబాకు చెందిన హఫీజ్ సయీద్ నిజానికి భారతదేశంలోని సిమ్లాకు చెందినవాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు చెందిన ఎల్.కె. అద్వానీ నిజానికి పాకిస్తాన్‌లోని సింధ్‌కు చెందినవాడు.

2001 పార్లమెంట్ దాడి సందర్భంలోనూ, 2002 సబర్‌మతి ఎక్స్‌ప్రెస్ దహనం సందర్భంలోనూ, 2007 సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుడు సందర్భంలోనూ చెప్పినట్టుగానే ముంబై దాడుల వెనుకగూడా పాకిస్తాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటిలిజెన్స్ (ఐ.ఎస్.ఐ.) మద్దతుతో లష్కర్ ఎ తొయిబా ఉన్నదని తమదగ్గర 'నిస్సందేహమైన' ఆధారాలు ఉన్నాయని భారత ప్రభుత్వం ప్రకటించింది.

లష్కర్ ఎ తొయిబా తన పాత్రలేదని ఖండించింది. అయినా అదే ప్రధాన నిందితురాలుగా ఉంది. పోలీసు, ఇంటిలిజెన్స్ సంస్థల ప్రకారం లష్కర్ ఎ తొయిబా భారత దేశంలో ఇండియన్ ముజాహిదీన్

అనే సంస్థ ద్వారా పనిచేస్తుంది. ముంబై దాడుల విషయంలో జమ్మూ కాశ్మీర్ పోలీస్ శాఖలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్‌గా పనిచేసే షేక్ ముఖ్తార్ అహ్మద్, పశ్చిమబెంగాల్‌లోని కలకత్తా వాసి తౌసిఫ్ రహ్మాన్ అనే ఇద్దరు భారతీయ పౌరులని అరెస్ట్ చేశారు.

అంటే పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నేరుగా చేసిన ఆరోపణలు కొంత ఇబ్బందుల్లో పడుతున్నాయన్నమాట.

ఎప్పుడైనా ఇటువంటి కథల వివరాలు బయటపడుతున్న కొద్దీ ఒక సంక్లిష్టమైన అంతర్జాతీయ వ్యవస్థ ఉన్నదని అందులో ప్రత్యక్షంగా పనిచేసినవారు, వారికి శిక్షణ ఇచ్చినవారు, వారిని నియమించినవారు, మధ్యవర్తులు, రహస్యంగా సమాచారం సేకరించినవారు, అవతలివైపు సమాచారాన్ని అందజేసినవారు వంటి ఎంతోమంది ఉంటారని బయటపడుతుంది. వారు కేవలం భారత పాకిస్తాన్ సరిహద్దులకు అటూ ఇటూ మాత్రమే కాదు, ఏకకాలంలో అనేక దేశాలలో పనిచేస్తుంటారు.

ఇవ్వాళ్టి ప్రపంచంలో ఒక టెర్రరిస్ట్ దాడికి మూలాలను ఒకే ఒక దేశపు సరిహద్దు లోపల గుర్తించడానికి ప్రయత్నించడమనేది కార్పొరేట్ సంస్థల డబ్బును ఒకే దేశంలో గుర్తించడానికి ప్రయత్నించడం లాంటిదే. అది అసాధ్యమైన పని.

ఇటువంటి పరిస్థితులలో టెర్రరిస్ట్ శిబిరాలను ధ్వంసం చేయడానికి వైమానిక దాడులు జరిపితే శిబిరాలను తుడిచిపెట్టవచ్చు. కాని టెర్రరిస్టులను తుడిచిపెట్టడం సాధ్యంకాదు. యుద్ధం చేసినా అంతే.

అలాగే మనమేదో నైతికంగా ఉన్నతస్థాయిలో ఉన్నామనే భ్రమలలో పడి మన చరిత్రను మరచిపోకూడదు. పొరుగు దేశమైన శ్రీలంకలో లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్.టి.టి.ఇ.) వంటి ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తివంతమైన టెర్రరిస్ట్ బృందం తన పని సాగిస్తున్నప్పుడు వారికి శిక్షణ ఇచ్చినది భారత సైన్యమేనన్నది మరచిపోకూడదు.

సీసాల్లోనుంచి భూతాలను బయటికి వదలడం

మొట్టమొదట అఫ్ఘనిస్తాన్‌లోని ఇస్లామిక్ తీవ్రవాదులకు మద్దతుగానూ, ఆ తర్వాత వారిమీద యుద్ధంలోనూ అమెరికా పాకిస్తాన్‌ను తన తొత్తుగా వాడుకుంది. ఇప్పుడు పాకిస్తాన్ భూభాగం ఈ వైరుధ్యంతో అతలాకుతలం అవుతూ అంతర్యుద్ధం వైపు ప్రయాణిస్తోంది.

సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా అమెరికా సాగించిన జిహాద్‌కు సైనికులను నియమించడం, శిక్షణ ఇవ్వడం పాకిస్తానీ సైన్యం, ఐ.ఎస్.ఐ. చేసిన పనులు. అప్పుడు వాళ్లు ఇస్లామిక్ ఛాందసవాద సంస్థలను పోషించారు. వారికి నిధులు అందజేశారు. ఈ భూతాలకు శిక్షణ ఇచ్చి సీసాలనుంచి బయటి ప్రపంచంలోకి వదిలిన తరువాత వారిని తన ఇష్టం వచ్చినట్టు కీలుబొమ్మలలాగా ఆడించవచ్చునని అమెరికా భ్రమపడింది. కనీసం ఆ భూతాలు తనమీదకే వచ్చి 'సెప్టెంబర్ 11' జరపవని ఆశించింది. ఆ తరువాత అమెరికా అఫ్ఘనిస్తాన్‌ను మరొకసారి హింసాత్మకంగా మార్చదలచింది.

అలా మళ్లీ ధ్వంసమైన అఫ్ఘనిస్తాన్ శిథిలాలను ఇప్పుడు పాకిస్తాన్ సరిహద్దులలో శుభ్రం చేస్తున్నారు.

ఈ స్థితిలో పాకిస్తాన్ అనే దేశం ఏ క్షణానైనా పేలిపోగల స్థితిలో ఉంది. ఆ మాట కాదని ఏ ఒక్కరూ, చివరికి పాకిస్తానీ ప్రభుత్వం కూడా అనలేదు. టెర్రరిస్టుల శిక్షణ శిబిరాలు, బోధనలలో నిప్పులు ఉమిసే ముల్లాలు, తమ ఇస్లామే ప్రపంచాన్ని పాలించాలనుకునే ఉన్మాదులు అందరూ కూడా రెండు అఫ్ఘన్ యుద్ధాలలో పాల్గొని మిగిలినవారే. వారి ఆగ్రహం పాకిస్తాన్ ప్రభుత్వం మీద ఉంది, పాకిస్తాన్ ప్రజలమీద ఉంది, అంతకు అంతా భారతదేశం మీద ఉంది.

ఒకవేళ ఈ సమయంలో పాకిస్తాన్ మీద యుద్ధమే చేయాలని భారతదేశం అనుకున్నట్టయితే మొత్తం ఉపఖండమే సంక్షోభంలోకి దిగజారడం సంపూర్ణం అవుతుంది. దివాలా తీసిన విధ్వంసమైన పాకిస్తాన్ శిథిలాలను భారత తీరంలో కడగడం మొదలుపెడితే భారతదేశం అంతకుముందు ఎన్నటికన్నా ఎక్కువ ప్రమాదంలో పడుతుంది.

పాకిస్తానే కుప్పకూలిపోతే అణ్వాయుధాలు చేతుల్లో పెట్టుకున్న లక్షలాది మంది ప్రభుత్వేతర పాత్రధారులు మన పొరుగున ఉంటారు.

భారతదేశపు నాయకులు పాకిస్తాన్ చేసిన పొరపాట్లనే తామూ చేయాలని ఎందుకు అనుకుంటున్నారో అర్థంకాదు. అంతేకాదు, ఆ దేశాన్ని ఖండించడానికి అమెరికా సాయం కోరుతూ, మన సంక్షుభిత, సంక్లిష్ట వ్యవహారాలలో ఒక ప్రమాదకరమైన జోక్యాన్ని ఎందుకు కోరుకుంటున్నారో తెలియదు. ఒక అగ్రరాజ్యానికి ఎప్పుడూ స్నేహితులంటూ ఎవరూ ఉండరు. దానికి కావలిసింది దళారీలు, తొత్తులు.

మరోవైపు నుంచి చూడాలంటే, భారత ప్రభుత్వానికి యుద్ధానికి దిగడంవల్ల రాగల సదవకాశం ఏమంటే దేశం లోపల పెంపొందుతున్న తీవ్రమైన సమస్యల నుంచి తప్పించుకోవచ్చు.

ముంబై దాడులను భారతదేశంలోని ఇరవై నాలుగు గంటల వార్తా ఛానళ్లు అరవై ఏడు జరిగింది జరిగినట్టుగా (తమకే ప్రత్యేకం అని కూడా చెప్పుకుని) ప్రసారం చేశాయి. మరెన్ని అంతర్జాతీయ ఛానళ్లు ప్రసారం చేశాయో తెలియదు. స్టూడియోలలో టి.వి. ఆంకర్లు, గ్రౌండ్ జీరో దగ్గర జర్నలిస్టులు తమ ఉద్వేగపూరితమైన వ్యాఖ్యానాన్ని నిరంతరాయంగా సాగించారు.

మూడు రోజులపాటు పగలూ రాత్రి మనందరమూ ఒకరకమైన అపనమ్మకంతో ఒక చిన్న యువకుల బృందం తుపాకులూ, ఇతర పరికరాలూ పట్టుకుని ఏం చేశారో చూశాం. మనకు మనం చెప్పుకుంటున్న అతి బలవంతమైన అణ్వాయుధాలు ఉన్న దేశపు పోలీసు బలగమూ, ప్రతిష్ఠాత్మకమైన నేషనల్ సెక్యూరిటీ గార్డ్, నావికా దళ కమాండోలు ఎందుకూ పనికిరాకుండా పోవడం చూశాం. ఆ యువకుల బృందం ఈ పని చేస్తూనే నిర్విచక్షణగా నిరాయుధులైన ప్రజలు ఎందరినో చంపారు. రైల్వే స్టేషన్‌లలో, ఆస్పత్రులలో, విలాసవంతమైన హోటళ్లలో హతుల వర్గం, కులం, మతం, జాతితో సంబంధం లేకుండా బలితీసుకున్నారు.

(మన భద్రతాబలగాల నిస్సహాయతకు ఒక కారణం బందీల క్షేమం గురించి ఆలోచించడం. వేరే సందర్భాలలోనైతే కాశ్మీర్‌లో భద్రతా బలగాలు ఇంత మృదువుగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. లోపల బందీలకు ఏమన్నా కానీ అని మొత్తం భవనాలను పేల్చివేశారు. మనుషులను రక్షణ కవచాలుగా అడ్డుపెట్టుకుని దాడులు చేశారు. అంతేకాదు,

పాలస్తీనా, ఇరాక్, అఫ్ఘనిస్తాన్ వంటి చోట్ల దాడులు చేసేటప్పుడు, భవనాల మీద క్షిపణి దాడులు చేసేటప్పుడు, పెళ్లి విందుల మీద బాంబులు వేసేటప్పుడు అమెరికా, ఇజ్రాయిల్ సైన్యాలు ఎప్పుడూ సందేహించలేదు.)

కాని, ఇది భిన్నమైనది. పైగా టెలివిజన్ తెరమీద కనబడుతున్నది.

ఆ టెర్రరిస్ట్ యువకులు చంపడానికీ, చావడానికీ చూపిన నిర్భయ సంసిద్ధత అంతర్జాతీయ ప్రేక్షకులను ఆశ్చర్యపరచింది. సాధారణంగా వార్తలు చూసేవాళ్లకు ఇప్పటికే అలవాటైన ఆత్మాహుతి దాడులకూ, క్షిపణి దాడులకూ భిన్నంగా ఈ యువకులు తమ దాడి సాగించారు.

ఇక్కడ ఉన్నదంతా సరికొత్తది. చావో రేవో ఆ దారుణమైన ప్రదర్శన అలా సాగుతూ పోయింది. సాగినంత సేపూ టి.వి. రేటింగ్‌లు పెరుగుతూ పోయాయి. ఏ టెలివిజన్ యజమానినైనా, కార్పొరేట్ వ్యాపార ప్రకటనకర్తనైనా అడిగి చూడండి. ఆ ప్రదర్శన ఎంత విలువైనదో. వాళ్లు తమ ప్రసార సమయాన్ని నిమిషాల్లో లెక్కపెట్టరు. సెకన్లలో లెక్కపెడతారు.

చిట్టచివరికి హంతకులు చనిపోయారు. కష్టంమీద చనిపోయారు. ఒక్కరు తప్ప అందరూ చనిపోయారు. (బహుశా ఆ గందరగోళంలో కొందరు తప్పించుకుని ఉండవచ్చు కూడా. మనకెప్పటికీ తెలియదు.)

ఆ దాడి జరిగినంతసేపూ టెర్రరిస్టులు ఏ కోరికలూ కోరలేదు. చర్చించే కోరిక ఉందని కూడా వ్యక్తం చేయలేదు. వాళ్ల ఉద్దేశమంతా జనాన్ని చంపడమే. తాము చనిపోయేలోపు అవతలి వాళ్లమీద వీలైనంత ఎక్కువ నష్టాన్ని కలిగించడమే. ఒకరకంగా వాళ్లు మనను దిగ్భ్రాంతిలో ముంచారు.

అనుద్దేశపూరిత నష్టం

'టెర్రరిజాన్ని ఏ రకంగానూ సమర్థించలేం' అని అన్నప్పుడు మనలో చాలామంది అర్థం ఏమంటే మానవ ప్రాణాన్ని తీయడాన్ని ఏ రకంగానూ సమర్థించలేం అని. ఆ మాట మనం ఎందుకు అంటామంటే మనం జీవితాన్ని గౌరవిస్తాం గనుక. అది చాలా విలువైనదని అనుకుంటాం గనుక.

మరి జీవితం అంటే, అవతలి వాళ్ల జీవితం మాత్రమే కాదు, తమ జీవితం అన్నా కూడా లక్ష్యం లేని వాళ్ల సంగతి ఏమిటి? వాస్తవం ఏమంటే వాళ్లను ఎలా అర్థం చేసుకోవాలో మనకు తెలియదు. ఎందుకంటే వాళ్లు చనిపోక ముందే మనం ఎన్నటికీ అందుకోలేని మరో ప్రపంచంలోకి ప్రవేశించారు.

ఒక టి.వి. ఛానల్ ప్రసారంలో దాడిచేసిన వారిలో ఒకరితో ఫోన్ సంభాషణ ప్రసారం చేశారు. ఆ మాట్లాడిన వ్యక్తి తనను తాను ఇమ్రాన్ బాబర్ అని చెప్పుకున్నాడు. ఆ సంభాషణ వాస్తవమైనదో కాదో నేను చెప్పలేను. కాని ఆ వ్యక్తి మాట్లాడిన విషయాలు దేశంలో అటువంటి ఎన్నో బాంబుదాడులకు ముందు వచ్చిన భయోత్పాత ఈమెయిల్స్ లో ఉన్న విషయాలే. ఆ విషయాల గురించి మాట్లాడడం మనకు ఇష్టంలేదు. అవి 1992 బాబ్రీ మసీద్ విధ్వంసం, 2002 గుజరాత్ ముస్లింలపై జరిగిన జాతి హనన హత్యాకాండ, కాశ్మీర్‌లోని పాశవిక నిర్బంధం.

'మీ చుట్టూ చక్రబంధం చేశారు. మిమ్మల్ని చంపేస్తారు. మీరు లొంగిపోవచ్చు కదా' అని యాంకర్ వాళ్లని అడిగాడు.

'మేమెట్లాగూ ప్రతిరోజూ చచ్చిపోతున్నాం' అని ఒక వింతైన యాంత్రిక పద్ధతిలో అవతలి నుంచి జవాబువచ్చింది. 'ప్రతిరోజూ అట్లా చచ్చిపోవడం కన్న ఒక్కరోజు సింహంలా పోరాడి చనిపోవడం మంచిది కదా.' ఆ వ్యక్తికి ప్రపంచాన్ని మార్చాలని కోరికేమీ ఉన్నట్టు లేదు. తనతో పాటు ప్రపంచాన్ని కూడా లాగికింద పడేస్తే చాలునను కుంటున్నట్టు ఉన్నాడు.

ఈ దాడి చేసిన వాళ్లు నిజంగా లష్కర్ ఎ తొయిబాకు చెందిన వాళ్లే అయితే ఇక్కడి హతులలో ఎక్కువ మంది ముస్లింలే ఉన్నారనే విషయం వాళ్లకు ఎందుకు పట్టలేదు? తాము ఏ ముస్లింల హక్కులకోసం పోరాడుతున్నాం అని చెపుతున్నారో తమ చర్యవల్ల ఆ ముస్లిం సమూహం మీదనే పెద్ద ఎత్తున ప్రతీకార దాడులు జరగవచ్చని వాళ్లకు ఎందుకు తట్టలేదు?

ఎందుకంటే టెర్రరిజం అనేది ఒక హృదయంలేని సిద్ధాంతం. అన్ని సిద్ధాంతాల లాగనే దానికి కూడా దృష్టి పెద్ద చిత్రం మీదనే ఉంటుంది. వాళ్ల లెక్కలలో వ్యక్తుల ప్రస్తావనే ఉండదు. ఒకవేళ వ్యక్తులకు ఏమైనా జరిగినా అనుద్దేశపూరితమైన ప్రమాదంగా జరుగుతుంది.

ఒక దారుణ స్థితిని మరింత దారుణంగా చూపడమే ఎప్పుడైనా టెర్రరిస్ట్ వ్యూహంలో ఒక భాగం. లేదా వాళ్ల లక్ష్యమే అది. అమరుల నెత్తురే టెర్రరిజానికి పంటకాలువ. హిందూ టెర్రరిస్ట్‌లకు హతులైన హిందువులు కావాలి. కమ్యూనిస్ట్ టెర్రరిస్ట్‌లకు హతులైన కార్మికులు కావాలి. ఇస్లామిక్ టెర్రరిస్ట్‌లకు హతులైన ముస్లింలు కావాలి. ఆ హతులు ప్రదర్శన వస్తువులు అవుతారు. తాము బాధితులనేందుకు నిదర్శనం అవుతారు. మొత్తం ప్రణాళికకు అదే కీలకం అవుతుంది.

ఒకానొక టెర్రరిస్ట్ చర్య సైనిక విజయాన్ని సాధిస్తుందని ఎవరూ అనుకోరు. ఎక్కువలో ఎక్కువ అది మరొక పరిణామానికి దారితీసే ఉత్ప్రేరకం అవుతుంది. అది మరింత పెద్దది కావచ్చు. ఒక కొత్త మార్పుకు దారి తీయవచ్చు. మొదటి చర్య దానికదిగా ఒక రంగస్థలం, ఒక ప్రదర్శన, ఒక ప్రతీక. ఇవాళ ఆ ప్రదర్శన తన కులుకు చూపడానికి, సోయగం ఒలకబోయడానికి, పాశవికత ప్రదర్శించడానికి 'లైవ్ టి.వి.' అనే వేదిక ఉంది. ముంబై దాడులను ఒకవైపు టి.వి. యాంకర్లు ఖండిస్తూ ఉండగానే అవే టి.వి. ప్రసారాలలో ఆ దాడుల శక్తి సామర్థ్యాలు వెయ్యి రెట్లు ఎక్కువ చేసి ప్రదర్శించబడ్డాయి.

ఈ పరిణామాల మీద లెక్కలేనన్ని గంటలు జరిగిన విశ్లేషణలలో, లెక్కలేనన్ని వ్యాసాలలో మనమధ్య ఉన్న ఇంతకన్న పెద్ద సమస్యలు – కాశ్మీర్, గుజరాత్, బాబ్రీ మసీద్ విధ్వంసం – గురించి మాటమాత్రమైనా ప్రస్తావన లేదు.

దానికి బదులుగా పదవీ విరమణ పొందిన దౌత్యవేత్తలూ, వ్యూహ నిపుణులూ, పాకిస్తాన్ మీద యుద్ధం చేస్తే మేలేమిటి, కీడేమిటి అని ఎడతెగకుండా చర్చించారు. తమ భద్రతకు హామీ లేకపోతే పన్నులు చెల్లించబోం అని ధనవంతులు బెదిరింపులు కూడా వినిపించారు. (అంటే పేద ప్రజలు రక్షణ లేకుండా ఉండడం ఫరవాలేదన్నమాట.) మరికొందరైతే ప్రభుత్వం దిగిపోవాలని, దేశంలోని ప్రతి రాష్ట్రాన్ని ఒక ప్రత్యేక కార్పొరేషన్ చేతుల్లో పెట్టాలని కూడా సూచించారు.

సరిగ్గా అప్పుడే మాజీ ప్రధాని వి.పి. సింగ్ మరణించారు. ఆయన దళితులకూ, వెనుకబడిన కులాలకూ నాయకుడు. అగ్రవర్ణ హిందువులకు

ఆయనంటే ద్వేషం. ఆయన మరణవార్త కూడా ప్రస్తావనకు రాకుండా పోయింది.

మాగ్జిమమ్ సిటీ రచయిత, బాలీవుడ్ సినిమా 'మిషన్ కాశ్మీర్' సహరచయిత సుకేతు మెహతా 'సెప్టెంబర్ 11' తరువాత జార్జ్ బుష్ చేసిన ప్రముఖ ఉపన్యాసం 'వాళ్లు మననెందుకు ద్వేషిస్తారు' కు భారతీయ రూపాన్ని ప్రకటించారు. హిందూ, ముస్లిం మత ఛాందసవాదులు ముంబైని ఎందుకు ద్వేషిస్తారో ఆయన విశ్లేషణ ఏమంటే 'బహుశా ముంబై ఆకర్షణకు చిహ్నం. సాహసికమైన స్వప్నాలకు చిహ్నం. నిర్విచక్షణాపూరితమైన బహిరంగత్వానికి చిహ్నం.'

మరి అటువంటి చిహ్నాన్ని వాళ్లు ద్వేషిస్తూ ఉంటే సుకేతు మెహతా పరిష్కారం ఏమిటి? 'ఈ టెర్రరిస్ట్లకు తగిన జవాబు ఏమంటే ఇంకా ఎక్కువ కలలు గనడం. ఇంకా ఎక్కువ డబ్బు కూడబెట్టడం. ముంబైని ఇంకా ఎక్కువ సార్లు సందర్శించడం.'

సరిగ్గా 'సెప్టెంబర్ 11' తరువాత జార్జ్ బుష్ కూడా అమెరికన్లను ఇంకా ఎక్కువ కొనుగోలు చేయండి అని అడగలేదూ? అవును. అడిగాడు. 'సెప్టెంబర్ 11'. ఆ తేదీ నుంచి మనం ఎప్పటికీ తప్పించుకోలేం.

అనుమానాస్పద టెర్రర్ దాడుల మసక చరిత్ర

ముంబైలో ఒక భీతావహ అధ్యాయం ముగిసిపోయినప్పటికీ మరో అధ్యాయం బహుశా ఇప్పుడే మొదలై ఉంటుంది. ప్రతిరోజూ భారతీయ ఉన్నతవర్గంలోని ఒక బృందం తన శక్తికొద్దీ గొంతు చించుకొని రాజకీయ వాదులను, అందరు రాజకీయవాదులను అనాలోచితంగా తిట్టడం మొదలుపెట్టింది. పోలీసులను, సైన్యాన్ని పొగడడం మొదలుపెట్టింది. పోలీస్‌రాజ్యం వస్తే బాగుండునని అడగడం మొదలుపెట్టింది. వాళ్ల ఈ వాదనలన్నిటికీ ప్రోత్సాహకులు మాటలు అందించేవాళ్లు టి.వి. యాంకర్లు. ఆ టి.వి. యాంకర్లను చూస్తుంటే కరుడుగట్టిన అభివృద్ధి నిరోధక ఫాక్స్ న్యూస్ కూడ ఎంతో విప్లవకరంగా వామపక్ష భావాలతో ఉన్నట్టు కనబడింది.

ప్రజాస్వామ్యం (అది ఎట్లాగైనా ఉండనీ) అవకాశాల మీద విపరీతంగా బలిసిపోయినవాళ్లు ఇప్పుడు ప్రజాస్వామ్యం వద్దని, పోలీస్‌రాజ్యం కావాలని అడగడంలో ఆశ్చర్యమేమీలేదు. ప్రజాస్వామ్యం వీళ్లకు తినబెట్టే కాలం అయిపోయింది. ఇప్పుడు వాళ్లే బలం ప్రయోగించి దోచుకునే కాలం వచ్చింది. ప్రజాస్వామ్యం అనబడేది అనవసరంగా మధ్యలో అడ్డుపడుతుంది. ఇంక అది అక్కరలేదు.

'పోలీసులు మంచివాళ్లు – రాజకీయనేతలు చెడ్డవాళ్లు,' 'చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లు మంచివాళ్లు – చీఫ్ మినిస్టర్లు చెడ్డవాళ్లు', 'సైన్యం మంచిది – ప్రభుత్వం చెడ్డది', 'భారత్ మంచిది – పాకిస్తాన్ చెడ్డది' లాంటి ప్రమాదకరమైన, మూర్ఖమైన సాధారణీకరణలు టి.వి. ఛానళ్లలో విపరీతంగా ప్రవహించాయి. ఆ టి.వి. ఛానళ్లు తమ ప్రేక్షకులను ఇక ఆపడానికి వీల్లేని ఉన్మాదస్థితిలోకి రెచ్చగొట్టిపెట్టాయి.

ఇంకా విషాదం ఏమంటే ఈ మేధో అమాయకత్వంలోకి దిగజారడం సరిగ్గా భారత ప్రజానీకం ఒక వాస్తవం గ్రహిస్తున్నప్పుడే జరిగింది. ఆ వాస్తవం ఏమంటే టెర్రరిజం అనే వ్యాపారంలో బాధితులూ, నిర్వాహకులూ అప్పుడప్పుడూ తమ స్థానాలను అటూ ఇటూ మార్చుకుంటారని.

కాశ్మీర్ ప్రజానీకం గత ఇరవై సంవత్సరాల భయానక అనుభవాల ద్వారా గుర్తించిన అవగాహన అది. ఆ అవగాహన రోజురోజుకూ స్పష్టమైంది. మిగతా భారత భూభాగంలో ఆ పాఠం మనమిప్పుడు నేర్చుకుంటున్నాం. (ఒకవేళ కాశ్మీర్ ఇష్టపూర్వకంగా భారతదేశంలోకి సంలీనం కాకపోతే భారతదేశమే కాశ్మీర్‌లో సంలీనం కావడమో, విధ్వంసం కావడమో జరుగుతున్నట్లుంది.)

2001 పార్లమెంట్ దాడి తర్వాత మొట్టమొదటిసారిగా లోతైన ప్రశ్నలు లేవనెత్తడం మొదలైంది. అమాయక ప్రజలను పోలీసులూ, ప్రచార సాధనాలూ కలిసి ఎట్లా కేసుల్లో ఇరికించాయో, ఎట్లా సాక్ష్యాధారాలను అల్లడం జరిగిందో, ఎట్లా సాక్షులు అబద్ధాలు ఆడారో, పరిశోధనా, విచారణా క్రమంలో ప్రతి సందర్భంలోనూ చట్టబద్ధ క్రమం ఎంత నేరపూరితంగా ఉల్లంఘించబడిందో కొంతమంది న్యాయవాదులూ, కార్యకర్తలూ తమ ప్రచారం ద్వారా వెల్లడిచేశారు.

చిట్టచివరికి న్యాయస్థానాలు నలుగురు నిందితులలో ఇద్దరిని నిర్దోషులుగా వదిలివేయక తప్పలేదు. వారిలో ఒకరు ఎస్.ఎ.ఆర్.జిలానీ. అసలు మొత్తం చర్యకు ఆయనే వ్యూహకర్త అని పోలీసులు ఆరోపించారు. మూడో నిందితుడు షౌకత్ గురు మీద పోలీసులు ఆరోపించిన నేరాలు అన్నిటినీ న్యాయస్థానం కొట్టివేసింది. పోలీసులు ఆరోపించని సాపేక్షికంగా చిన్న నేరాలకు, కొత్త నేరాలకు ఆయనకు శిక్ష పడింది.

మరొక నిందితుడు మహ్మద్ అఫ్జల్ కు విధించిన మరణశిక్షను సుప్రీంకోర్టు ఆమోదించింది. ఆ తీర్పులో కూడా మహ్మద్ అఫ్జల్‌కు ఏదైనా టెర్రరిస్ట్ బృందంతో సంబంధం ఉన్నదనేందుకు ఏ రుజువూ లేదని సుప్రీంకోర్టు అంగీకరించింది. అయినా దిగ్భ్రాంతికరంగా 'నేరస్తుడికి మరణశిక్ష విధిస్తేనే సమాజపు సామూహిక స్ఫూర్తి సంతృప్తి చెందుతుంది' అని ప్రకటించింది.

ఇవాళ్టికి కూడా భారత పార్లమెంట్ మీద దాడి చేసిన టెర్రరిస్ట్‌లు ఎవరో, వారు ఎవరి కోసం పనిచేశారో మనకు వాస్తవంగా తెలియలేదు.

సరికొత్తగా చెప్పాలంటే ఈ సంవత్సరం సెప్టెంబర్ 19న ఢిల్లీలోని జామియా నగర్‌లో బాట్లా హౌజ్‌లో జరిగిన వివాదాస్పద ఎన్‌కౌంటర్ ఉంది. అక్కడ ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్‌కు చెందిన అధికారులు ఇద్దరు ముస్లిం విద్యార్థులను కాల్చిచంపారు. ఆ విద్యార్థులు అద్దెకు తీసుకున్న ఇంట్లో జరిగిన ఈ హత్య చాలా అనుమాస్పదమైన పరిస్థితుల్లో జరిగింది. ఆ ఇద్దరు హతులు 2008లో ఢిల్లీ, జైపూర్, అహ్మదాబాద్‌లలో జరిగిన వరుస బాంబుదాడులకు బాధ్యులని పోలీసులు ప్రకటించారు. ఈ దాడిలో మోహన్‌చంద్ శర్మ అనే అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కూడా చనిపోయాడు. పార్లమెంట్ మీద దాడి విచారణలో కీలకపాత్ర వహించిన వాడు ఆయన. దేశంలోని అనేక మంది ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌లలో ఆయన ఒకడు. ఎంతోమంది టెర్రరిస్ట్‌లను నిర్మూలించినందుకు ఎన్నో ప్రతిఫలాలు పొందినవాడు ఆయన.

ఈ సంఘటనలలో స్పెషల్ సెల్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. స్థానిక ప్రజలలోని ప్రత్యక్ష సాక్షుల దగ్గర్నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకులూ, విద్యార్థులూ, జర్నలిస్టులూ, న్యాయవాదులూ, విద్యావేత్తలూ, కార్యకర్తలూ ఎందరో ఈ సంఘటన మీద న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

దీనికి స్పందనగా భారతీయ జనతా పార్టీ ఎల్.కె.అద్వానీ మోహన్ చంద్ శర్మను సాహసయోధుడుగా అభివర్ణించాడు. పోలీసుల

నిజాయితీని ప్రశ్నించిన వారందరి మీదా ప్రచార దాడి ప్రారంభించాడు. పోలీసులను ప్రశ్నించడం ఆత్మహత్యాసదృశమని, అలా చేసేవారు దేశద్రోహులని ప్రచారం చేశారు. మొత్తంమీద ఎన్‌కౌంటర్ ఘటన పై విచారణ జరగనే లేదు.

బాట్లాహౌజ్ ఘటన తరువాత కొద్దిరోజులకే టెర్రరిస్ట్‌ల గురించి మరొక కథనం వార్తలకు ఎక్కింది. ఇర్షాద్ అలీ, మొవారిఫ్ ఖమర్ అనే ఇద్దరు అమాయక వ్యక్తులను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ డిసెంబర్ 2005లో ఎత్తుకుపోయిందని, వారిమీద రెండు కిలోల ఆర్.డి.ఎక్స్., రెండు పిస్తోళ్లు పెట్టిందని, అప్పుడు వారిని కాశ్మీర్‌లోని అల్‌బదర్ అనే టెర్రరిస్ట్ సంస్థ సభ్యులుగా ఆరోపిస్తూ అరెస్ట్ చేసిందని సెషన్స్ కోర్టుకు సమర్పించిన నివేదికలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సి.బి.ఐ.) ప్రకటించింది.

అలీ, ఖమర్ ఇద్దరూ కూడా ఏళ్ల తరబడి జైల్లో గడిపారు. వారిలాగానే తప్పుడు ఆరోపణలపై జైలుపాలై, చిత్రహింసల పాలై, కొన్ని సందర్భాలలో హత్యల పాలైన వందలాది మంది ముస్లింలకు ఈ ఇద్దరూ ఒక ఉదాహరణ మాత్రమే.

అయితే ఈ క్రమం 2008 అక్టోబర్‌లో హఠాత్తుగా మారిపోయింది. 2008 సెప్టెంబర్‌లో మాలేగాంవ్‌లో జరిగిన దాడులపై పరిశోధన చేస్తున్న మహారాష్ట్రకు చెందిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఎ.టి.ఎస్.) అక్టోబర్‌లో హిందూ సన్యాసిని సాధ్వీ ప్రజ్ఞను, స్వామీ దయానంద్ పాండేను, భారత సైన్యంలో అధికారి లెఫ్టినెంట్ కర్నల్ పురోహిత్‌ను అరెస్ట్ చేసింది. వీరందరూ హిందూ జాతీయవాద సంస్థలకు, హిందూ ఆధిపత్యాన్ని ప్రభోదించే అభినవ్ భారత్ అనే సంస్థకు చెందినవారు.

ఈ అరెస్ట్ జరిగిన వెంటనే శివసేన, భారతీయ జనతాపార్టీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మహారాష్ట్ర ఎ.టి.ఎస్. ను ఖండించాయి. ఎ.టి.ఎస్. ప్రధాన అధికారి హేమంత్ కర్‌కరే మీద దుమ్మెత్తి పోసాయి. ఆయన ఒక రాజకీయ కుట్రలో భాగస్వామి అని ఆరోపించాయి. 'హిందువులు ఎప్పటికీ టెర్రరిస్ట్‌లు కాజాలరు' అని ప్రకటించాయి.

ఎల్.కె. అద్వానీ పోలీసుల పట్ల తన విధానాన్ని మార్చుకుని రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేయడం ప్రారంభించాడు. భారీ బహిరంగ సభలలో ఎ.టి.ఎస్. మీద దుమ్మెత్తిపోసాడు. పవిత్ర సన్యాసుల మీదా, స్వాముల మీదా ఆరోపణలు చేస్తారా అని గర్జించాడు.

నవంబర్ 25న పత్రికలలో మరొక వార్త వచ్చింది. మాలేగాంవ్ పేలుళ్లలో వి.ఎచ్.పి. నేత ప్రవీణ్ తొగాడియాకు కూడా పాత్ర ఉండవచ్చునని, ఆ విషయమై ఎ.టి.ఎస్. పరిశోధన చేస్తున్నదని ఆ వార్తలు తెలిపాయి. సరిగ్గా మర్నాడే ఒక అసాధారణమైన పరిణామంలో ముంబైదాడులలో హేమంత్ కర్‌కరే కాల్చి చంపబడ్డాడు. కొత్తగా రాబోయే ప్రధానాధికారి ఎవరైనప్పటికీ మాలేగాంవ్ పరిశోధన విషయం లో రాజకీయ ఒత్తిడులను తట్టుకొని వాస్తవాలు బయటపెట్టగలడా? అనుమానమే.

పోలీసులను ప్రశ్నించడం దేశద్రోహం అవుతుందా? కాదా? ఆత్మహత్యాసదృశం అవుతుందా? కాదా? అనే అంతిమ నిర్ణయానికి రావడానికి సంఘ్ పరివార్ సంకోచిస్తూ ఉండగానే టైమ్స్ నౌ టెలివిజన్ యాంకర్ ఆర్నబ్ గోస్వామి మాత్రం ఆ నిర్ణయం తీసేసుకున్నట్టున్నాడు. పోలీసుల, సైనిక బలగాల నిజాయితీని ప్రశ్నించి వారిని తిట్టడానికీ, తూలనాడడానికీ, వెటకారం చేయడానికీ ఆయన ఉత్సాహపడుతున్నాడు.

ఆ క్రమంలో నా పేరు, ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పేరు చాలాసార్లు వచ్చింది. ఒక సందర్భంలోనైతే ఒక మాజీ పోలీస్ అధికారిని ఇంటర్వ్యూ చేస్తూ ఆర్నబ్ గోస్వామి కెమెరా వైపు తిరిగి 'అరుంధతీ రాయ్, ప్రశాంత్ భూషణ్ మీరు ఇది చూస్తూనే ఉన్నారనుకుంటాను. మీరు మాట్లాడేది చెత్త' అన్నాడు.

ఇవాళ నెలకొని ఉన్న ఉద్రేకపూరితమైన, ఆవేశభరితమైన వాతావరణంలో ఒక టి.వి. యాంకర్ ఇలా అనడం అంటే రెచ్చగొట్టడమే, బెదిరించడమే. మరొక సందర్భంలోనైతే ఒక జర్నలిస్ట్ ఇటువంటి పనిచేసినందుకు ఉద్యోగం పోగొట్టుకోవలసింది.

అంటే భారతదేశానికి ప్రధానమంత్రి కాదల్చుకున్న వ్యక్తి, చెప్పే ప్రకారమూ, ఒక ప్రధాన స్రవంతి టి.వి. ఛానల్‌కి వ్యాఖ్యాతగా ఉన్న వ్యక్తి చెప్పే ప్రకారమూ ఈ దేశ పౌరులకు తమ పోలీసులను ప్రశ్నించే హక్కులేదు.

అనుమానాస్పద టెర్రరిస్ట్ దాడులూ, తప్పుల తడక పరిశోధనలూ, బూటకపు ఎన్‌కౌంటర్లతో నిండిన చరిత్ర కలిగిన దేశంలో పోలీసులను ప్రశ్నించగూడదంటున్నారు. ప్రపంచంలోకెల్లా అతి ఎక్కువ సంఖ్యలో కస్టడీ మరణాలు జరుగుతున్న దేశంలో పోలీసులను ప్రశ్నించగూడదని అంటున్నారు. నిందితులను చిత్రహింసలు జరపగూడదనే అంతర్జాతీయ ఒడంబడిక మీద సంతకం చేయడానికి నిరాకరిస్తున్న దేశంలో పోలీసులను ప్రశ్నించగూడదని అంటున్నారు. నిజానికి ఈ దేశంలో చిత్రహింసా శిబిరాలలోకి చేరుతున్న వాళ్లు తమను తాము చాలా అదృష్టవంతులుగా భావించుకుంటున్నారు. వాళ్లు కనీసం ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌ల చేతిలో చిక్కి ఎన్‌కౌంటర్ కాకుండా బతికిపోయామను కుంటున్నారు. ఈ దేశంలో మాఫియా నేర ప్రపంచానికీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌లకూ మధ్య విభజన రేఖ లేకుండా పోయింది. ఇక్కడ పోలీసులను ప్రశ్నించగూడదంటున్నారు.

అద్దంలో రాక్షసి


ఈ మొత్తం పరిజ్ఞానంతో హృదయాలు బరువెక్కిన మాలాంటి వాళ్లం ముంబై దాడులను ఎలా చూడాలి? వాటి గురించి మేం ఏం చేయాలి?

'సెప్టెంబర్ 11' తరువాత అమెరికా గడ్డమీద మరే పెద్ద దాడి జరగలేదు గనక ఈ విషయంలో అమెరికా వ్యూహం చాలా బాగా పనిచేసిందని అనేవాళ్లు కొందరు ఉన్నారు. అయితే అమెరికా ఇప్పుడు అనుభవిస్తున్నది ఇంకా దారుణమైనదని అనేవాళ్లూ ఉన్నారు.

'సెప్టెంబర్ 11' దాడుల వెనుక ఉద్దేశ్యం అమెరికా తన నిజస్వరూపాన్ని చూపేలా చేయడమే అనేట్టయితే టెర్రరిస్ట్‌లు సాధించిన విజయం ఎంత పెద్దది! అమెరికా సైన్యం ఎప్పటికీ గెలవలేని రెండు యుద్ధాలలో మునిగిపోయింది. ప్రపంచవ్యాప్తంగా అమెరికా అతి ఎక్కువగా ద్వేషించబడే దేశం అయిపోయింది. ఆ యుద్ధాల వల్ల అమెరికన్ ఆర్థిక వ్యవస్థ గందరగోళంలో పడే స్థితి వచ్చింది. బహుశా అంతిమంగా అమెరికన్ సామ్రాజ్యమే గందరగోళంలో పడుతుందేమో ఎవరు చూడవచ్చారు!

(దాడులకూ, బాంబులకూ గురైన అఫ్ఘనిస్తానే సోవియట్

జ్వాలాముఖి



ప్రముఖ ప్రజాసాహితీ ఉద్యమ నాయకుడు, కవి, రచయిత, దిగంబర కవులలో ఒకరైన జాల్వాముఖి (78) డిసెంబర్ 14న హైదరాబాద్ లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో చికిత్సపొందుతూ మరణించారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాస్వామ్య హక్కులు, గ్రామీణపేదలు, కార్మికులు, మేధావులు, ఉపాధ్యాయులు, విద్యార్థి ఉద్యమాలతో మమేకమై పనిచేశారు. విప్లవ స్ఫూర్తినిచ్చే వక్తగా రాష్ట్ర ప్రజలందరికీ చిరపరిచితులు. 1938 ఏప్రిల్ 12న నర్సింహాచార్యులు, వెంకట లక్ష్మీనర్సమ్మ దంపతులకు జన్మించిన ఆకారం వీరవెల్లి రాఘవాచార్యుల విద్యాభ్యాసమంతా హైదరాబాద్‌లోనే జరిగింది. హేతువాద ఉద్యమాల్లో, కులనిర్మూలన పోరాటాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. భారత – చైనా మిత్రమండలిలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ కమిటీ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. రెండుసార్లు చైనా పర్యటించారు. 1965–70ల మధ్య వెల్లువెత్తిన దిగంబర కవితా ఉద్యమానికి ఎనలేని కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం వచ్చిన మొదటి సాహితీ ఉద్యమం అది. మూడు కవితా సంకలనాలను దిగంబర కవులు ఈ కాలంలో వెలువరించారు. మొదటి సంపుటి 1965 మే 6న అర్ధరాత్రి రిక్షాకార్మికునితో, రెండవ సంపుటి 1966 డిసెంబర్ 18న అర్ధరాత్రి విజయవాడలో మోటర్ క్లీనర్‌తో, మూడో సంపుటి 1968 సెప్టెంబర్ 14 అర్ధరాత్రి బిచ్చగత్తెతో ఆవిష్కరింప జేశారు. 1970లో విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావంలో ముఖ్యభూమిక పోషించారు. 1971లో విరసం సభ్యుడిగా తమ ఉపన్యాసాలూ, రచనలతో రెచ్చగొడుతున్నారని ప్రభుత్వం నిఖిలేశ్వర్, చెరబండరాజులతో పాటు జ్వాలాముఖిపై పి.డి.యాక్ట్ కింద కేసులు నమోదుచేసి యాభైరెండు రోజులు జైల్లో నిర్బంధించింది. ఎమర్జెన్సీ కాలంలో జ్వాలాముఖి పదిహేను రోజులపాటు జైల్లో గడిపారు. వీ

యూనియన్‌కు సమాధి అయినట్టుగా అమెరికన్ సామ్రాజ్యానికి కూడా అదే ముగింపు పలకనుందా?)

ఇరాక్‌లోనూ, అఫ్ఘనిస్తాన్‌లోనూ వేలాది అమెరికన్ సైనికులతో సహా లక్షలాది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. 'సెప్టెంబర్ 11' తరువాత భారతదేశంతో సహా అమెరికా స్నేహితుల, ఏజెంట్ల మీదా, ప్రపంచంలోని అమెరికా ప్రయోజనాల మీదా టెర్రరిస్ట్ దాడుల సంఘటనలు ఎన్నో రెట్లు ఎక్కువ పెరిగిపోయాయి.

'సెప్టెంబర్ 11'కు అమెరికా ప్రతిస్పందనకు నాయకత్వం వహించిన జార్జ్ డబ్ల్యు బుష్ అనే మనిషి ఇవాళ ప్రపంచవ్యాప్తంగా మాత్రమే కాదు, తన దేశ ప్రజలచేత కూడా అతి ఎక్కువగా అసహ్యించుకోబడుతున్న వ్యక్తి.

టెర్రరిజం మీద యుద్ధంలో అమెరికా గెలుస్తున్నదని ఏ ఒక్కరైనా అనగలరా?

హోంల్యాండ్ సెక్యూరిటీ అనే రక్షణ ఏర్పాట్లు అమెరికన్ ప్రభుత్వానికి వందల కోట్ల డాలర్ల ఖర్చుకు దారితీశాయి. ప్రపంచంలోని అతి తక్కువ దేశాలు అటువంటి ఖర్చు పెట్టగలవు. భారతదేశం కచ్చితంగా అటువంటి ఖర్చు పెట్టలేదు. ఒకవేళ మనం ఆ ఖర్చు పెట్టగలిగినా అమెరికా సాగించినట్లుగా ఈ మన విశాల దేశం మొత్తాన్ని పోలీసుల రక్షణ వలయంలో పెట్టడం అసాధ్యం. మన మాతృభూమి అటువంటి హోంల్యాండ్ కాదు.

మనకు ఒక అణ్వాయుధాలు గల శత్రుపూరితమైన పొరుగుదేశం ఉన్నది. అది క్రమక్రమంగా పట్టుతప్పిపోతున్నది. మనకు కాశ్మీర్ అనే ఒక రాష్ట్రంలో సైనిక జోక్యం ఉన్నది. మనకు సిగ్గుతో తలవంచుకొనే విధంగా నిరాదరణకు గురి అవుతున్న, దారిద్ర్యంలో మునిగిన పదిహేను కోట్ల ముస్లిం మైనారిటీ సమూహం ఉన్నది. ఆ సమూహం నానాటికీ గత్యంతరం లేని గోడకు నెట్టబడుతూ ఉన్నది. ఆ సమూహపు యువతరానికి కనుచూపు మేరలో న్యాయం దక్కుతుందనే ఆశ కనబడడం లేదు. వాళ్లే గనక ఆశను పూర్తిగా కోల్పోతే, విప్లవ భావాలు అలవరచుకుంటే ఆ ప్రమాదం ఒక్క భారత దేశానికి మాత్రమే కాదు. యావత్ ప్రపంచానికి.

పదిమంది యువకులు ఎన్.ఎస్.జి. కమాండోలనూ, పోలీసులనూ మూడురోజుల పాటు నిలువరించి పోరాడగలిగితే, కాశ్మీర్ లోయను మొత్తంగా ఐదు లక్షల మంది సైనికులు అణచి ఉంచగలిగితే, లెక్కలు వేయండి. ఎటువంటి హోంల్యాండ్ సెక్యూరిటీ భారతదేశాన్ని సురక్షితంగా ఉంచగలదు?

ఆ మాటకు వస్తే ఇంకే తాత్కాలిక చర్యా ఆ పని చేయజాలదు.

టెర్రరిజం వ్యతిరేక చట్టాలు టెర్రరిస్ట్‌లను ఉద్దేశించినవి కావు. అవి కేవలం ప్రభుత్వాలకు ఇష్టంలేని ప్రజలమీద ఉపయోగించడానికి మాత్రమే. అందువల్లనే ఆ చట్టాల కింద రెండు శాతం నిందితులకు కూడా శిక్షలు పడడంలేదు. తమకు అసౌకర్యమైన వ్యక్తులను బెయిల్ లేకుండా, సుదీర్ఘకాలం నిర్బంధించి, చివరికి వదిలివేసే సాధనంగా మాత్రమే ప్రభుత్వాలు ఆ చట్టాలను వాడుకుంటున్నాయి.

కాని ముంబైలో దాడిచేసిన టెర్రరిస్ట్‌లు తమను అరెస్ట్ చేసి బెయిల్ నిరాకరించి, జైల్లో పెడతారనో, మరణశిక్ష విధిస్తారనో భయపడి ఆగిపోయే వాళ్లు కారు. తమకు మరణం రావాలనే వాళ్ల కోరిక.

నిజానికి ఇవాళ మనం అనుభవిస్తున్నది ఒక ప్రతిచర్య. దశాబ్దాల పాటు మనం చేసిన అతుకుల, మాట్ల, తప్పుడు పనుల పేరుకుపోయిన ఫలితం ఇవాళ మనం అనుభవిస్తున్నది. మన కాళ్ల కింద తివాచీ జారిపోతున్నది.

టెర్రరిజాన్ని ఆపివేయగలుగుతామనుకోవడం అమాయకత్వం. దాన్ని తగ్గించడానికి ఏకైక మార్గం అద్దంలోని రాక్షసిని చూడడమే. దారిమీద ఒక మలుపు దగ్గర నిలబడి ఉన్నాం మనం. ఒకవంక న్యాయం అని చూపుతోంది. మరోవంక అంతర్యుద్ధం అని చూపుతోంది. మూడోదారి లేదు. వెనక్కిపోలేం. మీరే నిర్ణయించుకోండి.

(ఔట్‌లుక్ వారపత్రిక సౌజన్యంతో) వీ

సింగూరులో ప్రతిపాదించిన చిన్న కార్ల కర్మాగారాన్ని బెంగాల్ నుంచి తరలించుకుపోయిన సందర్భంగా టాటాల గురించీ, సిపిఎం గురించీ విశ్లేషిస్తున్నారు **డి. బంద్యోపాధ్యాయ**

టాటాగారూ, బిల్లు కట్టి కదలండి!

(డా.డి. బంద్యోపాధ్యాయ పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంలో మూడు దశాబ్దాలపాటు అనేక పదవులు నిర్వహించారు. భూసంస్కరణల కమిషనర్‌గా సుప్రసిద్ధులయ్యారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిత్వ శాఖలోనూ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోనూ కార్యదర్శిగా పనిచేశారు. మనీలాలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు.)

కలకత్తాలో 2008 అక్టోబర్ 3న ఏర్పాటు చేసిన ఒక పత్రికా సమావేశంలో రతన్ టాటా పశ్చిమ బెంగాల్ నుంచి నానో కార్ల ప్రాజెక్ట్‌ను తరలించబోతున్న నిర్ణయాన్ని ప్రకటించాడు. ఈ తరలింపు నిర్ణయానికి పూర్తి బాధ్యత తృణమూల్ కాంగ్రెస్ నాయకత్వాన నడిచిన ఆందోళనదేనని ఆయన ఆరోపించాడు. ఈ పత్రికా సమావేశానికి ముందు రెండు గంటల పాటు ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రితో ఆంతరంగిక చర్చలు జరిపి వచ్చాడు గనుక ఆయన ప్రకటనపై ఆ చర్చల ప్రభావం కూడా ఉండి ఉంటుంది. ఆ పత్రికా సమావేశంలో ఆయన అనవసరమైన ద్వేష భావంతో ఉద్రేకంగా మాట్లాడాడు.

పశ్చిమ బెంగాల్‌లోని ప్రజా ఆందోళనల స్వభావం గురించీ, లక్షణాల గురించీ, గత చరిత్ర గురించీ అవగాహన లేనందుకు టాటాను ఎవరూ తప్పుపట్టనక్కరలేదు. గత శతాబ్దపు నలభైల చివరిలో పాత, కలుషితం కాని భారత కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వాన నడిచిన తెభాగా ఉద్యమంలోని ప్రధాన కేంద్రాలలో సింగూర్ కూడ ఒకటి. ఆ ఉదంతం గురించి మాణిక్ బందోపాధ్యాయ 'చోటా బకుల్‌పూర్ ప్రయాణం' అనే సుప్రసిద్ధ కథ రాశాడు. ఆ కథా స్థలం సింగూర్‌లోని బడాకమలాపూర్. ఈ దేశ సాధారణ ప్రజల నుంచి పూర్తిగా పరాయి అయిపోయిన ఒక ఉన్నతజాతి బూర్జువాకు ఈ నేలమీద బతుకు కోసమూ, జీవనోపాధి కోసమూ, తమ మౌలిక హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగానూ జరిగిన విస్తృత ప్రజాఉద్యమం గురించి ఎంత మాత్రం తెలిసి ఉండే అవకాశం లేదు. అందుకు ఆయననేమీ తప్పు పట్టనక్కరలేదు.

ఇంతకూ టాటాలకు తమ సంపదంతా పోగుపడినది 19వ శతాబ్దంలో చైనాలో చేసిన నల్లమందు వ్యాపారం నుంచి. అప్పుడు ఈస్ట్ ఇండియా కంపెనీ, దాని వ్యాపార భాగస్వాములు భారతదేశం నుంచి చైనాకు నల్లమందు అక్రమంగా రవాణా చేస్తూ వచ్చారు. ఆ భాగస్వాములలో టాటాలు ఒకరు. అప్పటి చైనా ప్రభుత్వం ఈ నల్లమందు దిగుమతిని తీవ్రంగా వ్యతిరేకించింది. చైనా ప్రభుత్వం మీద బ్రిటిష్ పాలకులు యుద్ధం నడిపారు. మొదటి నల్లమందు యుద్ధం అని పేరుగాంచిన ఆ యుద్ధం 1839 నుంచి 1842దాకా సాగింది. 1842లో చైనా ఓడిపోయి, నాన్‌జింగ్ ఒప్పందం మీద సంతకం పెట్టవలసి వచ్చింది. ఆ ఒప్పందం చైనాకు వ్యతిరేకంగా, బ్రిటిషర్లకు అనుకూలంగా అత్యంత అవమానకరమైన, ప్రతికూలమైన షరతులతో కూడి ఉంది. ఆ తర్వాత 1856 – 60 మధ్య రెండో నల్లమందు యుద్ధం జరిగింది. బ్రిటిష్ వాళ్లు మళ్లీ గెలిచారు. చైనాలో అక్రమ నల్లమందు వ్యాపారాన్ని బలప్రయోగంతో చట్టబద్ధం చేశారు. చైనాలోని ఈ నిషిద్ధ వస్తువును అమ్ముతూ టాటాలూ, మరికొందరు భారతీయ వ్యాపారస్తులూ ఇబ్బడిముబ్బడిగా లాభాలు సంపాదించారు. సంపద పోగేయడం ఎప్పుడైనా అహంకారానికి దారితీస్తుంది. అందువల్ల పత్రికా సమావేశంలో మమతా బెనర్జీని పేరుపెట్టి నిందించడంలో టాటా ప్రదర్శించిన అనాగరిక ప్రవర్తనను మనం అర్థం చేసుకోవచ్చు. సింగూర్‌లో భూమి కోల్పోయిన వాళ్ల పట్ల ఆయన ఎటువంటి సానుభూతినీ, దయనూ చూపలేదు. మరొకపక్క ఇటీవలనే ఆయన అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయానికి ఐదు కోట్ల డాలర్ల విరాళం ఇచ్చాడని పత్రికల్లో వార్తలొచ్చాయి.

టాటా సంగతి సరే, మరి భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) సంగతేమిటి? పీడితులకు ప్రాతినిధ్యం వహించడానికి తమకే గుత్తాధిపత్య హక్కుందని, అది రాజపత్రం ద్వారా తమకు సంక్రమించిందని వాళ్లనడం వింటూ ఉంటాం కదా. ఆ పీడితులు ఎల్లవేళలా పీడకులకు వ్యతిరేకంగా నిలిచి ఉంటారనీ, నిరంతరం పోరాడుతూ ఉంటారనీ వింటూ ఉంటాం కదా. ఆ పోరాటం ప్రతిసందర్భంలోనూ సమాజాన్ని మొత్తంగా ఒక విప్లవాత్మక పునర్వ్యవస్థీకరణ వైపు లేదా ప్రత్యర్థి వర్గాల ఉమ్మడి వినాశం వైపో దారితీస్తుందని వింటూ ఉంటాం కదా. కాని, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య రెండు రోజుల తర్వాత అక్టోబర్ 5న రాజర్‌హట్ లో ఒక ప్రత్యేక ఆర్థిక మండలాన్ని ప్రారంభిస్తూ తాను ఈ ఘర్షణలో ఓడిపోయానని, కాని యుద్ధంలో ఓడిపోనని అన్నాడు. ఇక్కడ ఒక ప్రశ్న సహజంగా తలెత్తుతుంది. ఆయన యుద్ధం ఎవరి కోసం చేస్తున్నాడు? ప్రత్యేక ఆర్థిక మండలాల ఆర్థిక దుష్ఫలితాల గురించి వివరిస్తూ ప్రొ. అమిత్ బాదురి ఒకచోట ఏమన్నారంటే 'ఆర్థికాభివృద్ధికి చిహ్నాలనబడే ప్రత్యేక ఆర్థిక మండలాల కొరకు గ్రామీణ ప్రాంతాలలోని

విశాల జనబాహుళ్యాన్ని భూమినుంచీ, ఉపాధి నుంచీ, ఇళ్ల నుంచీ, ఆదాయాల నుంచీ, మూలాల నుంచీ వెళ్లగొడితే ఇవాళ మేలు చేసే దేవతగా కనబడుతున్న ఈ దయ్యం త్వరలోనే బయటపడుతుంది.' కనుక ముఖ్యమంత్రి గారూ మీరూ, మీ పార్టీ ఏ వర్గంతో కలిసి ఉన్నారో ఇంతస్పష్టంగా బయటపెట్టుకున్నందుకు మీ సాహసానికి మెచ్చుకోవాలి. మీరు చాలా బహిరంగంగా పీడకుల పక్షాన నిలిచి పీడితుల మీద యుద్ధం చేస్తున్నామని ప్రకటించారు. ఈ యుద్ధం గుత్తపెట్టుబడికి అనుకూలంగా సమాజానికి పునర్వ్యవస్థీకరించాలని కోరుకుంటున్నారు. ఈ లక్ష్యాన్ని సాధిస్తే సి.పి.ఐ. (ఎం) తన చారిత్రక కర్తవ్యాన్ని నెరవేర్చినట్టే. కర్తవ్యం ఏమంటే కార్మికులనూ, రైతులనూ సంపూర్ణంగా లొంగదీసి, నిర్మూలించి ప్రపంచాన్ని బూర్జువాలకు సురక్షితంగా మార్చడం. బహుశా 'డబ్బేమైనా చేస్తుంది' అనే సామెతను మీరు రుజువు చేయదలచు కున్నట్టున్నారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం జూలై 2006లో పదమూడు ఉత్తర్వులను ప్రకటించింది. ఆ ఉత్తర్వులన్నీ 1894 భూసేకరణా చట్టంలోని సెక్షన్ 4 కింద వెలువడ్డాయి. ఆ ఉత్తర్వుల ప్రకారం సింగూర్‌లో దుర్గాపూర్ ఎక్స్‌ప్రెస్ హైవే ను ఆనుకొని ఉండే ఐదు మౌజాలలో వెయ్యి ఎకరాలను స్వాధీనం చేసుకోవడానికి ఉద్దేశించినవి. ఆ పదమూడు ఉత్తర్వులూ అన్నిటికన్నీ ఒకే ఉమ్మడి లక్ష్యంతో వెలువడ్డాయి. ఆ లక్ష్యం ఏమంటే ఉత్తర్వు కింద షెడ్యూల్డ్‌లో పేర్కొన్న భూమిని ప్రభుత్వం గానీ, ప్రభుత్వ సంస్థ గానీ, అభివృద్ధి అధికారులు గానీ ప్రజాధనంతో ఒక ప్రజా ప్రయోజనం కొరకు స్వాధీనం చేసుకోబోతున్నారు. ఆ ప్రజా ప్రయోజనం టాటా చిన్న కార్ల ప్రాజెక్టును ఆ ప్రాంతంలో నెలకొల్పడం ద్వారా ఉద్యోగ కల్పన సాగించడమూ, సామాజిక ఆర్థిక అభివృద్ధిని సాధించడం.

కాని భూసేకరణ చట్టంలోని ఏడో అధ్యాయంలో నిర్దేశించిన పద్ధతి ప్రకారం తప్ప ఒక ప్రభుత్వానికి భూమిని ఆక్రమించడానికీ, అందులోను ఒక ప్రైవేట్ కంపెనీకి అప్పగించడానికి వీలులేదు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని కప్పిపుచ్చడానికి బహిరంగ మోసానికి పాల్పడింది. ఆ భూమిని అది ప్రైవేట్ కంపెనీ కొరకు కాక పశ్చిమ బెంగాల్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ అనే ప్రభుత్వ కంపెనీ కొరకు సేకరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ కంపెనీ భూమిని మళ్లీ టాటా మోటర్స్ లిమిటెడ్‌కు అద్దెకిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సాగించిన ఈ గారడీ వల్ల టాటాలు ఒక్క పైసాకూడా చెల్లించకుండా 643 ఎకరాల భూమిని లీజుకు పొందగలిగారు. అయినా ఒక్క అడ్డంకి ఉందికదా? చట్టం నిర్దేశించిన ప్రకారం ఇలా భూమిని 'ప్రజా ప్రయోజనం' కొరకు మాత్రమే సేకరించాలి. అదే చట్టంలోని సెక్షన్ 3(ఎఫ్) 'ప్రజాప్రయోజనం' అంటే ఏమిటో నిర్వచిస్తుంది. ఆ నిబంధన నిర్వచనంలో ఎనిమిది రకాల పనులు ఉన్నాయి. అయితే ఈ నిర్వచనానికి ఉన్న ఒక మినహాయింపు చాలా ముఖ్యమైనది. 'కంపెనీలకోసం భూమిని సేకరించడం ప్రజా ప్రయోజనం కాదు' అని ఆ మినహాయింపు చెపుతుంది. అంటే టాటా మోటర్స్ లిమిటెడ్ కోసం భూసేకరణ జరపడం నూటికి నూరుపాళ్లు చట్ట విరుద్ధం. ఈ సమస్య ఇప్పుడు సుప్రీంకోర్టు ముందు ఉంది. ప్రభుత్వం ప్రజల ఆస్తిని స్వాధీనం చేసుకునేటప్పుడు ప్రజాప్రయోజనం అనేది చాలా ముఖ్యం. అందువల్లనే పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం మోసపూరితంగా ఈ చిన్నకార్ల కార్ఖానా వల్ల ఉద్యోగ కల్పన జరుగుతుందనీ, ఆ ప్రాంతపు సామాజిక, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని అంటే పరోక్ష ప్రజాప్రయోజనం ఉంటుందని నమ్మబలికింది. కాని ఈ నిర్ధారణకు ఆధారమేమీలేదు. మొట్టమొదట ఆ కార్ఖానాలో ఎన్ని ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పిస్తారో ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. రెండు, ఎంతమంది భూమి కోల్పోయిన వారికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు దక్కుతాయో ఎక్కడా చెప్పలేదు. మూడు, ఆర్థికాభివృద్ధి క్రమం మొదలవుతుందనీ దాని వల్ల సౌభాగ్యం పెరుగుతుందనీ చెప్పే వాగ్దానం పైనుంచి కిందికి సంపద ప్రవహిస్తుందనే పాత కాలం చెల్లిన పనికిమాలిన సిద్ధాంతాన్ని పునరుద్ఘాటించడమే. అంటే మొత్తం మీద ఇదంతా ఒక అబద్ధాల పురాణం. ఈ అబద్ధాలను అంగీకరించకపోయినప్పటికీ వాదన కోసం ఒక నిమిషానికి వాటిని ఒప్పుకుందాం. ఈ మొత్తం సిద్ధాంతానికి పునాది అయిన విషయం టాటా మోటర్స్ లిమిటెడ్ అనేది అక్కడ ఒక చిన్న కార్ల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పుతుందనేది. మరి ఇప్పుడు వాళ్లు దాన్ని అక్కడ పెట్టకుండా పశ్చిమ బెంగాల్ నుంచి మరో ప్రాంతానికి తరలించుకు పోదామనే నిర్ణయం ప్రకటించిన తరువాత మొత్తం సిద్ధాంతమే కుప్పకూలిపోయిందన్నమాట. ఇప్పుడిక చిన్న కార్ల కర్మాగారం లేదు, ఉద్యోగ కల్పనా లేదు, ఆప్రాంతపు సామాజిక ఆర్థిక అభివృద్ధీ లేదు. చివరకు 'ప్రజా ప్రయోజనం' అనేగే లేదు. అందువల్ల ఈ లేని కర్మాగారం కొరకు వ్యయం చేసిన ప్రజా ధనమంతా సంపూర్ణంగా వృథా అయిందన్నమాట. అంటే నిష్కారణంగా ఖర్చయిందన్నమాట. అటువంటి ఖర్చు చేసిన వారిమీద క్రిమినల్ చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

ఈ వ్యవహారానికి చాలా లోతైన, తీవ్రమైన పరిణామాలు ఉంటాయి. బలప్రయోగం ద్వారా వెయ్యి ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడానికి జరిగిన మొత్తం ప్రయత్నం, ఒక లేని పథకం కొరకు మౌలిక సౌకర్యాలు కల్పించిన తీరు, ఉచిత విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా, రెండు సంవత్సరాల పాటు ఇరవైనాలుగు గంటలూ సాగిన పోలీసు రక్షణ, ఈ స్థలం చుట్టూ 18.75 కిలోమీటర్ల పొడవున ఎనిమిది అడుగుల ఎత్తున నిర్మించిన సరిహద్దు గోడ, ఆ గోడమీద నిరంతరం కాపలాదారులు ఉండే బురుజు – ఇవన్నీ వ్యర్థంగా జరిగాయన్నమాట. వీటన్నిటికీ ఖర్చు ఎవరు భరించాలి? ప్రజాప్రయోజనం కొరకే ఇవన్నీ జరిగాయనే తప్పుడు వాదనలు వక్రమైన వాదనలు ఉన్నప్పటికీ ఇంత విస్తృత ప్రజాధనం ఖర్చైనప్పుడు కనీసమైన సమర్థన ఏమైనా ఉండాలి. ఇప్పుడుకి టాటాలు ఉపసంహరించుకున్నారు గనుక ఈ ఖర్చుకి అర్థమే లేదు. ఈ ఖర్చుకి బాధ్యులైన వారిమీద చర్యలు తప్పవు.

సింగూర్ నుంచి టాటాలు తన ఇష్టపూర్వకంగానే ఉపసంహరించుకున్నారు. అందువల్ల ఈ మొత్తం ఖర్చును వాళ్లే భరించవలసి ఉంటుంది. తార్కికంగా అది సరయినదే. అంతమాత్రమే కాదు. నైతికంగా కూడా అదే సరైనది. నిజం చెప్పాలంటే సింగూర్ నుంచి వెళ్లిపోవాలని టాటాలు తీసుకున్న ఈ అర్థాంతర నిర్ణయంవల్ల ప్రజా ఖజానాకు ఎంత ఖర్చయిందో భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సవివరణమైన లెక్కలు కట్టాలి. పశ్చిమబెంగాల్

పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పారిశ్రామికశాఖ, పశ్చిమబెంగాల్ గృహవసతి అభివృద్ధి సంస్థ, భంగోర్ రాజర్‌హాట్ ప్రాంతీయ అభివృద్ధి సంస్థ, రాష్ట్ర పోలీస్ శాఖ పెట్టిన ఈ ఖర్చుల లెక్కలను కాగ్ తేల్చి చెప్పవలసి ఉంటుంది.

అంతేకాదు, ప్రజాధనాన్ని ఇలా ఉద్దేశ్యపూర్వకంగా దుర్వినియోగం చేసిందెవరో కాగ్ బాధ్యత కూడా నిర్ణయించవలసి ఉంటుంది. ఇదంతా చేయడానికి ఎక్కువ సమయమే పట్టవచ్చు అయినా ప్రభుత్వాల జవాబుదారీతనానికీ, పారదర్శకతకూ, సత్‌పరిపాలనకూ అటువంటి చర్య అత్యవసరం.

ఈలోగా ఇక్కడ టాటాలకు ఒక తాత్కాలిక బిల్లు లెక్క కట్టడానికి ప్రయత్నం చేస్తున్నాను. ఈ వ్యవహారం గురించి పత్రికలలో వచ్చిన వివరాలలోని వాస్తవాలనూ, అంకెలనూ ఆధారం చేసుకొని ఈ బిల్లు లెక్కకడుతున్నాను. సింగూర్‌లో తాము సాగించిన అవక తవక పనికి టాటాలు విపరీతమైన ప్రజాధన దుర్వినియోగం చేశారు. కావాలంటే కాగ్ తుదినివేదిక వచ్చిన తరువాత ఇప్పుడు నేను తయారు చేస్తున్న తాత్కాలిక బిల్లును సవరించవచ్చు. కాని, తాము ఎంత చెల్లించవలసి ఉన్నదో టాటాలకు ఒక సూచనైనా ఇవ్వడం మంచిది కదా.

మొట్టమొదట పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం మోసం చేయకపోయి ఉంటే 1894 భూసేకరణ చట్టం అధ్యాయం 7 ప్రకారం స్వాదీనం చేసుకున్న భూమికంతా టాటాలు ఖరీదు కట్టి ఇవ్వవలసి ఉండేది. ఇప్పుడిక ప్రజాప్రయోజనం అనే సాకుకూడా లేదు గనక రాష్ట్ర ప్రభుత్వానికి టాటాలు రెండువందల కోట్ల రూపాయలు తిరిగి ఇవ్వవలసి ఉంటుంది. అంతే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ జరిపినప్పుడు నష్టపరిహారంగా ఇచ్చింది.

రెండవది, స్వాధీనం చేసుకున్న ఆస్తి చుట్టూ కంచెగా ఒక 18.75 కిలోమీటర్ల సరిహద్దు గోడను పశ్చిమ బెంగాల్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థో మరొక ప్రభుత్వం సంస్థో నిర్మించాయి. ఆ గోడ నిర్మాణంలో ఏమి వాడారో మనకు కచ్చితంగా తెలియదు. కాని స్థానికులు చెప్పే ప్రకారం అది ఎనిమిది అడుగులు ఎత్తుందని, దానికి భూమిలో రెండు అడుగుల లోతు పునాది తవ్వారని తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ప్రజా పన్నుల శాఖలోని ఏ క్లాస్ కాంట్రాక్టర్లు కొందరు వేసిన అంచనా ప్రకారం ఇటువంటి గోడను, మధ్య మధ్య స్తంభాలను నిర్మించడానికి ఒక మీటర్‌కు రు. 275 ఖర్చు అవుతుంది. అంటే ఈ మొత్తం గోడ నిర్మాణానికి తక్కువలో తక్కువ రు. 51.56 లక్షలు ఖర్చయి ఉంటుంది. ఈ గోడలో మొత్తం మీద ఐదు పెద్ద గేట్లు కూడా బిగించారు గనుక వాటి ఖరీదు కూడా దీనికి కలపవలసి ఉంటుంది. ఆ ఐదు గేట్లకు తక్కువలో తక్కువ రు. 25 లక్షలు అయి ఉంటుంది. అంటే గోడా, గేట్లూ కలిపి అయిన మొత్తం ఖర్చు రు. 76.56 లక్షలు.

మూడవది, ఈ భూమిని సేకరిస్తున్నప్పుడూ, సేకరించి టాటాలకు లీజుకు ఇచ్చిన తరువాత కూడా ప్రభుత్వం ఇరవైనాలుగు గంటల పోలీస్ రక్షణ కల్పించింది. గత రెండు సంవత్సరాలకుపైగా టాటా మోటర్స్ లిమిటెడ్‌కు చెందిన ఆస్తిని కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండువేల మంది పోలీసులను పగలు రాత్రీ కేటాయించిందని పత్రికా వార్తలు చెపుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం వైపునుంచి ఎటువంటి ప్రకటనా లేదు. ఎ.ఎస్.ఐ. లు ఎస్.ఐ.లతో సహా ఒక బెటాలియన్ (వెయ్యిమంది) పోలీసులను నియమించడానికి ఎంత ఖర్చు అవుతుందో పశ్చిమబెంగాల్ పోలీసు డైరెక్టరేట్ వేసిన అంచనాలు ఉన్నాయి. ఈ అంచనాలల్లో కూడా ఇన్‌స్పెక్టర్ లేదా ఆ పై స్థాయి అధికారుల జీతాలను కలపడం లేదు. ఆ లెక్క ప్రకారం నెలకు జీతాల మీద వ్యయమే రు.80.70 లక్షలు. ఇది మొత్తం వాస్తవ వ్యయంలో 83.01 శాతం మాత్రమేనని పోలీసు శాఖ చెపుతోంది. ఇంకా దీనికి కూడా యూనిఫారాలూ, బూట్లూ, కనీస పరికరాలకూ అయ్యే ఖర్చును కలపాలి. అది 16,51,100 రూపాయలు. అది మొత్తం నెలసరి వ్యయంలో 16.99 శాతం. ఈ మొత్తాన్ని కలిపితే నెలసరి వ్యయం 97,21,800 రూపాయలు. ఇంకా ఈ అంకెలో వాహనాల మీద అయ్యే ఖర్చూ, ఇంధనానికి అయ్యే ఖర్చూ, భారీ పరికరాలకు అయ్యే ఖర్చు కలపలేదు. అవి లేకుండా పోలీసులు పనిచెయ్యలేరని అందరికీ తెలుసు. అవి లేకపోయినా ఒక బెటాలియన్ పోలీసులను నియమించినప్పుడు అయ్యే వార్షిక వ్యయం రు.11.67 కోట్లు. టాటా ఆస్తులను రక్షించడానికి రెండు బెటాలియన్లను నియమించారు గనుక ఆ ఖర్చు. రు. 23.33 కోట్లు అవుతుంది. రెండు సంవత్సరాలకు రు.46.66 కోట్లు అవుతుంది. ఇంతకూ ఇది మౌలిక జీత భత్యాల భాగం మాత్రమే. వాస్తవ వ్యయం ఇంకా ఎక్కువ ఉంటుంది.

నాలుగవది, టాటాలకు ఆర్థిక లాభం చేకూర్చడానికి పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం మరొక మోసపూరిత చర్యకు దిగింది. రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పారిశ్రామిక శాఖకు చెందిన ప్రిన్సిపల్ కార్యదర్శి 12.10.2006న పశ్చిమబెంగాల్ గృహవసతి అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఒక ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో :

'పశ్చిమబెంగాల్‌కు పెట్టుబడులను (అంటే నానో కర్మాగారానికి) ఆకర్షించడంలో మనం ఇతర రాష్ట్రాల నుంచి గట్టి పోటీని ఎదుర్కోవలసి వస్తుంది. ఉదాహరణకు ఉత్తరాంచల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దుచేస్తోంది. లక్ష రూపాయల ఖరీదు ఉండే కారు ధరలో పదహారు శాతం ఎక్సైజ్ సుంకం రద్దుకావడమంటే చాలా తేడా పడుతుంది. అందువల్ల టాటా మోటర్స్ లిమిటెడ్ పెట్టుబడులకు ఆకర్షణ ఉండాలంటే మన రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనలో మరింత ఎక్కువ సహకారాన్ని అందించవలసి ఉంటుంది.

అందువల్ల టాటా హౌసింగ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ అనే సంస్థ పశ్చిమబెంగాల్ పారిశ్రామికాభివృద్ధి సంస్థతో కలిసి ఒక సంయుక్త రంగ కంపెనీని నెలకొల్పుతాయి. ఈ కొత్త కంపెనీకీ ఐదు వందల ఎకరాల భూమిని భంగోర్, రాజర్‌హాట్ అభివృద్ధి సంస్థ తక్కువ ఖరీదుకు అందజేస్తుంది. దానితో పాటు రాజర్‌హాట్ కొత్త నగరంలో చాలావిలువైన యాభై ఎకరాల భూమిని కూడా ఈ సంయుక్తరంగ కంపెనీకి అందజేస్తుంది. ఆ ఉత్తరంలో చాలా స్పష్టంగా ఇరవై ఎకరాల భూమిని వాణిజ్య అవసరాల కొరకు, ముప్పై ఎకరాల భూమిని గృహనిర్మాణ అవసరాలకు ఇవ్వాలని పేర్కొన్నారు. అప్పటికీ ఆ పట్టణంలో అమలౌతున్న ధరలలో సగం ధరకు ఆ భూమి ఇవ్వాలని నిర్దేశించారు. అంతేకాదు, ఆ ఉత్తరం ఇంకా ముందుకు వెళ్లి ఈ భూముల అమ్మకాలలో

పశ్చిమ బెంగాల్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ సాధించే లాభాలను టాటా మోటర్స్ లిమిటెడ్ ప్రాజెక్ట్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం వినియోగించించాలనీ దానికోసం బడ్జెట్‌వైపు ఎదురుచూడకూడదని కూడా పేర్కొన్నారు. నిజానికి టాటామోటర్స్ లిమిటెడ్‌కు సబ్సిడీ ఇచ్చే అసలు ఉద్దేశాన్ని దాచడానికే ఉద్దేశ పూర్వకంగా 'మౌలిక సదుపాయాల కల్పన' అనే మాట వాడుతూ వచ్చారు. ఈ విధంగా వాణిజ్య, పారిశ్రామిక శాఖ ఇచ్చిన ఆదేశం ఎన్నో చట్టాలను తుంగలో తొక్కింది. నైతికంగా ఎంతమాత్రం సమర్థించడానికి వీలులేనిది. అయితే ఆ విషయాలలోకి ఇక్కడ పోవడంలేదు.

ఒక్క కలం పోటుతో గృహవసతుల అభివృద్ధి సంస్థ ఇరవై ఎకరాల వాణిజ్య భూమిమీద రు. 60 కోట్లను, ముప్ఫై ఎకరాల గృహవసతి భూమిమీద రు. 75 కోట్లను నష్టపోయింది. అంటే మొత్తం నష్టం రు. 135 కోట్లు.

ఇక ఐదు వందల ఎకరాల భంగోర్, రాజర్‌హర్ అభివృద్ధి సంస్థ భూమి ఉంది. ఇక్కడ కచ్చితమైన అంకెలు లేవుగాని కొన్ని అంచనాలకు రావచ్చు. ఒక కొట్టా భూమికి (ఒక ఎకరానికి అరవై కొట్టాలు) ఈ ప్రాంతంలో లక్ష రూపాయలు పలుకుతుందనుకుంటే అభివృద్ధి సంస్థ కనీసమైన లాభసాటి ధరగా రు.50 వేలకే అమ్మిందనుకున్నా సంస్థ మొత్తం మీద రు.150 కోట్లు నష్టపోయిందని చెప్పవచ్చు.

టాటామోటర్స్ లిమిటెడ్‌కు లాభాలు చేకూర్చి పెట్టడానికి రెండు ప్రభుత్వరంగ సంస్థలు నష్టపోయేలా ఆదేశాలు ఇచ్చారన్నమాట. ఈ మొత్తం వ్యవహారం అనవసరమూ, చట్టవ్యతిరేకమూ, అనైతికమూ. నానో కుంభకోణం మీద భవిష్యత్తులో ఎప్పుడైనా ఒక విచారణ కమిషన్ ఏర్పడితే ఈ చిక్కుముడల లోపల చిక్కుముడులు పడిన వ్యవహారాన్ని విప్పి చెప్తుతుందేమో. ఈ అవకతవక లావాదేవీలలో ఎంత నష్టం జరిగిందో తెలుస్తూందేమో, బాధ్యులు ఎవరో నిర్ధారిస్తుందేమో. టాటాలు ఇప్పటికే ఒదిలేసి వెళ్లిపోయారు. లేకపోతే ఆ పెద్దమనుషులలో చాలామంది ఈ చట్టవ్యతిరేక కార్యకలాపంలో అవినీతిలో మరింతగా మునిగిపోయి తమ శేష జీవితాన్ని చెరసాలలో గడపవలసి వచ్చేది. అయితే ఒక విచారణ కమిషన్ ఏర్పడి కచ్చితమైన లెక్కలు తేలిస్తే ఇప్పటికైనా కొంతకాలమైనా వారు ఊచలు లెక్కపెట్టక తప్పదు. వారింకా అధికారంలో ఉండగానే చెరసాలల పరిస్థితులు మార్చడం వారికే మంచిది. సరే మనం మళ్లీ మన పాత లెక్కకు వద్దాం.

టాటాలు వెళ్లిపోయేటప్పుడు చెల్లించవలసిన తాత్కాలిక బిల్

1. భూసేకరణ ఖరీదు	రు.200 కోట్లు
2. గోడ ఖర్చు	రు. 76.56 లక్షలు
3. పోలీస్ రక్షణ ఖర్చు	రు. 46.66 కోట్లు
4. సబ్సిడీ భూమి ఖరీదు	రు. 135 కోట్లు +
	రు. 150 కోట్లు
	(మొత్తం రు. 285 కోట్లు)

అన్నీ కలిపి రు. 532.18 కోట్లు. ఇదంతా ప్రత్యక్ష ఖర్చు. ఇందులో ఇంకా పరోక్ష ఖర్చులూ, కనబడని ఖర్చులూ కలవలేదు. ఇది తాత్కాలిక బిల్లు మాత్రమే. పూర్తి బిల్లు కాగ్ లెక్కలు తేలిన తరువాత తేలుతుంది.

2

కలకత్తాలోని రాజ్‌భవన్ కౌన్సిల్ ఛాంబర్‌లో 2008 సెప్టెంబర్ 5,6 తేదీలలో జరిగిన చర్చలలోని కొన్ని విషయాలను నమోదు చేయకపోతే, బహిరంగంగా ప్రజలకు తెలియజేయకపోతే ఈ వ్యవహారం ముగించడం సాధ్యంకాదు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఏకపక్షంగా, అనైతికంగా తుంగలో తొక్కింది గనుక ఆ రహస్య సమావేశపు చర్చలను బయటపెట్టడానికి నాకేమీ అభ్యంతరం లేదు.

ఈ వ్యవహారాన్ని చక్కదిద్దడానికి ఒక మధ్యవర్తిని (ఫెసిలిటేటర్) నియమించారు. ఆయన మొట్టమొదటే చర్చకు ప్రాతిపదిక సూత్రాలను వివరించారు. ఎవరి మీద ఎవరు వ్యక్తిగత దూషణలు చేయకూడదు. సింగూర్ ప్రతిష్ఠంభనలో 'భూమి ఇవ్వడం ఇష్టంలేని' రైతులకూ, వ్యవసాయానికీ, పరిశ్రమకూ పశ్చిమబెంగాల్ ప్రజల సాధారణ సంక్షేమానికి ప్రయోజనకరంగా ఉండే సామరస్యపూర్వకమైన పరిష్కారాన్ని కనిపెట్టడానికే ఇరుపక్షాలూ ప్రయత్నించాలి. ఇరుపక్షాలూ ఈ ప్రాతిపదిక సూత్రాలను కచ్చితంగా పాటించాయనీ, చర్చలను నాగరికతమైన, మర్యాదపూర్వకమైన పద్ధతిలో నిర్వహించాయని చెప్పాలి.

'ఇష్టంలేకుండా భూమి కోల్పోయిన' వారికి భూమికి భూమి ఇచ్చే ప్రాతిపదికమీద ప్రాజెక్ట్ ప్రాంతంలోనే పునరావాసం కల్పించడానికి ఎంత భూమి దొరుకుతుంది అనే అంశం మీదనే చర్చ కేంద్రీకృతమైంది. ఇక్కడ ఒకమాట చెప్పాలి. అక్టోబర్ 2007లో తయారయిన జాతీయ పునరావాస పునఃస్థిరీకరణ విధానంలో భూమికి భూమి అనేదే సరైన సహాయ పునరావాస సూత్రం అని అంగీకరించడం జరిగింది.

టాటా మోటర్స్ లిమిటెడ్ కార్ఖానా కొరకు 643 ఎకరాల భూమిని ఇవ్వడం చర్చనీయాంశమే అయినప్పటికీ ప్రస్తుతం దాని బాగోగుల గురించి తాము చర్చించబోవడం లేదని ప్రతిపక్ష నాయకులు మొట్టమొదటే స్పష్టం చేశారు. నిజానికి ఇది ఒక పెద్ద ఉపశమనం. ఆ తర్వాత జరిగిన చర్చలు సామరస్యపూర్వకంగా జరగడానికి ఇది దోహదపడింది. కనుక మిగిలిన చర్చలు మిగిలిన 350 ఎకరాల భూమి గురించి మాత్రమే జరిగింది.

ఈ భూమిలో 244 ఎకరాలను కార్ల కార్ఖానా అనుబంధ సంస్థల కొరకు కేటాయించడం జరిగిందని ప్రభుత్వ పక్షం వాదించింది. ఒకగంట సేపూ అటూఇటూ వాదనలు నడిచిన తరువాత అవి ముందుకు సాగడం లేదని అర్థమయింది. ఆ అంశం మీదనే ఇరుపక్షాలూ వాదప్రతివాదాలు చేసుకున్నాయి.

ఆ దశలో హఠాత్తుగా వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి ప్రాజెక్ట్ ఏరియాలోని నలభై ఎకరాల భూమిని వ్యవసాయేతర వృత్తులకు వినియోగించేటట్టయితే భూమి ధరలో ఐదు శాతానికి నిర్వాసితులకు ఇస్తారమని అన్నారు. సహాయ పునరావాస విధానంలో ప్రాజెక్ట్ ఏరియా 'పరిసరాలలో' కూడా పునరావాసం కల్పించవచ్చునని ఆయన కొత్త వాదన చేశారు. అలా నిర్వాసితుల పక్షాన అప్పటికే నలభై ఎకరాలు వచ్చాయి గనుక ఇంకా ఎంత ఎక్కువ భూమి సంపాదించవచ్చుననే ప్రయత్నం మొదలయింది. నిజానికి ఆ భూమి అంతా ప్రాజెక్ట్ ప్రాంతంలో ఖాళీగానే ఉన్నది. ఇంకా వినియోగంలోకి రాలేదు. ముఖ్యంగా అదంతా అనుబంధ

సంస్థల కొరకు కేటాయించబడి ఉన్నది. అప్పుడు ఎటువైపు నుంచి ఏ ప్రతిపాదన వచ్చినా వాణిజ్య, పరిశ్రమల మంత్రి దగ్గర నుంచి ఒకే ఒక జవాబు వినబడింది : 'టాటాలు దానికి ఒప్పుకోరు.' పాత రోజుల్లో ఎచ్.ఎం.వి. 78 ఆర్.పి.ఎం. రికార్డ్‌మీద ఎక్కడైనా గీత పడితే పాటలో అదే చరణం మళ్లీ మళ్లీ వినబడుతుండేది. మంత్రి జవాబు అట్లా వినిపించింది. ఆ జవాబును నేను పదకొండుసార్లు లెక్కబెట్టి ఇక విసుగుతో మానేశాను.

మధ్యవర్తి మర్యాదగా, అందంగా, ఠీవిగా ఉన్న పెద్దమనిషి ఈ అరిగిపోయిన రికార్డ్‌తో ఆయన ఏమీ అసంతృప్తి కనబరచలేదు. అప్పటికి కూడా ఆయన తీయగా వాణిజ్య, పరిశ్రమల మంత్రిని 'భూమిని ఎవరు స్వాధీనం చేసుకున్నారండి' అని అడిగాడు. జవాబు 'ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంది.' దానిమీద వచ్చిన ప్రశ్న ఏమంటే ఒకవేశ పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చట్టం కింద బలప్రయోగంతో భూమిని సేకరించినట్టయితే ఆ భూమిని అనుబంధ సంస్థలు ఎలా వాడుకోవాలో నిర్ణయించడంలో దానికేమన్న పాత్ర ఉంటుందా లేదా? ఏయే అనుబంధ సంస్థకు ఎంతెంత భూమికావాలో ఎవరన్న నిర్దిష్టంగా లెక్క కట్టారా? ఈ ప్రశ్నలకు అరిగిపోయిన రికార్డ్ మళ్లీ గురగురలాడింది. 'టాటాలు దానికి ఒప్పుకోరు.'

అప్పుడు మధ్యవర్తి తాను పశ్చిమబెంగాల్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఎం.డి.ని కొన్ని ప్రశ్నలు అడగవచ్చునా అని మంత్రిని అనుమతి అడిగారు. మంత్రి వెంటనే ఒప్పుకున్నాడు. అనుబంధ సంస్థలను ఎవరు ఎంపిక చేశారు అని మధ్యవర్తి ఆ ఎం.డి. ని అడిగాడు. జవాబు 'టాటాలు.' ఆ అనుబంధ సంస్థలలో ఒక్కొక్క సంస్థకూ ఎంత భూమి అవసరమో ఎవరు నిర్ణయించారు అని అడిగాడు. జవాబు 'టాటాలు.' ఆ తరువాత మధ్యవర్తి ఆ భూమి ఏ ప్రాంతంలో ఉండాలో ఎవరు నిర్ణయించారో తెలుసుకోరాడు. జవాబు 'టాటాలు.' ఈ జవాబులతో బహుశా గందరగోళపడినప్పటికీ అది పైకి కనిపించనివ్వకుండా మధ్యవర్తి చాలా మర్యాదగా 'ఇంతకూ ఆ భూమి ఎవరికి చెందింది' అని అడిగాడు. దీనికి జవాబు 'పశ్చిమబెంగాల్ పారిశ్రామికాభివృద్ధి సంస్థకు.' దాని మీద మళ్లీ మధ్యవర్తి మరొక ప్రశ్న వేశాడు. 'ఆ భూమి సొంతదారు పారిశ్రామికాభివృద్ధి సంస్థ అయినట్టయితే ఆ భూమి ఎక్కడ ఉందో, ఎవరికి కేటాయించాలో నిర్ణయించడంలో ఆ సంస్థకు పాత్ర ఉండవద్దా?' ఈ ప్రశ్నకు వెంటనే మంత్రి జవాబిచ్చాడు : 'దానికి టాటాలు ఒప్పుకోరు.' తన వంతుగా ఎం.డి. ఆ జవాబుకు కలుపుతూ 'ఎంత భూమి కావాలో నిర్ణయించే సాంకేతిక పరిజ్ఞానం పారిశ్రామికాభివృద్ధి సంస్థకు లేదనీ, అందువల్ల పూర్తిగా టాటాలమీద ఆధారపడవలసి వచ్చిం'దని చెప్పాడు.

ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ మూడున్నర దశాబ్దాలకు మించిన నా ఉద్యోగ నిర్వహణలో ఒక వ్యాపార గృహానికి ప్రభుత్వం అంత సిగ్గుమాలిన బానిసత్వం సాగించడం నేనెన్నడూ చూడలేదు. అటువంటి ఉద్యోగులతోపాటు పనిచేసినందుకు నేను తలదించుకున్నాను.

ఇక్కడ పశ్చిమబెంగాల్ మొదటి ముఖ్యమంత్రి డా. బి.సి.రాయ్ గురించిన ఒక సంఘటన చెప్పడం అవసరం. 1951లో ఇంగ్లండ్‌లోని మారిస్ మోటర్ కంపెనీ నుంచి ఆయనకు ఒక ప్రతిపాదన వచ్చింది. భారతదేశంలో మారిస్ కార్ల తయారీ కొరకు ఒక భారతీయ పారిశ్రామిక వేత్తతో కలిసి సాంకేతిక సహకారం గురించిన ప్రతిపాదన అది. ఆ ప్రతిపాదనను అధ్యయనం చేసిన ముఖ్యమంత్రి ఒకరోజు తన వ్యక్తిగత సిబ్బందిని పిలిచి 'ఒకే డాకో' (ఆయన్ని పిలువు) అన్నారట. ఎవరిని పిలవమన్నారో అర్థంకాని సిబ్బంది ఆయన గదిలోనుంచి బయటికి వచ్చేశారు. తర్వాత ఆలోచించగా వారిలో ఒకరికి ఆయన అంటే జి.డి. బిర్లా కావచ్చునని అనిపించిందట. ఎందుకంటే జి.డి.బిర్లా అంతకు ముందెప్పుడో ముఖ్యమంత్రిని కలవాలని అప్పాయింట్‌మెంట్ కోరారట. సరే, వాళ్లు బిర్లాకు ఫోన్ చేసి ఆరోజు మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రితో అప్పాయింట్‌మెంట్‌కు రమ్మని పిలిచారట. బిర్లా సరిగ్గా ఆ సమయానికి ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరారట. బిర్లా వచ్చారని డా.రాయ్‌కి ఆయన సిబ్బంది సమాచారం ఇచ్చారట. ఆయన 'ఒకే బొస్తేబాలో' (కాసేపు ఆగమను) అన్నారట. బిర్లా కాస్సేపు వేచి చూసి ఆ తర్వాత లోపలికి వెళ్లి డా.రాయ్‌తో ఒక గంట గడిపారట. ఆ రకంగా కొన్నగర్‌లో హిందుస్తాన్ మోటర్స్ కార్ఖానా మొదలైంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆసియాలో ఏర్పాటైన మోటర్ కార్ల కార్ఖానా అది. రాష్ట్రంలో ఒక పారిశ్రామిక సంస్థను ఏర్పాటు చేయడానికి ఒక పారిశ్రామికవేత్త అడుగుల మడుగులు ఒత్తాలని ముఖ్యమంత్రి అనుకోని రోజులు అవి.

3

ఇక పశ్చిమబెంగాల్ నుంచి రతన్ టాటా వెళ్లిపోతే ఏం జరుగుతుంది?

మొట్టమొదట నాకు తెలిసినంతవరకు 2008 అక్టోబర్ 4న భూగోళం దాని ఇరుసు మీదనే పాతపద్ధతిలోనే ఇరవై నాలుగు గంటల్లో తన చుట్టూ తాను తిరిగింది. అంతేకాదు, ఆ రోజున కూడా సూర్యుడు యథాతథంగానే తూర్పున ఉదయించి పడమట అస్తమించాడు. స్వర్గం పడిపోయిందనో, భూమి బీటలు వారిందనో పత్రిక వార్తలు ఏమీ రాలేదు. సాధారణ ప్రజానీకం తమ నిత్యవ్యవహారాలలో మామూలు పద్ధతుల్లోనే సాగిపోయారు. అది ఎంతగా సాగిందంటే సి.పి.ఎం. ఇచ్చిన బంద్ పిలుపు నిర్ణీత వ్యవధికన్న చాలాముందే అయిపోయింది. పశ్చిమ బెంగాల్‌లో సాధారణ జీవనం 2008 అక్టోబర్ 3 తర్వాత దాని మామూలు క్రమంలోనే సాగుతుంది.

రెండు, టాటా మోటర్స్ లిమిటెడ్ ఒక కార్ల కర్మాగారం నెలకొల్పడం కొరకు 643 ఎకరాల భూమి కేటాయించడం జరిగింది గనక, ఇప్పుడు వాళ్లు ఆ కర్మాగారం నెలకొల్పగూడదని నిర్ణయించారు గనక వారికి ఇచ్చిన లీజ్ రద్దయిపోయిందని ఒక నోటీస్ ఇవ్వవలసి ఉంటుంది. టాటా మోటర్స్ కర్మాగారం వస్తేనే అనుబంధ సంస్థలకు పని ఉంటుంది గనక ఆ అనుబంధ సంస్థల లీజ్ కూడా రద్దయి పోయిందని నోటీసులు ఇవ్వవలసి ఉంటుంది.

మూడు, పత్రికా వార్తల ప్రకారం 200-250 ఎకరాలలో ఇప్పటికే భారీ నిర్మాణ పనులు సాగాయి. ఆ నిర్మాణాలను కూలగొట్టి ఆ భూమికి పాత సారవంతమైన స్థితి కల్పించి వ్యవసాయం

సాగించాలంటే భారీ పెట్టుబడి అవసరమవుతుంది. అందువల్ల ఆ ప్రాంతాన్ని భవిష్యత్తులో ఏదైనా కార్ల కర్మాగారం కొరకే అట్టిపెట్టవలసి ఉంటుంది. నిజానికి సాలీనా ఐదులక్షల చిన్న లేదా మధ్యతరహా కార్లు తయారు చేసే కర్మాగారం నెలకొల్పడానికి ఎంత భూమి అవసరమో ఒక ప్రమాణిక సలహా సంస్థ చేత అంచనా వేయించవలసి ఉంటుంది. ఆ అంచనా మీద ఆధారపడి కొంత భూమి 350 లేదా 400 లేదా 450 ఎకరాలు అందుకోసం కేటాయించవలసి ఉంటుంది. ఇప్పటికే టాటామోటర్స్ చేసిన నిర్మాణాలు కూడా ఇందులో భాగం కావాలి.

నాలుగు, ఎవరో బూటకపు పెట్టుబడిదారీతో ఏదో లోపాయకారి ఒప్పందం బదులు సింగూర్‌లో ఒక చిన్న లేదా మధ్యతరహా కార్ల కర్మాగారం నిర్మించే ఆసక్తి ఉందా అని అడగడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. ప్రభుత్వం ఏ లాభాలు లేదా ఏ సౌకర్యాలు ఇవ్వజూపుతున్నదో బహిరంగంగా ప్రకటించవలసి ఉంటుంది. తమ కర్మాగారం వల్ల భూ నిర్వాసితులు అయ్యే ప్రజలకు పరిహారంగా తాము ఏమి ఇవ్వజూపుతున్నారో ఆ పారిశ్రామికవేత్తలు బహిరంగంగా ప్రకటించవలసి ఉంటుంది. అలా వచ్చిన ప్రతిపాదనలలో సాంకేతికంగానూ, ఆర్థికంగానూ అత్యుత్తమమైనదేదో నిర్ధారించిన తరువాత వారికే కార్ఖానా నిర్మించే అవకాశం ఇవ్వవలసి ఉంటుంది. ఆ ఒప్పందం బహిరంగంగా పారదర్శకంగా ఉండాలిగాని టాటా మోటర్స్ లిమిటెడ్‌తో జరిగినట్టుగా రహస్యంగా ఒప్పందాలేమీ ఉండకూడదు.

ఐదు, ఇక మిగిలిన భూమి అంతా భూనిర్వాసితులకు తిరిగి అప్పగించాలి. ఒకసారి సేకరించిన భూమిని తిరిగి వెనక్కి ఇవ్వడం సాధ్యంకాదని వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి సరిగ్గా శిక్షణ పొందని రామచిలుకలాగా పదేపదే అంటున్నాడు. అది వాస్తవం కాదు. సేకరించిన భూమిని సొంతదార్లకు తిరిగి ఇవ్వడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. 1897 జనరల్ క్లాజెస్ చట్టంలో సెక్షన్ 21 ఉంది. అది 'ఒక ఉత్తర్వు ఇచ్చే అధికారం అంటే ఆ ఉత్తర్వు అదనంగా చేర్చే, మార్పులు చేసే, సవరించే, రద్దుచేసే అధికారం కూడా' అని చెపుతుంది. ఈ నిబంధన ప్రకారం తిరిగి ఇవ్వదలచుకున్న భూములను డీనోటిఫై చేయవచ్చు.

అలాకాక భాస్కరన్ పిళ్లై కేసులో 1997లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పరిధిలోపలే ఎవరైనా వ్యవహరించదలచినట్టయితే మిగులు భూమిని సింగూర్ పంచాయితీ సమితికి ఇవ్వవచ్చు. ఆ పంచాయితీ సమితీ 'ఆ గ్రామంలోని భూములను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలనే, మెరుగుపరచాలనే' కోరవచ్చు. నిజానికి నిర్లక్ష్యపూరితమైన భూసేకరణ క్రమం వల్ల ఇక్కడి ఐదు మౌజాలు ధ్వంసం అయిపోయాయి. ఈ గ్రామాలన్నిటినీ 1894 భూసేకరణ చట్టంలోని సెక్షన్ 3 (ఎఫ్) (1) (5) ప్రకారం ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయవలసి ఉంది. ఈ క్రమంలో భూములు కోల్పోయిన వాళ్లకు 999 సంవత్సరాల లీజ్ కింద భూమి ఇవ్వవచ్చు.

అదే విధంగా కాలక్రమంలో తమిళనాడులో జరిగిన సవరణ లాగా భూసేకరణ చట్టానికి స్థానిక సవరణ కూడా చేయవచ్చు. ఆ సవరణ ప్రకారం భూమి యజమానులకు భూమిని తిరిగి ఇవ్వవచ్చు. బహుశా ఆ మార్పు జరగడానికి ప్రభుత్వమే మారవలసి ఉంటుందేమో.

ఇక్కడ సి.పి.ఎం.కు మరొక హెచ్చరిక కూడా చేయవలసి ఉంది. ఈ భూమిని యథాతథంగా వాడుకోవడానికి 'ప్రజాప్రయోజనం' నిర్వచనానికి లోబడే మరొక పారిశ్రామిక ప్రణాళికను సిద్ధం చేయడానికి పూనుకుంటే అది పూర్తిగా చట్టవ్యతిరేకమవుతుంది. ఏ భూమినైనా మౌలికంగా ఏ అవసరం కొరకు సేకరించారో ఆ అవసరానికే వాడాలని చట్టం నిర్దేశిస్తుంది.

'ఒక రాజ్య చరిత్రలో ఒకానొక సమయం వస్తుంది. అప్పుడు ఆ రాజ్యపు కపటత్వాన్ని బహిర్గతం చేయవలసి వస్తుంది. ఆ రాజ్యం దైవానికీ, మనిషికీ వ్యతిరేకంగా సాగించిన నేరాలను ప్రకటించి ఖండించవలసి వస్తుంది' అంటారు. పశ్చిమబెంగాల్‌లో ఆ సమయం ఇప్పుడు వచ్చింది.

4

ఇది టాటా గారికి ఒక మర్యాదపూర్వకమైన విన్నపం. మమ్మల్ని అపార్థం చేసుకోకండి. మీరు ఈ బిల్లు వెంటనే చెల్లించాలని మేమేమి కోరడంలేదు. అసలు మీరు ఎప్పటికైనా ఈ బిల్లు చెల్లించాలని మేం ఒత్తిడి చేయబోవడంలేదు. మేం చేయదలచుకున్నదల్లా ఒక మామూలు సామెతను మీకు గుర్తుచేయడమే. 'ఎవరైనా పెద్దమనిషి లేచి వెళ్లిపోయేటప్పుడు తన లెక్కలు తేల్చి వెళ్లిపోతాడు.' వీ

హింస, అణచివేతలే సాధనంగా తుపాకీ సంస్కృతితో పాలిస్తున్న రాజ్యస్వభావాన్ని వివరిస్తున్నారు

కె. విజయకుమార్

ఎవరిది ప్రజాస్వామ్యం?

కార్ల్‌మార్క్స్ ఒక మంచి కలగన్నాడు. ఒక నిజమైన ప్రజాస్వామ్యన్ని గురించి కలగన్నాడు. అది ఎలా సాధ్యమవుతుందో ఆలోచించాడు.

మానవుడు, అనేక ప్రాణుల్లాగానే, తను కూడా యీ భూమి మీద రూపొందాడు. ఒక ప్రాణి రూపాంతరం చెందుతూ మనిషిలాగా మారింది. యీ మనిషి అవయవాలు ఇతర జంతువుల లాగా గాకుండా, చాలా ఎక్కువ రీతుల్లో మలచుకునే విధంగా తయారయ్యాయి. నాలుగు కాళ్ల జంతువు నుండి రెండు కాళ్లు, రెండు చేతుల జంతువుగా మారింది. దాంతో ప్రకృతిని తనకనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేసింది. మానవులు ఇందులో కొంత వరకు సఫలమయ్యారు. ఇంకా ప్రయాత్నాలు చేస్తూనే ఉన్నారు.

ఇతర ప్రాణులన్నీ ప్రకృతిలో దొరికే ఆహారాన్ని సమీకరించుకుని, దొరికిన విధంగానే తింటాయి. ప్రకృతిని అవి శాసించలేవు. కాని మానవులు ప్రకృతిలో దొరికే వాటి రూపురేఖల్ని మార్చి ఆహారంగా మలుచుకోవడం నేర్చుకున్నారు. ప్రకృతిలో దొరికిన ఆహారాన్ని వండి, రకరకాల మిశ్రమాలు చేసి, తమకి మంచి అనిపించిన విధంగా తింటున్నారు. ఇదే మనుషులకి, మిగిలిన ప్రాణులకి ఉన్న అతి ముఖ్యమైన తేడా. సమస్త ప్రాణులతోటీ ఉన్న తేడా. ఈ భౌతిక ప్రపంచం మీద, అంటే భౌతిక వనరులైన భూమి, నీరు, గాలి మీద (పంచభూతాలనే మాట పొరపాటు. అగ్ని, ఆకాశం ప్రకృతి సిద్ధంగా ఉండేవి కావు. అవి వుత్పాదితాలు. రెండు వస్తువుల రాపిడి వల్ల అగ్ని పుడితే, నీటి ఆవిరివల్ల మేఘాలు ఏర్పడి, ఆకాశమనే భ్రమని సృష్టిస్తాయి.) సమస్త ప్రాణులకీ హక్కు ఉంది. ప్రత్యేకించి, మానవుడిగా పుట్టిన ప్రతివారికీ హక్కు ఉంది.

మార్క్స్ కల

భౌతిక వనరులపై సమాన హక్కులు గల మానవులంతా తమలో తాము శ్రమ విభజన చేసుకుని, తమకి అవసరమయిన వస్తువుల్ని ఉత్పత్తి చేసుకుని, అవసరమయిన రీతిలో పంపిణీ చేసుకుని, సహజీవనాన్ని సాగించాలి. ప్రతివ్యక్తీ తన శక్తి కొద్దీ తన నైపుణ్యం కొద్దీ పని చేసి, తనకవసరమయినంతగా తీసుకోవాలి. వ్యవసాయంలోనూ, ఇతర ఉత్పత్తి ప్రక్రియలన్నిటిలోనూ వచ్చే ఇబ్బందుల్ని, ఇక్కట్లనీ సమాజమే ఉమ్మడిగా భరించాలి కాని వ్యక్తి కాదు. ఆరోగ్యం, విద్య, వసతి లాంటివన్నీ కూడా ఉమ్మడిగానే నిర్వహించుకోవాలి. ఒక్కరి కోసం అందరూ నిలబడాలి, అందరికోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలి. ఆడ, మగ, జాతి, మత, కుల తారతమ్యాలేవీ లేకుండా పనిచేయాలి. సహజీవనం సాగించాలి. అప్పుడు ధనిక, పేద అనే మాటలు ఉండవు. మోసాలూ, మోసకారులూ, సోమరిపోతులూ, యుద్ధాలు ఉండవు. అటువంటి ఒక నూతన ప్రజాస్వామ్య వ్యవస్థని మార్క్స్ కలగన్నాడు, సాధించాలనుకున్నాడు.

దాదాపు అటువంటి వ్యవస్థే ఆర్యులు రాకముందు మన దేశంలో ఉంది. బహుశా దానినే మార్క్స్ 'ఆదిమ కమ్యూనిజం' అన్నాడు.

నూతన ప్రజాస్వామ్య సమాజమంటే ఒక నిజమైన ప్రజాస్వామ్య సమాజం. ప్రతివ్యక్తీ తన శక్తి కొలదీ పని చేస్తాడు. ప్రతివ్యక్తీ తన అవసరం కొద్దీ తీసుకుంటాడు. మొత్తం ఉత్పత్తిలో అందరికీ సమానహక్కు ఉంటుంది. ఒక కుటుంబ సంపాదనని అవసరం కొద్దీ ప్రతి కుటుంబ సభ్యునికీ ఎలా వాడతారో అలాగే సమాజంలో కూడా అంటే సమాజమే ఒక కుటుంబంలా ఉంటుంది. దానినే మార్క్స్ 'కమ్యూన్' అన్నాడు. ఎవరికీ ఇతరుల శ్రమని దోచుకునే, సోమరిపోతులుగా, పరాన్న భుక్కులుగా ఉండే అవకాశం లేని సమాజం. సమాజం ఎలా ఉండాలో చెప్పడమేకాదు, ఆ మార్పు ఎలా సాధ్యమవుతుందో కూడ మార్క్స్ చెప్పాడు. అందుకే మార్క్స్ ఇలా అన్నాడు:

'చాలామంది ఈ వ్యవస్థని విశ్లేషించారు. కావలసింది దానిని మార్చడం ఎలా అని? ఆర్యులు ఈ నేల మీద అడుగిడి భూమిని, సంపదల్ని ఆక్రమించుకోవడమే గాక రాచరిక వ్యవస్థ అనే ఒక దుష్ట వ్యవస్థని ప్రవేశపెట్టారు. ఆర్యులు జంతు మాంసమే ఆహారంగా బతికినవారు. వ్యవసాయం తెలియనివారు. ఇతరుల వద్ద ఉన్న పశువుల్ని లాక్కోవటం, దానికి ఏ పద్ధతుల్నయినా ఆచరించడం అలవాటయిన వారు. ఇండియాకి వచ్చిన తరువాత కూడా ఆ అలవాటుని కొనసాగించారు. స్వదేశీయులపై దాడి చేయడం, అడ్డుకున్న వాళ్లని పిల్లా, పాప, ఆడా, మగ, ముసలీ ముతక విచక్షణ లేకుండా చంపేశారు. అలవికానప్పుడు కాళ్ల బేరానికొచ్చి రాజీ చేసుకున్నారు. విల్లంబుని ఆయుధంగా పట్టి దూరం నుండే చంపగల నేర్పు వాళ్లకి మేలు చేసింది. తద్వారా ఆధిపత్యం సంపాదించి రాచరిక వ్యవస్థని ప్రవేశపెట్టారు. ఈ దేశీయులంతా తమ దాసులేనని, తమకి కావలసినవి ఉత్పత్తి చేయడమే వారి కర్తవ్యమని నిర్దేశించారు. కాదన్న వాళ్లని చంపారు. కులాలుగా విభజించి పాలించారు. వీలు కానప్పుడు, పంచములని విడదీసి

సమాజానికి దూరం చేశారు. ఒక మంచి సహజీవన వ్యవస్థని కూలదోసి దోపిడీ వ్యవస్థని నెలకొల్పారు. తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికి ఆయుధాల్ని తయారు చేసుకోడమే గాక స్వదేశీయుల్ని కూడా తమ సైన్యంగా చేసుకున్నారు. అంటే మనవేలితో మన కళ్లు పొడిచే దుష్టత్వం. అలా రాచరికాన్ని దోపిడీ వ్యవస్థనీ, ఈ దేశంలో ప్రవేశపెట్టారు. దానిని పటిష్టం చేసుకోవడం కోసం దేవుడిని, మతాన్ని సృష్టించి, ప్రజల్ని భయాందోళనలకు గురిచేయడం ద్వారా పాపమనే సిద్ధాంతాన్ని నూరిపోయడం ద్వారా, తమ అధికారాన్ని పటిష్టం చేసుకున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా, ప్రత్యేకించి యూరోపియన్ల, ఆర్యుల ప్రభావానికి గురయిన ప్రాంతాలన్నింటిలోనూ రాచరిక వ్యవస్థలు నెలకొన్నాయి. రాచరికం అంటే ఏమిటి? ఒక గుంపుని పోగుచేయడం, ఆయుధాలు చేతబూని, నిరాయుధులైన ప్రజలపై దాడిచేసి, భయపెట్టి తమ రాజ్యంగా ప్రకటించుకోవడం. ప్రజల నుండి వాటా రూపంలో, పన్ను రూపంలో ఉత్పత్తుల్ని, డబ్బుని వసూలు చేయడం. ఇది మాఫియా గుంపుకి కొద్దిగా ఎక్కువ. ఎందుకంటే, ఆ గుంపే ప్రభుత్వంగా కూడా చెలామణీ అయ్యింది. ఏ వ్యక్తికి ఎంత ఎక్కువ గుంపు (లేక సైన్యం), ఎంత ఎక్కువ ఆయుధాలు సమకూర్చుకుంటే, అతనే శక్తివంతమయిన రాజు, మహారాజు, వగైరా. మనం చరిత్రలో చదువుకునే రాజుల చరిత్రలన్నీ యీ భ్రష్ట చరిత్రలే. నిరంతరం వీళ్లు మతాన్ని తోడుతెచ్చుకున్నారు. పూజారివర్గం రాచరికాన్ని పూర్తిగా సమర్థిస్తూ, మద్దతిస్తూ, ఎప్పుడూ ప్రజలను పాపం, దేవుడు అనే భయానికి గురిచేస్తూ అటు స్వామికార్యం, ఇటు స్వకార్యం కూడా నిర్వహించుకున్నారు. అప్పటి నుండి ఆయుధాలు లేకుండా ఏ రాజ్యం ఏర్పడలేదు. ఒక రాజు మరో రాజుపై, ఒక దేశం మరో దేశంపై (ఆ రాజు ఆక్రమణలో ఉన్న ప్రదేశమే ఒక దేశం) గెలిచిందంటే, అది ఆయుధాలతోనే. సామంత రాజ్యాలు, అంటే ఒక బలవంతమైన రాజుకి లొంగి వుండే బలహీన రాజ్యాలు. ఇవి ఆయుధాలు ప్రయోగించకుండా ఏర్పడతాయి.

మనకి స్వాతంత్ర్యం అలా వచ్చిందే. బ్రిటిష్ వాళ్లు దయతలచి, తన యిష్టానుసారం ఏర్పాటు చేసిన ప్రభుత్వం. బ్రిటిష్ ప్రభుత్వానికి నమ్మినబంట్లుగా, స్వాతంత్ర్య వ్యతిరేక, ప్రజావ్యతిరేక చర్యలకు పూనుకుని, దేశానికే ద్రోహం చేసిన అధికారులు సైన్యమే, మన స్వాతంత్ర్య దేశానికి అధికారులుగా, సైన్యంగా చెలామణి అయ్యారు. ఇప్పటికీ మన జైళ్లలో మన ప్రజలకి లేని సౌకర్యాలు బ్రిటిష్ వాళ్లకి కల్పిస్తారు. మనల్ని రెండు వందల సంవత్సరాల పైగా వేధించి, సంపదల్ని

కొల్లగొట్టుకుని, వేలమంది ప్రజల్ని హతమార్చిన బ్రిటిష్ రాణి, యువరాజులకి సిగ్గువిడిచి మన ప్రభుత్వం – మన రాజకీయ నాయకులు, మన అధికారులు – ఇచ్చిన అతిథి సత్కారం మన స్థితిని తెలుపుతుంది.

ఇపుడున్న ప్రజాస్వామ్య రూపం వ్యాపారుల స్వామ్యం. వ్యాపారులకి రాజు నుండి ఎక్కువ స్వేచ్ఛ కల్పించేది మాత్రమే. యీ ప్రజాస్వామ్యం దోపిడీ రూపాన్ని మాత్రమే మార్చింది. రాచరిక దోపిడీ నుండి వ్యాపార దోపిడీగా రూపాంతరం చెందింది. మన దేశంలో, అంతకుముందు రాజులుగా ఉన్న వాళ్లు, వాళ్ల కుటుంబ సభ్యులు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత శాసనసభ్యులు, లోక్‌సభ సభ్యులు, మంత్రులు అయ్యారు. వ్యాపార సంస్థల్ని నిర్మించుకున్నారు. ప్రజల నుండి వాళ్లు బలవంతంగా దోపిడీ చేసిన ఆస్తులన్నీ వాళ్లే అనుభవిస్తున్నారు. వాటిని ప్రజాపరం చెయ్యలేదు. పైగా జవహర్‌లాల్ నెహ్రూ, పటేల్‌లు రాచరిక దోపిడీ ఆపినందుకు బదులుగా వాళ్లకి భరణాలిచ్చారు. వీళ్లిద్దరూ తెలంగాణకి చేసిన అతి దుర్మార్గమయిన ద్రోహం మనకి తెలిసిందే. ఈ మంత్రివర్గాలే ప్రజలకి, దేశానికి సంబంధించి అన్ని నిర్ణయాలూ, చట్టాలు చేస్తాయి. అవన్నీ వ్యాపార వర్గాల చుట్టూ తిరుగుతుంటాయి.

ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వాలు కూడా, రాజుల్లాగే, ఆయుధాలనే నమ్ముకున్నాయి. అధునాతన ఆయుధాల్ని సమకూర్చుకుంటున్నాయి. అమెరికా పెత్తనమంతా ఆయుధాలతోనే ముడిపడి ఉంది. మనదేశం కూడా, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, ఇతర దేశాలతో వచ్చిన విభేదాల్ని అహింసతో పరిష్కరించుకోలేదు. ఆయుధాలతోనే పరిష్కరించాయి. బంగ్లాదేశ్ ఏర్పడటానికి అప్పటి మన ప్రభుత్వం అహింస సిద్ధాంతాన్ని వాడలేదు. ఆయుధ సిద్ధాంతాన్నే వాడింది. ఇరాక్ మీద అమెరికా తన మిత్ర బృందంతో దాడిచేసింది ఆయుధాలతోనే. మన ప్రభుత్వం కూడా దానిని సమర్థించింది గాని అహింసా సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టలేదు. చరిత్ర మొత్తం తిరగేస్తే రాచరికాలు, ప్రభుత్వాలు ఆయుధ శక్తితోనే ఏర్పడ్డాయి, ఏర్పడుతున్నాయి. ఇప్పుడు అమెరికా ప్రపంచం మీద చేసే పెత్తనానికి ఆయుధసంపదే కారణం. అందుకే ఇతర దేశాలన్నీ, మన దేశంతోసహా, అమెరికాకు భయపడుతున్నాయి. లొంగి ఉంటున్నాయి.

కార్ల్‌మార్క్స్ ఇదే చెప్పాడు. ఒక నిజమైన ప్రజాస్వామ్య సంస్థ తను కలలుగన్న సమాజం ఏర్పడాలంటే, ఈ దోపిడీ ప్రభుత్వాల్ని మార్చాలి, వ్యవస్థను మార్చాలి. ఏ రూపంగానైనా దానికి పూనుకుంటే, ఈ ప్రభుత్వాలు ఆయుధాలతో దాడి చేస్తాయి. ప్రతిఘటించే వాళ్లని పూర్తిగా హతమార్చి తన దోపిడీని కొనసాగిస్తాయి. ఈ ముఠాల్ని ఓడించందే వ్యవస్థని ప్రజాపరం చేయలేం. వాళ్లని ఓడించడానికి ఆయుధం అవసరం. ఈ వ్యవస్థల మార్పు ప్రపంచ వ్యాప్తంగా జరిగినప్పుడు కార్ల్‌మార్క్స్ కలలు గన్న సమసమాజాలు ఏర్పడతాయి. ఆయుధాలు లేని, ఆయుధాలు అవసరంలేని ప్రపంచం వెల్లివిరుస్తుంది. అప్పుడు మానవులు ప్రకృతిని శోధిస్తూ, జయిస్తూ, తమ జీవనాన్ని ఇంకా మెరుగుపరుచుకుంటూ పరస్పరం సహకరించుకుంటూ, పేదలు, ధనవంతులు అనే భేదం లేని, దేవుడు దెయ్యాల భయంలేని, మతరహిత సహజీవనాన్ని కొనసాగిస్తారు.

మార్క్స్ చెప్పిన ఆయుధ సిద్ధాంతం, రాజ్యాధికారం, తుపాకి గొట్టం ద్వారానే వస్తుందనే మావో ప్రకటన, ఊహాజనితాలు కావు. జరిగిన, జరుగుతున్న ప్రభుత్వాల్ని, వ్యవస్థల్ని అధ్యయనం చేసి రూపొందించిన సిద్ధాంతం. నిజానికి సిద్ధాంతమే మార్క్స్‌ది. తుపాకీ ఆచరణ తరతరాలుగా ఈ దోపిడీ ప్రభుత్వాలది, వ్యవస్థలది. ఈ రోజు మీరు ఏ మంత్రి అయినా, శాసనసభ్యుడైనా తుపాకీ లేకుండా ఉండడం చూశారా? ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా, ఎప్పుడూ తుపాకితోనే ఉంటున్నారు. ఈ ప్రభుత్వం – ఏపార్టీ అయినా – అన్యాయాలని, అక్రమాలని ప్రతిఘటించే ప్రజలపై, తమ కనీస అవసరాలకి ఉద్యమించే ప్రజలపైకి తుపాకులనే పంపిస్తుంది. ఎరువుల కోసం నిరీక్షించే రైతుని చంపినా, బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంపై కాల్పులు జరిపి బలితీసుకున్నా, ముదిగొండ భూపోరాటం పై తుపాకులు పేల్చినా ఇదంతా ఈ దోపిడీ వ్యవస్థల తుపాకి గొట్టం ఆచరణే. నక్సలైట్లతో ప్రభుత్వం అహింసా సిద్ధాంతంతో వ్యవహరించలేదు.

రాడికల్ సంస్థలుగాని, విప్లవోద్యమాలు గాని మొదట ఆయుధాలు పట్టుకోలేదు. పార్టీ సభ్యులు, విద్యార్థి, యువజనులు ప్రజా సమస్యల్ని, వాటి మూలాల్ని, చట్టాల్ని కనీస వేతనాల్ని ప్రచారం చేస్తూ గ్రామాలకి, గిరిజన తండాలకి వెళ్లినప్పుడు దొరలు, పోలీసులు వాళ్లని పట్టుకుని నానా హింసలకు, హత్యలకు గురిచేశారు. ఎంతోమంది ప్రాణాల్ని కోల్పోయారు. పౌరహక్కుల సంఘాల సభ్యుల్ని కూడా చంపుతున్నారు. దోపిడీ వర్గాల ఈ దాడిని తట్టుకోడానికే వాళ్లు తుపాకి పట్టారు.

మిగిలింది ఇప్పుడు నడుస్తున్న చరిత్రే. ఎవరు అప్రకటిత యుద్ధమని ప్రకటిస్తున్నారో, ఎవరు ఆయుధాలకై కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నారో, ఎవరు ప్రత్యేక హంతక ముఠాల్ని తయారు చేస్తున్నారో, ఎవరిని కాపాడడానికి ఈ ముఠాల్ని తయారు చేస్తున్నారో ప్రజలందరికీ తెలిసిందే.

అమెరికా నాయకత్వంలో ఈ దోపిడీ వ్యవస్థలన్నీ ఏకమయ్యాయి. ప్రజా ఉద్యమాల పైకి ముందుగా పోలీసులు, తర్వాత సి.ఆర్.పి.ఎఫ్., గ్రేహౌండ్స్, సైన్యం, అమెరికా తదితర దేశాల ఆయుధాలు, దళాలు, ఇలా వరుసగా దాడికి దిగి తమ దోపిడీ వ్యవస్థల్ని కాపాడుకుంటాయి. ప్రజలు శ్రమించి పెంపొందించిన ఉత్పత్తులను వాళ్లకి దక్కకుండా తమ స్వంతం చేసుకుంటారు. అదేమంటే తాము చేసేదంతా ప్రజల కొరకే అని నమ్మబలుకుతారు. భట్రాజుల్లాగా ఒకరినొకరు పొగుడుకుంటారు. పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంటారు. కాదన్న వారిపై దుష్ప్రచారం చేస్తారు. ప్రజలు తెలుసుకుని ఎదిరిస్తే తుపాకులతో అణచివేస్తారు. ఈ రోజు శాసనసభ్యులు, మంత్రులు ఎంతగా స్వంత ఆస్తుల్ని కూడబెట్టు కుంటున్నారో ఆ ప్రాంత ప్రజలకి తెలుస్తూనే ఉంది. ప్రజా సౌకర్యాలకై పన్నులరూపంలో సేకరించిన డబ్బునికాజేసి తమస్వంత ఆస్తిగా మలుచు కుంటున్నారు. ఈ వ్యవస్థలో పాలు పంచుకుంటున్న వాళ్ల మధ్య ఉన్న విభేదాలు, పంపకపు తగాదాలే ఇన్ని పార్టీలకి కారణం. సారాంశంలో ఈ కార్పొరేట్ పార్టీలన్నీ ఒకటే. దోపిడీ వ్యవస్థని సమర్థించేవే.

అందువలన తుపాకి గొట్టం ఆచరణ ఎప్పుడూ రాచరికం, దాని నుండి పుట్టుకొచ్చిన భూస్వామ్యం, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థది. దానిని సమర్థించే పార్టీలది, ప్రభుత్వాలది. మార్క్స్ సిద్ధాంతీకరించింది ఈ ఆచరణనే.

వీ

రేపటి ప్రపంచపు కలల తీరం - హైదరాబాద్ మహానగరం

2007, ఏప్రిల్ 16... హైదరాబాద్ నగర చరిత్రలో ఓ చారిత్రాత్మక మలుపు. ఈ భాగ్యనగరాన్ని అంతర్జాతీయనగరాలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు ఆవిర్భవించింది 'హైదరాబాద్ మహా నగరపాలకసంస్థ'. నగరంలో సంపూర్ణ పారిశుధ్యం, పరిశుభ్రత,పచ్చదనాల పెంపు కోసమే కాకుండా ప్రజల సౌకర్యార్థం అనేక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, నిర్వహణకై ఈ సంస్థ అహర్నిశం కృషి చేస్తోంది . ప్రపంచ చిత్రపటంపై ఆకర్షక కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపడమే జి.హెచ్.ఎమ్.సి. ప్రధాన లక్ష్యం.

కార్యాచరణ పథకాలు-భవిష్య ప్రణాళికలు:

- **డస్ట్‌బిన్ ఫ్రీ సిటీ:** 2008 డిసెంబరు నాటికి హైదరాబాద్‌ను "డస్ట్‌బిన్ ఫ్రీ" నగరంగా తీర్చిదిద్దాలన్నది ఆశయం. ఈ మేరకు డోర్-టు-డోర్ చెత్త సేకరణకు తగిన చర్యలు తీసుకుంటోంది.
- ప్రస్తుతం నగరంలో వున్న 180 ఆధునిక పబ్లిక్ టాయిలెట్స్‌కు అదనంగా, మరో 100 పబ్లిక్ టాయిలెట్స్‌ను బి.ఓ.టి. ప్రాతిపదికన నిర్మిస్తోంది.
- ఇటీవల భారీవర్షాలకు దెబ్బతిన్న సుమారు 300 కి.మీ. పొడవుగల రహదారుల మరమ్మతులను 2009, జనవరి నాటికి పూర్తి చేసేందుకు తగిన చర్యలు చేపడుతోంది. ఇందుకోసం రూ. 65 కోట్లు కేటాయించడమైంది.
- రహదారులపై స్ట్రీట్ లైట్ల ఏర్పాటు 95 శాతం పూర్తయింది. ఏదేని కారణంగా దీపాలు వెలగకపోతే, ఫిర్యాదు అందిన 12 గంటల లోపల సంబంధిత కాంట్రాక్టర్ తగినచర్యలు చేపట్టాలి. లేనియెడల వెలగని ఒక్కొక్క స్ట్రీట్‌లైట్‌కు, రోజుకు, రూ. 100/- చొప్పన సదరు కాంట్రాక్టర్‌కు జరిమానా విధించడమౌతుంది.
- **ప్రధాన రోడ్ల విస్తరణ కార్యక్రమం:** రూ.80 కోట్లతో నగరంలోని ప్రధాన రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టడమైనది. ఇందుకోసం రూ.80 కోట్లు కేటాయించడమైంది.
- ఇన్నర్ రింగ్ రోడ్ల పనులన్నీ 2009 జనవరి నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఇందుకోసం రూ. 150 కోట్లు కేటాయించడమైంది.
- **మహిళా సాధికారత:** ఇందిరా క్రాంతి పథకం క్రింద నేటి వరకు 35 వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటయ్యాయి. 5 లక్షల 26వేల మంది మహిళలు ఈ పథకం క్రింద లబ్ధి పొందారు. రూ. 91.41 కోట్ల మేరకు బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి.
- **ఉపాధి కల్పన:** నగరంలో గల 7564 మంది యువతకు శిక్షణ ఇప్పించి ఉపాధి అవకాశాలను కల్పించింది జి.హెచ్.ఎమ్.సి.
- 936 వికలాంగుల స్వయం సహాయక బృందాల ఏర్పాటు.
- కొత్తగా మరో 20 ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం.
- **రోడ్డు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం:** మూసీ నదిపై రేస్ కోర్స్ దగ్గర ఒకటి, కంధికల్ గేట్ వద్ద మరొకటి చొప్పన రోడ్డు ఓవర్ బ్రిడ్జ్ (ఆర్.ఓ.బి.) లను నిర్మిస్తోంది.
- రూ. 10 కోట్ల అంచనాలతో ఎలక్ట్రికల్ క్రిమటోరియాల ఏర్పాటు
- నాలాల ఆధునికీకరణ
- 12 ప్రాంతాల్లో ఆధునిక క్రీడా ప్రాంగణాల అభివృద్ధి
- మూసీనది సుందరీకరణ, చార్మినార్ వద్ద పాదచారుల రహదారి అభివృద్ధి ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- సెప్టెంబర్, 2009 లోగా నగరంలో నివసిస్తున్న పేద, బడుగు వర్గాల వారి కోసం 22,829 గృహాల నిర్మాణంపూర్తి.
- నవంబరు, 2008 నాటికి నగరంలో మొత్తం 10 లక్షల మొక్కలు నాటడం పూర్తవుతుంది.
- హైదరాబాద్ మహానగర పాలక సంస్థ, ప్రతి నెలా మొదటి శనివారం, సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ప్రజలతో ముఖాముఖి(ఫేస్ - టు - ఫేస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఒక ప్రైవేటు టీ.వి. ఛానల్ ద్వారా నేరుగా ప్రసారమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి వర్యులు, ఉన్నతాధికారులు ప్రజా సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మీ సమస్యల పరిష్కారానికై **23221978, 23222018, 23261330** ఫోన్ నెంబర్ల యందు సంప్రదించగలరు.

GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION







శ్రీ మహ్మద్ అలీ షబ్బీర్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్, బొగ్గు, మైనారిటీ సంక్షేమం, వక్ఫ్ మరియు ఉర్దూ అకాడమీ శాఖామాత్యులు



శ్రీ కోనేరు రంగారావు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన & పట్టణాభివృద్ధి శాఖామాత్యులు



శ్రీ ముఖేష్ గౌడ్
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖామాత్యులు

HYDERABAD
ON MISSION TOMORROW

హైదరాబాద్ మహానగర పాలకసంస్థ,
మున్సిపల్ కాంప్లెక్స్, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్ - 500 063
ఫోన్.: 155304 Website: www.ghmc.gov.in

భావితరాల మేటి మహానగరంగా హైదరాబాద్‌ను సంసిద్ధపరుస్తోంది - హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

R.No. 40/CPRS/2008

వెనుకబడిన ప్రాంతాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం వల్లనే వేర్పాటువాదం తలెత్తుతోందంటూ కేంద్ర-రాష్ట్ర సంబంధాలను వివరిస్తున్నారు **వి. హనుమంతరావు**

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

సంప్రదాయంగా వస్తున్న ఉమ్మడి కుటుంబాలకు, భారత దేశానికి చాలా దగ్గర పోలికలున్నాయి. పరపాలన నుంచి విముక్తి చెందిన నాటి భారతదేశం పలు జాతులు ఒకే గొడుగు కింద ఉన్న ఉమ్మడి కుటుంబం. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ రాను రాను చిన్న కుటుంబాలుగా విడిపోయి న్యూక్లియస్ కుటుంబాలుగా వేర్వేరు కుటుంబాల వ్యవస్థగా ఎలా మారుతూ వచ్చిందో, దేశంలో అలనాటి ఐక్యత అంతరించి భాషా ప్రయుక్త రాష్ట్రాలు, తర్వాత రాష్ట్రాల్లో ఉప రాష్ట్రాలుగా విభజనకు గురయ్యాయో చూస్తున్నాం. ఉమ్మడి కుటుంబం ప్రధానంగా ఆస్తుల విషయంలో తగాదేలేర్పడి చిన్న కుటుంబాలుగా ఎలా విడిపోతూ వచ్చాయో, దేశం కూడా ఆర్థిక విషయాల్లో కేంద్రానికీ, రాష్ట్రాలకు సమతుల్యత లోపించి రాష్ట్రాలు కూడా కేంద్ర - రాష్ట్ర ఆదాయ వ్యయాల విషయంలో తగాదాలు ఏర్పడి ప్రాంతీయ పార్టీలు ఏర్పడడం, కేంద్రం ఎక్కువ వనరులు తన చేతుల్లో ఉంచుకోవడం, రాష్ట్రాలు తమకు ఇంకా అధికంగా వనరులు కావాలని కోరడం మనం చూస్తున్నాం.

ఉమ్మడి కుటుంబం చిన్న కుటుంబాలుగా విడిపోతున్నా, రాకపోకలు, పెళ్లిళ్లు పేరంటాల సందర్భంలో కలుసుకోవడం ఎలా లాంఛనంగా జరుగుతుందో, కేంద్ర రాష్ట్ర సంబంధాలు కూడా అంత లాంఛనంగా మాత్రమే కొనసాగుతున్నాయి. ఈ పరిణామాన్ని గమనించిన కేంద్రం కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాల పరిష్కారం దిక్కుగా ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేసి అయిదేళ్లకొకసారి ఈ సంబంధాలను పునఃపరీక్ష చేయడం జరుగుతోంది. రాష్ట్రాలు తమ ఆర్థిక సమస్యలను ఈ కమిషన్ ముందు ఏకరువు పెట్టడం దుకాణంలో కొసరుపెట్టినట్లు కమిషన్ అరకొర నిధులు అదనంగా సిఫార్సు చేయడం జరుగుతోంది. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకేపార్టీ పరిపాలిస్తున్నంత కాలం ఏదో కుటుంబ వ్యవహారంగా సర్దుకొని పోవటం జరుగుతూ వచ్చినా, రాష్ట్రాలు అసంతృప్తితో కొనసాతున్నాయి. మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్.టి.రామారావు పరిపాలనా సమయంలో దేశంలో కాంగ్రెసేతర పార్టీల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసి కేంద్రం మిథ్య అనే నినాదంతో ఈ సమస్యకు ఒక ఉద్యమ స్వరూపం వచ్చింది. రాజ్యాంగం ప్రకారం మనది ఫెడరల్ వ్యవస్థ అయినా, యూనిటరీ పరిపాలనే కొనసాగటంతో కేంద్రంలో ఇటు మంత్రులు, అటు అధికారులు వీలైనంత ఎక్కువ అధికారాలను, పరిపాలనాధికారాలను రానురాను మరింతగా తమ చేతుల్లోనుంచి పోకుండా రాష్ట్రాల పగ్గాలను విడిచిపెట్టకుండా ఉచ్చు మరింతగా బిగిస్తూ వచ్చారు.

ఉదాహరణ స్వర్గీయ కాసు బ్రహ్మానందరెడ్డి ఫైనాన్స్ కమిషన్ అధ్యక్షునిగా 70వ దశకంలో నియమితులైనప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రతిపాదిత పథకాలకు కేటాయింపులు చేసి, అవి ఎలా అమలు జరుగుతున్నాయో పరిశీలించే నెపంతో మంత్రులు, అధికారులు దేశమంతటా తిరుగుతూ, ఫలానా గ్రామంలో ఫలానా పథకం అమలు చేయాలని, అలా అమలు చేస్తే నిధులు విడుదల చేస్తామని అనటంతో కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా ఉన్న బ్రహ్మానందరెడ్డికి మింగుడు పడక, కేంద్రం ప్రతిపాదించిన పథకాల అమలును, అందుకు కేటాయించిన నిధులను రాష్ట్రాలకు బదిలీ చేయాలని సిఫార్సు చేశారు. తమ చేతుల్లో ఆ మేరకు అధికారాలు, ఆ పేరుతో దేశం అంతటా ప్రయాణాలు ఆగిపోతాయని కేంద్ర మంత్రులు, అధికారులు ఆ సిఫార్సును అంగీకరించినట్లే అంగీకరిస్తూ, అదే సమయంలో ఆ పథకాలనే మరో రూపంలో కొత్తగా రచించి, అలాంటి అధికారాలను ఈరోజు వరకూ తమ చేతుల్లో కేంద్రీకరించుకొంటూ వస్తున్నారు. కేంద్రం బలహీనత ఇదయితే, రాష్ట్రాలు కూడా ఏమి తక్కువ తినలేదు. ఈ పథకాలకు కేంద్రం ఇచ్చే నిధులను సరిగా ఖర్చు చేయకపోవడంతో, ఆ మొత్తాన్ని వంతులుగా విడుదల చేస్తూ, మొదటి వంతు ఖర్చు వివరాలు తెలియజేస్తేనే రెండో వంతు నిధులు విడుదల చేస్తామనే షరతు విధించింది.

రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలకిచ్చిన నిధులను వేరే కార్యక్రమాలకు మళ్లించడం పథకాలు అమలు జరక్కపోవడం, కేంద్రం ఇచ్చిన నిధులకు ఏ పథకాల పేరుతో విడుదల చేసిందో, ఆ పేరును మార్చి తమ సొంత పేర్లు పెట్టుకొని, రాష్ట్ర ప్రభుత్వాలే ఈ పథకాలను రచించినట్లు, అమలు పరుస్తున్నట్లు ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం మెహర్బానీ అన్నట్లు ప్రవర్తించాయి. వీళ్ల రోగం ఇలా ఉందా అని రాష్ట్ర ప్రభుత్వాలే రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ల ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఈ విధంగా కేంద్రం మీద రాష్ట్రాలు బాణాలు సంధిస్తే, కేంద్రం ఈ ఏర్పాటు ద్వారా ఆ బాణాలను తిప్పికొట్టింది. రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటైతే చేసింది గాని, వాటి అమలు, సిఫార్సులు, తమకు ఇబ్బందుల్లేనివి అంగీకరించడం లేకపోతే ఆ సిఫార్సులను కొంత మేరకు అంగీకరిచడం, నిర్ణీత సమయంలో సిఫార్సులను అందజేయకపోయినా, పటించుకోకపోవడం జరుగుతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుస్తీల మధ్య ప్రజలు నలిగి పోతున్నారు. వారికందాల్సిన పథకాల ఫలితాలు అందకుండా పోతున్నాయి. ప్రస్తుతం 13వ ఫైనాన్స్ కమిషన్, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల

మధ్య సంబంధాల గురించి రెండు కమిషన్లు పని చేస్తున్నాయి. కేంద్ర-రాష్ట్ర కమిషన్ పరిధి చాల విస్తృతమైంది. ఆర్థిక సంబంధాలతోపాటు, గవర్నర్ పాత్ర, ప్రణాళికకు చట్టబద్ధత, శాశ్వత ప్రాతిపదికన ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు, ఫెడరల్ వ్యవస్థ పనితీరు, రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, కేంద్ర నిధుల పంపకం, కేంద్రం రాష్ట్రాల కిచ్చే గ్రాంట్లు, కేంద్ర ప్రతిపాదిత పథకాలూ ఇలా అనేక విషయాలను ఈ కమిషన్ పునఃపరిశీలించి సిఫార్సులు చేస్తుంది. మొదటి కమిషన్‌ను 1980 దశకంలో ఎన్.టి.ఆర్. కేంద్రం మిథ్య అనే నినాద నేపథ్యంలో కేంద్రం ఏర్పాటు చేసింది. ఇపుడు అనేక రాష్ట్రాలు వివిధ రాజకీయ పార్టీలు పరిపాలన చేస్తున్నా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒతిళ్లు పెరుగుతున్న నేపథ్యంలో ఈ కమిషన్ ఏర్పాటైంది. వేర్పాటువాదం, రాష్ట్రాల విభజన గురించి ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మనం బెంగాలీలం, తెలుగువాళ్లం, తమిళులం, కన్నడవాళ్లం, బీహారీలం, ఆ తర్వాత మనం భారతీయులం అనే వినబడుతోంది కాని మొదట భారతీయులం అనే స్పృహ రాను రాను సన్నగిల్లుతోంది. ఎపుడో యుద్ధం వచ్చినపుడు, లేక ఇటీవల ముంబై అగ్నిగుండం అయినపుడు మాత్రం మనం భారతీయులుగా స్పందింస్తాం. లేకపోతే ఎవరి కుంపటి వారిదే. తాగునీటికోసం, పంట నీటికోసం ఇపుడు రాష్ట్రాల మధ్య మాటల యుద్ధాలే జరుగుతున్నాయి.

ఈ దుష్పరిణామానికి కాంగ్రెస్‌పార్టీయే పూర్తి బాధ్యత వహించాలి. ఎందుచేతనంటే గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్లు దేశం అంటే రాష్ట్రాల సమాహారం, దేశాభివృద్ధి అంటే రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి. రాష్ట్రాలు వెనుకబడితే, దేశం ఎలా అభివృద్ధి అవుతుంది? రాష్ట్రాలు లేకపోతే, కేంద్రం అనేదే మిథ్య. ఆర్థిక వనరులను ఇతోధికంగా ఇచ్చే వనరులను కేంద్రం చేతుల్లో ఉంచుకోవటమే కాక చట్ట ప్రకారం కేంద్రం పరిధిలో ఉన్న పన్నులపై సెస్‌లు విధించి ఆ సెస్సుల నుంచి వచ్చే ఆదాయం రాష్ట్రాలకు పంచకపోవడం వంటి దొడ్డిదారి పద్ధతుల ద్వారా రాష్ట్రాలను నీరసపరుస్తుంటే రాష్ట్రాలు చేతులు ముడుచుకొని కూర్చోలేవుకదా. అలాగే విస్తృత పరచగలిగే వనరులను తమకు తామే కేటాయించుకొంటూ, రాష్ట్రాలకు ఇన్ ఎలాస్టిక్ వనరులను కేటాయించడం వంటి అడ్డదారులు తొక్కడంతో రాష్ట్రాల్లో అధికారేతర పార్టీలు మునగదీసుకొని కూర్చొంటాయా? వారు గళం విప్పారు. అలా విప్పిన ఫలితమే రాష్ట్రాలకు పరిమితమైన ప్రాంతీయ పార్టీలు. ఎక్కడెక్కడైతే ఆ పార్టీలు బలం పుంజుకున్నాయో అక్కడక్కడ ఆ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అలాంటి పార్టీలకు లక్ష్యం వారి వారి రాష్ట్రాల అభివృద్ధి మాత్రమే. ఈ విధంగా ఫెడరలిజం బలహీనపడుతోంది. యూనిటరీ పరిపాలన బలపడుతోంది. ఈ ధోరణులను నిరోధించడమే ప్రాంతీయ పార్టీల లక్ష్యం.

కొద్ది నెలల్లో జరగబోయే సాధారణ ఎన్నికల్లో అలాంటి పార్టీలన్నీ ఏకమై, తృతీయఫ్రంట్ రూపొందించుకొని అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వాన్ని సవాలు చేస్తున్నాయి. ఈ కలయికలు అవకాశవాద, అధికారకాంక్షతో కూడిన సిద్ధాంతరహిత కలయికే కావచ్చు, కాని కేంద్ర-రాష్ట్రాల మధ్య న్యాయమైన, ప్రజాస్వామికమైన నిధుల పంపకం విషయంలో వారందరి అభిప్రాయాలూ ఒక్కటే. అంతేగాక ఇటీవల కాంగ్రెస్, కాంగ్రెసేతర పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థికశాఖ మంత్రులు ఫైనాన్స్ కమిషన్లకు పంపిస్తున్న నివేదికల్లో రాజ్యాంగ చట్టం ప్రకారం రాష్ట్రాలతో కేంద్రం పంచుకోవాల్సిన పన్నుల ఆదాయంలో యాభై శాతం రాష్ట్రాలకివ్వాలని డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. కేవలం పన్నుల పంపకమేగాని ఆ పన్నులకు అదనంగా సెస్‌ల పేరుతో కేంద్రం వసూలు చేస్తున్న ఆదాయం కూడా చేర్చాలని, ఆయా రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులు, సమస్యలను పరిష్కరించుకోవటానికి కేంద్రం ఇచ్చే గ్రాంట్లు కేంద్రం తన ఇష్టం వచ్చినట్లు కాక ఆ మొత్తాన్ని పంపకం చేయడం నియమ బద్ధంగా ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ గ్రాంట్ల విషయంలో కూడా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రతిపక్ష పార్టీలు ఏకాభిప్రాయంలో ఉన్నాయి. గ్రాంట్లు ఇవ్వడానికి అధికారం ఉన్నంతకాలం దాని దుర్వినియోగానికే ఆ అధికారం ఉపయోగించిన సందర్భాలే ఎక్కువగా ఉన్నాయి కాబట్టి, ఆ అధికారాన్ని రద్దు చేయాలనే అభిప్రాయం కూడా ఉంది.

చారిత్రక కారణాల వల్ల కొన్ని రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా ఉంటే మరికొన్ని రాష్ట్రాలు వెనకబడే ఉన్నాయి. అరవై రెండు సంవత్సరాల తర్వాత కూడా అదే స్థాయిల్లో ఉన్నాయి. ఉదాహరణకు శ్రీకాకుళం, విజయనగరం, మహబూబ్‌నగర్ (రాష్ట్ర రాజధానికి పక్కనే ఉన్నా) ఆదిలాబాద్ జిల్లాలు అపుడూ ఇపుడూ వెనుకబడే ఉన్నాయి. అలాగే దేశంలో ప్రణాళికా సంఘం కూడా ఈ వెనుకబాటుతనాన్ని అంతం చేయడంలో వైఫల్యం చెందిందనే చెప్పాలి. జాతీయ అభివృద్ధి మండలి కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోలేకపోయింది. ఈ వెనుకబాటుతనాన్ని అంతం చేయడానికి ప్రతీ రాష్ట్రానికీ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి (అవసరమైతే అభివృద్ధి చెందిన జిల్లాలకు కేటాయింపులు తగ్గించయినా సరే) నిర్దిష్ట కాలవ్యవధిలో వెనుకబాటుతనాన్ని పోగొట్టాలి. అసలే కేంద్రం, రాష్ట్రాల మధ్య అసమానతలు అలా ఉండగా, వాటికి రాష్ట్ర ప్రభుత్వాల అలక్ష్యం తోడై, ఆ రాష్ట్రాల, జిల్లాల, ప్రాంతాల అసమానతలు తోడై, వాటి అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడంలో ఆ ప్రాంతాల వెనుకబాటుతనాన్ని మరింత పెంచి పోషిస్తున్నాయి. దానికి ఒక ప్రధాన కారణం అధికారం కేంద్రం నుంచి గ్రామాలకు చేరుతుంది. గాంధీజీ అన్నట్లు అధికారం, పరిపాలన గ్రామస్థాయి నుంచి కేంద్ర స్థాయికి ప్రవహించాలి; పిరమిడ్ రూపంలో ఉండాలి. కాని ఆచరణలో పథకాలు, కేంద్రంలో ప్రారంభమై, చిట్టచివరకు గ్రామాలకు చేరుతున్నాయి.

నా పాత్రికేయ జీవితం ఢిల్లీలో యాభైవ దశకంలో ప్రారంభమై, విశాఖ చేరి తిరిగి మధ్యస్తంగా హైదరాబాద్‌లో స్థిరపడ్డాను. ఢిల్లీ పార్లమెంట్ వార్తలు పంపినపుడు ఫలానా పథకం కోసం బడ్జెట్‌లో ఇన్ని వందల కోట్లు కేటాయించారనే వార్త పంపినపుడు అమ్మో ఇన్ని నిధులు ఖర్చు చేయబోతున్నారా అని ఆశ్చర్యపడేవాణ్ని. కాని నేను విశాఖపట్నంలో పని ప్రారంభించి గ్రామీణ ప్రాంతాలను సందర్శించినపుడు ఆ గ్రామాలకు ఆ పథకాల నిధులు చేరేసరికి, వందల రూపాయల్లోనే ఉండేవి. అంత చిన్న మొత్తంతో ఆ గ్రామం అభివృద్ధి చెందటానికి ఎన్ని పదుల సంవత్సరాలు పడుతుందా అని అనిపించింది. ఇప్పటిలా, అభివృద్ధి ప్రణాళికలు గ్రామస్థాయి నుంచి మండలం, జిల్లా, రాష్ట్రం వరకూ పైపైకి పోతే ప్రణాళికలు, కేటాయింపులు ఒక పథకం ప్రకారం రచన జరిగి ఉండేది. కాని జరుగుతున్నదేమంటే మనవద్ద ఎన్ని నిధులున్నాయో లెక్కవేసి ఆ మేరకు ప్రణాళికలు కుదించ

బడుతున్నాయి. ఈ నిధులు ఎటూ చాలక అభివృద్ధి కుంటుపడుతూ వచ్చింది. అదీకాక ప్రణాళికా సంఘానికి రాజ్యాంగ పరమైన అధికారాలు లేవు. అధికారం లేని ప్రణాళికా సంఘం ఆదేశాల మేరకు ఆ రాజ్యాంగాధికారాం కల రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పని చేయటమా? ఇదంతా విడ్డూరంగా ఉందని కేంద్రానికి అనిపించలేదా? ప్రణాళిక సాధికార వ్యవస్థగా ఉండాలి. ఈ విషయంలో కూడా ప్రాంతీయ, ప్రతిపక్ష పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉంటుంది.

పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. తాతాచార్యులు గారి ముద్ర పడిన తర్వాత 'ప్రెసిడెంట్ ఈజ్ ప్లీజ్డ్ టు....' అని ప్రకటన వెలువడుతుంది. ఇది లాంఛనం మాత్రమే. కాని వాస్తవంలో అధికారంలో ఉన్న పార్టీ ఆమోదం మాత్రమే. ఆ ఆమోదం పొందిన వెంటనే ఆ చట్టం ఆచరణలోకి రాదు. ఆ చట్టం ఆచరణలోకి రావటం కోసం నియమ నిబంధనలను పాలనా యంత్రాంగం రూపొందించాలి. కొన్ని సందర్భాల్లో పాలకపార్టీకి ఇష్టం లేకపోయినా, అనేక కారణాల వల్ల బిల్లు ప్రవేశపెట్టడం జరుగుతుంది. అలాంటపుడు పాలకపార్టీ నియమ నిబంధనాలను తయారు చేయడంలో నెలలూ, సంవత్సరాలు పడుతోంది. అంతా పాలక పార్టీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటోంది. అలా తుది ఘట్టం దాటిన తర్వాత అమలు పరచడం ప్రారంభమవుతుందని కూడా అనుకోలేం. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జిల్లా కలెక్టర్లకు, వారు వారి కింద పరిపాలనా యంత్రాంగానికి అందచేయడం జరగాలి. దానికి కావాల్సిన నిధులను కేంద్రం, రాష్ట్రం చట్టంలో పొందుపరచిన విధంగా విడుదల చేయాలి. ఆ పనులు చేయడానికి ఒకవేళ టెండర్లు పిలవాలంటే అదో పెద్ద తతంగం. ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని కుదించలేమో? ఇది ఫైనాన్స్ కమిషన్ పరిధిలోకి రాదా? ఇన్ని ఫైనాన్స్ కమిషన్ల పరిపాలనా సంస్కరణ కమిషన్లు ఏమీ చేయలేకపోయాయా?

దేశ రక్షణ, విదేశాంగ విధానం, విదేశాలతో వ్యాపారం, ద్రవ్య, పరపతి విధానాలు తప్ప, మిగతా అధికారాలన్నీ రాష్ట్రాల పరిధిలో ఉండాలనే నెహ్రూ విధానాన్ని కాంగ్రెస్ పార్టీయే తుంగలో తొక్కింది. రాజ్యాంగం ప్రకారం ఏయే రంగాలు కేంద్రం పరిధిలో లేదా రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉండాలో ఉమ్మడి పరిధిలో ఉండాలో నిర్ధారణ చేసింది. కాని ఆచరణలో ఈ పరిధుల్ని కేంద్రం నీరుకార్చి, రాష్ట్రాధికారాలు కొన్నింటిని తన పరిధిలోకి లాగేసుకుంది. ఉదాహరణకు వ్యవసాయం పూర్తిగా రాష్ట్రాల పరిధిలో ఉంది. కాని ఆచరణలో ప్రతి సంవత్సరం రైతులు ఏయే పంటలి ఎన్ని లక్షల హెక్టార్లలో పండించాలి, రాష్ట్రాలకు ఎన్ని లక్షల టన్నుల ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి, ఆహార వ్యాపార పంటల కనీస ధర ఎంత, కేంద్రానికి ఎంత కేటాయించాలి – అన్నీ కేంద్రమే నిర్ణయించి ఆదేశాలిస్తుంది. పెరిగిన ఖర్చుల దృష్ట్యా ధాన్యం ధర వెయ్యి రూపాయలుగా నిర్ణయించాలని రాష్ట్రం రెండు సంవత్సరాలుగా ఆందోళన చేసినా, శాసనసభ ఏకగ్రీవంగా నిర్ణయించి పంపినా, దిక్కూమొక్కూ లేదు. పేరు రాష్ట్రానిది, అధికారం కేంద్రానిది. పేరుకు ఫెడరల్ వ్యవస్థ, ఆచరణలో యూనిటరీ వ్యవస్థ! ఇది రాజ్యాంగ వ్యతిరేక విధానమని, ఆచరణ అని కాంగ్రెస్ పార్టీ కాదనగలదా? కాదనలేదు. ప్రతిపక్షాలు గొడవచేసి సాధిస్తే తమ మనస్సులో ఉన్న కోర్కె కూడా నెరవేరుతుదనేది కాంగ్రెస్ ఆలోచన కాబోలు. కాంగ్రెసేతర పక్షాలు గొంతెమ్మ కోర్కె ఏమీ అడగడంలేదు; రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు వాటి అధికారాలను వారు చెలాయించుకోవాలని మాత్రమే. ఈ అధికారం కావాలని తృతీయ ఫ్రంట్ కలసి ఎన్నికల్లో పోటీ చేస్తే తప్పేమిటి?

గవర్నర్లు గవర్నర్లా, పాలకపార్టీ ఏజెంట్లా? గవర్నర్లు ఆరోవేలు లాంటి విమర్శలు మొట్టమొదట నుంచీ వినవస్తున్నాయి. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన వారే గవర్నర్లుగా రావడం చూస్తున్నాం. పాలకపార్టీ మారినపుడల్లా గవర్నర్లు మారుతుంటారు. లేకపోతే పార్టీలో సీనియర్లు, ప్రముఖులకు ఎటువంటి పదవులు లేకుంటే గవర్నర్‌గా నియమించడం, లేదా వయసుమళ్లిన వారినే నియమించడం, కేంద్రంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటే, ఆ పార్టీని ఇబ్బందుల పాలుచేసే వారిని నియమించడం జరుగుతుంది. 80వ దశకంలో ఎన్.టి.రామారావును దించటానికి ఆయన అమెరికా వెళ్లినపుడు గవర్నర్‌ను సాధనంగా చేసుకొని నాదేండ్లను ముఖ్యమంత్రిగా నియమించినపుడు కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాగాంధీ ఎటువంటి కుట్ర పన్నిందో మనందరం చూసాం. ఇలా అనేక విమర్శలకు, వివాదాలకు గురవుతూ వస్తున్న ఈ పదవిని రద్దు చేస్తే పోలా. లేదా రాజకీయ పార్టీలు గవర్నర్ పదవని పావులుగా ఉపయోగించకుండా ఉండాలంటే ప్రధాని, హోంశాఖామంత్రి, ప్రతిపక్ష నాయకులు, ఒక సుప్రీంకోర్టు జడ్జీతో ఒక జాతీయ కమిటీ గవర్నర్ పదవికి అర్హులైన వారిని ఎంపిక చేయాలని, ఆ కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి గవర్నర్‌ను నియమించాలనే సూచన ఆలోచించదగింది.

భారతదేశం సువిశాలమైన దేశం; 28 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు, విభిన్నమైన సహజసంపదలు ఉన్నాయి. కొన్ని వెనుకబడిన ప్రాంతాలైతే, మరికొన్ని బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు కావడంతో వారి ఆర్థికపరిస్థితులు కూడా విభిన్నమైనవి. ఒకేరకమైన చట్టాలు అమలుపరిస్తే కొన్ని రాష్ట్రాల పరిస్థితులు మెరుగైతే మరికొన్ని వాటిని అమలుపరచుకోలేవు. ప్రకృతి వైపరీత్యాలతో సాధించిన కొద్దిపాటి అభివృద్ధి తుడిచిపెట్టుకపోతోంది. ఢిల్లీలో కూర్చున్న కేంద్రానికి ఇది తలకుమించిన పని. ఇప్పుడు ముఖ్యమంత్రులు, తదితర మంత్రుల జాతీయాభివృద్ధి మండలి లాంటి వ్యవస్థలు అప్పుడప్పుడు సమావేశాలు చేస్తుంటే సమస్యలు పరిష్కారం కావడంలేదు. వనరుల సమీకరణ, వివిధ రాష్ట్రాలకు వాటి పంపకం, రాష్ట్రాల కోర్కెలు – ఇలాంటివన్ని నిరంతరంగా పరిశీలించడానికి శాశ్వత వ్యవస్థలు అవసరం. ఇందుకోసం ప్రధాని, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖల మంత్రులు, గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకులు, కొద్దిమంది ఆర్థిక నిపుణులతో ఒక జాతీయ స్టాండింగ్ కమిటీ ఏర్పాటు చేయడం అభిలషణీయం. ఆయా రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ, ఆందోళనకు దారితీస్తున్న పరిస్థితులలో వేర్పాటువాదం తలెత్తుతుంది. కనుక ఇలాంటి కమిటీ ఆ సమస్యలను ఎప్పటికప్పుడు గమనించి పరిష్కరిస్తోంటే ఇటువంటి వాదాలు తలెత్తవు.

కేంద్ర – రాష్ట్ర సంబంధాల గురించి ఏర్పాటైన కమిటీ ఈ సూచనలను గమనంలోకి తీసుకుంటుందని ఆశించాలి. రాజకీయ పార్టీలు ఈ కమిటీకి ఇచ్చే నివేదికలను తయారుచేయడానికి సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలి. వీ

అభివృద్ధికి ఎన్ని పేర్లు పెట్టినా ఫలాలు మాత్రం పాలకులకే అంటూ ఆర్థిక మాంద్యం ప్రభావంతో సంక్షోభంలో పడిన ఉపాధి అవకాశాల గురించి వివరిస్తున్నారు ఇ.ఎస్. బ్రహ్మచారి

మళ్లీ ఉద్యోగాలు ఎన్నేళ్లకో?

'నీ పక్కవాడికి ఉద్యోగం పోతే మాంద్యం
నీకే పోయిందనుకో అప్పుడది సంక్షోభం' అని

అనడం అందరం వినేవుంటాం. అయితే ఇది కేవలం ఉద్యోగులకి సంబంధించింది. ఉన్న సరుకులు అమ్ముడుపోకపోతే వర్తకులకి మాంద్యం. ఉత్పత్తయిన సరుకులకి సరిపడా ఆర్డర్లు రాకపోతే ఉత్పత్తిదారులకి మాంద్యం. స్టాక్ మార్కెట్లు పడిపోతుంటే మదుపుదారులకి మాంద్యం. అప్పులివ్వటానికి బ్యాంకుల్లో డబ్బు లేకపోతే ద్రవ్య సంక్షోభం.

అర్థశాస్త్రజ్ఞుల నిర్వచనం వీటన్నిటికంటే వేరుగా ఉంటుంది:

రెండు త్రైమాసాలు వరుసగా దేశ స్థూలజాతీయోత్పత్తి క్షీణిస్తే ఆ దేశం మాంద్యంలోకి జారినట్లు.

ఇప్పటికింకా అమెరికా స్థూలజాతీయోత్పత్తి అలా క్షీణించలేదు. ఈ నిర్వచనం ప్రకారం ఆ దేశం మాంద్యంలో పడలేదు. మరైతే మాంద్యంలో ఉన్నట్లు ఎలా ప్రకటించినట్లు? మరొక లెక్కప్రకారం అయి ఉండాలి. అదెలాగంటే:

అమెరికాలో వాణిజ్య వలయాల గురించి చెప్పేపని నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రిసెర్చ్ అనే సంస్థది. బిజినెస్ సైకిల్ డేటింగ్ కమిటీ సమావేశంలో మాంద్యం ఎప్పుడొచ్చిందీ నిర్ధారిస్తారు. అలాగే ఎప్పుడు ముగిసిందీ చెబుతారు. ఆ కమిటీ జాతీయోత్పత్తిని మాత్రమే తీసుకొని మాంద్యాన్ని నిర్ధారించదు. ఉదాహరణకు 2001 మాంద్యంలో వరసగా రెండు త్రైమాసాలు (క్వార్టర్స్) స్థూలజాతీయోత్పత్తి తగ్గలేదు. ఇతర సూచికలను కూడ తీసుకొని మాంద్యం ఉన్నట్లు ప్రకటించారు. దీనర్థం జాతీయోత్పత్తిని లెక్కలోకి తీసుకోదని కాదు. దీన్నొక్కటే కాకుండా మరికొన్ని అంశాలని కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. ఉద్యోగాలూ, నిజ ఆదాయాలూ అమ్మకాలూ, పారిశ్రామికోత్పత్తి అంశాలని పరిగణనలోకి తీసుకొని, ఆ సంస్థ 1 డిసెంబర్ 2008 న అమెరికా మాంద్యంలో ఉన్నట్లు ప్రకటించింది. పైగా 2007 డిసెంబర్‌లోనే మాంద్యంలో పడ్డట్లు తేల్చింది. అంటే ఇప్పటికి సంవత్సరం అన్నమాట.

& & & & &

డిసెంబర్ 5 శుక్రవారం విడుదలైన రిపోర్ట్ ప్రకారం నవంబర్‌లో ఐదు లక్షల ముప్పై మూడు వేల ఉద్యోగాలు పోయాయి. సెప్టెంబర్ అక్టోబర్ నెలల నివేదికలను సవరించారు. సెప్టెంబర్‌లో నాలుగు లక్షల మూడు వేలు, అక్టోబర్‌లో మూడు లక్షల ఇరవై వేల ఉద్యోగాలు పోయాయని తేల్చారు. నిపుణులు సైతం నివ్వెరపోయారు. మహా అయితే మూడు లక్షల యాభై వేలు అన్న వారి అంచనాలు తప్పని తేలిపోయింది. నిరుద్యోగం రేటు 6.7 శాతం. మాంద్యం మొదలైన డిసెంబర్ 2007 నుంచి ఈ రేటు 1.7 శాతం పెరిగింది. 1974 డిసెంబర్ నుంచీ ఇన్ని ఉద్యోగాలెన్నడూ పోలేదు. మరొక లెక్క (గృహ సర్వే) ప్రకారం ఆరు లక్షల డెబ్భైమూడు వేలు పోయాయి. నాలుగు లక్షల ఇరవై రెండు వేల మంది కార్మికులు మార్కెట్లో లేరని కార్మికశాఖ చెప్పింది. వీళ్లు ఉద్యోగాలు రావనే నిరాశతో ప్రయత్నం విరమించుకున్న వాళ్లు. వీళ్లని కూడా కలిపితే రేటు 7 శాతాన్ని చేరేది. బుష్ కాలంలో 2001 మాంద్యం తర్వాత వచ్చిన ఉద్యోగాలు తక్కువ. ఫుల్‌టైం ఉద్యోగాల స్థానంలో పార్ట్‌టైం ఉద్యోగాలు పెరిగాయి. వాళ్లంతా ఫుల్‌టైం కోరుకునే వాళ్లే. కాని దొరకకపోవటంతో అలా మిగిలిపోయారు. అందరినీ కలిపితే రేటు 12.5 శాతం ఉంటుంది. 1994లో ఈ లెక్క తీయటం మొదలెట్టాక ఇదే అతి ఎక్కువ. వికాస కాలం (బూమ్)లో వచ్చిన ఉద్యోగాల్లో నూటికి 43 రియల్ ఎస్టేట్‌కు సంబంధించినవే. వాళ్లలో ఎక్కువమంది తమ ఉద్యోగాలను తాము కల్పించుకున్నవారే. వీళ్లు ఉద్యోగ సమాచారంలో లెక్కలోకిరారు.

మరీ ఇబ్బందికరమైంది : నవంబర్‌లో పోయిన ఐదు లక్షల ముప్పై మూడు వేల ఉద్యోగాల్లో మూడు లక్షల డెబ్బై వేలు సేవారంగానికి చెందినవి కావటమే. పోయినవాటిలో ఇవి డెబ్భై శాతం. ఇప్పటిదాకా ఇతర రంగాల్లోనే ఎక్కువగా పోయాయి. సేవారంగం కొద్దిగానే దెబ్బతిన్నది. ఈసారి మాత్రం భారీగా కోల్పోయింది. ఆందోళనకి కారణం: అమెరికా జాతీయోత్పత్తిలో ఎనభై శాతం ఈ రంగం నుంచి రావటమే. పది నెలలుగా నిలదొక్కుకున్న సేవారంగం నవంబర్‌లో నిభాయించలేకపోయింది. అయిదింట నాలుగొంతుల స్థూలజాతీయోత్పత్తికి కారణమైన రంగంలో మాంద్యం జొరబడింది. ఈ రంగం దెబ్బతింటే అమెరికా ఆర్థికవ్యవస్థ దెబ్బతిన్నట్లే. ఈ విషయంలో ఆర్థికవేత్తల్లో తేడాలు లేవు.

2008 జనవరి నుంచీ ఆగస్ట్ దాకా ఎనిమిది నెలల్లో పోయిన ఉద్యోగాలు ఆరు లక్షల యాభై ఆరువేలు. కాగా సెప్టెంబర్–అక్టోబర్–నవంబర్ మూడు నెలల్లో పోయినవి పన్నెండు లక్షల యాభై ఏడు వేలు. ఆ ఎనిమిది నెలల్లో కంటే ఈ మూడు నెలల్లో పోయినవి ఇంచుమించు రెట్టింపు. దీన్ని బట్టి ఉద్యోగాలు పోయే వేగం

బాగా పెరుగుతోంది. మొత్తం ఈ ఏడాది పందొమ్మిది లక్షలకి పైగా పోయాయి. ఇక డిసెంబర్‌లో ఇంకా ఎక్కువే పోయేట్లున్నాయి. ఆరు లక్షలని ఎక్కువమంది అభిప్రాయం. ఒబామా జనవరిలో పగ్గాలు పట్టేటప్పటికి ఇరవై ఐదు లక్షల ఉద్యోగాలు పోయివుంటాయి. ఒబామా కల్పిస్తానన్న ఈ ఇరవై ఐదు లక్షల ఉద్యోగాలు – అదీ రెండేళ్లలో. మరి ఆ తర్వాత 2009 అంతా మాంద్యమేనని ఏకాభిప్రాయం. ఆ తర్వాత కొనసాగవచ్చు. 2010లో ఒకవేళ స్థూలజాతీయోత్పత్తి పెరగటం మొదలైనా ఉద్యోగాలు పోతూనే వుంటాయి. మరి వాటన్నిటి సంగతి ఏమిటి?

& & & & &

దశాబ్దాలుగా ప్రభుత్వాలు పెట్టిన నిబంధనల మూలంగా ఉద్యోగాలు పోయినవాళ్లలో మూడవవంతుకి మాత్రమే నిరుద్యోగ భృతి అందుతుంది. అదీ కుటుంబానికి చాలీచాలని మొత్తమే. నవంబర్‌లో కార్మికుల పనిగంటలు వారానికి 33.5 మాత్రమే. ఇన్ని తక్కువ గంటల పనివారం 1964 నుంచీ ఎన్నడూ లేదు. దీనికి సంబంధించిన రికార్డ్ మొదలైంది 1964లో.

డిసెంబర్ 24న కార్మిక శాఖ తన నివేదికలో పోయిన వారం నిరుద్యోగ ప్రయోజనాల కోసం 586,000 దరఖాస్తులు అందాయి. అంతకు ముందు వారం కంటే యాభై ఎనిదివేలు ఎక్కువ. 1982 నవంబర్ నుంచీ ఇంతమంది ఎన్నడూ చేతులు చాచలేదు. ఎన్నో రాష్ట్రాల్లో ఇందుకు నిధులు అయిపోయాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఫెడరల్ ప్రభుత్వం నుంచి అప్పులు తీసుకొని ఉన్నాయి. మరికొన్ని అప్పులడగడానికి రెడీగా ఉన్నాయి.

నిజవేతనాలు పెరగకున్నా నిత్యావసరాల ధరలు పెరిగాయి. 2007 జనవరిలో ద్రవ్యోల్బణం 2.08 శాతం. 2008 జనవరికి అది 4.28 శాతానికి చేరింది. జూలైలో 5.36 శాతం నమోదయింది. దాంతో ప్రజల ఇక్కట్లు ఎక్కువయ్యాయి. ఖర్చులు తగ్గించుకోక తప్పలేదు. కొన్ని అవసరాలు వదులుకోవాల్సి వచ్చింది. కొనటం తగ్గించుకున్నారు. డబ్బు బయటకి తియ్యాలంటే అజ్జాయించారు. దాంతో అమ్మకాలు తగ్గాయి. ద్రవ్యోల్బణం వెనకాడింది. ఆగస్ట్‌లో 5.37, సెప్టెంబర్‌లో 4.94, అక్టోబర్‌లో 3.66 శాతం అయింది. గ్యాస్ ధరలూ అంతర్జాతీయ మార్కెట్లో బాగా తగ్గుతుండడంతోనూ, జనం కొనక విలాసవస్తువుల ధరలూ తగ్గటంతోనూ ద్రవ్యోల్బణం తగ్గుతూ ఉంది. కాని ఆహార పదార్థాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అక్టోబర్‌లో 0.3 శాతం, నవంబర్‌లో 0.2 శాతం పెరిగాయి. నవంబర్‌లో బట్టలు 0.3 శాతం పెరిగాయి. అంటే, సామాన్యులకి కావలసిన సరుకులకి ఎక్కువ చెల్లించాల్సి వస్తోంది. అమ్మకాలు తగ్గుతూనే ఉన్నాయి గాని పెరగలేదు. మాన్యుఫాక్చరింగ్ రంగంలో ద్రవ్యోల్బణాన్ని సవరిస్తే వేతనం నలభై సంవత్సరాలనుంచీ ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది.

& & & & &

స్థూలజాతీయోత్పత్తి నాలుగవ త్రైమాసంలో 4–5 శాతం వార్షికరేటు చొప్పున క్షీణించవచ్చని నిపుణుల అంచనా. 2009 సంవత్సరంలో రెండు శాతం క్షీణత ఉండవచ్చంటున్నారు. ఇది దీర్ఘకాలం కొనసాగుతుందని, ప్రపంచమంతా పాకి త్వరగా కోలుకోదని వారూ వీరూ అని తేడాలేకుండా చెబుతున్నారు. ఆ తర్వాత ఎప్పుడో ఎకానమీ ఎత్తుకుంటుంది. దీనర్థం స్థూలజాతీయోత్పత్తీ, అమ్మకాలూ, ఆదాయాలూ, పారిశ్రామికోత్పత్తీ పెరగటం మొదలౌతుందనే గదా? అంతమాత్రాన ఉద్యోగాలు వస్తాయనికాదు. రావు సరిగదా, పోవటమైనా ఆగదు.

1990 మాంద్యంలోనూ 2001 మాంద్యంలోనూ ఎకానమీ తిరిగి పుంజుకున్నాక ఎన్నో నెలలపాటు ఉద్యోగాలు పోతూనే ఉన్నాయి. 2001 మాంద్యంలో ముగిసిందన్నాక 11 లక్షల ఉద్యోగాలు పోయాయి.

ఇక్కడ ఒక సందేహానికి ఆస్కారముంది – సరుకుల ఉత్పత్తి పెరుగుతూ ఉన్నప్పుడు, శ్రామికులసంఖ్య పెరగాలిగదా, తగ్గుతూ ఉంటే ఉత్పత్తి తగ్గాలిగాని ఎలా పెరుగుతుంది?

అంతేపనిని తక్కువమంది చేత చేయిస్తారు. అంటే ఉత్పాదకత పెరిగిందన్నమాట. ఒక మనిషి ఇంతకుముందు ఉత్పత్తిచేసినదానికంటే అంతే కాలంలో ఎక్కువ సరుకు తయారుచేస్తే ఉత్పాదకత పెరిగినట్లు. ఎక్కువ ఉత్పత్తి చేశారు కాబట్టి కార్మికులకి ఎక్కువ ఇవ్వాలనేం లేదు. ఉదాహరణకి, 2000 –2007 మధ్య ఉత్పాదకత 18 శాతం పెరిగింది. కాని మధ్యతరగతి శ్రామిక కుటుంబాల సగటు నిజ ఆదాయం మాత్రం 0.6 శాతం పడిపోయింది. మాంద్యకాలంలో కంపెనీలు తక్కువమందితో ఎక్కువ పనిచేయిస్తారనేది అందరికీ తెలిసిన విషయమే. ఉత్పాదకత పెరుగుతుంది. కనక అంతే ఉత్పత్తి చెయ్యటానికి తక్కువమందే సరిపోతారు. కనక కొంతమందిని తొలగిస్తారు. దీన్ని కుదింపు (డౌన్ సైజింగ్) అనాలిగదా. అలా అనరు. సరిచెయ్యటం (రైట్ సైజింగ్) అంటారు. ఉన్న ఉద్యోగులు ఉద్యోగాలు ఎప్పుడు పోతాయోననే భయంతో ఎక్కువసేపు పనిచేస్తారు. మాంద్యం పోయిన తర్వాత కూడా ఇలానే పనిచెయించేందుకు యజమానులు ఒత్తిడి పెడతారు. లాభార్జనే లక్ష్యం గనక శ్రమచేసేవారి శారీరక మానసిక ఇబ్బందుల్ని గురించి ఆలోచించరు. వాళ్లలాభం వాళ్లకి చేరితే సరి. వాళ్ల ప్రయోజనాలు వాళ్లవి. కార్మికుల ప్రయోజనాలతో అవి ఏనాడూ కలవవు.

2001 మాంద్యంలో వృద్ధి రేటు పెరగటానికి కారణం ఉత్పాదకత పెరగటమేనని ఎన్.బి.ఇ.ఆర్. అంది. ఉదాహరణకి 2001 నవంబర్ నుంచీ స్థూలజాతీయోత్పత్తి బాగానే పెరిగింది. ఇదంతా ఉత్పాదకత పెరిగినందువల్లనే. అలాగని ఎన్.బి.ఇ.ఆర్. సంస్థే చెప్పింది. ఒక కార్మికుడు ఒకరోజుకి కొంత ఉత్పత్తి చేస్తాడు. నిన్నటికన్నా ఇవ్వాళ ఎక్కువ ఉత్పత్తి చేస్తే ఉత్పాదకత పెరిగినట్లు. పనిగంటలు పెరిగితే ఉత్పాదకత పెరుగుతుంది. శ్రమ తీవ్రత పెరిగినా ఉత్పాదకత పెరుగుతుంది. ఈ రెండు పద్ధతులను ప్రయోగించి కంపెనీలు ఉత్పాదకత పెంచుతాయి. లాభాలు పెంచుకుంటాయి. అలా ఒకవైపు నిజ స్థూలజాతీయోత్పత్తి పెరుగుతున్నా మరోవైపు ఉద్యోగాలు తగ్గుతాయి.

& & & & &

రికవరీ అన్నప్పుడు ఉత్పత్తి, అమ్మకాలూ పెరిగినాకనే రికవరీ మొదలైందంటున్నారు. అలాగే ఉద్యోగాలూ వస్తుండాలి గదా? రాకపోతే పోనీ అప్పటికున్నవైనా ఉండాలిగదా? పెట్టుబడిదారుల ఎదుగుదలకి సంబంధించిన ఉత్పత్తి అమ్మకాలూ పెరిగితే చాలా? భారీ సంఖ్యలో ఉండే కార్మికులకీ ఉద్యోగులకీ ఉపాధి కొడిగట్టుకపోతున్నా ఎకానమి ఉరుకుతున్నట్లేనా? అంతేనట. 1990లోనూ 2001లోనూ ఉద్యోగాలు

రాకపోయినా ఎకానమీ ఎత్తుకుందని ప్రకటించారు. దానికి ఉద్యోగాలు లేని రికవరీ అని ముద్దుపేరు పెట్టారు. పోయినవాళ్లకి ఉద్యోగాలు దొరకకపోయినా ఎకానమీ కోలుకున్నట్లేనట. అంటే అమ్మకాలు పెరిగితే కోలుకున్నట్లే. అదే గీటురాయి. వాణిజ్యం బాగుంటే సరి. శ్రామికుల జీవితాలు అస్తుబిస్తైనా ఫరవాలేదు. వారు దాన్ని ఉద్యోగాలు లేని (జాబ్‌లెస్) రికవరీ అంటుంటే బారీ బ్లూస్టోన్ అనే ఎకనామిస్ట్ అమెరికన్ ప్రాస్పెక్ట్ లో రాస్తూ ఉద్యోగాలు పోతున్న (జాబ్‌లాస్) రికవరీ అన్నాడు. వాస్తవానికది ఉద్యోగాలు పోతున్న రికవరీ. ఎందుకంటే కొత్తవి రాకపోగా ఉన్నవి కూడా పోతూ ఉన్నాయి. ఉద్యోగులకీ కార్మికులకీ ఉపాధి పోతున్నా రికవరీ అని ప్రకటించిన ఎన్.బి.ఇ.ఆర్. సంస్థ పెట్టుబడి వైపునుంచి మాత్రమే ఈ విషయాన్ని పరిశీలిస్తున్నదనీ, కార్మికవర్గాన్ని పట్టించుకోలేదనీ చెప్పటానికి ఇంతకన్న వేరే రుజువేం కావాలి?

1990 మాంద్యం జూలైలో మొదలై 1991 మార్చ్‌కి ముగిసిందని ఎన్.బి.ఇ.ఆర్. ప్రకటించింది. ఉద్యోగాల సంగతికొస్తే – నిరుద్యోగం రేటు మాంద్యం మొదలైన జూలై 1990లో 5.5. అది ముగిసిందని చెప్పిన 1991 మార్చ్‌లో 6.8 అక్కడినుంచీ వెనక్కేమీ తగ్గలేదు. పోనీ అలాగే నిలబడి ఉన్నదా అంటే అదీ లేదు. అక్కడ నుంచి పెరుగుతూ 1992 జూన్‌లో 7.8 అయింది. అప్పుడు తగ్గటం ప్రారంభించింది. 1993కి 6.8 కొచ్చింది. మాంద్యం మొదట్లో ఉన్న 5.5 శాతానికి వచ్చేసరికి 1996 మార్చ్ అయింది.

2001 మాంద్యం మార్చ్‌లో మొదలై అదే ఏడాది నవంబర్‌లో ముగిసింది అని ఎన్.బి.ఇ.ఆర్. ప్రకటించింది. ఆ మార్చ్‌లో నిరుద్యోగం రేటు 4.3, నవంబర్‌లో 5.6. అంతటితో ఆగలేదు. పెరిగి పెరిగి 2003 జూన్‌కి 6.3కి చేరింది. మాంద్యం అన్న కాలంలో పదహారు లక్షల మంది ఉపాధి పోతే, రికవరీ మొదలైందన్నాక 2003 జూన్‌కి పదకొండు లక్షల మంది ఇళ్లకు వెళ్లాల్సొచ్చింది. తిరిగి 2001 నవంబర్‌లో ఉన్న 5.6 శాతానికి రావటానికి 2004 జనవరి దాకా ఆగాల్సొచ్చింది. ఇక మాంద్యం వచ్చినప్పుడున్న 4.3 శాతం తాకనేలేదు. 2006 అక్టోబర్‌లో 4.4 తాకింది. అంతే, అక్కడ నుంచి మళ్లీ పెరగటమే.

ప్రస్తుత మాంద్యం వచ్చిన 2007 డిసెంబర్‌లో 5 శాతం. 2008 జనవరిలో 4.9 శాతం, ఫిబ్రవరిలో 4.8 శాతం, మార్చ్‌లో 5.1 శాతం, ఏప్రిల్‌లో 5 శాతం. అక్కడినుంచీ పెరుగుతూ నవంబర్‌కి 6.7 శాతం అయింది. ఈ మాంద్యం ముగిసింది అనేటప్పటికి ఎంతవుతుందో! ఆ తర్వాత ఎన్ని నెలలకి పైస్థాయిని తాకుతుందో! తిరిగి 5 శాతానికి ఎప్పటికొస్తుందో! 2001 మాంద్యంలో లాగా ఆ స్థాయికి రాదో అనుమానించాల్సిన పరిస్థితి.

✤ ✤ ✤ ✤ ✤

కంపెనీలకీ, స్టాక్‌మార్కెట్లకీ చిక్కులొగితే పాలకులు దడదడ లాడతారు. మంత్రులూ, అధ్యక్షులూ ఏం ఫర్వాలేదనీ, తామున్నామనీ, హామీలిస్తారు. పార్లమెంట్‌లో చర్చిస్తారు. అంతర్జాతీయ సంస్థల్ని సమావేశపరుస్తారు. ప్రభుత్వ యంత్రాగాన్ని పరుగులెత్తిస్తారు.

స్థూలజాతీయోత్పత్తి పెరగటానికి ప్రభుత్వం కంపెనీలకి అప్పు ధారాళంగా తక్కువ వడ్డీకి దొరికే ఏర్పాట్లు చేస్తుంది. ఇంకా ఎంతైనా చేస్తానంటుంది. భారీ ప్రోత్సాహక ప్యాకేజీలిస్తుంది. ఎన్ని లక్షల కోట్ల డాలర్లయినా ఇవ్వడానికి రెడీగా ఉంటుంది. జి.డి.పి. వృద్ధిరేటు పెంచేపనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు. చాలా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఇది పెరగవచ్చు.

ఎకానమీని పైకి లాగేందుకు ఏమైనా చెయ్యటానికి – తనఖా అప్పుల్ని కొనేందుకు కూడా సిద్ధమే అన్నది. వెనకాడనని ప్రకటించింది.

ఎచ్.ఐ.ఎస్. గ్లోబల్ ఇన్‌సైట్ ప్రధాన ఆర్థికవేత్త. ఎకానమీ కోలుకోవాలంటే ప్రోత్సాహక ప్యాకేజీ ఇవ్వటం మినహా మరే మార్గమూ లేదు అన్నాడు. అయితే ఈ తతంగం అంతా ఉద్యోగుల పేరుమీదే జరుగుతోంది. కార్ల కంపెనీల వాళ్లకొక ప్యాకేజీ. వాళ్ల దగ్గర పనిచేసే కార్మికులూ, ఆధారిత పనుల్లో ఉన్న వాళ్లూ మొత్తం ముప్ఫై లక్షల ఉద్యోగాలు పోతాయట. కనుక ఆ కంపెనీలని నిలబెడితే అందరి ఉద్యోగాలూ ఉంటాయి. వాటికి ప్యాకేజీ ఇస్తే అవి కొనసాగుతాయి. కథ సుఖాంతం అవుతుంది. ఉద్యోగాలు నిలబడాలంటే కంపెనీలకి డబ్బివ్వాలి. అన్ని కంపెనీలదీ ఇదే వాదం. చట్ట సభలూ ప్రభుత్వాలూ ఎంతైనా ఇవ్వటానికి సిద్ధంగా ఉంటాయి. మొదట జనం ఏమైనా అనుకుంటారని కొంత బెట్టు చేస్తే చెయ్యచ్చు.

సెంటర్ ఫర్ ఆటోమోటివ్ రిసెర్చ్ అనే సంస్థ కార్ల కంపెనీలు దివాలా తీస్తే 2009లో ముప్ఫై లక్షల మందికి ఉద్వాసన తప్పదనీ, మూడేళ్లలో 15,700 కోట్ల డాలర్ల పన్ను రెవిన్యూ నష్టం వస్తుందనీ అన్నది.

కార్ల పరిశ్రమా, విడిభాగాల పరిశ్రమల్లో మొత్తం 7,32,800 మంది పనిచేస్తున్నారు. బిగ్‌త్రీ(జనరల్ మోటర్స్, ఫోర్డ్, క్రిజ్లర్)2,39,341 మంది ఉద్యోగులతో ఉంది. దాదాపు ఇరవై లక్షల మంది ఆరోగ్య రక్షణకు కార్ల తయారీదారుల మీద ఆధారపడి ఉన్నారు.

మాక్రో ఎకనామిక్ అడ్వైజర్స్ అనే సంస్థ ఈ త్రైమాసంలో 5.5 శాతం వార్షిక రేటు చొప్పునా, వచ్చే త్రైమాసంలో 4.25 శాతం చొప్పునా క్షీణిస్తుందని అంచనా కట్టింది. 500 బి. ప్రోత్సాహకం ఆ పరిస్థితిని మార్చలేనంత ఆలస్యంగా వచ్చింది. అయినా అది 2009 మధ్యకల్లా మాంద్యాన్ని ముగించగలదు. నిరుద్యోగాన్ని 8.5 శాతం వద్ద నిలువరించగలదు. అటువంటి ప్రోత్సాహకం లేకపోతే మాంద్యం మూడవ త్రైమాసంలోకి కూడా పాకుతుంది. నిరుద్యోగం 9.5 శాతం అయితీరుతుందని చెప్పింది.

కంపెనీలకి తగినంత అప్పు త్వరగా లభించకపోతే వచ్చేయేడు కూడా ఉద్యోగాలు పోవడం ఖాయం అని మూడిస్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జిందీ అంటున్నాడు. ప్రభుత్వమూ అదే చెబుతోంది. తన చర్యల వల్ల రుణలభ్యత సులభమయిందని అంటోంది. అందుకోసం శ్వేతసౌధ ప్రతినిధి టోనీ ఫ్రాట్ ముఖ్యమైన లివర్లని లాగుతున్నట్లు చెప్పాడు.

ఇప్పుడు ఒబామా ఉద్యోగకల్పన గురించి ఒకేపనిగా మాట్లాడుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు రాబోయే ఒబామా ఇచ్చిన అన్ని ప్యాకేజీలకీ అనుకూలుడే. తనొచ్చాక ఇంకా ఎన్నో ఇచ్చేవాడే. ఉద్యోగుల తరపున చాలా మాట్లాడాడు. వచ్చే రెండేళ్లలో ఇరవై ఐదు లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్నాడు. ఆయన కూర్చునేటప్పటికి అన్ని ఉద్యోగాలు పోయి ఉంటాయని ఇంతకుముందే చూశాం.

నవంబర్ నిరుద్యోగం నివేదిక వచ్చాక బుష్ శ్వేతసౌధం

బయటకొచ్చి కనపడినట్లు కనపడి ఐదు నిముషాలపాటు ముక్తసరిగా మాట్లాడి ముగించాడు. రుణ మార్కెట్ల సమస్యే ఎకానమీ ఎదుర్కొంటున్న అర్జంట్ అంశం అన్నాడు. బ్యాంక్‌లకి ఇతర సంస్థలకీ లక్షల కోట్ల డాలర్ల ప్రజాధనం ఇవ్వాలనే తన విధానాన్ని పునరుద్ఘాటించాడన్న మాట.

ఒబామా రెండేళ్లలో కనీసం ఇరవై ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించే రికవరీ పథకం కావాలనీ, అదే సమయంలో అప్పు విరివిగా దొరికేటట్లు చేయాలని అన్నాడు. అప్పు మీద ఎన్నో అమెరికా కుటుంబాలూ, వ్యాపారాలూ ఆధారపడి ఉన్నాయని చెప్పాడు. మామూలు మాటల్లోకి మారిస్తే ఆయన చెప్పిందిది. బ్యాంకులకీ, ద్రవ్యసంస్థలకీ ఇచ్చే లక్షల కోట్లలో ఏదో కొద్దిగా జనానికి చేరేట్లు చూస్తారు. ఆ ఆర్థికవేత్తలు చెప్పినా అదే. రాజకీయ నాయకులు ఉపన్యసించినా అదే. పాలకులు పూతపూసి చూపించినా అదే.

☙ ☙ ☙ ☙ ☙

విదేశాల నుంచి పెట్టుబడులు రావటంలేదు. ప్రపంచంలో ఏ దేశానికీ లేనంత అప్పులో మునిగి ఉంది. ప్రోత్సాహక ప్యాకేజీలకి డబ్బు సమకూర్చటానికి డాలర్లు అచ్చు వేస్తోంది. ఇందువల్ల సరుకుల ధరలు పెరుగుతాయి. విదేశాల నుంచి పెట్టుబడులు రావటంలేదు. ప్రపంచంలో ఏ దేశానికీ లేనంత అప్పులో మునిగి ఉంది. పదకొండు లక్షల కోట్ల డాలర్లకి పైమాటే. ప్రస్తుతం మార్కెట్‌లో డబ్బుకి గిరాకీ ఉన్న నోట్లు అచ్చు వేస్తూపోతే నోట్ల సరఫరా పెరుగుతుంది. మరల ఎకానమీ లేవటం మొదలైతే నోట్లు ఎక్కువగా చలామణీలోకి వస్తాయి. వేగంగా చేతులు మారతాయి. దాంతో సరుకుల ధరలు పైకిపోతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అయితే ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం ఒకటుంది. ఎకానమీ లేవటం మొదలైనంత మాత్రాన ఉద్యోగాలు పోవటం ఆగదు. ఆ పరిస్థితుల్లో కార్మికుల ఆదాయాలు తగ్గుతూనే ఉంటాయి. మరోవైపు ధరలు పెరుగుతుంటాయి. ఈ పరిస్థితి శ్రమజీవుల్ని కుంగదీస్తుంది. రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులు కొంతడబ్బు పొందుతారు. దీన్ని 401 (కె) ప్లాన్ అంటారు. వేతనంలో కొంత ఉద్యోగి చెల్లిస్తే ఆ మొత్తంలో సగం యజమాని జోడిస్తాడు. రిటైర్ అయ్యేదాకా దీనికి పన్ను కట్టక్కర్లేదు. తీసుకున్నప్పుడు చెల్లించాలి. ఇది ఉద్యోగులకి కొంత ప్రయోజనకరంగా ఉంటుంది.

ఇటీవల చాలా కంపెనీలు జోడించాల్సిన డబ్బు చెల్లించటం నిలిపివేశాయి. పదవీ విరమణ సమయంలో తక్కువ డబ్బు చేతికొస్తుంది.

2009లో అనేక కంపెనీలు ఖర్చులు తగ్గించుకునే నెపంతో ఇదే పని చేస్తారు. ప్రభుత్వాలు ప్యాకేజీలిచ్చేటప్పుడల్లా ఖర్చులు తగ్గించమని చెబుతాయి. కంపెనీలు ఉద్యోగుల్ని తగ్గించి మిగిలినవాళ్లతో పనంతా చేయిస్తారు. వేతనాలు తగ్గిస్తారు. 401 (కె) లాంటి పథకాలకి గండి కొడతారు. అంటే, ప్రభుత్వ ప్యాకేజీలు పొందికూడా ఉద్యోగులని గుల్లచేస్తారు. ప్రభుత్వం పట్టించుకోదు. ఈ డబ్బు వృద్ధాప్యంలో ఎంతో ఆసరాగా ఉంటుంది. దీన్ని కూడా కొల్లగొడుతున్నారు.

☙ ☙ ☙ ☙ ☙

1990 మాంద్య కాలంలో సీనియర్ బుష్ 'ఉద్యోగాలూ, ఉద్యోగాలూ, ఉద్యోగాలూ' అని కలవరించాడు. చేసింది చిన్నమెత్తులేదు. 2001లో బుష్ 'ఉద్యోగాలూ, ఉద్యోగాలూ' అని తెగ చెప్పాడు. చేతలు మాత్రం పూర్తిగా సంపన్నులకొరకే. మూడు లక్షల కోట్ల పన్నులు తగ్గించాడు. ఈసారి ఇప్పటికే వడ్డీ రేటు ఎన్నోసార్లు తగ్గించారు. తగ్గించి తగ్గించి డిసెంబర్ 16న 0 – 0.25 స్థాయికి తెచ్చారు. కొన్ని సంస్థల్లో పెట్టుబడులు పెట్టారు. డెబ్లై వేల కోట్ల డాలర్ల ప్యాకేజీ ఇచ్చారు. ఇదే నెల 19న కార్ల కంపెనీలకి 17,400 కోట్ల డాలర్ల అప్పు అనుమతించాడు. ప్రస్తుతం బిగ్ త్రీ (జనరల్ మోటర్స్, ఫోర్డ్, క్రిజ్లర్) కంపెనీల ఉద్యోగుల జీతాలు, అమెరికాలో ఉన్న విదేశీ కంపెనీలిస్తున్న జీతాలకన్నా ఎక్కువ. అప్పు తీసుకుంటే 2010 కల్లా జీతాలు తగ్గించి సమం చెయ్యాలి. కంపెనీలకి అప్పులిస్తూ బదులుగా కార్మికుల వేతనాలు తగ్గించమనటం మాంద్య భారాన్ని కార్మికుల మీద వెయ్యటం కాక మరేమిటి?

కంపెనీలకీ కార్పొరేట్లకీ ఇస్తే క్రమంగా ఫలాలు కిందికి దిగుతూ అట్టడుగు వారికికూడా అందుతాయనేది ప్రచారం. దీన్ని ఇంగ్లీష్‌లో ట్రికిల్ డౌన్ ఎఫెక్ట్ అంటారు. పెట్టుబడిదారులకి ఆదాయలు పెరిగేటట్లు చేస్తే వాళ్లు వ్యాపారాల్లో పెడ్తారు. కొత్త ఉద్యోగాలు కల్పిస్తారు. ఆ విధంగా నిరుద్యోగం తగ్గుతుంది. ఇదీ వాదన. 1990 మాంద్యం ముగిశాక పదిహేను నెలలకి నిరుద్యోగం రేటు పైస్థాయికి చేరింది. 2001 మాంద్యం అయ్యాక పందొమ్మిది నెలలపాటు ఈ రేటు పెరుగుతూనే ఉంది.

బుష్ సంపన్నులకి భారీగా పన్నులు తగ్గించాడు. వసూలు చేసినవి సైతం తిరిగి ఇచ్చేశాడు. వాళ్ల చేతుల్లోంచి వీళ్లకి చిల్లిగవ్వ చేరిందిలేదు. కార్మికులూ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారు.

కంపెనీలకీ కార్పొరేట్లకీ ఇస్తే కార్మికుల వాటా కార్మికులకి చేరుతుంది. చేరిందేదో చూశాం.దారిద్ర్యం నిరుద్యోగం, చేరబోయేదీ అదే

పంటచేలు కార్పొరేట్లకీ పరిగ కార్మికులకీ – పంచటం.

ఇదే ఒక పాలకుడు అభివృద్ధి అన్నా, మరొకడు మార్పు అని ఊరించినా, వేరొకడు సామాజిక న్యాయం అని నామకరణం చేసినా ◼

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - ఫిబ్రవరి 2009 : మతోన్మాదం - కొత్తరంగులు, కొత్త హింసా రూపాలు**
- **ఫోకస్ - మార్చ్ 2009 : రామ మనోహర్ లోహియా భావాలు - సమకాలీనత**
- **పడుపు వృత్తి నివారణ - సామాజిక బాధ్యత - ఎ. సుదయ్య, మడికొండ రాజు**
- **విశాఖ ఏజెన్సీ మహిళల సమస్యలు - పోరాటాలు - శివలక్ష్మి**

అమెరికా ఆర్థిక సంక్షోభ నేపథ్యంలో దాన్ని ఎదుర్కోవడానికి మన ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలను సూచిస్తున్నారు **వి. చలపతిరావు**

ఆర్థిక మాంద్యం తాకిడికి తట్టుకోగలమా?

ప్రస్తుతం అమెరికాలో ఏర్పడ్డ సబ్‌ప్రైమ్ సంక్షోభం, దాని పర్యావసానం వల్ల ఏర్పడ్డ ఆర్థిక మాంద్యంతో అక్కడి ఫైనాన్సియల్ మార్కెట్, స్టాక్‌మార్కెట్లు చతికిల పడిపోయాయి. దీని ప్రభావం ప్రపంచంలో ఇతర దేశాల మార్కెట్లపై ముఖ్యంగా తూర్పు ఆసియా, దక్షిణ తూర్పు ఆసియా దేశాలయిన జపాన్, ఇండోనేషియా, ఇండియా లాంటి కొన్ని ఇతర దేశాల మార్కెట్లపై కనపడుతోంది. ఇక్కడి స్టాక్‌మార్కెట్లు కూడా కుప్పకూలిపోతున్నాయి. దీనికి కారణం ఈ మార్కెట్లలో అమెరికా పెట్టిన పెట్టుబడులను ఏకాయెకిగ వీటికి సంబంధించిన షేర్లు అమ్మి వాపసు తీసికోవటమే అని చెబుతున్నారు. ఇలా విదేశీ పెట్టుబడులు హడావిడిగా తరలిపోవటం వల్ల, ఇక్కడ పరిశ్రమలకు దాపురించే పెట్టుబడుల కరువు, బ్యాంకులలో ఏర్పడ్డ ద్రవ్య లభ్యత లేని పరిస్థితిని నివారించటానికి, ఆర్‌బిఐ ఇటీవల మూడు దఫాల మొత్తం 2.5 శాతం సిఆర్‌ఆర్ రేటును తగ్గించి ఒక లక్షవేల కోట్ల రూపాయలను భారతీయ బ్యాంకింగ్ సిస్టంలోకి పంపింగ్ చేసి బ్యాంకుల వద్ద పరిశ్రమలకు అప్పులు ఇవ్వటానికి ద్రవ్య లభ్యత (లిక్విడిటి) ను ఎక్కువ చేసింది. ఇంత త్వరితగతిన ఒకవారం రోజుల నిడివిలోనే ఆర్‌బిఐ మూడుసార్లు సిఆర్‌ఆర్‌ను తగ్గించి బ్యాంకుల వద్ద లిక్విడిటీని పెంపుచేసిన ఉదంతమే రిజర్వ్‌బ్యాంక్ చరిత్రలో మొదటిసారి కావచ్చును. ఇలా చేయడానికి కారణం అప్పుల కొరకు భారతీయ పరిశ్రమలు ప్రభుత్వంపై పెంచే ఒత్తిడి ఒకటయితే, రెండవ కారణం ఇలా చేయకపోతే జిడిపి వృద్ధి రేటు ఇప్పుడున్న 7.5 శాతం నుండి ఇంకా తగ్గిపోవచ్చనే భయం ప్రభుత్వానికి ఉండవచ్చును. రిజర్వ్ బ్యాంక్ వ్యాపార బ్యాంక్‌లలో ఇంత పెద్ద మొత్తంలో ద్రవ్య లభ్యతను తక్కువ చేసినప్పటికి అక్టోబర్ 17న స్టాక్ మార్కెట్ సెన్సెక్స్‌లో ఒకేసారి వెయ్యి పాయింట్లు పతనమయింది. ఇలా జరగటానికి కారణమేమిటో, అసలు ఈ స్టాక్ మార్కెట్ల వ్యవహార శైలి ఏమిటో వీటి మర్మం ఏమిటో అటు ప్రభుత్వానికి గాని, వీటిని రెగ్యులేటు చేసే సెబి లాంటి సంస్థలకు గాని అర్థం కావటం లేదు.

ఇంకొకవైపు భారతీయ ఆర్థికరంగంపై ద్రవ్యోల్బణం చేస్తున్న వికటాట్టహాసం అంతా ఇంతా కాదు. గత రెండేళ్లలో ద్రవ్యోల్బణం రేటు ఐదు శాతం నుండి 12 శాతం వరకు పెరిగింది. సగటు భారతీయుని జీవితాన్ని అతలాకుతలం చేస్తోంది. బియ్యం, కూరగాయలు, నూనెలు, పప్పులు లాంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. అసలు ఈ ద్రవ్యోల్బణం స్థితి నియంత్రించ బడకముందే, ఆర్‌బిఐ లోగడ పెంచిన సిఆర్‌ఆర్ (క్యాష్ రిజర్వ్ రేషియో) రేట్లను మరల దించవలసి వచ్చింది. ఈ విధంగా ఆర్‌బిఐ సిఆర్‌ఆర్ రేట్లను పెంచినా ద్రవ్యోల్బణం స్థితి నియంత్రణ కాలేదు. ఇంకొకవైపు సిఆర్‌ఆర్ రేటు తగ్గించినా సెన్సెక్స్ పతనం ఆగలేదు. ఈ వ్యవహారమంతా ఒక విషవలయంగా మారిందంటే అతిశయోక్తి కాదు.

కేంద్ర ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని నియంత్రించటానికి గాని, స్టాక్‌మార్కెట్ల పతనాలను ఆపటానికి గాని ఆర్‌బిఐ ద్రవ్య నియంత్రణ విధానాల పైననే ఎక్కువ ఆధారపడటమే ఈ దుస్థితికి కారణం. పరిపాలనాపరమైన ఇతర చట్టపరమైన చర్యలకు నీళ్లొదలటమే. 1991 తర్వాత ప్రభుత్వాలు ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలను గుడ్డిగా అమలుపరచటం వలన, అవినీతిపరులైన పెద్ద వ్యాపారుల, కాంట్రాక్టర్ల, బ్లాక్ మార్కెటీర్ల, చీకటి వ్యాపారస్తుల పట్టు ప్రభుత్వంపై పెరగటమే. ఈ వర్గాలు ఇప్పుడు ప్రభుత్వాలకు గౌరవనీయులుగా, వి.వి.ఐ.పి.లుగా మారిపోయారు. వీరు ఎటువంటి అక్రమ చర్యలకు పాల్పడినా ప్రభుత్వాలు పట్టించుకోని స్థితి దాపురించింది. ఉదాహరణకు హైదరాబాద్‌లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించిన జిఎంఆర్ సంస్థ గత కొన్ని రోజులలో రెండు సార్లు యూజర్ చార్జీలు, బస్సు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు విపరీతంగా పెంచుకుంటు పోయినా అటు ఏయిర్‌పోర్ట్ అథారిటీ గాని, ఇటు రాష్ట్ర ప్రభుత్వం గాని ఇదేమిటని ఆ సంస్థను సంజాయిషీ అడగటంలేదు. ప్రయాణికుల ప్రయోజనాలను రక్షించలేకపోతున్నవి.

అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తాము ప్రారంభించిన జలయజ్ఞంలో లోపభూయిష్టమయిన ఇపిసి సిస్టంలో నియమించబడ్డ కాంట్రాక్టర్లు వారికి ఒప్పచెప్పిన సాగునీటి ప్రాజెక్టుల ఎస్టిమేట్లను తమకు తామె ఎన్నిసార్లు పెంచినా ప్రభుత్వం వారిపట్ల ఉదాసీన వైఖరివల్ల ఇదేమిటని ప్రశ్నించలేదు. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరగటమే కాక దానితోపాటు అవినీతి విపరీతంగా పెరిగింది. అరవై వేల కోట్ల ఎస్టిమేట్‌తో ప్రారంభించిన ఈ జలయజ్ఞం నాలుగేండ్ల తర్వాత మొత్తం ఖర్చు ఒక లక్ష కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు. లక్ష ఎకరాలు అదనంగా సాగుకిందకు తేబడగలదని ఘనంగా చెప్పటమేగాని ఇంత వరకు ఒక్క ఎకరం కూడా అదనంగా సాగుకిందకు తీసుకువచ్చిన జాడలేదు.

అమెరికాలో బుష్ ప్రభుత్వం కూడా అక్కడి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌ల యెడ ఇలాంటి ఉదాసీన వైఖరి అవలంబించటం వలననే అక్కడ మొదట సబ్‌ప్రైమ్ సంక్షోభానికి, తర్వాత ఆర్థిక మాంద్యానికి దారితీసిందని స్పష్టమవుతోంది. అక్కడి వ్యాపార బ్యాంకులు దివాలా తీయటానికి ముఖ్య కారణం బ్యాడ్ ఫైనాన్సింగ్ అని తెలుస్తోంది. అక్కడి ప్రభుత్వం కాని లేదా కేంద్ర బ్యాంక్ గాని విచ్చలవిడిగా చేయబడుతున్న బ్యాంక్ రుణాలను అదుపు చేయలేకపోవటం వలన ఈ దుస్థితి దాపురించింది.

అమెరికా, గ్లోబల్ ఆర్థిక సంక్షోభం సందర్భంలో మన ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి మన ఆర్థికరంగపు ఫండమెంటల్స్ బాగానే ఉన్నాయి, పటిష్ఠంగా ఉన్నాయి అని పదే పదే చెప్తున్నప్పటికి, ఇక్కడి ఆర్థికవ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ గ్లోబల్ సంక్షోభాన్ని తట్టుకొని నిలబడ గలదని ప్రకటించినప్పటికీ భారత ప్రజలకు నమ్మకం కుదరటం లేదు. కనుక ముందుముందు ఏమవునో అని ఆందోళనకు గురి అవ్వటం సహజం. ఎందుకంటే లోగడ ఆర్‌బిఐ బలహీనమయిన నియంత్రణ వల్ల ఎన్నో అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకుల డైరక్టర్లు తత్సంబంధిత ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కయి, డిపాజిటర్ల మొత్తాలను వేల కోట్లలో మింగేసి బోర్డులను తిప్పేశారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు రెండు వేల కోట్లను సదరు బ్యాంక్‌ల డైరక్టర్లు మింగేశారు. అదే విధంగా ఆర్‌బిఐ సరిగా నియంత్రణ చేయకనే మన పబ్లిక్ సెక్టర్ బ్యాంక్‌లు పెద్ద వ్యాపారులకు పరిశ్రమలకు 'బ్యాడ్ ఫైనాన్సింగ్' చేయడం వల్ల ఒక లక్షవేల కోట్ల ఎన్.పి.ఎ.లు ఏర్పడ్డట్లు బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్లు స్వయంగా ప్రకటించాయి. ఇవన్నీ ఆర్థిక వ్యవస్థను కుంగతీసే అంశాలు కావా?

1945లో జెఆర్‌డి టాటా బొంబాయి ఆర్థిక ప్రణాళికా రచనకు పూనుకొని, తోటి పారిశ్రామికవేత్తలయిన బి.డి.బిర్లా, కస్తూరిబాయ్, లాల్‌బాయ్ లాంటివారి సహకారంతో దానిని తయారు చేసి అమలు పరుస్తూ భారతదేశ పారిశ్రామికాభివృద్ధికి పునాదులు వేసిన ఘనత ఆయనదే. ఒక సందర్భంలో జె.ఆర్.డి. టాటా ఇలా జవాబిచ్చాడట, 'నేను ఇండియా ఒక ఆర్థిక సూపర్‌పవర్ కావాలని కోరటం లేదు, ఇండియా ప్రజలందరూ సుఖసంతోషాలతో బతకాలని నా కోరిక'. కాని నేటి పాలకులు భారతదేశం సూపర్ ఆర్థిక పవర్ కాబోతోందని, జిడిపి వేగంగా పెరుగుతున్నదని గొప్ప చెప్పుకుంటూ ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారు. వైఎస్ లాంటి రాజకీయ నాయకులు ఓట్ల కోసం చేసే సంక్షేమ కార్యక్రమాలనే అభివృద్ధి పనులని నమ్మబలుకుతున్నారు. ప్రైవేట్ కంపెనీల పెరుగుదలనే దేశ అభివృద్ధిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇవ్వాళ విదేశీ పెట్టుబడులు వాపసు తరలిపోతుంటే పాలకులు, కంపెనీల అధిపతులు బెంబేలెత్తుతున్నారు. స్టాక్‌మార్కెట్లన్ని కుప్పకూలుతున్నాయి. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులతో సంబంధం లేకుండా కొద్దిపాటి పెట్టుబడులతో గ్రామీణ పరిశ్రమలు చిన్న పరిశ్రమలు అభివృద్ధి చేయబడితే గ్రామాలలోని నిరుద్యోగులకు ఉపాధినివ్వగలుగుతాయి. కాని గ్లోబలైజేషన్ మత్తులో చిన్న పరిశ్రమల అభివృద్ధి ధ్యాస ఈ ప్రభుత్వాలకు లేకుండా పోయింది. ఎంతసేపు పెద్ద పరిశ్రమలు వాటికి కావాల్సిన సెజ్‌ల మాటలే ఇప్పటి ప్రభుత్వాలకు ముఖ్యమైనది. వీరు సమ్మిళిత అభివృద్ధి గురించి (ఇన్‌క్లూజివ్ గ్రోత్) మాట్లాడే మాటలన్ని నీటి మూటలే.

భారత్ నేర్చుకోవలసిన పాఠాలు

అమెరికాలో దివాలాతీసిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లను ఆదుకోవడానికి, దేశ పరిశ్రమలకు ఇన్వెస్ట్‌మెంట్ తైలధార నిలిచిపోకుండా ఉండడానికి, అమెరికా ప్రభుత్వం డెభై వేల కోట్ల డాలర్లను ప్రభుత్వ నిధుల నుండి విడుదల చేయటానికి చట్ట పరమయిన చర్యలన్ని తీసుకున్నది. దీనిని ఒక పెద్ద 'బేల్ అవుట్' చర్యగా వారు చెబుతున్నారు. బ్రిటన్, యూరో కరెన్సీ దేశాలు కూడ తమ తమ దేశాలలో దివాలా ముఖంలో ఉన్న బ్యాంక్‌లను బేల్ అవుట్ చేయటానికి అలాంటి చర్యలు తీసుకుంటోంది.

నిన్నటి దాకా అమెరికా ట్రెజరీ సెక్రటరీ పాల్సన్ (భారత్‌లో ఆర్థికమంత్రి హోదా) నమ్ముకున్న సిద్ధాంతం 'ప్రైవేట్ మంచిది పబ్లిక్ చెడ్డది' అన్నది ఇప్పుడు పటాపంచలయింది. ఇప్పుడు అమెరికా ప్రైవేట్ బ్యాంకులకు పబ్లిక్ నిధులు సరఫరా చేయవలసిన పరిస్థితి దాపురించింది. భారతదేశపు మొదటి ప్రధానమంత్రి నెహ్రూ గారి హయాంలో రష్యా అనుసరించిన మోడల్‌లో పంచవర్ష ప్రణాళికల రచన అమలు ప్రారంభమయింది. ఈ ప్రణాళికలో ఆయన అటు వ్యవసాయానికి గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి తగిన ప్రాధాన్యమివ్వడమే కాక, పారిశ్రామికరంగంలో మిక్సడ్ ఎకానమీ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాడు. అంటే పారిశ్రామికరంగంలో ఇటు పబ్లిక్ రంగాన్ని అటు ప్రైవేట్‌రంగాన్ని సమాంతరంగా అభివృద్ధి అయ్యే విధంగా ప్రణాళికలలో వీలు కల్పించారు. ఇందిరాగాంధీ ఇంకొక అడుగు ముందుకు వేసి ప్రైవేట్ బ్యాంక్‌లను జాతీయం చేసింది. జాతీయం చేసి ఈ పబ్లిక్ సెక్టర్ బ్యాంక్‌లే భారత ఆర్థిక వ్యవస్థను కాపాడగలవని ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి గర్వంగా చెబుతున్నారు. కాని వీరు 1991 నుండి ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఆర్థిక సంస్కరణల పేర చేసిన పనులు అనుసరించిన ఆర్థిక విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. పారిశ్రామికరంగంతో పాటు విద్య, వైద్యం లాంటి మౌలిక రంగాలను కూడా ప్రైవేటీకరించే దిశలో ఈ ప్రభుత్వాలు నడుస్తున్నాయి. సెజ్‌ల పేర ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు వారి అవసరాలకు మించి వారితో లాలూచి పడి ఈ పాలకులు పేద రైతుల పంట పొలాలు కూడ భూసేకరణ చట్టం కింద అగ్గువ ధరలకు సేకరించడానికి అనుకూలమైన ధరలకు అంటగడుతున్నారు. ఇలా రైతులకు జరిగే అన్యాయాలను భారతదేశంలో ఒక్క మమతా బెనర్జీ తప్ప ఎవరూ గట్టిగా ఎదుర్కోలేదు. ఈ ప్రభుత్వాలు చదువుకుంటున్న వారికి ఉద్యోగాల సృష్టి గురించి ఆలోచిస్తోంది గాని ఇప్పటికి అరవై శాతం ప్రజలు పల్లెలలో ఉండేవారికి ఉద్యోగాల కల్పన గురించి ఆలోచించటం లేదు. పశ్చిమ బెంగాల్‌ను ఏలుతున్న కమ్యూనిస్ట్ ప్రభుత్వం కూడ ఇందుకు మినహాయింపు కాదు. అందువల్ల గ్లోబల్ సంక్షోభాన్ని తట్టుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కింది చర్యలు వెంటనే చేపట్టాలి.

1. గ్లోబల్ సంక్షోభాన్ని తట్టుకొని నిలబడగల శక్తి పబ్లిక్ సెక్టర్‌లో గల బ్యాంక్‌లకు, బిహెచ్ఇఎల్ లాంటి పరిశ్రమలకు ఉంది. కనుక వీటిని పటిష్టపరచటానికి తగు ద్రవ్య లబ్ధికి సంబంధించిన చర్యలను వెంటనే చేపట్టాలి. ఉదాహరణకు నిజాం కాలం నుంచి కూడ

జీవితఖైదీల మానసిక, జీవన స్థితిగతులను వివరిస్తూ కుంటిసాకులతో జాప్యం చేయకుండా అర్హత ఉన్న ఖైదీలందర్నీ విడుదల చేయాలంటున్నారు **ఎ. కొండయ్య**

ఛిద్రమౌతున్న జీవితఖైదీల బతుకులు

ఎట్టకేలకు ఆగస్టు 15న నామమాత్రంగానైన ఖైదీల విడుదల జరిగింది. అందులో గౌరు వెంకటరెడ్డి విడుదల జరిగింది. కాని జీవిత ఖైదీలకు పట్టిన గౌరు గ్రహణం మాత్రం వీడలేదు. ఎప్పుడు వీడుతుందో కూడా తెలియని జీవిత ఖైదీలు తమలాంటి దుస్థితి పగవారికి కూడా రాకుండా చూడాలని వేడుకుంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా సత్ప్రవర్తన గల జీవిత, జీవితేతర ఖైదీలకు క్షమాభిక్ష పెట్టే విషయమై అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ లబ్ధికోసం చిలికి చిలికి గాలివానలా మార్చి చివరికి బంతిని సుప్రీంకోర్టులోకి నెట్టిన విషయం అందరికీ విదితమే. ఖైదీలు, వారి కుటుంబీకుల సంక్షేమంతో పాటు మొత్తంగా సమాజ శ్రేయస్సుకు దోహదపడే విశాల దృక్పథంగా ఖైదీల క్షమాభిక్ష ప్రక్రియను తీర్చి దిద్దే బాధ్యత తమదేనన్న విషయం మన ఏలికలు ఏనాడో మర్చిపోయారు. ఇందుకు భిన్నంగా ఈ ప్రక్రియను ఏ స్థాయికి దిగజార్చారో వివాదాస్పదం గౌరు వెంకట రెడ్డి క్షమాభిక్ష సంఘటనే సాక్ష్యం. ఈ క్షమాభిక్ష నుద్దేశించి సుప్రీంకోర్టు కూడా ఘాటైన పదజాలంతో పాలకులకు, అందుకు గుడ్డిగా సహకరించిన ఉన్నతాధికారులకు మొట్టికాయలు వేయాల్సివచ్చింది.

నాటినుండి 'ఇదుగో క్షమాభిక్ష' అని అధికార ప్రభుత్వమంటే 'అదుగో గౌరి, సూరిల కోసమే' నంటూ ప్రతి పక్ష టి.డి.పి. నానా యాగీ చేయడం వల్ల మొత్తంగా అర్హత కలిగిన వందలాదిమంది జీవిత ఖైదీల విడుదల ప్రక్రియ పదే పదే వాయిదా పడుతూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో తమ విడుదలకై ఎంతో కాలంగా ఆశతో ఎదురు చూసిన ఖైదీలు, వారి కుటుంబీకులు, బంధుమిత్రులు అంతులేని క్షోభను అనుభవించారు. తట్టుకోలేని ప్రాణాలెన్నో ఇప్పటికే గాలిలో కలిసాయి. దీర్ఘ కాలిక వ్యాధుల బారిన పడినవారు, తీవ్ర నిరాశ నిస్పృహలకు గురై మానసిక రోగులుగా మారినవారు, తగిన వైద్యం లభించక, ఆదుకునే ఆపన్న హస్తం లేక జీవచ్ఛవాల్లా బతుకీడుస్తూ ఇక్కడొకరూ, అక్కడొకరూ అకాలమరణాల వాత పడుతూనే ఉన్నారు. 2004 పంద్రాగస్టున వెయ్యిమందికి పైగా క్షమాభిక్ష ప్రసాదించిన ప్రభుత్వం 2004 అక్టోబరు నాటికి మరో 285 మంది కూడా క్షమాభిక్షకు అర్హులౌతారని హోంమంత్రి ప్రకటించారు. కాని గడిచిన 3,4 సంవత్సరాలుగా పాలకులు ఈ ఏడాది ఆగస్టు 15కు మాత్రమే కంటి తుడుపు చర్యగా జీవిత ఖైదీలతోపాటు చిన్న శిక్షలలోని అనేక సెక్షన్‌లవారిని మినహాయించి కేవలం 200 మందికి మాత్రమే అర కొర క్షమాభిక్ష పెట్టింది. ఈ సందర్భంగా విడుదలయిన ఖైదీలు సైతం 'మాకన్నా అత్యంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న జీవితఖైదీలకు ఈ క్షమాభిక్ష పెట్టి ఉంటే సంతోషించే వాళ్లమని' మీడియాతో మాట్లాడారంటే జీవిత ఖైదీల దుస్థితి వారినెంత కలచివేసిందో తెలుసుకోవచ్చు. కాని జీవితఖైదీల గురించి ప్రశ్నించి నప్పుడల్లా కోర్టుకెక్కిన ప్రతిపక్షాన్ని నిందించటం, సుప్రీం కోర్టులో పెండింగ్ కేసును సాకుగా చూపి కాలం వెళ్ళబుచ్చుతున్నారే తప్ప వీరి విడుదలకు పాలక ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు.

ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు అయినా త్వరగా మెరుగైన పరిష్కారం సూచిస్తుందని జీవిత ఖైదీలు ఆశించారు. కాని ఈ కేసు వాయిదాల మీద వాయిదాలు పడుతూ సంవత్సరం గడిచినా విచారణే పూర్తి కాకపోగా ఈ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఖైదీలకు మరింత ఆందోళన కలిగించేలా ఉండటం బాధాకరం. 'జీవిత ఖైదీలు కనీసం 14 సంవత్సరాలు శిక్ష కూడా పూర్తి చేయకుండా వందలాది మందికి మూకుమ్మడిగా క్షమాభిక్ష పెట్టి ఎలా విడుదల చేస్తారని' ప్రశ్నించింది. దీంతో తాము ఉన్నత న్యాయస్థానంపై పెట్టుకొన్న ఆశలపై నీళ్ళు చల్లిందని జీవిత ఖైదీలు, వారి కుటుంబీకులు ఆందోళన చెందినా అంతిమ తీర్పులోనైనా సానుకూలత వ్యక్తం కాకపోతుందా! అని వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్నారు. నేడు మన జైళ్ళల్లో నెలకొన్న అధ్వాన్న

ప్రజలకు సేవలందిస్తున్న ఆర్.టి.సి. ని పటిష్ఠంగా ఉంచవచ్చు. ఈ సంస్థను నష్టాల బారినుండి తప్పించటానికి ఐదు వందల కోట్ల ఆర్థిక సహాయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించాలి. ప్రైవేట్ బస్సు డీలర్లు దీనిని కబళించాలని చూస్తున్నారు.

2. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆహార భద్రతను పెంచటానికి, ద్రవ్యోల్బణం అదుపు చేయటానికి పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంను బలపరచాలి. కూరగాయలతో యుక్తంగా అన్ని నిత్యావసర వస్తువుల అమ్మకాన్ని దీని పరిధిలోకి తీసుకురావాలి.
3. అంతర్జాతీయ చమురు ధరలు తగ్గినప్పుడు వాడకందార్లకు దాని వెసులుబాటును కల్పించాలి.
4. ఆహార భద్రతను పెంచటానికి, గ్రామ సీమలలో ఉపాధి సౌకర్యం పెంచటానికి వ్యవసాయరంగాన్ని, గ్రామీణ, చిన్న పరిశ్రమల అభివృద్ధికి తగు విధంగా ప్రోత్సహించాలి. పై చర్యల లాంటి కొన్ని పాలనాపరమైన చర్యలు తీసుకుంటే అమెరికా ఆర్థిక సంక్షోభపు దుష్ప్రభావాల నుండి భారత ఆర్థిక వ్యవస్థను రక్షించవచ్చును. వీ

పరిస్థితుల మధ్య సుదీర్ఘ జైలు జీవితం కారణంగా ఏర్పడుతున్న అగాధాలను లోతుగా పరిశీలించాలనీ, ఇప్పటికే పరిశీలించిన జైలు కమిషన్ల నివేదికల్ని పట్టించుకోవాలనీ, అలాగే నేడు మానవ సమాజంలో వచ్చిన పరిణితిని కూడా పరిగణనలోకి తీసుకుని జీవిత ఖైదీల క్షమాభిక్షకు కనీస కాల పరిమితిని హేతుబద్ధంగా నిర్ణయించాలని, ఖైదీలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం పలుమార్లు ఆందోళనకు కూడా పూనుకొన్నారు. ఈ సంక్షుభిత సమయంలో తగినంత కాకపోయినా, కొంతయినా ఖైదీల సమస్యలు వివిధ కోణాల్లో చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో అత్యంత విషాదకరంగా పరిణమించిన జీవిత ఖైదీల స్థితిగతులను, వారి జీవితాల్లోని అగాధాలను మరింత చర్చనీయాంశంగా మార్చి, మానవీయ సంస్కరణ స్ఫూర్తితో పరిష్కారాలు కనుగొనకపోతే జైళ్లే వారి పాలిట నరక కూపాలుగా మారటం ఖాయం.

జైళ్ళలో అధ్వాన్న పరిస్థితులు

జైళ్లలో ఖైదీలకుండాల్సిన హక్కులు, అవకాశాల గురించి వివిధ సందర్భాలలో న్యాయనిపుణులు చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. 'చట్ట బద్ధమైన పద్ధతిలో నిర్బంధించినపుడు కోల్పోవాల్సిన హక్కులు తప్ప, మిగిలిన హక్కులన్నీ ఖైదీలకు ఉంటాయి. అంటే పరిశుభ్రమైన నివాస పరిస్థితులు, సంపూర్ణ ఆహారం, బట్టలు, తగిన వైద్య సేవలు, చదువుకోవటం, రాసుకోవటం, వ్యాయామం, విశ్రాంతి, ధ్యానంతో సహా గౌరవనీయమైన, వివక్షకు తావు లేని పరిస్థితులు, తన మేధస్సును పెంచుకుంటూ మనిషిగా ఎదగటానికి అవసరమైన అన్ని హక్కులూ, అవకాశాలూ ఖైదీలకు కూడా ఉండి తీరాలని 'చెబుతూ' ఖైదీలు నిర్బంధంలో ఉండటమే శిక్షకాని జైలు పరిస్థితులు వాటికవే శిక్షలు కారాదని కూడా న్యాయ నిపుణులు నొక్కి చెప్పారు. కాని మన జైళ్ళల్లో ఖైదీల స్థితిగతులు పరిశీలించిన, ఖైదీల పట్ల పాలకుల, జైలు అధికారుల వ్యవహార శైలిని చూసిన ఇలాంటి మానవ హక్కుల స్ఫూర్తి మచ్చుకైనా కానరాదు. 'జైళ్ళు ఖైదీలను సంస్కరించే విద్యాలయాలుగా ఉండాలన్న' గాంధీజీ వాక్కుల స్ఫూర్తితో జైళ్ళను పోలీసు శాఖనుండే విడదీసి కరక్షనల్ సర్వీస్‌గా మార్చాం, ఆధునిక వసతులు కల్పించాం అని మన పాలకులు చెప్పుకుంటున్నప్పటికీ జైళ్ళలో ప్రజాస్వామిక సంస్కరణలు అందని ఫలాలుగానే మిగిలిపోయాయి. కారణం తమ వలస దోపిడీ, ఆధిపత్యాలను కాపాడుకునేందుకు జైళ్ళను అణచివేత సాధనాలుగా తీర్చిదిద్దే బ్రిటిష్ ప్రిజన్ యాక్ట్ ఆధారంగానే 1979లో మన జైళ్ల చట్టాలు కూడా రూపొందడమే. వాటి ఆధారంగానే నేటికీ మన జైళ్ల నిర్వహణ కొనసాగుతుండడమే. అందుకే మన జైళ్లలో నేటికీ క్రమ శిక్షణ పేరుతో ఆధిపత్యం, అణచివేత అడుగడుగునా చెలామణిలో ఉండటం గమనించవచ్చు. ఇలాంటి సంబంధాల మూలంగా జైలు అధికారుల నుండి, సిబ్బంది నుండి ఖైదీలు నిరంతరం చిన్న చూపును, నిర్లక్ష్యాన్ని, ఆగ్రహాన్ని, అవమానాలను చవిచూడటం సర్వసాధారణంగా కనిపిస్తోంది.

అధికారుల ఆదేశాలను మారు మాట్లాడకుండా చేసుకుపోయే మర మనుషులుగా ఖైదీలు తీర్చి దిద్దబడుతున్నారే తప్ప, వారిలో దాగిన సృజనాత్మక శక్తి యుక్తులను వెలికి తీసే ప్రయత్నాలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. తమ బాగోగుల కోసం వెచ్చించాల్సిన వనరులు కూడా వారి జేబుల్లో నింపుకొంటున్న జైలు అధికారులను ఖైదీలు ప్రశ్నించటం కాని, నిలదీయటం కాని చేయకూడదు. అలా చేసారంటే కక్ష సాధింపునకు జైళ్లలో ఉన్నన్ని అవకాశాలు మరెక్కడా ఉండకపోవచ్చు. చివరికి తమ హక్కులు, అవకాశాల మెరుగుదలకోసం గాంధీ చూపిన 'నిరాహార దీక్ష' బూనటం కూడా నేరంగా భావించే నేటి జైలు మాన్యువల్ వల్ల ఖైదీలకు జరిగే మేలు ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఖైదీలు కుక్కిన పేనులా అణిగి మణిగి ఉండక తప్పదు. నేడు జైళ్లలో అధికంగా తీసుకువస్తున్న సత్ప్రవర్తన ఇదే.

ఇలాంటి పరిస్థితుల్లో ఖైదీలకు కల్పించే నాసి రకపు ఆహారపు వనరులు సైతం అవినీతి అక్రమాల బారిన పడి మిగిలినదే వీరికి దక్కేది. ఇక జైళ్లల్లో ఉన్న పరిశ్రమలు, తదితర పనుల్లో కొంతమందికి ఉపాధి కల్పించినా, వీరికి ఇచ్చే జీతాల గురించి వినే వారందరికీ గతంలో ఎప్పుడో పల్లెటూరి పెత్తందార్లు పప్పులూ, బెల్లంపెట్టి వెట్టి చాకిరీ చేయించుకున్న రోజుల్ని గుర్తుకు తెస్తాయి. బయట సమాజంలో రెండు నుండి మూడు వందలు తీసుకుని కార్పెంటర్, బేల్‌దారీ, వంట, ఎలక్ట్రికల్, మెకానికల్, ఆఫీసులో ఒక క్లర్కు స్థాయిలో పనిచేసే వారు కూడా జైల్లో 10, 15 రూపాయలకే పనిచేయక తప్పటం లేదు. సంవత్సరంలో కొంతకాలం కుటుంబ సభ్యులతో కలిసి ఉండేందుకు ఉద్దేశించిన పెరోల్, ఫర్లో, ఓపెన్ జైలు అవకాశాల ప్రాబల్యం కలిగిన అతి కొద్ది మంది చేజిక్కించుకోవటంతో మిగిలిన వారు తీవ్ర నిరాశా, నిస్పృహల మధ్య జీవిస్తున్నారు. జైల్లో ఖైదీల శారీరక, మానసిక వికాసానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నప్పటికి కేవలం చెస్, కారమ్స్ లాంటి అరకొర ఆట వస్తువులు, సప్తగిరి టివి ఛానల్‌తో చేతులు దులుపుకుంటున్నారే తప్ప, అవసరానికి తగ్గట్లు ఆట, పాటలతో ప్రోత్సాహం లేదు. సమాచార హక్కు చట్టం స్ఫూర్తి ఖైదీలను వెక్కిరిస్తూ కనీసం టివి న్యూస్ ఛానల్స్ కూడా జైల్లో నిషేధించబడ్డాయి. అడ్డమైన కత్తిరింపుల తరువాతే దిన పత్రికలు కూడా దర్శనమిస్తాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఏ పండుగకో, పబ్బానికో, ఏడాదికోసారి జరిగితే గొప్ప. లైబ్రరీ, విద్యా వసతులు, అంతంత మాత్రమే.

ఇక నివాస యోగ్యమైన పరిస్థితుల వద్దకు వస్తే దాదాపు అన్ని జైళ్లలో సామర్థ్యానికి మించి 2, 3 రెట్ల మంది ఉండాల్సి రావటంతో ఎన్నో అసౌకర్యాల నడుమ జీవించాల్సి వస్తుంది. ఇక్కడ పరిశుభ్రత లోపించి దోమలు విజృంభించినా పట్టించుకునే వారుండరు. ఇవన్నీ అటుంచి, స్వేచ్ఛకు, సమాజానికి, కుటుంబానికి దూరమై అనేక శారీరక, మానసిక వొత్తిడుల మధ్య జీవించాల్సి రావటం పోషకాహార లేమి, రక్షిత మంచి నీరు అందకపోవటం తదితర కారణాలవల్ల తీవ్రమైన అనేక దీర్ఘకాలిక వ్యాధులతోపాటు, మానసిక రుగ్మతలు తలెత్తుతున్నాయి. క్షమాభిక్ష వివాదాస్పదం తరువాత మానసిక వ్యధతో కంటి మీద కునుకు పడటం లేదంటూ నిద్ర మాత్రలకు అలవాటు పడే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. అనారోగ్య సమస్యలతో మరణిస్తున్న వారిలో జీవిత ఖైదీలే అధికంగా ఉండటం గమనార్హం. ఇంతటి అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం లేదు. ఇటు జైలు, హాస్పిటల్‌లో గాని, బయట ధర్మాసుపత్రిలో గాని ఖైదీల పట్ల చిన్న చూపు ఉండటం, ఆర్థిక లేమితనం కారణంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురై, కనీస వైద్య సేవలు కూడా లభించడం లేదు.

ఉదాహరణకు ఓ జైల్లో ఖైదీ తన అనారోగ్యం గురించి జైలు డాక్టర్లకు, అధికారులకు అనేక సార్లు చెప్పినా మెరుగైన వైద్యం కోసం ఔట్ హాస్పిటల్‌కు పంపలేదు. జైలు డాక్టర్ ఇచ్చిన మందులతో, ఖైదీ ఆరోగ్యం కుదుటపడకపోగా, మరింత క్షీణించింది. ఈ విషయాన్ని తోటి

ఖైదీలు వెళ్లి డాక్టరు గారికి తెలియచేసి ఔట్ హాస్పిటల్‌కు పంపాలని కోరారు. అందుకు ఆగ్రహించిన జైలు డాక్టరు 'ఆయనేం చావడు లేవయ్యా, ఆయన సమస్య డాక్టరుకు, నాకు తెలుసు, మీకేం తెలుసు? ఇచ్చిన మందులకు తగ్గకపోతే చూద్దాంలే' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడు కారణంగా 35 సంవత్సరాల ఆ ఖైదీకి నూరేళ్లూ నిండి ఆ రాత్రికే మరణించాడు. తెల్లవారి తోటి ఖైదీలు నిద్రలేచే సమయానికి అధికారులు గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని మాత్రం పోస్ట్‌మార్టమ్ కోసం ధర్మాసుపత్రికి తరలించారు. ఇలా ఎంత మొత్తుకున్నా సకాలంలో అవుట్ హాస్పిటల్‌కు పంపని జైలు డాక్టర్లు, అధికారులు ఆయా ఉద్యోగాలు కాపాడుకోవడం కోసం శవాన్ని మాత్రం ఆఘమేఘాల మీద హాస్పిటల్‌కు తరలించడాన్ని బట్టి చూసినా జైల్లో ఖైదీల ప్రాణాలకు ఉన్న విలువ ఏపాటిదో తెలుసుకోవచ్చు.

జైలు డాక్టర్లు, అధికారులు, పోలీసు ఎస్కార్ట్‌లు, బయట ధర్మాసుపత్రి వైద్యులు నాలుగంచెలుగా ఉన్న వీళ్లంతా విచక్షణతో సకాలంలో సమన్వయంతో స్పందిస్తేనే ఖైదీల ఆరోగ్యం కుదుట పడుతుంది. ఇందులో ఏ ఒక్క దగ్గర నిర్లక్ష్యం జరిగినా ఖైదీలు తమ ప్రాణాలపై ఆశ ఒదులుకోవాల్సిందే. ఇలా ఎన్నో ఆటంకాల మధ్య ఖైదీల ఆరోగ్యం గాలిలో దీపంలా ఎప్పుడు ఎవరి ప్రాణం గాలిలో కలుస్తుందో తెలియని అనిశ్చిత పరిస్థితి ఉంది. ఈ మరణాలపై విచారణ కూడా ఒక తంతులా ముగించి వేస్తారే తప్ప చిత్త శుద్ధి ఏ మాత్రం ఉండదు. కాబట్టి అసలు ఈ మరణాలకు కారణాలు ఏమిటో బాధ్యులు ఎవరో వెలుగు చూసే అవకాశం లేదు. ప్రభుత్వం అందించే నష్ట పరిహారాల జాబితాల్లో కూడా వీరి కుటుంబాలకు స్థానం లభించదు. ఇంక అన్ని విధాలుగా రెండవ తరగతి పౌరులుగా చూడబడుతూ నోరెత్తి మాట్లాడలేని స్థితిలో ఉన్న మహిళా జీవిత ఖైదీల దుస్థితిని వర్ణించడం కష్టమే. ఎక్కడో అడవుల్లో మరణించే వన్యమృగాలపట్ల తీవ్రంగా స్పందించే సమాజం నిత్యం నాలుగుగోడల మధ్య జరిగే ఖైదీలమరణాలపై కనీస స్పందన, సానుభూతి లేకపోవటం ఓ విషాదం.

విచ్ఛిన్నమౌతున్న కుటుంబాలు

జీవిత ఖైదీ శివయ్యకు 8 సంవత్సరాల జైలు జీవితం తరువాత క్షమాభిక్ష లభించింది. ఈ శిక్షా కాలంలోనే ఈయన భార్యకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై భార్యాభర్తలిద్దరి మధ్య తరచు ఘర్షణలు తీవ్రమై చివరికి భార్యను కాళ్లు నరికేసి మళ్ళీ జైలు పాలయ్యాడు. ఇదిలా ఉంటే మరో జీవిత ఖైదీ 7 సంవత్సరాలు జైలు జీవితం గడిపితే క్షమాభిక్ష లభిస్తుందని భార్యా పిల్లలకు ఆశలు కల్పిస్తూ వచ్చారు. కాని 7 సంవత్సరాలు దాటి 8 సంవత్సరాలు గడిచినా క్షమాభిక్ష లభించలేదు సరికదా, జీవిత ఖైదీలు కనీసం 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాలని దిన పత్రికల ద్వారా తెలుసుకున్న ఆ ఖైదీ భార్య "ఇక మా దారి మేం చూసుకుంటామని" భర్తకు తెగేసి చెప్పి ప్రస్తుతం మరో వ్యక్తితో కలిసి ఉంటోంది. ఇది జీర్ణించుకోలేని ఖైదీ మానసిక రోగిగా మారాడు. ఇక మూడో జీవిత ఖైదీ భార్య తన భర్త సుదీర్ఘమైన ఎడబాటు భరించలేక కుటుంబాన్ని ఒంటరిగా ఈదలేక ఆత్మహత్య చేసుకోగా పిల్లలు అనాథలుగా మారారు. నాలుగవ ఖైదీ తన భార్యా పిల్లలు పడుతున్న వేదన చూడలేక జైల్లోనే ఆత్మహత్యకు బలయ్యాడు. చివరగా ఇటీవల ఓ ఖైదీ వారి భార్యా పిల్లల దయనీయ పరిస్థితికి అద్దం పట్టే ఉత్తరంలోని కొన్ని వాక్యాలు గుర్తు చేసుకుందాం.

"పిల్లలతో కలిసి విశాఖ జైలుకు రమ్మని మీరు రాసిన ఉత్తరం అందింది. రావాలనే ఉంది. కాని ఎలా? ఇప్పటికే ఓ పూట తింటే ఓ పూట పస్తులుంటున్నాం. పిల్లల చదువులకు తడిసి మోపెడవుతోంది. దీనికి తోడు పిల్లలకు ఎప్పుడూ అనారోగ్యమే. మందులు కొనడమే కష్టంగా ఉంది. ఇక విశాఖ రావడానికి చార్జీలు, ఖర్చులు ఎలా సర్దుకునేది. పైగా నీకు డబ్బులు కావాలని కూడా రాశావు. వున్నది ఇక ఒక్కటే మార్గం. మానం అమ్ముకోవాలి. సరే నంటే తెలియజేయగలవు." అంటూ రాసిన ఈ కాసిన్ని వాక్యాలు చూసిన ఖైదీలు, వారి కుటుంబాల్లో సంక్షోభం ఎంత పరాకాష్టకు చేరిందో తెలియడం లేదూ! ఇలా చెప్పుకుంటూ పోతే గుండెలను పిండేసే కఠోర వాస్తవాలెన్నో జీవిత ఖైదీల బతుకుల్లో సర్వసాధారణంగా కనిపిస్తాయి. జైలు పాలై నాలుగైదు సంవత్సరాలు గడిచేటప్పటికి వీరి కుటుంబీకులు ఇంటర్వ్యూలకు రావడం క్రమంగా తగ్గిపోతుంది. వీరి భార్యా/భర్తలు పునర్వివాహం చేసుకోవడమో, వివాహేతర సంబంధాలు పెట్టుకోవటమో జరుగుతోంది. బంధు మిత్రులతో సంబంధాలు తెగిపోతున్నాయి. మరికొంత కాలం గడిస్తే భార్యా/భర్త పిల్లలతో కూడా సంబంధాలు తెగిపోయి తాను ఒంటరిగా మిగిలిపోతానేమోనన్న ఆందోళన ఖైదీలను బాధిస్తోంది. వీరి కుటుంబాలు ఆస్తిపాస్తులన్నీ కోల్పోయి ఆర్థికంగా పతనం అంచుకు చేరుకుంటున్నాయి. తండ్రి ఆలనా పాలనా లేక పిల్లలు వ్యసనపరులు, అనాథలుగా మారుతున్నారు. మగదిక్కులేని ఈ కుటుంబాలు సమాజంలో నిరాదరణకు, అవమానాలకు, అఘాయిత్యాలకు గురవుతున్నాయి. 6 నుండి 9 సంవత్సరాల మధ్య జైలు జీవితం గడిపిన వారి కుటుంబాలే ఇంతటి భయానక పరిస్థితులను ఎదుర్కొంటున్నాయంటే, కనీసం 14 సంవత్సరాలు గడపాల్సి వస్తే వీరిలో జరిగేది సంస్కరణో, సర్వం కోల్పోవటమో మానవత్వమున్న మనుష్యులు ఎవరైనా గ్రహించవచ్చు.

కరుడుగట్టిన నేరస్తులెందరు?

ఎన్నో నేరాలకూ, ఘోరాలకూ పాల్పడి కూడా ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రాబల్యం కలిగిన వాళ్ళలో అత్యధికులు నేరం నవోదుకాకుండాను, విచారణ ప్రక్రియలో నిర్దోషులుగాను బయటపడుతున్నారు. ఇక ప్రాబల్యం లేని తాడితులు, పీడితులు లక్షలాది రూపాయలు వెచ్చించి న్యాయాన్ని కొనలేని బడుగు, బలహీన వర్గాల వారే సంక్లిష్టంగా ఉన్నా విచారణ ప్రక్రియ కోరల్లో చిక్కుకుని శిక్షింపబడుతున్నారు. వెయ్యి మంది అపరాధులకు శిక్ష పడకపోయినా సరే ఓ నిరపరాధికి శిక్ష పడకూడదన్న ఉన్నత న్యాయ సూత్రం ఆదర్శంగా పెట్టుకుంటున్నప్పటికి అనేక కారణాల వలన 30 శాతం మంది నిర్దోషులు కూడా అకారణంగా జీవిత ఖైదును అనుభవిస్తూ జైళ్ళలో మగ్గిపోతున్నారు. ఇలాంటి వారిలో రావలసిన సత్ప్రవర్తన ఏమిటో అంతుపట్టదు. పరిస్థితుల ప్రభావం వల్లనో, క్షణికావేశంలోనో పొరపాట్లు చేసి, కొన్ని సంవత్సరాలు జైలు ఇక్కట్లు పడగానే పశ్చాత్తాపంతో ఈ ఒక్కసారి మాపై కనికరిస్తే చాలు ఇంకెప్పుడూ ఇలాంటి వాటి జోలికి వెళ్ళకూడదని వ్యథ పడేవారి సంఖ్య సగానికి పైగానే ఉంటుంది. కేవలం 20 శాతం మాత్రమే నేరాలకు అలవాటు పడిన వాళ్ళు ఉంటున్నారు. అయినప్పటికీ, పాశవికమైన నేరాలకు పాల్పడిన వారిలో కూడా మార్పు ఉంటుందని గత అనుభవాలు ఎన్నో నిరూపిస్తున్నాయి.

అత్యధిక జనాభా, తీవ్రమైన కుల, మత, ప్రాంతీయ, లింగ

వివక్షతలు, అసమానతలతో కునారిల్లుతున్న దేశం మనది. ఇలాంటి పరిస్థితుల్లో నేరాలను నిరోధించడంలో శిక్షలు పోషించే పాత్ర తక్కువేనని సామాజిక దృక్పథం కలిగిన న్యాయ నిపుణుల అభిప్రాయం. తీవ్ర అసమానతలు, దారిద్ర్యం, వనరుల కొరత, సామాజిక అవమానాలు వంటివి మన సమాజంలో పెద్ద మొత్తంలో నేరాలకు దారి తీస్తున్నాయని కూడా వీరు విశ్లేషిస్తున్నారు. నేర పూరితమైన రాజకీయాల వలన కూడా ఇటీవల నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. ఇలా నేరాలను ప్రోత్సహించే సామాజిక పరిస్థితులను పూర్తిగా తొలగించడమో లేక, కనీస స్థాయికి తగ్గించగలిగితే చాలా వరకు నేరాలను నియంత్రించవచ్చు. అసలైన ఈ పనికి పూనుకోకుండా కేవలం కఠిన శిక్షల ద్వారా నేరాలను నియంత్రించాలనుకోవడం నేల విడిచి సాము చేయడమే కాగలదు. అత్యధికంగా మరణశిక్ష వేస్తున్న పాకిస్తాన్ దేశంలో నేరాలు తగ్గుతున్న జాడే కనిపించడం లేదు. మహిళా హంతకులను కఠినంగా శిక్షిస్తున్న మన రాష్ట్రంలో మహిళలపై ఆకృత్యాలు కొనసాగడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం గమనార్హం.

హేతుబద్ధ క్షమాభిక్షలే శ్రేయస్కరం

జీవిత ఖైదీలు కనీసం 14 సంవత్సరాలు జైలు జీవితం గడపకుండానే విడుదల చేస్తే సమాజానికి తీవ్ర హాని జరుగుతుందని గగ్గోలు పెట్టేవాళ్ళందరూ పాక్షిక దృష్టితోను, రాజకీయ లబ్ధికోసమో, మాట్లాడటం జరుగుతుందే తప్ప మానవీయ సంస్కరణోద్దేశ్యం కనిపించడం లేదు. గతంలో మన రాష్ట్ర పాలకులే 13 సార్లు 3,5,7 సం॥లు జైలు జీవితం గడిపిన వేలాది మందికి క్షమాభిక్ష పెట్టారు. ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి టి. అంజయ్య నేతృత్వంలో 1981, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ రజతోత్సవాల సందర్భంగా రెమిషన్‌తో కలిసి 5 సం॥ జైలు జీవితం గడిపిన జీవిత ఖైదీలందరికీ విముక్తి లభించింది. ఇంతటి ఉదారంగా పెట్టిన క్షమాభిక్ష వల్ల కూడా సమాజానికి కీడు జరిగినట్లు ఎలాంటి నివేదికలు లేవు. అసలు ఈ క్షమాభిక్షలవల్ల సమాజానికి జరుగుతున్న మంచి చెడుల గురించి సమగ్రంగా సమీక్షించిన దాఖలాలే లేవు. అలాంటి ఆధారాలు ఏమీ లేకుండా కేవలం ముజేభ్ లాంటి ఒకరిద్దరి దుర్వినియోగాన్ని కొండంతలు చేసి మాట్లాడుతున్నవారందరూ మరో ముఖ్యమైన కోణాన్ని మరుగుపరుస్తున్నారు. ఇప్పటి వరకు క్షమాభిక్షపై విడుదలైన వాళ్ళలో 90శాతం మంది తిరిగి ఎలాంటి నేర చరిత లేకుండా సహజీవనం సాగిస్తున్నారన్న విషయం గుర్తించకపోవడం భావ్యమా?

అంతెందుకు ఇక్కడ జైళ్ళలోని పరిస్థితులను, ఖైదీల ప్రవర్తనలను అధ్యయనం చేసిన జస్టిస్ ముల్లా కమిషన్, జస్టిస్ పాండు రంగారావు కమిషన్లు '5 సంవత్సరాలల జైలు జీవితంలో ఖైదీలలో మార్పు రావడం సాధ్యమేనని అంతకన్నా ఎక్కువ కాలం జైలులో ఉంటే సమాజం మీద వ్యతిరేకత ఏర్పడి సమాజానికి భారంగా, హానికరంగా మారవచ్చని విశ్లేషిస్తూ 5 సంవత్సరాలు జైలులో గడిపిన జీవిత ఖైదీల విడుదల గురించి ఆలోచించాలని" సూచించిన జైలు కమిషన్ల నివేదికలు బుట్ట దాఖలు చేయడం న్యాయమా?

చివరికి స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన గాంధీ అనేకసార్లు జైలు జీవితం గడిపిన స్వీయ అనుభవంతో "నేరాన్ని ద్వేషించు – నేరస్తుణ్ని కాదు" అని సూత్రీకరిస్తూ "5 సంవత్సరాలు శిక్షా కాలం పూర్తి చేసిన జీవిత ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకురావటం సాధ్యమేనని అంతకు మించి జైలులో గడపడం అనేక ప్రతికూల పరిస్థితులకు దారి తీస్తుందని" విశ్లేషించిన గాంధీగారి విలువైన మాటల్ని పెడచెవిన పెట్టడం ధర్మమా?

హైదరాబాదు సంస్థానంలో అత్యంత నిరంకుశుడుగా పేరుగాంచిన నిజాం పాలనలో కూడా జైలు ఎంత నరక ప్రాయమో గుర్తించి అందులో ఓ రాత్రి, ఓ పగలూ గడిపితే రెండు రోజులుగా లెక్కించి మానవతా స్ఫూర్తితో జీవిత శిక్ష (14 సంవత్సరాలు) పడిన వారిని 7 సంవత్సరాలకే విముక్తి చేసిన సత్ సంప్రదాయమున్నట్లు తెలుసున్న వారందరికీ ఇప్పటికీ కూడా మనకలాంటి మానవతా స్ఫూర్తి ఎందుకు కొరవడిందా? అన్న ప్రశ్న తలెత్తక మానదు.

కొంతవరకే ప్రస్తావించిన ఇంతటి అసంఖ్యాక ప్రశ్నల మధ్య 6, 7 సంవత్సరాలకే జీవత్సవాల్లా మారుతున్న ఖైదీలను ఎప్పుడో, ప్రామాణికంగా పెట్టుకుని 14 సం॥లు మగ్గబెట్టిన తరువాతే విడుదల చేయాలని మాట్లాడటం మూర్ఖత్వమే తప్ప, మరొకటి కాదు. నిజమైన సంస్కరణ యొక్క చివరి దశ ఖైదీలను సమాజంతో విలీనం చేసే క్రమంలోనే జరుగుతుంది. అందుకు అనువుగా అన్ని సెక్షన్ల జీవిత శిక్ష ఖైదీలలోను ఆశావహ పరిస్థితులు కల్పించేలా వుంటేనే సత్ప్రవర్తన సులభతరమవుతుంది. అందుకే క్షమాభిక్ష ప్రక్రియను హేతుబద్ధంగా విశాల మానవతా స్ఫూర్తితో మార్పుకు దోహదపడేలా తీర్చిదిద్దడం ద్వారానే ఇటు ఖైదీలకు, అటు సమాజానికి మేలు జరుగుతుంది.

జీవిత ఖైదీల సంక్షేమానికి ఈ కింది చర్యలు చేపట్టాలి

1. క్షమాభిక్షకు కనీస కాల పరిమితి ఐదు సంవత్సరాలుగా నిర్ణయించి, ఏడు సంవత్సరాలు జైలు జీవితం గడిపిన వారందరికీ క్షమాభిక్ష వర్తించేలా చూడాలి. యాభై ఐదు సంవత్సరాలు నిండిన మహిళలను, అరవై సంవత్సరాలు నిండిన పురుషులను వృద్ధులుగా గుర్తించి క్షమాభిక్షపై విడుదల చేయాలి.
2. ప్రతి జీవిత ఖైదీ సంవత్సరానికి రెండు మూడు సార్లు తన భార్య/భర్త పిల్లలతో వారం నుండి పదిహేను రోజులు కలిసి ఉండేందుకు జైలులో తగిన ఏర్పాటు చేయాలి. ఖైదీ విడుదలయ్యేంతవరకు కుటుంబం లో ఒకరికి ఉపాధి కల్పించాలి. పిల్లల చదువులకయ్యే ఖర్చులు ప్రభుత్వమే భరించాలి.
3. జైళ్లలో తగినన్ని పరిశ్రమలు స్థాపించి జీవిత ఖైదీలందరికి ఉపాధి సౌకర్యం కల్పించాలి. వీరికి నెలకు కనీసం పదిహేను వందల రూపాయల జీతాలు ఇవ్వాలి. దీనిని మూడు భాగాలుగా విభజించి ఓ భాగం నేరం తాలుకు బాధిత కుటుంబానికి, ఓ భాగం తన కుటుంబానికి, మరో భాగం తన అవసరాలకు వాడుకునేలా చూడాలి.
4. జైళ్లలో తగినంతమంది వైద్య సిబ్బందిని నియమించడంతో పాటు ఇందులో ఓ మానసిక వైద్య నిపుణుడు ఉండేలా చూడాలి. ఆరోగ్య శ్రీ పథకాన్ని ఖైదీలకు కూడా వర్తింపచేయాలి. జైల్లో మరణించిన ఖైదీల కుటుంబాలకు కనీసం 3 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
5. జైళ్లలో మెరుగైన వసతులతోపాటు ఫోన్‌సౌకర్యం కల్పించాలి. ✦

సెజ్‌ల వల్ల భూములు కోల్పోయిన రైతుల పరిస్థితులనూ, అందువల్ల మహిళలపై పడుతున్న అదనపు జీవనభారాన్నీ, వారి ఆరాట పోరాటాలనూ వివరిస్తున్నారు **రాజేష్ సాదు**

ప్రత్యేక ఆర్థిక మండలాల్లో మహిళలు

అభివృద్ధి అంటే ప్రజాస్వామ్య దేశంలో ప్రజల భాగస్వామ్యంతో ప్రజాభీష్టంతో అమలు జరిగే ప్రక్రియగా చెప్పవచ్చును. అభివృద్ధి చెందుతున్న దేశాలలో 'అభివృద్ధి రేటు' నేడు అత్యంత ఆవశ్యకమైన అంశంగా ఆయా ప్రభుత్వాల ముందున్నది. ఈ క్రమంలోనే భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు 'జాతీయ వృద్ధి రేటు పెరుగుదల' మాత్రమే అభివృద్ధి మంత్రంగా కనిపిస్తోంది. ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక, సామాజిక అంశాలకు ప్రాతినిధ్యం లేనప్పటికీ ఈ వృద్ధిరేటు అన్ని సమస్యలకు పరిష్కారమని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మనదేశం త్వరితగతిన అభివృద్ధి సాధించటానికి ఉత్పత్తి, వస్తువుల ఎగుమతి కేంద్రాలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు (స్పెషల్ ఎకనామిక్ జోన్స్ – ఎస్.ఇ.జెడ్.) అనే నమూనాను ఎంచుకున్నారు.

ప్రత్యేక ఆర్థిక మండలాలు విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించడానికి ఉపయోగపడే సంస్థల సముదాయాలకు నిలయంగా భావిస్తున్నవి. భారత ప్రభుత్వం 2001లో చైనాను ఆదర్శంగా తీసుకుంది. అదే రీతిలో మనదేశంలో కూడా ఏర్పాటు చేయడానికి అప్పటి ఎన్.డి.ఎ. ప్రభుత్వం సంకల్పించింది. 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పార్లమెంట్‌లో చట్టాన్ని నామమాత్రమైన చర్చలేకుండానే ఆమోదించారు. అంటే అత్యున్నత ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కాదు కదా కనీసం విషయాలేమిటో అర్థం చేసుకోకుండానే ఈ అభివృద్ధి ప్రక్రియ ఆవిష్కరించబడింది. ఈ చట్టం ఫిబ్రవరి 2006లో అమలులోకి వచ్చింది. సెజ్‌ల రూపం రాకముందే భారతదేశంలో 1965లోనే ఎగుమతి ప్రోత్సాహక మండలాల పేరుతో కాండ్లా (గుజరాత్)లో ఏర్పాటు చేశారు.

వ్యవసాయాధారిత దేశంలో వ్యవసాయాభివృద్ధి ఆధారితంగా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలి కానీ వ్యవసాయ భూములను, ముఖ్యంగా మూడు కాలాలు పండే పంటపొలాల స్థానంలో పారిశ్రామిక సంస్థల పేరుతో ప్రత్యేక ఆర్థిక మండలాలు ఏర్పాటు చేస్తున్నారు. మానవాభివృద్ధికి కావాల్సిన జీవన ప్రమాణ స్థాయిలను ఏమాత్రం పెంచకపోగా ఈ నూతన అభివృద్ధి మంత్రం పచ్చటి పల్లె జీవితాలను ఛిద్రం చేస్తుందని దేశంలో ప్రజాస్వామిక వాదులు చెబుతున్నారు. పచ్చని పంటపొలాలతో తులతూగే గ్రామసీమలు విస్థాపన కాబోతున్నాయి. భూమికి – శ్రమకు మధ్య ఉన్న సంబంధం విడదీయరానిది. తమ భూములను కోల్పోవడం వలన తమ ఉపాధి అవకాశాలేకాక, జీవన సంస్కృతి ధ్వంసమవుతుందని ప్రజలందరూ ఎస్.ఇ.జెడ్. ప్రభావిత ప్రాంతాలలో తమ ధిక్కారాన్ని వ్యక్తపరుస్తున్నారు. మనిషికీ భూమికీ ఏర్పడిన విచక్షణాత్మక సంబంధమే మానవ నాగరికత. అది నేటి వరకు విడదీయలేని సంబంధంగా ఉంటూవస్తోంది. ఈ నేపథ్యంలో సెజ్‌లు రావడం వలన మరొక అమానవీయ చారిత్రక తప్పిదం జరుగబోతోందని విమర్శకుల అభిప్రాయం.

ఇప్పటికే గ్రామాలు, వ్యవసాయం సంక్షోభ పరిస్థితుల్లో ఉంటుంటే మెజార్టీ ప్రజల జీవనాధారమైన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్యాకేజీలు, పథకాలను అమలుపర్చాల్సిన పాలకవర్గాలు వ్యవసాయ భూములను పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు, కంపెనీలకు, విదేశీ పెట్టుబడిదార్లకు, బహుళజాతి సంస్థలకు అప్పజెప్పాలనుకుంటున్నాయి. ఈ ఆలోచనే అమలు జరుగకుండా దేశంలో ముఖ్యంగా పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మనరాష్ట్రంలో ప్రతిచోట ఏదో ఒక ఆందోళన సెజ్‌లకు వ్యతిరేకంగా జరుగుతూనే ఉంది.

సెజ్‌లు కేవలం వ్యవసాయదారుల జీవితాలనే కాక, వ్యవసాయ కూలీలు, గ్రామంలోని చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి లాంటి కుల వృత్తులపై ఆధారపడిన వారిపై వేస్తున్న ప్రభావం అనూహ్యం. అంతేగాక సమాజానికి నాగరికతకు మూలమైన మహిళలపై పెనుభారాన్ని మోపుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండలాల నిర్మాణ క్రమంలో భూములు కోల్పోయిన యజమానులు ఆత్మగౌరవంతో, అప్పుతీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడితేనో లేక ఏం పని చేయాలనే ఆలోచన లేక మద్యానికి బానిసై ఉపాధి లేని కుటుంబం కావచ్చు, గ్రామాలకు గ్రామాలే ధ్వంసం అవుతున్న నేపథ్యంలో అవి ఏ కుటుంబాలైనా ఎక్కువ భారం మోసేవారు మహిళలే. సమాజంలో అనాదినుండి మహిళలపట్ల ఉన్న హింస, వివక్ష ఈ సెజ్‌ల మూలంగా గుణాత్మకంగా పెరుగుతోంది. ఈ సెజ్‌లు వచ్చి మా జీవితాలను ఛిద్రం చేయడమే కాక, మానవ సంబంధాలను ఇంకా నాశనం చేస్తున్నాయని రాష్ట్రంలో అనేకమంది మహిళలు ఈ సెజ్ ప్రభావిత గ్రామాలలో సెజ్‌లకు వ్యతిరేకంగా ఆందోళనలలో భాగస్వాములవుతున్నారు. మన రాష్ట్రంలో మొట్టమొదటగా కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలాలలో ఆందోళన ఉధృతమయింది. కాకినాడ సెజ్‌లో మహిళలు సెజ్‌లు రావడం మూలంగా తమ జీవితాలను ఏ విధంగా కోల్పోబోతున్నారనేది విస్తృంగా అధ్యయనం చేసి చర్చించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక ఆర్థిక మండలాలు – మహిళల జీవితాలు

ప్రత్యేక ఆర్థిక మండలాల కోసం అత్యధిక భూములను సేకరిస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ది రెండవస్థానం. సెజ్ చట్టం రవాణా సదుపాయాలు అనుకూలంగా ఉన్న ప్రాంతాలలో ఈ సెజ్‌లను ఏర్పాటు చేయాలని చెబుతుంది. తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ దగ్గర సహజవాయువు నిక్షేపాలు బాగా ఉన్నాయి. కాబట్టి ఓ.ఎన్.జి.సి.కి శుద్ధి కర్మాగారం (రిఫైనరీ) కోసం 12,500 ఎకరాలతో సెజ్ నెలకొల్పడానికి భూసేకరణ ప్రారంభించింది. కాకినాడ ఓడరేవు ద్వారా సరుకుల రవాణా జరుగుతుంది. కానీ తొలుత ఈ సెజ్‌లను పిఠాపురం, సామర్లకోట మండలాల పరిధిలో ఏర్పాటు చేయాలనుకున్నారు. రైతాంగం ఆందోళన చేయడంతో దీనిని యు.కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలోని పదహారు గ్రామాలలో భూసేకరణ చేపట్టారు. ఈ గ్రామాలలో భూములు మొత్తం కూడా వ్యవసాయోగ్యమైనవే. మూడు కాలాల పంటలు పండే భూములే. రాష్ట్రంలో 1.07 కోట్ల హెక్టార్లలో పలు రకాల పంటలు సాగవుతున్నాయి. కాగా ఆహార పంటల విస్తీర్ణం 78.83 లక్షల హెక్టార్లు. ఇందులో మూడువంతులు పండేది కోస్తా జిల్లాలోనే. ప్రస్తుతం 'కోస్టల్ కారిడార్' పేరుతో 15 ఫిబ్రవరి 2008న జి.ఓ. నెం. 34ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పుడు ఏకంగా ఏడున్నర లక్షల ఎకరాలకు కోస్టల్ కారిడార్ పేరిట ఎసరు పెట్టారు. ఇవన్నీ వ్యవసాయ భూమూలే. తూర్పుగోదావరి జిల్లాలోనే 15.09 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యవసాయ భూములు అభివృద్ధిపేరిట కనుమరుగయిపోతే ఆహార భద్రత సమస్య తప్పదని నిపుణులు అంటున్నారు.

కోస్తా తీరంలో 972 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్న సముద్రతీరంలో 80 లక్షల మంది మత్స్యకారులు నివాసం ఉంటున్నారు. వీరు ప్రధానంగా సముద్రంపైన ఆధారపడి జీవించేవారు. రాష్ట్ర ఆర్థిక గణాంక శాఖ లెక్కల ప్రకారం 2005–06లో ఈ ప్రాంతంలో 6768.89 కోట్ల రూపాయల విలువచేసే మత్స్యసంపద లభ్యమయింది. కాని పెట్రో రసాయనాల కర్మాగారంవలన మత్స్యసంపద కనుమరుగవబోతోంది. సముద్రంపైకిపోయే పురుషులతోపాటు చేపలు ఏరుకునే పనిలో, అమ్మకంలో పనిచేసే మహిళల ఉపాధి అవకాశాలు పోతాయి.

అంతేగాకుండా ఎక్కడాలేని విధంగా రైతుల భూములలో పేదలు సరుగుడు, కొబ్బరి, జీడిమామిడి, సపోట తోటలలో, రెండు అంతర పంటలు పండించుకుంటున్నారు. ఈ పంటల ప్రతిఫలాలు రైతుకు చెందవు. సాగు చేసుకున్న భూమిలేని పేదలకు దక్కుతాయి. ఇందులో పండిన పప్పుధాన్యాలు, దుంపలు, వంట చెరుకు, పశువులకు మేత రాగా, ఈ పంటలను పండించడం వలన రైతుల భూమిని సంరక్షించడమే కాకుండా ఆ రైతు సేద్యానికి అవసరమయ్యే పనులను చేస్తారు. ఇది ఎన్నో సంవత్సరాలుగా రైతుకు పేదలకు ఉన్న అవినాభావ సంబంధంగా గ్రామాలలో చూడగలం. పై పనులన్నింటిలోను మహిళలదే కీలకమైన భాగస్వామ్యం. వారే ఎక్కువగా ఈ పనులు చేస్తుంటారు. తమ భూములను కోల్పోవడం మూలంగా ఉపాధిలేమి ఉంటుంది. దానితో కుటుంబం ఛిద్రమై మహిళల జీవితం అనూహ్యంగా మిగులుతుంది.

రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా చట్టం చేసిన ప్రభుత్వం డెవలపర్లకు బ్రోకర్లుగామారి మోసపూరితంగా, బలవంతంగా భూములను ధారాదత్తం చేస్తోంది. ఫలితంగా అప్పటికే మహిళలపై సమాజంలో ఉన్న అనేక రకాల హింసలతోపాటు, నూతన అభివృద్ధి సంస్కరణల మూలంగా జీవితమే ప్రశ్నార్థకంగా మారుతోంది. కాకినాడ సెజ్‌లో మొదట మూలపేట గ్రామంలో సెజ్ వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైంది. ఉద్యమం బలంగా ఉన్న గ్రామాలలో కదారిపేట గ్రామం ఒకటి. ఈ గ్రామాన్ని ఈ అధ్యయనం కోసం ఎంచుకున్నాం.

ఎంపికచేసుకున్న గ్రామం

గ్రామం పేరు కదారిపేట. ఇది తూర్పు గోదావరి జిల్లా తొండంగి మండలంలో ఉంది. ఈ గ్రామం జిల్లా కేంద్రమైన కాకినాడకు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని గ్రామ పంచాయితీ సోడిసోలిపేట. గ్రామానికి మట్టిరోడ్డు మాత్రమే ఉంది. గ్రామంలో పాఠశాల లేదు. చదువుకోవాలంటే తప్పనిసరిగా ఇతర గ్రామాలకు వెళ్లవలసి ఉంటుంది. ప్రస్తుతం పాఠశాల భవన నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ గ్రామంలో మొత్తం యాభై యాదవ కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుత సెజ్ నిర్మాణంలో భాగంగా భూమిని కోల్పోయిన కుటుంబాల సంఖ్య ఇరవై. మొత్తం ముప్పై ఎకరాల భూమిని కోల్పోయారు.

ఎన్నో సంవత్సరాల నుండి వ్యవసాయం పై ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారు. గొర్రెలను, మేకలను కూడా పెంచి తమ జీవన భద్రతను ఏర్పాటు చేసుకున్నారు. కదారిపేట గ్రామంలో ముప్పై ఎకరాల భూమిని సెజ్ డెవలపర్ ఎకరాకు మూడు లక్షల రూపాయల చొప్పున ఇచ్చి తీసుకున్నారు. మీకు ప్రభుత్వం ఎక్కువ నష్టపరిహారం ఇవ్వదు, మీ భూములలో సెజ్ కచ్చితంగా వస్తుందని భయభ్రాంతులకు గురిచేసి భూములను తీసుకున్నారు. అప్పటి నుండి ప్రజలందరు ఆందోళనలో భాగస్వాములయ్యారు. ముఖ్యంగా మహిళలు సంఘటితంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని తమ భూములను కాపాడుకోవడానికి ఇతర గ్రామాల మహిళల సహకారంతో పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. సెప్టెంబర్ 5 సాయంత్రం ఆరు గంటల నుండి రాత్రి పన్నెండు గంటల వరకు ఆ గ్రామానికి వచ్చిన ఎం.ఆర్.ఓ. ను మహిళలంతా కలిసి నిర్బంధించారు. మా భూములు మాకివ్వండి లేకుంటే మిమ్మల్ని పోనివ్వమంటూ నినాదాలూ చేస్తూ అర్ధరాత్రి వరకు ఏ అధికారులు చెప్పినా మహిళలు వదలలేదు. చివరకు ఆ మహిళలనే బతిమిలాడుకొని ఎం.ఆర్.ఓ. తిరిగి వెళ్లారు. అంతేకాకుండా ఈ గ్రామానికి భూ సేకరణ నిమిత్తం వచ్చిన జిల్లా కలెక్టర్ గోపాలకృష్ణ ద్వివేదిని ప్రజలంతా ఘెరావ్ చేశారు. 'మా భూములకు కాదు మా స్త్రీలకు కూడా రేటు కట్టివ్వండి, అప్పుడైనా మీ భూదాహం తీరుతుందా' అంటూ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఇప్పుడు కాకినాడలో బలమైన సెజ్ వ్యతిరేక ఉద్యమంలో ఈ గ్రామ మహిళల పోరాటం కీలకం. దాదాపు సగం కుటుంబాలు భూమి నుండి నిర్వాసితం అవుతున్నాయి. ఇందులో సెజ్‌బాధిత ఇరవై కుటుంబాల్లో పురుషులు ఇరవైమంది, మహిళలు ఇరవైమంది, బాలురు ముప్పైరెండు మంది, బాలికలు ఇరవైనాలుగు మంది ఉన్నారు. మొత్తంగా ఈ ఇరవై కుటుంబాలలో జనాభా 106 మంది.

సెజ్ నిర్మాణంలో భాగంగా కదారిపేట గ్రామంలో 0–1 ఎకరాల భూమిని కోల్పోయిన కుటుంబాలు, ఎనిమిది; 1–2 ఎకరాల భూమిని కోల్పోయిన కుటుంబాలు పన్నెండు; 2–3 ఎకరాలు భూమిని కోల్పోయిన

కుటుంబాలు రెండు. మొత్తం ఇరవై కుటుంబాల వారు తమకున్న భూమిని కోల్పోయారు. భూమిని కోల్పోక ముందు వారికి ఒక ఎకరానికి ఒక సంవత్సరంలో మూడు పంటలకు గాను సుమారుగా ఒక లక్ష రూపాయల చొప్పున ఆదాయం వచ్చేది. ప్రస్తుతం వారికి ఎటువంటి ఆదాయ మార్గంలేదు. నష్టపరిహారం కింద ఇచ్చిన డబ్బులను గతంలో అప్పు కింద ఖర్చు చేశారు. ప్రస్తుతం కూలి పనిద్వారా మాత్రమే కుటుంబ మనుగడ జరుగుతోంది. ఈ కూలి పనికి కూడా ఎక్కువగా మహిళలే వెళ్తున్నారు. వారిపైనే మరింత పనిభారం పడుతోంది. వారికున్నటువంటి గొర్రెలు, మేకల పెంపకం కూడా భూములు కోల్పోవడంతో కష్టమైంది. ఇప్పటికే దాదాపు పన్నెండు కుటుంబాల వారు తమ గొర్రెలను, మేకలను అమ్మేశారు. ఇది ఈ వృద్ధి నమూనా పరిణామం.

వరిమూడు పంటలు పండిస్తారు కాబట్టి తమ భూముల్లో పని చేసుకుంటూనే ఇతర భూముల్లో శ్రమించడం వారికి ఒక ఆధారం. కనీసం ఒక్క సంవత్సరంలో నలభై రోజుల పని దొరుకుతోంది. కడారిపేట గ్రామంలో ప్రధానంగా పిక్కలు ఏరుకొనే పనిలో వారికి రోజుకు యాభై నుండి ఎనభై రూపాయల వరకు ఆదాయం ఉంటుంది. వరినాటు, కలుపు, వరికోత పనులకూ ఎనభై రూపాయల నుండి వంద రూపాయల వరకు ఆదాయం ఉంటుంది. అయితే ఈ పనులు వారికి ఉపాధిని కల్పిస్తాయి. ఈ రకంగా స్త్రీలు సంవత్సరం పొడవునా శ్రమించి కుటుంబాలకు ఆధారమైనారు. అలాగే జీడిమామిడి, సపోట, సర్వే, కొబ్బరి తోటలలో పనులకు డెబ్బై రూపాయల నుండి ఎనభై రూపాయల వరకు దినసరి వేతనం ఉంటుంది.

సెజ్ వలన భూములు కోల్పోయిన రైతులు తమకు వచ్చిన డబ్బును అప్పులు తీర్చడానికి, కుటుంబ కార్యక్రమాల కోసం ఖర్చుపెట్టి వీధి పాలవుతున్నారు. ఎన్నో సంవత్సరాలుగా కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలు ఈ రోజు గ్రామమే ధ్వంసం అవుతుంటే, తమ భూముల్లోనే ముళ్లకంచెను నాటి పచ్చని పంటపొలాల స్థానంలో ఏ ఫ్యాక్టరీలు నిర్మిస్తారో స్పష్టత లేకుండానే భూములను తీసుకుంటుంటే ఆవేదన చెందుతున్నారు. భూమి పోయిన బాధతో ఆ కుటుంబ యజమాని మద్యానికి బానిసై లేక పట్టణాలకు వలసవెళ్లి పనులు దొరకక గ్రామానికి తిరిగి రాలేక సత్రాల వెంట, బస్‌స్టేషన్ల వెంట బిక్షగాడి అవతారమెత్తు తున్నాడు. ఆ కుటుంబాన్ని ఎలా పోషించాలనే ప్రశ్న మహిళలపైనే అనివార్యంగా ఉంటోంది. ఉపాధి అవకాశాలు మృగ్యమైపోతున్నా ప్రభుత్వాలు ప్రకటించే నష్టపరిహారం, పునరావాసం ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ఇక్కడి గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని నిలిపివేయడం ద్వారా ఆ ఉపాధి కూడా లేకుండా పోతోంది. డ్వాక్రా లాంటి స్త్రీ పథకాలను నిలిపివేసి మహిళల శక్తిని బలహీనపరుస్తున్నారు. ఒకవైపు భర్తలు దూరంగా పోవడం, కుటుంబ భారం తీర్చే అవకాశాలు కనుచూపుమేరలో లేకపోవడంతో తాముబతికి పిల్లల్నిపెంచడం మహిళల పై ఎంతటి అమానవీయ దృశ్యాన్ని ఆవిష్కరిస్తుందో ఆలోచించాలి.

ఇటీవల రాష్ట్రంలో సెజ్ వ్యతిరేక ఆందోళన ఎక్కువగా కొనసాగుతున్నప్పటికి ప్రభుత్వం ఇంకా సెజ్‌లను నెలకొల్పడానికి పెట్టుబడిదారులకు భూములను కేటాయిస్తూనే ఉంది. ప్రభుత్వం తమను తమ కుటుంబాలను వంచించి, భూసేకరణ చేపట్టిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి తీసుకున్నారని నిలదీశారు. సెజ్ బాధిత మహిళలను కదిలిస్తే వారి కన్నీళ్లు మనల్ని ప్రశ్నిస్తుంటాయి. మేము గత మూడు సంవత్సరాల నుండి సెజ్ అనే మాట వింటున్నాం. అప్పటి నుండి రోజూ నిద్ర, ఆహారం సరిగా ఉండడం లేదు. మా గ్రామంలో ఎప్పుడు పోలీసులు, అధికారులు వచ్చి మా భూముల్లో కంచెలు వేస్తారనే భయంతో బతుకుతున్నామనీ, మా పిల్లల్ని ఏ రాత్రి పోలీస్ వాళ్లు తీసుకుపోతారో తెలియని పరిస్థితిలో మేం జీవిస్తున్నామనీ అంటున్నారు. ఇప్పుడిప్పుడే మేం కొంత ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాం, అందువల్లనే మా పిల్లలను చదివించు కోవాలనుకుంటున్నాం. కాని సెజ్ వచ్చి మాకు నిలువనీడ లేకుండా చేస్తుంటే ఇక మా పిల్లల చదువులు ఎలాగని ఆందోళన చెందుతున్నారు.

కాకినాడ సెజ్ బాధిత మహిళలంతా కలిసి 8 మార్చ్ 2008న మహిళా ఆక్రందన దినంగా ప్రకటించుకున్నారు. కాకినాడ సెజ్ వ్యతిరేక మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమస్యను గుర్తించిన సామాజిక ఉద్యమ నాయకురాలు మేధాపాట్కర్ ఇక్కడి మహిళల తరఫున ఆందోళనలో భాగస్వాములయ్యారు. అంతేకాక స్థానిక మహిళా న్యాయవాది హేమా వెంకట్రావు సందర్శించి మహిళల భాగస్వామ్యం ఈ ఉద్యమంలో అవసరమని గుర్తించి ఆమె ఆధ్వర్యంలోనే మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. మొదటగా ఈ సమస్యను మానవ హక్కుల వేదిక నాయకులు గుర్తించి న్యాయపరమైన సలహాలు అందజేస్తున్నారు. రామన్ మెగసెసె అవార్డ్ గ్రహీత సందీప్‌పాండే కూడా ఈ ఉద్యమానికి మద్దతుగా ఉన్నారు.

ఆందోళనలో పాల్గొనే క్రమంలో పోలీస్ అధికారులు మహిళలను దూషించడం, లాఠీ ఛార్జిచేయడం సర్వసాధారణమైపోయింది. సేద్యాన్ని, సముద్రాన్ని నమ్ముకొని జీవిస్తున్న ప్రజలకు సెజ్ రావడం పెద్ద శాపంగా మారింది.

ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందివ్వాలంటే ప్రజలనే నిర్వాసితం చేసి, కేవలం పిడికెడు విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించి దేశాభివృద్ధి అంటే, ఎవరికి కావాలి ఈ దేశాభివృద్ధి? మనోవేదనతో గుండె బరువెక్కి, భూములు లేక ఆత్మహత్య చేసుకున్న కుటుంబాల పరిస్థితేమిటి? పచ్చని పొలాలో ఫ్యాక్టరీల సైరన్ మోతలు మోగిస్తామంటే పాలకుల విధానాలను ఏమనాలి? మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఒకవైపు చెబుతూ వారి జీవితాలను ధ్వంసం చేస్తే స్వావలంబన ప్రశ్నార్థకమే కదా? మనిషికి భూమికి ఉన్న సంబంధం సెజ్ మహమ్మరి కబళిస్తుంటే రైతు ప్రయోజనాల మాటేంటి? దేశాభివృద్ధికి పల్లెసీమలే ప్రధానం అంటున్నప్పటికి నేడు గ్రామాలకు గ్రామాలే ధ్వంసం అవుతుంటే అభివృద్ధికి ఆనవాళ్ళు గ్రామాలేనా? ఇత్యాది ప్రశ్నలు నేడు సెజ్ బాధిత గ్రామాలను చూస్తుంటే కానవస్తున్నాయి. సామాజిక ఆర్థిక సంక్షోభాన్ని భారతదేశం లాంటి మానవ వనరులు ఎక్కువగా ఉన్న దేశంలో సృష్టించాలని అభివృద్ధి చెందిన దేశాల కుట్ర. అందుకనే నూతనమైన అభివృద్ధి నమూనాలను మనలాంటి దేశాల ముందు పెడుతున్నాయి. దీనివలన మానవాళి జీవనమే అగమ్యగోచరమవుతోంది. ఏ అభివృద్ధి నమూనా అయినా ఎక్కువగా మహిళలపైనే ప్రభావాన్ని చూపెడుతోంది. అనేకరకాల హింసలు మహిళలపై ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. ఇక ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని మహిళలు ఎలా సాధించగలరు? ఒకవైపు మహిళా సాధికారత అంటూనే ఈ మహిళల జీవనాధారాన్ని పెకిలించే అభివృద్ధి నమూనా ఎవరికోసం? ఏ మహిళల కోసం? ✦

భారత సమాజంలో విశిష్టమైన సోషలిస్టు భావాలను ప్రచారం చేసిన రామ మనోహర్ లోహియా జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ, ఆదర్శాలనూ పరిచయం చేస్తున్నారు **నిరంజన్ రామకృష్ణన్**

అహింసాజ్యోతి లోహియా

స్టూడెంట్ నాన్‌వైలంట్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎస్.ఎన్.సి.సి. – దౌర్జన్య రహిత విద్యార్థి సమన్వయ సంఘం) అట్లాంటా నుండి ప్రచురించే పత్రిక 'స్టూడెంట్ వాయిస్'. 1964 జూన్ 9 నాటి ఆ పత్రికలో ఈ కింది వార్తా కథనం వెలువడింది.

'జాక్‌సన్, మిస్సిసిపి – ఇక్కడి ఓ మోరిసన్ కేఫటేరియాలో భారత దేశపు ఓ పార్లమెంట్ సభ్యునికి ఆహారం వడ్డించేందుకు రెండు పర్యాయాలు తిరస్కరించటం జరిగింది. రెండవ పర్యాయం పోలీసులు గస్తీ తిరిగే వాహనంలో ఎక్కించుకుపోయారు. మే నెల 27, 28 తేదీలలో రెండుసార్లు కూడా డాక్టర్ రామ్ మనోహర్ లోహియా వెంట శ్వేత జాతీయులు ఉన్నారు. లోహియా దేశీయ దుస్తుల్లోనే ఉన్నారు. లోహియా ఇక్కడి టౌగాలూ కళాశాలను సందర్శిస్తూ ఉన్నారు.'

రామ మనోహర్ లోహియా తమని తాము విశ్వపౌరునిగా సంభావించుకుని మిస్సిసిపిలో అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు సంసిద్ధుడయినట్లుగా కన్పిస్తుంది. ఆయన రాణాలకు వ్యతిరేకంగా నేపాల్ పోరాటంలో పాల్గొన్నారు. పోర్చుగీస్ పాలనకు వ్యతిరేకంగా గోవాలో ఒక శాసనోల్లంఘన ప్రజా ఉద్యమాన్ని లేవదీశారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఈయన పాత్ర ఎల్లరకూ సువిదితమే – ఆరేళ్లపాటు బ్రిటిష్ జైళ్లలో... ఆరు పర్యాయాలు.... చిత్ర హింసల్ని అనుభవిస్తూ.. స్వాతంత్ర్యానంతరమూ మరో డజను సార్లు – 1951లో తొలిసారిగా అమెరికా పర్యటించేనాటికే స్వతంత్ర భారతదేశంలో రెండుసార్లు కారాగార వాసం. లోహియాకు ఇదంతా మామూలే – ఎప్పుడూ ఏదో ఒక సిద్ధాంతం కోసం నిలబడటమే – ఎక్కువసార్లు అనేక సిద్ధాంతాల కోసం గొప్ప అహింసావాదిగా, ప్రజాప్రతిఘటనాశీలిగా ఆయన వ్యక్తపరిచేదేమంటే 'ఆయుధాలతో పనిలేకుండా అన్యాయాన్ని ఎదిరించేందుకు ఓ మార్గం ఎంతో అవసరం. అది ఇంతకు ముందే అన్వేషింపబడింది. ప్రజాప్రతిఘటనలో న్యాయాన్ని, సమానత్వాన్ని ఆయుధాలతో పనిలేకుండానే సాధించే తపన ద్యోతకమవుతుంది. ప్రజా ప్రతిఘటన అనేది దట్టించిన సహేతుకత్వం.'

1932లో బెర్లిన్ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఆంగ్ల, జర్మన్, ఫ్రెంచి, హిందీ, బెంగాలీ భాషల్లో అనర్గళంగా ప్రసంగించేవారు. 1963లో పార్లమెంట్‌లో అడుగుపెట్టినప్పుడు మూడు పర్యాయాలుగా సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గుతూ వచ్చిన ఏక పక్ష రాజకీయానిదే ఏకఛత్రాధిపత్యం. లోహియా ఓ కుదుపు కుదపటం జరిగింది. 'రోజుకు 25000 రూపాయలు' అంటూ ఓ కరపత్రం రాసారు. అది రోజుకు భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూపై ఖర్చుపెట్టే ధనం. రోజుకు మూడు అణాల (రూపాయికి 16 అణాలు) సంపాదనపై అధికాంశ ప్రజలు జీవనం సాగించే దేశంలో ప్రధానిపై అంత ఖర్చు సిగ్గుచేటు అని పేర్కొన్నారు. అయితే నెహ్రూ అభ్యంతరం చెప్పటం జరిగింది. భారతదేశపు ప్లానింగ్ కమిషన్ వారి గణాంకాల ప్రకారం భారత ప్రజల రోజువారీ సగటు ఆదాయం 15 అణాలు. అప్పుడు లోహియా దానిని ప్రముఖ అంశంగా పేర్కొని పార్లమెంట్‌లో ప్రత్యేకమైన చర్చకోసం పట్టుబట్టారు. అప్పటి వివాదం 'తీన్ అణ పంద్రా అణ' (మూడు అణాలు, పదిహేను అణాలు) వివాదంగా ఇప్పటికీ భారతీయుల స్మృతిపథంలో నిలిచిపోయింది. లోహియా తమ వాదనకు పదును పెట్టుకుంటూ పోయారు. ప్లానింగ్ కమిషన్ గణాంకాలు కాకుల లెక్కల కింద జమకట్టారు. అవి విషయాన్ని పక్కదారి పట్టించేవిగా ఉన్నాయన్నారు. కొద్దిమంది ధనవంతుల ఆదాయం కోట్లాది మంది సగటు ఆదాయాన్ని పైకెత్తి అవాస్తవిక చిత్రాన్ని మనముందుంచుతున్నదన్నారు. ఆనాడు లోహియా చెప్పిన మూడణాల ఆదాయం జనాభాలోని డెబ్బై శాతం ప్రజలకు వర్తిస్తుంది.

గత శతాబ్దపు 50వ, 60వ దశకాల్లో అలీన దేశాల్లో మార్క్సిస్ట్ సిద్ధాంతం వేలంవెర్రిగా అభిమానింపబడినట్లుగాకాక లోహియా ఆలోచనా విధానం మరో విధంగా ఉంది. భారతదేశపు అభివృద్ధికి పెద్ద అడ్డంకి వర్గం కాదు, కులం అని ఆయన గుర్తించారు. ఇప్పటివలె ఆనాడు కూడా కులం విషయం బహిరంగంగా ప్రస్తావించటం రాజకీయంగా ఆమోదయోగ్యంకాదు. అయితే అది అడుగడుగునా అందరి జీవితాలలో అనేక అంశాలలో ఆచరణయోగ్యమయ్యింది – జనన వేడుకల్లో, వివాహ విషయాల్లో, అనేక కలయికల్లో, చివరకు అంత్యక్రియల్లో కూడ. భారతదేశ చరిత్ర అంతటా ప్రజలు తమని తాము ఒక దేశ ప్రజలుగా గుర్తించక తమ తమ కుల సభ్యులుగా పరిగణించుకున్నందువల్ల భారతదేశ అభివృద్ధి తిరోగమన దిశగా సాగిందనేది లోహియా సిద్ధాంతం. లోహియా చెప్పినట్లు కులం అనేది ఘనీభవించిన వర్గం; వర్గం అనేది కదిలే కులం. అగ్రభాగాన గల బ్రాహ్మణ, వైశ్యకులాల సంకుచిత, మూర్ఖత్వ భావనల కారణంగా దేశానికి కొంగ్రొత్త భావనలు అందకుండా పోయాయి. అగ్రభాగాన కూడ మళ్లీ అరలు, పొరలు, అగ్రభాగంలో ఉన్న తొలి కులానిది. తెలివి తేటల్లో పైచేయి, రెండవ కులానిది. వ్యాపారరంగంలో, నిశ్చయాత్మక కార్యావళి

ప్రబోధకునిగా మంచి పంట కావాలంటే భూమిని గుల్లబారేట్లుగా దున్నినట్లుగానే పైకులాల వారిని స్వచ్ఛందంగా కింది కులాల వారి అభ్యున్నతికి, పెరుగుదలకు దున్నిన భూమిలా కిందికి వెళ్లి పంటకు తగిన సారాన్ని అందించమంటారు. ఆ విధంగా దేశం భావనల విషయంలో, సహజ సామర్థ్యాల విషయంలో విశాలత్వాన్ని సంతరింపజేసుకొని లబ్ధిని పొందగలదంటారు.

లోహియా మాటల్లోనే చెప్పవలసి వస్తే 'కులం అవకాశాన్ని పరిమితం చేస్తుంది. పరిమితమైన అవకాశం సామర్థ్యాన్ని అణచివేస్తుంది. కులం ఎక్కడ తల ఎగరేస్తుందో అక్కడ అవకాశం, సామర్థ్యం ప్రజల నిరంతర సంకుచిత పరిధుల్లో గిరికీలు కొట్టవలసిందే.' తమ పార్టీ అయిన సంయుక్త సోషలిస్టు పార్టీలో కింది కులాలకు చెందిన అభ్యర్థులకు ఎన్నికలలో టిక్కెట్లు, పార్టీలో పెద్ద పెద్ద పదవులు యిచ్చి వాళ్ళను ప్రోత్సహించటం జరిగింది. ఆయన కులాలను గూర్చి ఇలా నిరంతరంగా మాట్లాడినా కులాల కొనసాగింపును సమర్థించే తత్వంకాదు – ఓటు హక్కును వినియోగించుకునేవారు ఏ కులానికి చెందిన వారయినా వాళ్లంతా సోషలిస్టు పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసేట్లు చూడటమే ఆయన లక్ష్యం. దేశాన్ని పటిష్టంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పాలుపంచు కోవాలంటారు. కుల నిర్మూలనకు ఆయన సూత్రీకరించిన నినాదం 'రోటీ–బేటీ'. కలిసి భోంచేయటం ద్వారా (రోటీ), ఇతర కులాల వరులకు పిల్లనివ్వటం ద్వారా (బేటీ) ప్రజలు కులపు అడ్డుగోడల్ని కూల్చవచ్చంటారు.

పెద్దపెద్ద పరిశ్రమల స్థాపనను ప్రతిపాదించే విషయంలో మార్క్సిజం, కేపిటలిజం సమ ఉజ్జీలేనని ముందుగా గుర్తించింది లోహియానే. అలీన ప్రపంచానికి భారీ పరిశ్రమల స్థాపనతో సమస్య పరిష్కారం కాబోదన్నారు. (కార్పొరేట్ రంగం అమెరికన్లకు ప్రాణాంతకమవుతుందని ఈయన 1951లోనే హెచ్చరించారు.) 'ఆసియాకు వ్యతిరేకంగా ఐరోపా ప్రయోగించిన చిట్ట చివరి అస్త్రం'గా మార్క్సిజాన్ని అభివర్ణిస్తారాయన. తటస్థ దేశాల మనుగడకు తప్పనిసరి ప్రత్యామ్నాయాలుగా సూచించబడే మార్క్సిజం, కేపిటలిజం రెండింటినీ 'సమాన సందర్భరహిత సూత్రీకరణ' పేరిట ఈయన ఖండించారు. అంద్రే మాల్‌రాక్స్‌తో 'మంచి సమాజాన్ని మంచి పద్ధతుల ద్వారానే సాధించవలసిన' సవాలును తాను స్వీకరించవలసి ఉందని నెహ్రూ అనటం ద్వారానయినా ఆయన కూడ ఈ విషయంలో లోహియా భావాలవంటి భావాలనే కలిగి ఉన్నాడని అనుకోవాల్సివస్తుంది. కార్మిక ప్రాధాన్య సాంకేతిక పరిజ్ఞాన వినియోగానికి లోహియా గట్టి ప్రాధాన్యాన్ని యిస్తారు. అటువంటివి శ్రామికుణ్ణి బండ చాకిరినుండి బయట పడవేసేదిగానే ఉండాలిగాని సామాన్యుణ్ణి సుదూరశక్తుల దయాదాక్షిణ్యాల వైపుకు తరుముకు పోరాదంటారు.

అహింసామార్గంలో ప్రజాప్రతిఘటనకు ఉద్యమ రూపాన్నివ్వటం తోపాటు, పేదలు, భాగ్యవంతుల మధ్య అఖాతాన్ని పూడ్చే ప్రయత్నాల తోపాటు, కుల నిర్మూలనతో పాటు, యంత్ర భూతాల నుండి మనల్ని కాపాడే మార్గాలతోపాటు లోహియా ఉద్యమాల జాబితాలో స్త్రీ పురుషుల మధ్య అసమానత్వాన్ని రూపుమాపటం, వర్ణ వివక్షను అంత మొందించటం, మూక సంస్కృతి బారినుండి కాపాడి వ్యక్తిగతమైన ఏకాంతాన్ని మానవునికి అందించటం వంటివి కూడా ఉన్నాయి.

లోహియా చేపట్టిన ఉద్యమాలెన్నో భారతదేశంలో ముందడుగు వేసాయి. అందులో కొన్నిటికంటే ఇంకొన్ని బాగా విజయం సాధించాయి. కొన్ని ప్రతికూల ఫలితాలను అందించాయి. అవి ఆయనకు రుచించి ఉండవు. అయితే వివాదమన్నా, పోరాటమన్నా లోహియాది వెనుకాడే తత్వం కాదు. 'మనం అంతా కలిసి ఏదో విధంగా సర్దుకుపోలేమా' అనే రోడ్నే కింగ్ ఆశయ ప్రకటనకు అనుగుణంగా నడుచుకునే ప్రస్తుత అమెరికన్ కాంగ్రెస్‌లోని డెమొక్రాట్లవలెగాక బాధ్యతల్ని తలకెత్తుకున్నప్పుడే ఏ రాజకీయ పక్షమైనా ఎదుగుతుంది అనే నిశ్చితాభిప్రాయం లోహియాది. ప్రజా చైతన్యం పట్ల ఈయనకు ఎనలేని విశ్వాసం. నియమిత పాలనాకాలం పూర్తి కాకుండానే ఎన్నికలు తిరిగి నిర్వహించే వెసులుబాటు గల భారత పార్లమెంటరీ వ్యవస్థ విషయంలో ఒకసారి ఈయన అన్నదేమంటే – 'సజీవ సమాజాలు ఐదేళ్ళ వరకు (పార్లమెంట్ వ్యవధి) వేచి ఉండవు'. అంటే దుష్పరిపాలన చేసే ప్రభుత్వాన్ని ప్రజలు పడగొట్టాలి. పదహారేళ్లుగా పాలనలో ఉన్నా నెహ్రూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆయన తన ఈ ఆలోచనను ఆచరణలో పెట్టారు.

లోహియాను తరచుగా స్వతంత్ర భావాలు గల సామ్యవాదిగా అభివర్ణిస్తారు. అది అరకొర అభివర్ణనే కాని సంపూర్ణంగా అతికినట్లుండేది కాదు. తన భావాలకు నిరంతరం పరిణామ శీలతను కల్పించటం వల్ల అలా కన్పించటం జరుగుతుంది కాని వివాదరహితంగా ఉండాలనుకు నేందుకు మాత్రం కాదు.

తరచుగా లోహియా ఇటు తనకు మద్దతు పలికే వారిని అటు తన ప్రత్యర్థులను ఆశ్చర్యంలో ముంచెత్తేవాడు. 1962లో చైనా దురాక్రమణ తరువాత భారతదేశం బాంబు తయారు చేయాలనే పిలుపునిచ్చి అందరినీ ఆశ్చర్య చకితుల్ని గావించారు. ఆయన ఆంగ్లానికి వ్యతిరేకి. అందుకే బ్రిటిష్ వాళ్ల గోలీతోను (తుపాకిగుండు), బోలీతోనూ (ఆంగ్లభాష) (బందూక్ కీ గోలీ, ఔర్ అంగ్రేజీకీ బోలీ) భారతదేశాన్ని పరిపాలించారని ఈయన పేర్కొనటం మరపునకు రానటువంటి పదబంధాలతో భావ విన్యాసం దేశాన్ని పాలించే వర్గాన్ని గణితమంత లెక్క సరిగా లెక్కించ తీరుని మించి, మూడు దశాబ్దాలుగా వేరొకరు చెప్పిన దాఖలాలు లేవు, 'ఉన్నత కులం, సంపద, ఆంగ్ల భాషా జ్ఞానం – ఈ ముడింటిలో ఏ రెండు కలవారైనా పాలక వర్గానికి చెందినవారై ఉంటారు'. ఈ నిర్వచనం నేటికీ నిజమై నిలుస్తోంది.

రామమనోహర్ లోహియాను సత్యవాదిగా, మేధావిగా, అవగాహన పరునిగా గుర్తించడంలో ఇటు మిత్రులది, అటు శత్రువులది ఒకే మార్గం. ఈయన తన అనుయాయుల్లో ప్రగాఢమైన విశ్వాస పాత్రను, ఎంతో గౌరవభావాన్ని పాదుకొల్పారు. 'డాక్టర్ సాహిబ్' అనగానే వాళ్ల మనస్సుల్లో ఒకే ఒక మూర్తి మెదులుతుంది. ఈయన జీవనం, మరణం అంతా సీదా సాదాగానే సాగింది. ఈయన వెనకేసుకున్నదేమీ లేదు. ఈయన మరణం భారతదేశానికి తీరని లోటు. దానివల్ల భారతదేశం సునిశితమైన రాజకీయ మేధావుల్లో ఒకరిని పోగొట్టుకున్నట్లయింది. అప్పుడు ఆయన వయస్సు 57 ఏళ్ళే.

(తెలుగు సేత : రావెల సాంబశివరావు) వీ

గిల్‌బర్ అబ్‌కర్ రాసిన 'ఈస్టర్న్ కాల్డ్రన్' వ్యాస సంపుటిని పరిచయం చేస్తున్నారు **డా. మానేపల్లి**

అగ్నిగుండంగా పశ్చిమాసియా

ఇరాన్, ఇరాక్, పాలస్తీనా, ఇజ్రాయిల్ ప్రాంతాలు నిత్యం మండుతున్నాయి. దీనికంతటికీ అమెరికన్ సామ్రాజ్యవాద దుశ్చర్యలే కారణం అన్నది బహిరంగ రహస్యం. మరి దీనికి ప్రత్యామ్నాయం ఎక్కడుంది? ఆ ప్రాంతాల సామాన్య ప్రజానికానికి భద్రత కరువయ్యింది.

గిల్‌బర్ అబ్‌కర్ మార్క్సిస్టు మేధావి. సమకాలీన ప్రపంచ సమస్యల్ని మార్క్సిస్టు దృష్టికోణం నుంచి విశ్లేసిస్తూ వ్యాసాలు రాస్తున్నారు. గిల్‌బర్ అబ్‌కర్ కొత్త వ్యాససంపుటి 'ఈస్టర్న్‌కాల్డ్రన్' లో 22 వ్యాసాలున్నాయి. వీటిని నాలుగు భాగాలుగా విభజించాడు. ఇవి 1980–2003 మధ్య సుమారు ఇరవై ఏళ్ల కాలంలో వివిధ పత్రికల్లో వచ్చాయి. ఫ్రెంచ్ భాషలో ఉన్న ఆ వ్యాసాన్ని పీటర్ డ్రక్కర్ ఇంగ్లిష్‌లోకి అనువదించాడు. 22 వ్యాసాలు ఒక పుస్తకరూపంలో ఒక క్రమంలో ఒక్క దగ్గరచేర్చి చదువుకుంటే–అబ్‌కర్ ఏమి చెప్పదలుచుకున్నదీ తెలుస్తుంది. ఈ వ్యాస సంపుటికి–చాలా విపులమైన ముందు మాట రాశాడు. ఇందులో చాలా సమకాలీన సమస్యల్ని చర్చించే ప్రయత్నంచేశాడు. ఒక లేఖ కూడా వుంది. దీన్ని మొదట 2004లో మంత్లీ రివ్యూ ఫౌండేషన్(న్యూయార్క్) వారు ప్రచురించారు. 2006లో ఇండియాలో ఆకార్‌బుక్స్ (ఢిల్లీ) ప్రచురించారు. సుమారు ఒక దశాబ్దకాలానికి పైగా లెబనాన్‌లో నివసించి 1983లో ఫ్రాన్స్ వెళ్లి అక్కడ యూనివర్సిటీలో రాజనీతిశాస్త్ర ఆచార్యుడుగా పనిచేశాడు. మధ్య ప్రాచ్యంలోని సంక్షోభాన్ని కళ్లారాచూశాడు. ప్రథమస్థాయి సమాచారాన్ని కూడదీసి పత్రికలకు వ్యాసాలు రాస్తున్నాడు. ఈయన వ్యాసాలు పుస్తకరూపంలో వచ్చి మేధావుల ప్రశంసలందుకోవడమే కాక వివిధ ప్రపంచ భాషల్లోకి అనువాదమయ్యాయి.

తూర్పు యూరప్, పశ్చిమాసియా దేశాల్లో ఇస్లాం, దాని రాజకీయ ఎజెండా–సామ్రాజ్యవాద శక్తులతో ఆయా దేశాధిపతుల మిలాఖత్, ఇరాన్, పాలస్తీనా, ఆఫ్ఘనిస్తాన్‌లపై అమెరికా దురాక్రమణ యుద్ధం, రసాయన బాంబులు–మారణాయుధాలు–సద్దాం హుస్సేన్ పై పగ, మరోక పక్క రష్యాచొరబాట్లు–కవ్వింపు చర్యలు–ఈ అన్నిటిని అబ్‌కర్ తన వ్యాసాల్లో ప్రస్తావించాడు. అమెరికాపై బిన్‌లాడెన్ అతని అనుచరులు చేశారని చెపుతున్న సెప్టెంబర్11 దాడి–ఆకాశ హర్మ్యాల నేలమట్టం, విఫలమైన, ఘోరంగా ఎదురుదెబ్బతిన్న బుష్ విదేశాంగ కుటిల నీతి, వీటిని విశ్లేషించుకోనిదే అమెరికా దురాక్రమణ కుతంత్రం అర్థంకాదు. ఇది చమురుగనులపై అధిపత్యంకోసం జరిగిన పోరులా కనపడినా పూర్తిగా అంత మాత్రమేకాదు.

ఈ పుస్తకానికి రచయిత పెట్టిన పేరు 'ఈస్టర్న్ కాల్డ్రన్' (తూర్పు దేశాల్లో అగ్నిగుండం) కాగా దిగువ ఒక సబ్ టైటిల్ ఉంది. ఇస్లాం, ఆఫ్ఘనిస్తాన్, పాలస్తీనా, ఇరాక్ ఇన్‌ఎ మార్క్సిస్టు మిర్రర్. మనకు అబ్‌కర్ ఈ మొత్తం చిత్రాన్ని మార్క్సిస్టు అద్దంలో చూపిస్తున్నాడు. ఈ వ్యాస సంపుటికి ప్రత్యేకంగా రాసిన ఉపోద్ఘాత(మూడోమాట/పరిచయ) వ్యాసంలో అమెరికన్ మిలటరీ ఎత్తుగడల్నీ, మధ్య ప్రాచ్యంలో దాని పోకడల్నీ ఎండగట్టాడు. ఒకనాటి ఆటామన్ సామ్రాజ్యకాలంనాటి సంఘటనల్లో మొదలుపెట్టి ఇటీవలికాలంలో సద్దాంహుస్సేన్‌పై కాలు దువ్వడం వరకుగల క్రమం మొత్తాన్ని విశ్లేషించాడు. మొదటి ప్రపంచయుద్ధ కాలంనాటికి శైశవ్యదశలోవున్న అమెరికా శక్తులు క్రమంగా రాజకీయంగా, ఆర్థికంగా, దౌత్యపరంగా ఎదిగి ఎదిగి ఈనాడు ఒక ప్రపంచ పోలీసు స్థాయికి చేరుకున్న క్రమం వివరించాడు. సమకాలిక సంఘటనల్ని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రథమశ్రేణి సమాచారంతో వివరించ గల గొప్ప పట్టువున్న వాళ్లు ఇంత సమర్థవంతంగా ఈ విషయాన్ని విడమర్చి చెప్పడం కుదరదు. ఆ పని ప్రశంసనీయంగా చేశాడు అబ్‌కర్. కనుకనే ఈ వ్యాససంపుటికి ఒక సాధికారికత ఏర్పడింది.

ఇందులో మొత్తం 22 వ్యాసాల్ని నాలుగు భాగాలుగా చేస్తే మొదటిభాగంలో ఇస్లామిక్ ఫండమెంటలిజం, ఖోమైనీ విప్లవ సంగీతం, ఆరబ్ ఉదారసంస్కారవాదం మొదలైన అంశాలు చర్చించాడు. రెండవ భాగంలో ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ చొరబాటు, లెబనాన్ వైఖరి, మాటతప్పిన సోవియట్, ఆఫ్ఘన్ యుద్ధవాతావరణం మొదలైన అంశాలున్నాయి. మూడు నాలుగు భాగాలు కాస్త పెద్దవి.

మూడవభాగంలో పాలస్తీనా తిరుగుబాట్లు, పాలస్తీనా విముక్తి సైన్యం, పాలస్తీనాలో వామపక్ష శక్తులు, వాషింగ్టన్ ఎత్తుగడలు, అత్యంత కీలకమైన జియోనిజమ్, ఇజ్రాయిల్ మిలిటరీ దాడులు ఇలా చాలా విషయాలు చర్చకు వచ్చాయి. వివరించాలంటే, మళ్లీ ఒక్కొక్క అధ్యాయంపై ఒక సమగ్ర వ్యాసమే రాయవలసి వుంటుంది.

నాలుగవభాగంలో ఇరాక్‌లో యుద్ధవాతావరణం ఆ నిరంతర వాతావరణంలో సామాన్య ఇరాకీ ప్రజల విషాద జీవితం, చమురు యుద్ధాలు, అమెరికా యుద్ధ వైఖరి, వాషింగ్టన్, లండన్‌లో ప్రపంచాధినేతలు కుటిలనీతి, ఈ వ్యాసాలచివర ఒక లేఖ యుద్ధ వ్యతిరేక చర్యలకు సంబంధించినది. వీ

సింగరేణి లో ఓపెన్‌కాస్ట్ గనులతో జరుగుతున్న పర్యావరణ వినాశనాన్నీ, నిర్వాసితుల స్థితిగతులనూ వివరిస్తున్నారు **పిట్టల రవీందర్**

ప్రశ్నించాల్సిన బొగ్గుగనుల విధ్వంసం

బొగ్గుగనుల తవ్వకం విధానంలో 1980 నుండి భారీ మార్పులు సంభవించాయి. దేశీయంగా బొగ్గు అవసరాలు పెరగడంతో వేగవంతమైన ఉత్పత్తి విధానాలు, గనుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయాయి. తక్కువ సమయంలో ఎక్కువ మోతాదులో బొగ్గును వెలికితీసే లక్ష్యంతో ఓపెన్‌కాస్ట్ గనుల తవ్వకంవైపు బొగ్గు ఉత్పత్తి సంస్థలు ఎక్కువ శ్రద్ధను కనబరుస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోని ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా తెలంగాణలోని ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలలో గడిచిన 120 సంవత్సరాలుగా బొగ్గును ఉత్పత్తి చేస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రస్తుతం 37 అండర్‌గ్రౌండ్ గనులతోపాటుగా, 13 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులను నిర్వహిస్తోంది. అంతేకాకుండా నష్టాలతో నడుస్తున్నాయన్న నెపంతో అనేక అండర్‌గ్రౌండ్ బొగ్గుగనులను ఓపెన్‌కాస్ట్ గనులుగా మార్చేందుకు ప్రణాళికలను రూపొందించుకుని అమలు జరుపుతున్నది. క్రమంగా అండర్‌గ్రౌండ్ గనులను మూసివేసేందుకు లేదా వాటిని ఓపెన్‌కాస్ట్ గనులుగా మార్చివేసేందుకు ప్రయత్నిస్తున్నది. గడచిన ఇరవై సంవత్సరాల కాలవ్యవధిలో 22 సంప్రదాయ అండర్‌గ్రౌండ్ గనులను సింగరేణి సంస్థ మూసివేసింది. పర్యవసానంగా సుమారు 46 వేలమంది గని కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. పరోక్షంగా మరో ఐదు లక్షలమంది తమ ఉపాధిని కోల్పోయారు. సింగరేణిలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నింటిపైనా ప్రభావిత ప్రాంతాల ప్రజలతోపాటుగా, పర్యావరణ ప్రేమికులు తీవ్రమైన భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల విధానంపైన సర్వత్రా నిరసనలు, వ్యతిరేకత వ్యక్తం అవుతున్నాయి. 'భూగర్భంలో సహజసిద్ధంగా ఏర్పడిన నేలబొగ్గు జాతీయ సంపద. అందువల్ల నేలబొగ్గును భూమిపొరల్లోనుండి వెలికితీసే క్రమంలో కొంతమందికి ఇబ్బందులు కలుగుతాయన్న కారణంగా మొత్తంగా జాతి ప్రయోజనాలను విస్మరించలేం' అంటూ ప్రభావిత ప్రాంతాల బయట, సింగరేణి బొగ్గుతో ప్రయోజనం పొందుతున్న కొంతమంది సరికొత్తవాదనలు ముందుకు తీసుకువస్తున్నారు. అందువల్ల ఓపెన్‌కాస్ట్ గనుల విధానంపట్ల పెల్లుబుకుతున్న నిరసనల నేపథ్యాన్ని, ఇందుకు గల కారణాలను విశ్లేషించుకోవాల్సిఉన్నది.

ఓపెన్‌కాస్ట్ మైనింగ్ విధానంలో భూమి ఉపరితలం నుండి 150 మీటర్ల లోతువరకు (కొన్ని సందర్భాలలో 300 మీటర్ల లోతువరకు కూడా) మట్టిని తొలగించి, భూగర్భంలో ఉన్న బొగ్గు పొరలను వెలికి తీస్తారు. ఒక టన్ను బొగ్గును వెలికితీయడానికి సగటున ఎనిమిది నుండి పది క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించవలసి ఉంటుంది. (భూభౌతిక పరిస్థితులనుబట్టి ఈ లెక్కల్లో మార్పులుంటాయి.) క్యూబిక్ మీటరు మట్టి బరువు సగటున టన్నున్నర కిలోలుగా లెక్క చెబుతారు. అంటే ఒక టన్ను బొగ్గును వెలికితీయడానికి సగటున 15 టన్నుల బరువుతో సమానమైన మట్టిని తొలగించవలసి ఉంటుంది. సింగరేణి బొగ్గుగనుల సంస్థ ఇప్పటివరకూ ఓపెన్‌కాస్ట్ విధానం ద్వారా 300 కోట్ల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. అంటే 45 వేల కోట్ల టన్నుల బరువుతో సమానమైన మట్టిని భూమి ఉపరితలం నుండి తొలిచిపడవేసింది. ఈ మట్టిని నిలువచేయడానికి సుమారు 7800 ఎకరాల భూమిని ఉపయోగించుకున్నది. రానున్న రోజుల్లో సింగరేణి కంపెనీ ప్రారంభించనున్న దాదాపు 50 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులనుండి వెలికితీసే మట్టిని నిలువచేయడానికి కనీసం మరో 30 వేల ఎకరాల భూమిని ఉపయోగించుకోవాల్సి ఉన్నది. ఈ మొత్తం ప్రక్రియలో భారీ యంత్రాలు భారీవాహనాలు ఉపయోగిస్తారు. భారీపేలుళ్లు నిర్వహిస్తారు. అందువల్ల ఓపెన్‌కాస్ట్ గనుల వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతున్నాయి.

ఓవర్‌బర్డెన్ (ఓ.బి. బొగ్గుపొర బయటపడే వరకూ భూమి ఉపరితలం నుండి తొలగించే మట్టి) డంప్‌కోసం ఎక్కువ మొత్తంలో ఉపరితల భూములను వినియోగించవలసి వస్తున్నది. గతంలో కంటే భిన్నంగా 150 మీటర్ల లోతునుండి 300 మీటర్ల లోతు వరకు ఉపరితలాన్ని తవ్వడంవల్ల పరిసర ప్రాంతాలలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయి. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ సమీపంలోని 10 కిలోమీటర్ల పరిధిలో వ్యవసాయ భూములన్నీ నిస్సారంగా మారి సాగు యోగ్యతను కోల్పోతాయి.

ఈ గనుల్లో భారీ యంత్రాలు వినియోగించడంవల్ల, శబ్ద, వాయు, చమురు కాలుష్యం పర్యావరణాన్ని ఎక్కువ మోతాదులో దెబ్బతీస్తుంది. జంతు, జీవజాలానికి ప్రాణాంతకంగా తయారవుతుంది. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులవల్ల నిర్వాసితులవుతున్న స్థానికులకు ఈ ప్రాజెక్టుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతోనూ, సహాయ-పునరావాస విధానాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఉండకపోవడంవల్లనూ ఈ ప్రాజెక్టుల ఏర్పాటుపట్ల స్థానిక ప్రజల్లో పెద్దయెత్తున వ్యతిరేకత ఎదురవుతున్నది. అంతేకాకుండా కేవలం భూములు కోల్పోయిన నిర్వాసితులనే కాకుండా పరిసర ప్రాంతాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఆ ప్రాంతం సామాజిక, ఆర్థిక రంగాలపై గనులు ప్రభావం చూపుతాయి. గాలి, నీరు, శబ్దకాలుష్యాలతోపాటు ఓబిని, ఆ తర్వాత బొగ్గును వెలికి

తీసేందుకు గనిక్వారీలో భారీస్థాయిలో నిర్వహించే బ్లాస్టింగ్ (పేలుళ్లు) వల్ల పరిసర ప్రాంతాల భూమి కంపించడం, వాహనాల శబ్దం, మట్టి తవ్వకం వల్ల విపరీతంగా గాలిలోకి లేచే దుమ్ము ఫలితంగా ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రభావిత ప్రాంతాల ప్రజల సామాజిక జీవనవిధానంలో అనూహ్యమైన మార్పులను తీసుకువస్తున్నాయి.

ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రాంతాలలో పంట పొలాలు భూసారంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్న పరిణామాలపై నిర్వహించిన భూసార పరీక్షల్లో భూసారక్షీణ కారకాల (పి.హెచ్) స్థాయి సుమారు మూడున్నరగా నమోదుకాగా, గని సమీప ప్రాంతాలలోని భూముల్లో భూసారక్షీణ కారకాల (పి.హెచ్) స్థాయి 3 నుండి 8.13 వరకు ఉన్నట్టుగా వ్యవసాయశాఖ నిర్వహించిన అధ్యయనంలో నిర్ధారించారు. ఫలితంగా గనుల సమీపంలోని పంటపొలాలలో భూసారం తగ్గిపోయి ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగిపోయినట్లు తదనుగుణంగా రైతులకు సాగుఖర్చులు పెరగటంతో బాటుగా, పంటి దిగుబడులు కూడా తగ్గిపోయినట్లు, పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్నట్లు ఈ అధ్యయనాలు వెల్లడించాయి.

కోల్‌ఇండియాకు అనుబంధంగా ఉన్న నార్త్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్.ఇ.సి.ఎల్) లో అక్కడి వ్యవసాయ శాఖ నిర్వహించిన అధ్యయనం ప్రకారం ఓపెన్‌కాస్ట్ గని పరిసరప్రాంతంలోని 250 ఎకరాల పంటపొలాలకు నష్టం వాటిల్లుతుండగా, మరో 75 ఎకరాల మేరకు భూమిలో బొగ్గుదుమ్ము, ధూళి పేరుకుపోవడంతో పూర్తిగా సాగుకు పనికిరాకుండాపోతున్నది. ఓపెన్‌కాస్ట్‌గని రాకపూర్వం ఈ ప్రాంతంలో ప్రతి హెక్టారుకు సగటున 18 టన్నుల వరిధాన్యం దిగుబడిరాగా, గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత ధాన్యం దిగుబడి సగానికి సగం (8 నుండి 9 టన్నులకు) పడిపోయినట్లు అక్కడి వ్యవసాయశాఖ అధ్యయనం తేల్చిచెప్పింది. ఓపెన్‌కాస్ట్ గనుల్లో వెలువడే ఆమ్లాలు, ఇతరత్రా నీటి కాలుష్య కారకాలు సమీప చెరువుల్లోకి చేరుతుండటంవల్ల గని పరిసర ప్రాంతాలలో చేపలపెంపకం పూర్తిగా కుంటుపడిపోయినట్లు, దీనిమీద ఆధారపడిన వందలాది కుటుంబాలు ఉపాధిని కోల్పోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. బొగ్గులో బూడిద శాతం తక్కువగా ఉండే ఎన్.ఇ.సి.ఎల్. సంస్థ పరిధిలోనే పరిస్థితులు ఇట్లా ఉంటే, బొగ్గులో 15 నుండి 45 శాతం బూడిదను కలిగిఉండే సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఎవ్వరైనా ఊహించుకోవచ్చు.

ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల నిర్వహణవల్ల పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న 11 సంవత్సరాలలోపు వయసు పిల్లల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెలువరించిన అధ్యయన నివేదికలు వెల్లడించాయి. ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనుల ప్రాంతాల్లోని విద్యార్థుల్లో ఏకాగ్రత తగ్గిపోతుందని, బుద్ధిమాంద్యం, చికాకులు అధికంగా ఉన్నాయని కూడా ఈ అధ్యయన నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ వయస్సు పిల్లల్లో శ్వాసకోశ, చర్మవ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల్లో వెల్లడించింది. అంతేకాకుండా ఓపెన్‌కాస్ట్ గనులు నిర్వహిస్తున్న ప్రాంతాలలో నివసిస్తున్న మహిళలపై కూడా ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృతమైన అధ్యయనాలు నిర్వహించింది. గనుల ప్రభావిత ప్రాంతాల లోని గర్భిణుల్లో ఎక్కువ శాతం సహజ ప్రసవాలకు నోచుకోవడంలేదని, సిజేరియన్ ఆపరేషన్ చేయించుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది.

మరోవైపున ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గును తొలిచే క్రమంలో వినియోగిస్తున్న భారీ పేలుడు పదార్థాల విస్ఫోటనాల ఫలితంగా వెలువడుతున్న శబ్దకాలుష్యం, దుమ్ము, బొగ్గుధూళి తదితర కారణాల వల్ల పక్షులు, చిట్టడవుల్లో సంచరించే జీవాలు పూర్తిగా కనుమరుగై పోతున్నాయి. క్రిమి, కీటకాలు కనిపించకుండా పోతున్నాయి. ఫలితంగా ప్రకృతిలో జనజీవాలమధ్యన ఉండాల్సిన సమతుల్యత దెబ్బతింటున్నది. ప్రతి ఓపెన్‌కాస్ట్ బొగ్గుగని నిర్వహణ ఫలితంగా చుట్టూ కనీసం పది కిలోమీటర్ల పరిధిలో ఈ దుష్పరిణామాలు సంభవిస్తున్నాయని అంతర్జాతీయ పర్యావరణ సంస్థలు నిర్వహించిన శాస్త్రీయ పరిశీలనకు సంబంధించిన నివేదికల్లో తేల్చిచెప్పారు.

అయితే ఈ పరిణామాలన్నింటినీ ఎదుర్కొనడానికి భారత బొగ్గు మంత్రిత్వ శాఖ చేసిన సూచనలేవీ మన దేశంలోని బొగ్గు ఉత్పత్తి సంస్థలు పాటించకపోవడం వల్లనే బొగ్గుగనుల ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల్లో ఆందోళనకు కారణమవుతున్నది. సరిగ్గా సంవత్సరం క్రితం నవంబర్ 2007 లో ఢిల్లీలో నిర్వహించిన "భారత బొగ్గుగనుల ప్రాంతాల్లోని సామాజిక, పర్యావరణ సమస్యలపై అంతర్జాతీయ ప్రథమ మహాసభ" న్యూఢిల్లీ డిక్లరేషన్ పేరిట అనేక సూచనలు చేసింది. ఇందులో ప్రధానంగా నూతనంగా గనులను ప్రారంభించే ప్రతిపాదనల స్థాయిలోనే ప్రభావిత ప్రాంతాలలోని సామాజిక, పర్యావరణ సంబంధమైన అధ్యయనాలు నిర్వహించి, ఆ ప్రాంత ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలను రూపొందించుకొని అమలు జరపాలని సూచించింది. కానీ ఈ దిశలో మనదేశంలోని బొగ్గు ఉత్పత్తి సంస్థలేవి సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ఈ విషయంలో సింగరేణి మరింతగా వెనుకబడిపోవడంతో బొగ్గుగనుల ప్రాభావిత ప్రాంతాల ప్రజలనుండి వ్యక్తమవుతున్న ఆందోళనలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. భారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడం, ప్రతియేటా లాభాలను అధిగమించడం లాంటి వ్యాపార ధృక్పథం నుండి ఇప్పటికైనా సింగరేణి తన దృష్టిని బొగ్గుగనుల ప్రభావిత ప్రాంతాల ప్రజల సమస్యలవైపు మళ్లించకపోతే, రానున్న కాలంలో బొగ్గుగనుల నిర్వహణ మరింత సంక్లిష్టంగా మారే సూచనలు స్పష్టంగా కనిసిస్తున్నాయి. వీ

గతితర్కం, మానవ పరాయీకరణ, శ్రమ విలువ సిద్ధాంతం, చరిత్ర గమనం పట్ల భౌతికవాద అవగాహనల పునాదిగా మార్క్సిజం అంటే ఏమిటో వివరిస్తున్నారు **బెర్టెల్ ఓల్‌మన్**

మార్క్సిజం అంటే ఏమిటి?

ఒక అగ్రశ్రేణి పెట్టుబడిదారు దగ్గరికి ఒక యువ విలేకరి వెళ్లి మీరిన్ని డబ్బులు ఎలా సంపాదించారు అని అడిగాడట. 'నిజంగా అదంతా చాలా సులభం' అంటూ ఆ పెట్టుబడిదారు జవాబిచ్చాడట. 'నేను ఐదు సెంట్లకు ఒక ఆపిల్ పండు కొన్నాను. ఆ సాయంత్రమంతా కూర్చుని దాన్ని నిగనిగలాడేలా రుద్దాను. మర్నాడు పొద్దునే దాన్ని పది సెంట్లకు అమ్మాను. దానితో రెండు ఆపిల్స్ కొన్నాను. ఆ సాయంత్రం వాటిని రుద్దీ రుద్దీ మర్నాడు ఇరవై సెంట్లకు అమ్మాను. అలా అలా ఎనభై సెంట్లదాకా సంపాదించాను. సరిగ్గా అప్పుడే నా భార్య తండ్రి చనిపోయాడు. ఆయన ఆస్తి పదిలక్షల డాలర్లు మాకు కలిసివచ్చింది.' ఇది నిజమేనా? ఇది న్యాయమైందేనా? అసలు దాని అర్థమేమిటి? కొంతమంది ఎందుకు ధనికులుగా ఉన్నారో, కొంతమంది ఎందుకు పేదలుగా ఉన్నారో, అసలు ఇలా కాక మరొరకంగా ఉండే అవకాశం ఉందో లేదో అనే ప్రశ్నలు ఇవాళ్టి సమాజంలో అతి వేడిగా, వాడిగా చర్చించబడుతున్నాయి.

ఈ ప్రశ్నలకు జవాబులు కనిపెట్టడానికే కార్ల్ మార్క్స్ ప్రయత్నించాడు. మనం నివసిస్తున్న ఈ పెట్టుబడిదారీ సమాజం ఎలా పనిచేస్తుందో, ఎవరికోసం బాగా పనిచేస్తుందో, ఎవరి కోసం ఘోరంగా పనిచేస్తుందో, అంతకు ముందున్న భూస్వామ్య విధానం నుంచి అది ఎలా పుట్టిపెరిగిందో, అది చివరికి ఎక్కడికి దారితీస్తుందో అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నించాడు. జనం తమ మనుగడ సాగించడానికి నెలకొల్పుకునే సాంఘిక, ఆర్థిక సంబంధాల మీద ఆయన ప్రధానంగా దృష్టిపెట్టాడు. ఆ క్రమంలో పెట్టుబడిదారీ విధానంలో శాంతి భద్రతలుగా మనకు కనబడుతున్న దాని వెనుక రెండు ప్రధాన వర్గాల పోరాటం దాగి ఉన్నదని ఆయన గుర్తించాడు. ఒక వర్గం సమాజంలోని ఉత్పాదక వనరులన్నిటినీ తమ సొంతం చేసుకున్న పెట్టుబడిదారీ వర్గం, మరొకవర్గం మనుగడ సాగించడానికి శ్రమ చేయక తప్పని కార్మిక వర్గం. మార్క్సిజం అని మనం ఇవాళ పిలుస్తున్నది మొత్తం ఈ రెండు వర్గాల మధ్య ఉండే సంక్లిష్టమైన, నిరంతరం మారే సంబంధాల విశ్లేషణే.

మూలాలు

ఈ విశ్లేషణలో భాగమైన ప్రధాన సిద్ధాంతాలను ఈ విషయం దృష్టిలో పెట్టుకుని అర్థం చేసుకోవాలి. ఆ సిద్ధాంతాలు పరాయీకరణ సిద్ధాంతం, శ్రమ విలువ సిద్ధాంతం, చరిత్ర పట్ల భౌతికవాద అవగాహన సిద్ధాంతం. అసలు సోషలిజం గురించి మార్క్స్ ఊహ కూడా ఆయన పెట్టుబడిదారీ విధానం గురించి చేసిన అధ్యయనం నుంచే వెలువడింది. ఎందుకంటే సోషలిజం అంటే పెట్టుబడిదారీ విధానంలో అంతర్గర్భితంగా ఉన్న, సాకారం పొందని శక్తుల వికాసమే. ఆ వికాసానికి పెట్టుబడిదారీ విధానం సాధించే మహత్తర భౌతిక సంపద, అద్భుతంగా పురోగమించిన నిర్మాణ రూపాలు వీలు కలిగిస్తాయి. తద్వారా ఇంకా ఎక్కువ న్యాయమైన, ప్రజాస్వామికమైన సమాజం రూపొందుతుంది. ఆ సమాజంలో ప్రతి ఒక్క వ్యక్తి తన విశిష్టమైన మానవ లక్షణాలను అభివృద్ధి చేసుకోగలుగుతారు.

కొన్ని సామ్యవాద భావాలు నిజానికి బైబిల్ నాటి పూర్వకాలంలో కూడా కనబడుతాయి. కాని మార్క్సిజానికి మాత్రం దాని ప్రధాన మేధోపరమైన మూలాలు జర్మన్ తత్వశాస్త్రంలో, ఇంగ్లిష్ రాజకీయార్థిక శాస్త్రంలో, ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిజంలో ఉన్నాయి. నిరంతరం మారుతున్న, సంక్లిష్టంగా ఉన్న ప్రపంచాన్ని గురించి ఆలోచించే ఒక పద్ధతిని మార్క్స్ తనకన్నా ముందరి జర్మన్ తత్వవేత్త హెగెల్ నుంచి నేర్చుకున్నాడు. ఆ పద్ధతిని గతితర్కం అంటారు. అలాగే తన శ్రమ విలువ సిద్ధాంతం గురించి తొలి ఆలోచనలు చేసినప్పుడు మార్క్స్‌కు ఆ ఆలోచనలు అందినది బ్రిటిష్ రాజకీయార్థిక శాస్త్రవేత్తలు ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోల నుంచి. అదే విధంగా పెట్టుబడిదారీ విధానాన్ని అధిగమించిన తరువాత ఏర్పడబోయే ఆనందమయ భవిష్యత్తు గురించి మార్క్స్‌కు ఊహలను అందించినవారు ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిస్టులు. ముఖ్యంగా చార్లెస్ ఫోరియర్, కాంటె డి సెయింట్ సైమన్. ఒకవైపు అపారమైన సంపదను సృష్టిస్తూనే అంతకు అంత దారిద్ర్యాన్ని తయారు చేసిన పారిశ్రామిక విప్లవపు వైచిత్రితోపాటు ఈ మూడు ప్రధాన మేధో ప్రవాహాలు మార్క్సిజం రూపొందడానికి తోడ్పడ్డాయి.

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం

పెట్టుబడిదారీ విధానం గురించి మార్క్స్ చేసిన అధ్యయనం ఒక తత్వశాస్త్రం మీద ఆధారపడింది. ఆ తత్వశాస్త్రం గతితార్కికమూ, భౌతికవాదమూ కూడా. గతితార్కిక దృష్టి అంటే మార్పులను, పరస్పర సంబంధాలను శ్రద్ధతో గుర్తించడం. ఆ మార్పులకూ, పరస్పర సంబంధాలకూ గురి అవుతున్న నిర్మాణాలనూ, క్రమాలనూ అధ్యయనం చేసేటప్పుడు ఆ మార్పుల పాత్రను, పరస్పర సంబంధాల పాత్రను

నొక్కి చెప్పడం. ఇలా చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానపు వ్యవస్థలోని ఒక చిన్న ఘటనను – ఉదాహరణకు ఒక ఎన్నికనో, ఒక ఆర్థిక సంక్షోభాన్నో – అధ్యయనం చేసేటప్పుడు దాని విశాల నేపథ్యం గురించి విస్మరించకుండా ఉండాలి. అట్లాగే ఆ ఘటన వర్తమానంలో ఎలా కనబడుతున్నదో చూస్తున్నప్పుడు దాని వాస్తవ గతాన్ని గానీ, భవిష్యత్తు అవకాశాలను గానీ, దాని చారిత్రక నేపథ్యాన్ని గానీ విస్మరించకుండా ఉండాలి. అందుకే మార్క్స్ ఆ క్షణానికి సంబంధించిన ఏ విషయం గురించి పరిశీలించినా ఆయన తీసుకున్న గతితార్కిక వైఖరి వల్ల ఆ విషయాన్ని సంపూర్ణంగా అధ్యయనం చేశాడు. అంటే ఒక తక్షణ విషయాన్ని చూస్తున్నప్పుడే దాన్ని అప్పటిదాకా అభివృద్ధి చెందిన, ఇంకా అభివృద్ధి చెందుతున్న విశాల పెట్టుబడిదారీ విధాన వ్యవస్థలో భాగంగా చూశాడు. చరిత్రలో జరుగుతున్న వాస్తవికమైన మార్పులు ఈ దృష్టితో చూసినప్పుడు పరస్పరం సంఘర్షించిన శక్తుల ఫలితంగా సంభవిస్తున్నాయని అర్థం అవుతుంది. ఆ పరస్పర ఘర్షణను వైరుధ్యాలు అంటారు. సమాజ సాధారణ గమనంలోనే వైరుధ్యాలు తలెత్తుతాయి.

గతితర్కం గురించి హెగెల్ చెప్పినప్పటికీ ఆయన పూర్తిగా భావాలతో మాత్రమే వ్యవహరించాడు. అందుకు భిన్నంగా మార్క్స్ వాడిన గతితర్కం పూర్తిగా భౌతికవాదానికి సంబంధించినది. పెట్టుబడిదారీ విధానం అనేదాన్ని ఒక ఆలోచనల వ్యవహారంగా కాక నిత్యజీవిత వ్యవహారంగా మార్క్స్ ప్రాథమికంగా భావించాడు. అయితే ప్రజా జీవితం అన్నప్పుడు అందులో చైతన్యమూ, ఆలోచనలూ కూడా ఉంటాయి. ఒకవైపు హెగెల్, భావాలను వాటిని కలిగి ఉన్న మనుషుల నుంచి విడదీసి పరీక్షించగా, మార్క్స్ అవలంబించిన భౌతిక వాదం ఆ భావాలను జీవిస్తున్న మనుషుల మెదళ్లలో గుర్తిస్తుంది. ఈ భౌతికవాదం మనుషులనైనా, భావాలనైనా ఒక ప్రపంచంలో అవిభాజ్యమైన భాగాలుగా చూస్తుంది. ఆ ప్రపంచం అనుక్షణం మానవ కార్యాచరణల వల్ల, ముఖ్యంగా ఉత్పత్తి వల్ల తిరిగి తిరిగి రూపొందుతున్నదని గుర్తిస్తుంది. ఈ పరస్పర సంబంధంలో సాంఘిక పరిస్థితులు, ప్రవర్తన, మనుషుల భావాల స్వభావంమీదా, అభివృద్ధి మీదా ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. సాంఘిక పరిస్థితుల మీదా ప్రవర్తన మీదా మనుషుల భావాల చూపే ప్రభావం కన్న ఆ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

పరాయీకరణ

మార్క్స్ చెప్పిన నిర్దిష్ట సిద్ధాంతాలను సరిగ్గా అర్థం చేసుకోవాలంటే అవి పెట్టుబడిదారీ విధానపు స్వభావం గురించీ అభివృద్ధి గురించీ ఆయన వేసిన సూటి ప్రశ్నలకు జవాబుగా రూపొందాయని గుర్తించ వలసి ఉంటుంది. మనుషులు తాము బతకడానికి సంపాదించే పద్ధతులు వారి శరీరాలమీదా, మనసుల మీదా, రోజువారీ జీవితం మీదా ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయి? మార్క్స్ ఈ ప్రశ్నకు జవాబును తన పరాయీకరణ సిద్ధాంతంలో చెపుతాడు. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులు ప్రతిరోజూ తమ పనిలో ఉపయోగించే సాధనాలు – యంత్రాలూ, ముడిసరుకులూ కార్ఖానాలూ – వాళ్లకు చెందినవి కావు. అవి పెట్టుబడిదారులకు చెందినవి. కార్మికులు ఆ పెట్టుబడిదారులకు తమ 'శ్రమ శక్తిని' లేదా 'పనిచేయగల సామర్థ్యాన్ని' అమ్ముకుని ప్రతిఫలంగా పొందే వేతనంతో జీవించవలసి ఉంటుంది.

ఈ రకమైన శ్రమ పద్ధతి వల్ల నాలుగు రకాల సంబంధాలు ఏర్పడతాయని మార్క్స్ పరాయీకరణ సిద్ధాంతంలో మౌలికంగా గుర్తించాడు.

1. కార్మికుడు / కార్మికురాలు తాను ఏ పని చేయాలో, ఎలా చేయాలో నిర్ణయించడంలో భాగస్వామ్యం లేనందువల్ల తన ఉత్పాదక కార్యాచరణ నుంచి పరాయీకరించబడతారు. తెగ్గొట్టబడతారు. ఆ పని ఏ పరిస్థితులలో ఎంత వేగంగా చేయాలో, అసలు ఆ మనిషి ఆ పని చేయాలో లేదో మరొకరెవరో నిర్ణయిస్తారు. పెట్టుబడిదారు నిర్ణయిస్తాడు. కార్మికులను ఇష్టారాజ్యంగా పనికి తీసుకునే, తొలగించే అవకాశం పెట్టుబడిదారుకు ఉంటుంది.

2. ఆ కార్యాచరణ ద్వారా కార్మికులు తాము తయారు చేసిన ఉత్పత్తి నుంచి కూడా పరాయి అయిపోతారు. ఏమి తయారువుతున్నదో, తయారైన వస్తువు ఏమౌతుందో, తన చేతులు దాటి పోయిన తర్వాత ఆ వస్తువు ఎక్కడికి పోతుందో, ఆ నిజమైన ఉత్పత్తిదారుకు ఎటువంటి అదుపు లేదు.

3. కార్మికులు తమ తోటి కార్మికుల నుంచి, మనుషుల నుంచి కూడా పరాయి అయిపోతారు. ఒక పని చేసేటప్పుడు అవసరమైన అనేక రూపాల సహకారం స్థానంలో పోటీ, ఒకరిపట్ల ఒకరికి వ్యతిరేక భావన నెలకొంటాయి. ఈ సంబంధం కార్మికులకూ, పెట్టుబడిదారులకూ మధ్య మాత్రమే కాదు. పెట్టుబడిదారు తన సొంత లాభాలనూ, ప్రయోజనాలనూ పెంచుకోవడానికే ప్రయత్నిస్తూ కార్మికుల శ్రమ మీదా, ఉత్పత్తి మీదా అదుపు చేస్తాడు గనుక వ్యతిరేకత సహజమే. కాని, ఈ వ్యతిరేకత ఒకేవర్గంలోని వేరు వేరు మనుషుల మధ్య కూడా ఏర్పడుతుంది. ఎందుకంటే ప్రతి ఒక్కరూ తనకు వీలైనంత బాగా మనుగడ సాగించాలనే కోరుకుంటారు.

4. చిట్టచివరికి కార్మికులు మానవ జీవులుగా మనందరికీ సమానంగా ఉన్న విశిష్టమైన సృజనాత్మక శక్తి నుంచీ సామాజికత నుంచీ కూడా పరాయి అయిపోతారు. తమ కార్యాచరణ నుంచీ, ఉత్పత్తి నుంచీ, తోటి మనుషుల నుంచీ తమను పరాయికరిస్తున్న శ్రమ వల్ల కార్మికులు క్రమ క్రమంగా తమ నుంచి తామే దూరమైపోతారు. మానవ జాతిలో సభ్యులుగా వారిలో సహజంగా ఉండే ఉదాత్త లక్షణాలను అభివృద్ధి చేసుకునే శక్తిని కోల్పోతారు.

ఈ సంబంధాలకు రెండు ముఖాలున్నాయి. ఒక ముఖం తీవ్రంగా కుంచించుకుపోయిన వ్యక్తిని తయారుచేస్తుంది. ఆ వ్యక్తి శారీరకంగా బలహీనుడు. మానసికంగా గందరగోళానికీ, భ్రమలకూ గురైనవాడు. ఒంటరివాడు. ఏ శక్తీ లేనివాడు. ఈ పరాయీకరణకు మరొక ముఖంగా కార్మికుడికి చుట్టూ బోలెడు ఉత్పత్తులుంటాయి. ఇతర మనుషులుంటారు. కాని ఆ ఉత్పత్తులు, మనుషులు తన అదుపులో ఉండరు. అసలు ఆ ఉత్పత్తులు ఏమిటో, ఆ మనుషులు ఎవరో అర్థం కూడా కాదు. మార్కెట్ అనబడే ఒక భ్రమాజనిత పదార్థానికి లొంగిపోయి కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులు ఒక చేతినుంచి మరొక చేతికి చలామణీ అవుతూ ఉంటాయి. ఆ క్రమంలో ఆ ఉత్పత్తులు వేరు వేరు పేర్లు మార్చుకుంటుంటాయి. ఒకప్పుడు దాన్ని విలువ అంటారు. మరొకప్పుడు సరుకు అంటారు. మరొకప్పుడు పెట్టుబడి అంటారు. మరొకప్పుడు లాభం అంటారు. మరొకప్పుడు అద్దె అంటారు. మరొకప్పుడు వేతనం

అంటారు. ఆ సరుకు ఎవరి చేతిలో ఉన్నది, ఎలా వాడుతున్నారు అనే దాన్ని బట్టి ఆ పేరు ఉంటుంది. చిట్టచివరికి ఇవే సరుకులు తమ అసలు స్వభావాలలో కనబడకుండా కార్మికుల నిత్య జీవితంలోకి పునఃప్రవేశిస్తాయి. మరొక యజమాని ఇంటి రూపంలో, కిరాణా దుకాణదారు అమ్మే సరుకు రూపంలో, బ్యాంక్ ఇచ్చే రుణం రూపంలో, యజమానికి చెందిన కార్ఖానా రూపంలో, తాను తయారు చేసిన సరుకులే కార్మికుల జీవితంలోకి వస్తాయి. అంతేకాదు, తోటి మనుషులతో తన సంబంధాలను నిర్దేశించడానికి వేరువేరు చట్టాలు, పద్ధతులు ఉంటాయి.

విచిత్రమేమంటే తన పరాయీకరణను పునరుత్పత్తి చేసే పరిస్థితులను కార్మికుడే తనకు తెలియకుండానే తయారు చేస్తున్నాడు. కార్మికులు తమ శ్రమద్వారా తయారు చేసిన ప్రపంచం, శ్రమ పరాయీకరణ ద్వారా పోగొట్టుకున్న ప్రపంచం మరొకరి సొంత ఆస్తిగా కార్మికుడికి తిరిగి దర్శనమిస్తుంది. ఆ ప్రపంచంలోకి తాము ప్రవేశించాలంటే తమ శ్రమశక్తిని అమ్ముకొని అనుమతి సంపాదించ వలసిందే. శ్రమశక్తిని అమ్ముకొనడమంటే మరొకసారి మరింత శ్రమ పరాయీకరణకు గురికావడమే. పరాయీకరణ గురించి మార్క్స్ ఇచ్చిన ఉదాహరణలు పారిశ్రామిక కార్మికుల జీవితాల నుంచి గ్రహించినవే అయినప్పటికీ ఇతర అన్ని వర్గాల ప్రజలుకూడా అటువంటి పరాయీకరణకు గురిఅవుతూనే ఉంటారు. ఈ సంబంధాల ప్రభావం వారిమీద ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఏమేరకు ఉంటుందో ఆ మేరకు పరాయీకరణ ఉంటుంది. పెట్టుబడిదారులు కూడా అటువంటి పరాయీకరణకు గురిఅవుతూనే ఉంటారు.

విలువ సిద్ధాంతం

కార్మికుల శ్రమ పరాయీకరణ ప్రభావం వాళ్లు చేసిన ఉత్పత్తుల మీద ఎలా ఉంటుంది? వారు చేయగల పనులమీద కానీ, వారితో చేయగల పనుల విషయంలోగానీ ఆ ప్రభావం ఎలా ఉంటుంది? సరుకుల ధరలను వివరించడానికి స్మిత్, రికార్డోలు శ్రమ విలువ సిద్ధాంతాన్ని ఉపయోగించారు. ఏ సరుకు విలువైనా దాని ఉత్పత్తిలో ఖర్చయిన శ్రమకాలపు మొత్తానికి ఫలితమేనని వాళ్లు వివరించారు. మార్క్స్ ఈ వివరణను దాదాపుగా అంగీకరించాడు. అయితే ఆయన శ్రమ విలువ సిద్ధాంతం అసలు ఏ వస్తువులకైనా, ఎటువంటి ధరలైనా ఎందుకు ఉండాలనే మౌలిక సమస్య మీద ప్రధానంగా దృష్టి పెట్టింది. పెట్టుబడిదారీ విధానంలో మాత్రమే ఉత్పత్తి అయిన వస్తువుల పంపిణీ మార్కెట్లూ, ధరలూ అనే మాధ్యమం ద్వారా జరుగుతుంది. బానిస సమాజంలో ఒక బానిస యజమాని తన బానిసలు ఉత్పత్తి చేసినదాన్నంతా బలప్రయోగంతో లాక్కుంటాడు. తనకు ఎంత ఇష్టమొస్తే అంత ఆ బానిసలకు ప్రతిఫలంగా ఇస్తాడు. ఇక భూస్వామ్యంలో భూస్వామి తన అర్ధ బానిసలు ఉత్పత్తి చేసిన దానిలో కొంత భాగాన్ని తన భూస్వామ్య హక్కుగా స్వాధీనం చేసుకుంటాడు. మిగిలిన భాగమే అర్ధ బానిసలు నేరుగా వినియోగించడానికి అందుబాటులో ఉంటుంది. ఈ రెండు రకాల సమాజాలలోనూ ఉత్పత్తిలో అత్యధిక భాగాన్ని ఎవరూ కొనలేదు, అమ్మలేదు. అంటే అప్పుడు వస్తువులకు ధర అనే మాటకు అర్థం లేదు.

మరి పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి అయిన ప్రతి వస్తువుకూ ధర ఉండడం అనే అసాధారణ వాస్తవం కనబడుతూ ఉంది. దీన్ని వివరిస్తూ మార్క్స్ ఉత్పత్తి సాధనాల నుంచి ఉత్పత్తిదారుడైన కార్మికుడు వేరయిపోవడమే కారణమన్నాడు. పాత సమాజాలలో బానిసలూ, అర్ధ బానిసలూ తమ ఉత్పత్తి సాధనాలకు కట్టివేయబడి ఉన్నారు. పెట్టుబడిదారీ సమాజంలో ఇలా వేరు చేయబడడం వల్ల కార్మికులు తమ శ్రమ శక్తిని అమ్ముకోక తప్పని పరిస్థితి తలెత్తింది. తమ చేతుల్లో ఉత్పత్తి సాధనాలు ఏమీ లేవుగనక కార్మికులు బతకాలంటే తప్పని సరిగా తమ శ్రమశక్తిని అమ్ముకోవలసి వస్తుంది. అలా శ్రమశక్తిని అమ్ముకునేటప్పుడు ఆ శ్రమ ఏ ఉత్పత్తులను చేస్తుందో ఆ ఉత్పత్తులమీద తమ అధికారాన్ని వాళ్లు వదులుకోవలసి వస్తుంది. అప్పుడిక ఆ వస్తువులన్నీ మార్కెట్‌లో వినిమయానికి అందుబాటులోకి వస్తాయి. నిజానికి అసలు ఉత్పత్తే వినిమయం కోసం జరగడం మొదలవుతుంది. మరొకవైపు ఆ ఉత్పత్తి చేసిన కార్మికులు తమ శ్రమశక్తిని అమ్ముకున్నందు వల్ల వచ్చే వేతనాలతో మార్కెట్‌లోకి వెళ్లి తమ ఉత్పత్తులలో కొంత భాగాన్ని వినియోగం కోసం కొనుక్కునే స్థితి వస్తుంది.

అంటే, కార్మికుల పరాయీకృత శ్రమ అన్ని వస్తువుల మీద వేసే సాధారణ ప్రభావాన్నే 'విలువ' అంటున్నాం. అప్పుడిక ఆ వస్తువులన్నీ చేయగలిగిన పని, వాటితో ఎవరైనా చేయగల పని వినిమయం మాత్రమే. ఆ వినిమయానికి వీలు కల్పించే వాస్తవం వాటి ధర. అంటే, విలువ అంటే ఒక ప్రత్యేకమైన ధర కాదు. ఏ సరుకైనా అసలు ధర అనేది కలిగి ఉండడానికి అవసరమైన మొత్తం పరిస్థితుల సముదాయాన్ని మనం విలువగా భావిస్తున్నాం. ఈ అర్థంలోనే అసలు విలువ అనేది పెట్టుబడిదారీ విధాన ఉత్పత్తి అని మార్క్స్ అన్నాడు. ఈ విలువను మార్క్స్ రెండు రూపాలలో చూశాడు. మార్కెట్‌లో ఒక సరుకు వినిమయం కావడానికి ఉండే నమూనా ధర. దాన్ని మారకపు విలువ అన్నాడు. అట్లాగే ఆ సరుకు ఎన్నెన్ని రకాలుగా మనిషికి ఉపయోగపడడం ద్వారా విలువ సంతరించుకుంటుందో అది ఉపయోగపు విలువ. పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులకూ, వారి కార్యాచరణకూ మధ్య; ఉత్పత్తులకూ ఇతర ప్రజలకూ మధ్య ఎటువంటి విలక్షణమైన సంబంధాలు ఉంటాయని మార్క్స్ వివరించాడో ఆ సంబంధాలన్నిటినీ ఈ మారకపు విలువ, ఉపయోగపు విలువలు విభిన్న రూపాలలో ప్రదర్శిస్తాయి.

ఒక ప్రత్యేక మానవ లక్షణం, ఒక వైవిధ్యభరితమైన పని తమను తాము చెరిపివేసుకున్న స్థితిని మారకపు విలువ ప్రతిఫలిస్తుంది. పరాయీకరణ ద్వారా కార్మికుల మధ్య సంబంధాలు ఎంతకు కుదించబడతాయంటే వారు చేసిన ఉత్పత్తులలో ఉపయోగించిన శ్రమ పరిమాణం మాత్రమే లెక్కకు వస్తుంది. వాటిలోని ప్రత్యేక నైపుణ్యాలు, ప్రత్యేక లక్షణాలు కనబడకుండా పోతాయి. అలా పరిమాణం లెక్కకు వచ్చినప్పుడు మాత్రమే సరుకులు వాటిలోని శ్రమ పరిమాణాల నిష్పత్తిని బట్టి ఒకదానితో ఒకటి మారకం చేయడం వీలవుతుంది. ఒక సరుకు ధర దాని ఉత్పత్తిలో నిక్షిప్తమైన శ్రమకాలపు పరిమాణానికి సమానమని స్మిత్, రికార్డోలు చేసిన సూత్రీకరణ ఈ వివరణతో పరిపుష్టమవుతుంది. మరి ఉపయోగపు విలువ విషయానికి వచ్చేసరికి సరుకుల భౌతిక లక్షణాలు దేనికి దానికే ప్రత్యేకంగా విశిష్టంగా ఉంటాయి. కాని పెట్టుబడిదారీ సమాజంలో ఈ సరుకుల తయారీలో ఉపయోగపు

విలువకన్న మారకపు విలువకే ఎక్కువ ప్రాధాన్యత దొరుకుతుంది. పెట్టుబడిదారీ సమాజంలో ఉద్దేశపూర్వకంగానే సరుకులు కాలం చెల్లిపోయేలా చూడడం, ఒక సరుకు మన్నికకన్న ఎక్కువ ప్రాధాన్యత ఆకర్షణకు ఇవ్వడం, పారిశ్రామిక ఉత్పత్తిని పెద్ద బృందాలలో కాక వ్యక్తిగత స్థాయిలోనూ, కుటుంబ స్థాయిలోనూ జరపడం వంటి చర్యలన్నీ మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేయడానికీ, సంకుచితం చేయడానికీ చేసే ప్రయత్నాలకు తిరుగులేని దాఖలాలు.

విలువకు మూడో కోణం కూడ ఉంది. దాన్ని అదనపు విలువ అంటారు. అది కార్మికులు తమ శ్రమ ద్వారా సృష్టించే మారకపు విలువ, ఉపయోగపు విలువల మొత్తానికీ, వారు వేతనంగా పొందే దానికీ మధ్య ఉండే తేడా. ఒక పెట్టుబడిదారు మిగిలిన అన్ని సరుకులు కొన్నట్టుగానే ఒక కార్మికుడి శ్రమ శక్తిని కొంటాడు. ఆ శ్రమ శక్తిని తన ఇష్టం వచ్చినచోట రోజుకు ఎనిమిది గంటలో, అంతకన్న ఎక్కువో వినియోగించుకుంటాడు. అయితే కార్మికులు తమకు అందిన వేతనానికి సరిపోయిన సరుకులను అయిదు గంటలలోనే ఉత్పత్తి చేయగలరను కుందాం. మిగిలిన మూడు గంటల్లో, అంతకన్న ఎక్కువ విలువగల సరుకులు ఉత్పత్తి అయినప్పటికీ అవి కార్మికుడికి చెందవు. పెట్టుబడిదారు చేతుల్లోకి పోతాయి. ఈ విధంగా అదనపు ఉత్పత్తి మీద పెట్టుబడిదారులకు ఉండే అధికారమే వారికి కార్మికుల మీదా, మొత్తం సమాజం మీదా ఉండే అధికారానికి పునాది. ఈ అదనపు విలువ ఎంత పరిమాణం ఉండాలనే విషయంలో పెట్టుబడిదారులకూ, కార్మికులకూ ఎప్పుడూ పోరాటం జరుగుతుంటుందని చెపుతూ ఆ పోరాటపు పూర్తి వివరాలను మార్క్స్ శ్రమ విలువ సిద్ధాంతం అందజేస్తుంది. పెట్టుబడిదారేమో పని దినానికి ఎన్ని గంటలో అది పెంచాలనీ, లేదా తక్కువ గంటల్లోనే పని వేగం పెంచాలనీ, తద్వారా అదనపు విలువను పెంచుకోవాలనీ ప్రయత్నిస్తుంటాడు. అలా తమ అదనపు విలువ కొల్లగొట్టబడకుండా ఉండేందుకు, తమను తాము రక్షించుకునేందుకు కార్మికులు సంఘటితం అవుతూ ఉంటారు. మరొక వైపు పెట్టుబడిదారుల మధ్యనే తీవ్రమైన పోటీ ఉంటుంది గనుక, అంతకంతకూ యంత్రాలు పెరుగుతున్న కొద్దీ కార్మికులు బయటికి తోసివేయబడుతుంటారు గనుక, మిగిలిపోయిన కార్మికుల నుంచి ఇంకా ఇంకా ఎక్కువ అదనపు విలువ సంపాదించడానికి పెట్టుబడిదారులకు అవకాశం దొరుకుతుంది. అవసరమూ పెరుగుతుంది.

అయితే విచిత్రంగా అదనపు విలువ పరిమాణం పెరగడమే పెట్టుబడిదారీ విధానపు అతి పెద్ద బలహీనతకు వనరు. ఎందుకంటే తాము సృష్టించిన ఉత్పత్తిలో కొంత భాగమే కార్మికులకు వేతనంగా దొరుకుతుంది గనక, కార్మికులు ఎప్పటికీ తాము వినియోగించవలసిన వస్తువులను హెచ్చుస్థాయిలో కొనలేరు. అంటే, పరిశ్రమలలో ఉత్పత్తి అయ్యే మొత్తం సరుకులు అలా పెరిగిపోతూనే ఉంటాయి. ఆ వస్తువులన్నిటినీ అమ్మగల మార్కెట్లను అందుకోవడంలో పెట్టుబడిదారులు ఎప్పటికప్పుడు విఫలమవుతుంటారు. దీనివల్ల అధికోత్పత్తి సంక్షోభం తలెత్తుతుంది. ఇది పెట్టుబడిదారీ విధానపు మౌలికమైన సంక్షోభం. దాని అర్థం ఏమంటే కార్మికులు చాలా ఎక్కువ ఉత్పత్తి చేశారుగనుక చాలా తక్కువ మీద జీవించవలసి వస్తుంది.

చరిత్ర గమనం

పెట్టుబడిదారీ విధానం ఎలా పుట్టింది? ఎక్కడికి చేరబోతోంది? ఈ ప్రశ్నలో మొదటిభాగానికి జవాబు చెప్పే క్రమంలో మార్క్స్ భౌతికవాద చారిత్రక దృక్పథం భూస్వామ్య విధానం నుంచి పెట్టుబడిదారీ విధానానికి పరివర్తన ఎలా జరిగిందో వివరిస్తుంది. పట్టణాల పెరుగుదల, జనాభా పెరుగుదల, సాంకేతిక విధానమూ, వ్యాపారమూ పెరుగుదల వల్ల ఏర్పడిన వైరుధ్యాలు ఒక నిర్దిష్ట దశలో అప్పటివరకూ ఉత్పత్తిని సంఘటితం చేసిన భూస్వామ్య సామాజిక రాజకీయ రూపాలను బద్దలు చేశాయని మార్క్స్ వివరిస్తాడు. భూస్వామికీ అర్ధబానిసకూ మధ్య పాత భూస్వామ్య హక్కులమీదా సంప్రదాయాలమీదా ఆధారపడి ఏర్పడిన సంబంధాలు అప్పటివరకూ ఉన్న ఉత్పత్తి శక్తులు మరింతగా అభివృద్ధి చెందడానికి ఆటంకంగా మారిపోయాయి. అలా ఎంతోకాలం గడిచిన మీదట, ఎన్నో రాజకీయ పోరాటాలు సాగిన మీదట పెట్టుబడిదారులకూ కార్మికులకూ మధ్య ఒప్పందంతో కూడిన సంబంధాలు ఏర్పడవలసి వచ్చింది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం లాభాలు ఎక్కడ వస్తాయనుకుంటే అక్కడికి స్వేచ్ఛగా తరలివెళ్లడానికి పెట్టుబడిదారులకు అధికారం వచ్చింది. అలాగే కార్మికులకు తమ శ్రమశక్తిని స్వేచ్ఛగా ఏ పెట్టుబడిదారుకైనా అమ్ముకోవడానికి, ఆ పెట్టుబడిదారు దాన్ని ఎలా వాడుకున్నా సరే అని అమ్ముకోవడానికి అధికారం వచ్చింది. ఇందువల్ల కొత్త ఉత్పత్తి శక్తులలో ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంలో, శాస్త్ర విజ్ఞానంలో అంతర్గర్భితంగా ఉన్న ఉత్పాదక శక్తులు విడుదలయి లెక్కించ శక్యంగానంత స్థాయికి ఎదిగాయి.

అయితే ఇక్కడ ఒక సమస్య ఉంది. లాభాలు పెంచుకోవడం వేగవంతమైన అభివృద్ధికి దారితీస్తుంది. వేగవంతమైన అభివృద్ధి ఇంకా ఎక్కువ లాభాలకు దారితీస్తుంది. అంటే, ఏ పరిణామం లాభసాటి కాదో అక్కడ అభివృద్ధి ఆపివేయబడుతుందన్నమాట. 1830ల నుంచి పెట్టుబడిదారీ విధానంలో క్రమం తప్పకుండా వస్తున్న సంక్షోభాలు దీనికి ప్రబల నిదర్శనం. అప్పటి నుంచి పెట్టుబడిదారీ విధానంతో పాటు ఉనికిలోకి వచ్చిన కొత్త ఉత్పత్తి శక్తులు, సంపదను సృష్టించడంలో వాటి అభివృద్ధి, వాటి శక్తి ఆ ఉత్పత్తి సంఘటితం చేసిన పెట్టుబడిదారీ సామాజిక సంబంధాలతో వైరుధ్యాన్ని ఎదుర్కోవడం మొదలుపెట్టాయి. పెట్టుబడిదారులు కార్ఖానాలనూ, యంత్రాలనూ, ముడిసరుకులనూ, శ్రమశక్తినీ తమ సొంతం చేసుకొని సరుకులు తయారు చేసే పనిలో పెట్టారుగానీ, కచ్చితంగా లాభాలు వస్తాయంటేనే ఈ పని జరిగింది. ఈ ఉత్పత్తి కారకాలు ఎంత ఎక్కువగానైనా ఉండనీ, ఆ ఉత్పత్తులకు వినియోగదారులలో ఎంత అవసరమైనా ఉండనీ లాభం రాకపోతే ఆ ఉత్పత్తి కారకాలను ఉపయోగించడమూ ఉండదు, ఆ సరుకులు తయారు చేయడమూ ఉండదు. సమాజానికి అవసరమైన సంపద ఉత్పత్తి చేయకుండా ఉండడంలో ఎంత వ్యయం అవుతున్నదో, ఎంత నష్టం అవుతున్నదో అది పెరిగిపోతూ ఉంటుంది. అట్లాగే సమాజ వ్యతిరేకమైన స్వభావం కలిగిన రూపాలలో సంపద తయారుకావడం వల్ల జరిగే నష్టమూ పెరిగిపోతూ ఉంటుంది. అందువల్లనే ఉత్పత్తిని మరింత సమర్థంగా, మరింత మానవీయంగా రూపొందించవలసిన అవసరం పెరుగుతుంది.

ఈ అవగాహనా చట్రంలోపల నిజమైన చరిత్ర గమనాన్ని వర్గపోరాటం నిర్ణయిస్తుంది. ఉత్పత్తి క్రమంతో దానికి ఉండే సంబంధాన్ని బట్టే ఒక వర్గాన్ని ప్రధానంగా నిర్వచించడం జరుగుతుందని మార్క్స్ అన్నాడు. ఆ వర్గానికి ఆ సంబంధంలోనే వస్తుగతమైన ప్రయోజనాలు ఉంటాయని కూడా ఆయన అన్నాడు. పెట్టుబడిదారుల ప్రయోజనాలు తమ అధికారాన్ని పెంచుకోవడంలో, లాభాలను విస్తరించుకోవడంలో ఉంటాయి. మరొకపక్క కార్మికుల ప్రయోజనాలు ఎక్కువ వేతనాలలో, సురక్షితమైన పని పరిస్థితులలో, తక్కువ పని గంటలలో, ఉద్యోగ భద్రతలో ఉంటాయి. అంతేకాదు, వారి ప్రయోజనాలను సాధించుకోవడానికి అవసరమైన పద్ధతిలో అధికారాన్ని పునర్విభజించుకోవడంలో కూడా కార్మికుల ప్రయోజనాలు ఉంటాయి. ఈ రెండు ప్రయోజనాల మధ్య సఖ్యత కుదర్చడం సాధ్యం కాదు. ఒకరి ప్రయోజనాలు ఏమేరకు నెరవేరితే ఆ మేరకు మరొకరి ప్రయోజనాలు దెబ్బతింటాయి. అదే ఈ రెండు ప్రధాన వర్గాల మధ్య జరిగే వర్గపోరాటం. ఈ వర్గ యుద్ధం సమాజంలోని అన్ని రంగాలలోనూ చెలరేగుతుంది. ఇందులో పెట్టుబడిదారులకి తమ సంపద సహకారం ఉంటుంది. రాజ్యం మీద వాళ్ల నియంత్రణ సహకారం ఉంటుంది. ప్రజల ఆలోచనను నిర్దేశించే, వక్రీకరించే పాఠశాలలూ, ప్రచార సాధనాలూ, చర్చిలూ వంటి అన్ని సంస్థల మీద పెట్టుబడిదారుల ఆధిపత్యం వాళ్లకు సహకరిస్తుంది. మరి కార్మికుల పక్షాన్నో? వాళ్లకు ఉండేది కేవలం సంఖ్యాబలం. పని స్థలంలో ఎంత పరాయీకరించబడి అయినా ఒకరికొకరు సహకరించుకుంటూ పని చేసిన అనుభవం వాళ్లకు ఉపయోగపడుతుంది. ట్రేడ్ యూనియన్లు ఉపయోగపడతాయి. ఉనికిలో ఉన్న చోట కార్మికవర్గ రాజకీయ పార్టీలు ఉపయోగపడతాయి. వీటన్నిటికి తోడు పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు సమకాలీన జీవన స్థితిగతులను అంతకంతకూ ఎక్కువగా అర్థం లేనివిగా మారుస్తూ ఉంటాయి గనుక అవి కార్మికులకు ఉపయోగపడతాయి.

పెట్టుబడిదారీ విధానం కింద రాజ్యాంగ యంత్రం అనేది పెట్టుబడిదారుల చేతుల్లో ఒక సాధనంగా పనిచేస్తుంది. ప్రమాదకరమైన భిన్నాభిప్రాయాలను అణచివేయడానికి, అదనపు విలువ రాబట్టుకోవడానికి, విస్తరించుకోవడానికి పెట్టుబడిదారులు రాజ్యాంగ యంత్రాన్ని వాడుతారు. ఈ పని ప్రధానంగా కార్మికవర్గ వ్యతిరేక చట్టాలను తయారు చేయడంలో, అమలు చేయడంలో జరుగుతుంది. అంతేకాదు, పెట్టుబడిదారులకు అనేక రకాల ఆర్థిక ప్రోత్సహకాలూ, రాయితీలూ ఇవ్వడం ద్వారా జరుగుతుంది. ('పెట్టుబడిదారుల సంక్షేమం'). రాజ్యాంగ యంత్రాన్ని మార్క్స్ అనేక రాజకీయ వ్యవస్థల సమాహారంగా కూడ చూశాడు. ఆ రాజకీయ వ్యవస్థలు పెట్టుబడిదారీ విధానపు ఆర్థిక వ్యవస్థలతో ముడిపడి ఉంటాయి. ఆ ఆర్థిక వ్యవస్థల అవసరం ఏమంటే పెట్టుబడిని అంతకంతకూ ఎక్కువగా పోగేసుకోవడం. అంటే, విలువలను ఉత్పత్తి చేసే ఉత్పత్తి సాధనాలను పోగేసుకోవడం. రాజ్యాంగ యంత్రపు పనల్లా ఈ ప్రయోజనాలను పరిరక్షిస్తూ మొత్తం వ్యవస్థ కుప్పకూలి పోకుండా చూడడమే. ఇక చిట్టచివరిగా రాజ్యాంగ యంత్రమనేది వర్గపోరాట వేదిక కూడ. అక్కడ వర్గాలూ, వర్గాలలోని ముఠాలూ రాజకీయ ప్రాబల్యం కొరకు ఘర్షణ పడతాయి. కాని, అది అసమాన యుద్ధం. అక్కడ పెట్టుబడిదారుల చేతులలోనే శక్తిమంతమైన అన్ని ఆయుధాలూ ఉంటాయి. పెట్టుబడిదారీ రాజ్యాంగ యంత్ర పాత్ర ఒక సంక్లిష్ట సామాజిక సంబంధం అనే విషయాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే దాన్ని ఈ మూడు కోణాల నుంచీ అధ్యయనం చేయాలి: 1. అది పెట్టుబడిదారీ వర్గానికి ఒక పనిముట్టు; 2. అది ఒక రాజకీయ కార్యాలయాల, క్రమాల వ్యవస్థ; 3. అది ఒక వర్గపోరాట వేదిక.

పెట్టుబడిదారీ విధానం తన చేతిలోని బలప్రయోగ సాధనాలకు తోడ్పడడం కోసం ఒక భావజాలాన్ని కూడా తయారు చేస్తుంది. ఒక ఆలోచనా సరళిని తయారు చేస్తుంది. దానిద్వారా ప్రజలు యథాస్థితిని అంగీకరిస్తుంటారు. లేదా కనీసం ఇప్పుడు ఉన్నదానికన్న మంచిదాన్ని తేగల అవకాశం లేదని గందరగోళ పడుతుంటారు. చాలా సందర్భాలలో ఈ భావజాలంలోని ప్రధానమైన ఆలోచనలు, భావనలు మనుషులకు ఏం నేర్పుతాయంటే, ఒక ఘటననో, సంస్థనో చూసేటప్పుడు కనబడే విషయాలే చూడాలి. దాని చరిత్రను పట్టించుకోగూడదు. మార్పుకు ఉండే అవకాశం గురించి ఆలోచించగూడదు. ఆ ఘటనో, సంస్థో ఏ విశాల నేపథ్యంలో ఉన్నదో ఆలోచించగూడదు. తత్ఫలితంగా ప్రతి మనిషి ఆలోచనలోనూ కొన్ని పాక్షిక, జడాత్మక, వక్రీకరించబడిన, ఏకపక్ష భావనల గుచ్ఛం ఉంటుంది. ప్రతి మనిషీ ఏమి ఆలోచించాలని పెట్టుబడిదారులు కోరుకుంటారో సరిగ్గా ఆ గుచ్ఛమే ఇది. ఉదాహరణకు పెట్టుబడిదారీ భావజాలం ప్రకారం వినియోగదారులకు సర్వం సహాధికారం ఉందని చెపుతారు. సూపర్ మార్కెట్‌లోకి వెళ్లి తమ ఇష్టం వచ్చిన వస్తువులు కొనుక్కుని పరిశ్రమలో ఏమి ఉత్పత్తి చేయాలో వినియోగదారులే వాస్తవికంగా నిర్ణయిస్తున్నట్టుగా ఈ భావజాలం చెపుతుంది. కాని, ఆ వినియోగదారులు కూడా తమ అభిరుచులను ఎలా అభివృద్ధి చేసుకున్నారో అంటే చరిత్ర ఏమిటో విశ్లేషించడానికి ఏ ప్రయత్నమూ జరగదు. అట్లాగే సూపర్‌మార్కెట్‌లో దొరికే వస్తువుల వరుసను ఎవరు నిర్ణయించారో, అంటే, విశాల వ్యవస్థ ఏమిటో కూడ అర్థం చేసుకోవడానికి ఏ ప్రయత్నమూ జరగదు. ఒక ఘటనను దాని చారిత్రక సామాజిక సందర్భంలో పెట్టడం అంటే మరో మాటల్లో దాన్ని గతితార్కికంగా అధ్యయనం చేయడం, పెట్టుబడిదారీ ఆలోచనా విధానం ఏ సంకుచిత నిర్ధారణలకు దారితీస్తుందో అందుకు పూర్తిగా భిన్నమైన నిర్ధారణలకు దారితీస్తుంది. విడదీయడానికి వీలులేని అంశాలను వక్రీకరించి విడదీయడానికి ప్రయత్నించడం ద్వారా పెట్టుబడిదారీ భావజాలం పరాయీకరించబడిన మనుషుల, శకలాలుగా మారిపోయిన జీవితాల ఆలోచనలను ప్రతిఫలిస్తుంది. అదే సమయంలో వాళ్లు తమ పరాయీకరణను గ్రహించడం కష్టమయ్యేటట్టు చేస్తుంది.

అయితే పెట్టుబడిదారీ విధానపు వైరుధ్యాలు ఇంకా పెద్దవైన కొద్దీ, ఇంకా లోతైనకొద్దీ, దాచి ఉంచడానికి వీలులేని పరిస్థితి వచ్చే కొద్దీ రాజ్యాంగయంత్రం గానీ, ఈ భావజాలం గానీ పనికిరాకుండా పోతాయి. కార్మిక జనబాహుళ్యం – వాళ్లు మధ్యతరగతి కార్మికులు కావచ్చు, కింది తరగతి పారిశ్రామిక కార్మికులు కావచ్చు – తమ ప్రయోజనాలు ఏమిటో గుర్తిస్తారు. అంటే వర్గచైతన్యం పొందుతారు. అందుకు తగినట్టుగా కార్యాచరణలోకి దిగుతారు. ఆ సమయం వచ్చినప్పుడు పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోయడం పెట్టుబడిదారీ శక్తుల స్వభానికి తగినట్టుగా వేగవంతంగానూ ప్రజాస్వామికంగానూ సాగుతుందని మార్క్స్ అన్నాడు. ఆ విప్లవ ఫలితంగా ఒక సోషలిస్ట్

సమాజం లేచి నిలుస్తుంది. అది పెట్టుబడిదారీ విధానం నుంచి వారసత్వంగా అందిన ఉత్పాదకశక్తిని సంపూర్ణంగా వినియోగించు కుంటుంది. ఇంకా విస్తారంగా అభివృద్ధి చేస్తుంది. ప్రజాస్వామికమైన ప్రణాళికల ద్వారా ఇక నుంచి ఉత్పత్తిని సామాజిక అవసరాలను తీర్చే దిశలో సాగిస్తారు. వ్యక్తుల సొంత లాభాలను పెంచుకొనేందుకు కాదు. సోషలిస్ట్ సమాజం తన నిర్మాణంలో నిరంతరమూ తపన పడే అంతిమ లక్ష్యం అత్యంత మానవీయమైనది. అది పరాయీకరణను రద్దుచేయడం. ఈ లక్ష్యం సాధించడమే కమ్యూనిజం అని మార్క్స్ అన్నాడు.

ఇవ్వాల్టి మార్క్సిజం

మార్క్స్ తరువాత సాగిన ఈ వంద సంవత్సరాలలో పెట్టుబడిదారీ విధానం చాలావరకు మారిందని మనందరికీ తెలుసు. అయితే భూస్వామ్య విధానం నుంచి, సోషలిజం నుంచి పెట్టుబడిదారీ విధానాన్ని వేరుచేసే మౌలిక సంబంధాల వ్యవస్థల విషయంలో దానిలో వచ్చిన మార్పులు చాలా తక్కువ. మార్క్స్ సిద్ధాంతాలలో పెట్టుబడిదారీ విధానపు ప్రధాన లక్షణాలుగా వేటిని గుర్తించాడో వాటిలో వచ్చిన మార్పులు చాల తక్కువ. ఉదాహరణకు, గత శతాబ్దంలో కన్న ఇప్పుడు కార్మికులు ఎక్కువ డబ్బులు సంపాదిస్తూ ఉండవచ్చు. మరి పెట్టుబడిదారులు కూడా ఎక్కువే సంపాదిస్తున్నారు. తత్ఫలితంగా ఈ రెండువర్గాల మధ్య సంపదలోనూ, ఆదాయంలోనూ ఉన్న తేడాలు అప్పటికన్నా చాలా ఎక్కువ. కార్మికులకు తమ శ్రమతో, తమ ఉత్పత్తులతో, పెట్టుబడిదారులతో ఉండే సంబంధాలు మార్క్స్ రోజులలో ఉన్నట్టుగానే ఉన్నాయి. ఆ సంబంధాలను ఇంతకుముందే పరాయీకరణ సిద్ధాంతంలోనూ, శ్రమ విలువ సిద్ధాంతంలోనూ చూసి ఉన్నాం. బహుశా మనం చూస్తున్న పెట్టుబడిదారీ విధానానికి, మార్క్స్ చూసిన పెట్టుబడిదారీ విధానానికి అతి పెద్ద తేడా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో రాజ్యాంగ యంత్రపు ప్రత్యక్ష జోక్యంలో ఉంది. రాజ్యాంగ యంత్రం ఇబ్బడిముబ్బడి లాభాలు సంపాదించి పెట్టడం కొరకు పనిచేస్తోంది. దాని ఫలితంగానే రాజ్యాంగ యంత్రపు సంస్థలకూ పెట్టుబడిదారీ వర్గానికి అంతకంతకూ పెరిగిపోతున్న సన్నిహిత సంబంధాలను దాచిపెట్టడానికి భావజాలం పాత్ర పెరిగిపోతున్నది.

తొలిరోజులనుంచి కూడా మార్క్సిజం మీద అన్నివైపుల నుంచీ దాడులు జరుగుతున్నాయి. అయితే ఈ విమర్శలలో ప్రధానమైనవి మార్క్స్ ఎన్నడూ అనని మాటలను అన్నట్టుగా చెపుతూ చేసే విమర్శలు. ఉదాహరణకు, మార్క్స్ భౌతికవాదం ప్రతిపాదించాడు కనుక ఆయన చరిత్రలోనూ, ప్రజాజీవితంలోనూ భావాల పాత్రను నిరాకరించాడని కొందరు విమర్శిస్తుంటారు. అట్లాగే మార్క్సిజాన్ని 'ఆర్థిక నియతివాదం' అని విమర్శిస్తూ మరికొందరు మార్క్స్ రాజకీయాలనీ, సంస్కృతినీ, మతాన్నీ ఏకపక్ష ఆర్థిక కారణపు సులభ ప్రభావాలుగా చూసాడని విమర్శిస్తారు. అలాచేసి ఉంటే అది గతితర్కానికి వ్యతిరేకం. ధరలు నిర్ణయించడంలో శ్రమ ఒక్కటే పాత్రవహిస్తుందని అన్నాడని, అంటే విలువనూ ధరనూ ఆయన సమానం చేశాడని పొరపాటుగా అర్థం చేసుకొని శ్రమ విలువ సిద్ధాంతాన్ని కూడా పొరపాటున విమర్శించడం జరుగుతోంది. ధరలమీద పోటీ ప్రభావాన్ని ఆయన విస్మరించాడని విమర్శ సాగుతోంది. అలాగే పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాలు ఎటువైపు దారితీస్తాయో ఆయన చేసిన ఊహలను మారడానికి వీలులేని జ్యోతిష్యాలుగా భావించి తప్పుడు జ్యోతిష్యం చెప్పినందుకు ఆయనను విమర్శించడం జరుగుతోంది.

చివరిగా మరికొందరు కొన్ని కమ్యూనిస్టు దేశాలలో జరిగిన ప్రజాస్వామ్య వ్యతిరేక ఆచరణలను చూపెడుతూ అసలు మార్క్సిస్ట్ సిద్ధాంతంలోనే అంతర్గర్భితంగా నిరంకుశత్వం ఉందని వాదిస్తారు. నిజం చెప్పాలంటే మార్క్స్ సిద్ధాంతం ఆధునిక పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాల మీద కేంద్రీకరించింది. అక్కడ అప్పటికే ప్రజాస్వామిక సంస్థలు ఏర్పడి అసమర్థంగా పనిచేస్తున్నాయి. మరి ఆయన సాపేక్షికంగా పేద, రాజకీయంగా అభివృద్ధి చెందని దేశాలలో సోషలిజం నిర్మాణం ఎలా ఉంటుందో ఊహించనైనా లేదు.

నేనిక్కడ నిర్వచించినట్టుగా మార్క్సిజం పెట్టుబడిదారీ దేశాలలో, ముఖ్యంగా యూరప్‌లో కార్మికుల మీద, మేధావుల మీద ప్రధానమైన ప్రభావం వేసింది. వాళ్లు తమ సమస్యలను అర్థం చేసుకోవడంలో, రాజకీయ వ్యూహాలను నిర్మించుకోవడంలో మార్క్సిజాన్ని ప్రధానమైన పరికరంగా వాడుకున్నారు. పాశ్చాత్య దేశాలలో చివరికి మార్క్సేతర మేధావులు కూడ – ముఖ్యంగా సామాజిక శాస్త్రవేత్తలూ, చరిత్రకారులూ మార్క్స్ రచనల నుంచి గణనీయమైన దృక్పథాన్ని పొందగలిగారు. ఇక మూడోప్రపంచ దేశాలలో ఆదిమ పరిస్థితులు, ఆధునిక పెట్టుబడిదారీ పరిస్థితులు కలగలిసిన ఒక ప్రత్యేక సమ్మేళనం వల్ల మార్క్సిజాన్ని గణనీయంగా మార్చుకోవలసి వచ్చింది. అక్కడ మార్క్సిజం ఎన్నో విముక్తి ఉద్యమాలకు శత్రువులుగా ఉన్నవారి స్వభావం ఏమిటో స్పష్టం చేసుకోవటానికి ఉపయోగపడింది. ఇక కమ్యూనిస్టు దేశాలలో మార్క్స్ సిద్ధాంతాలలో కొన్నిటిని ఘనీభవింపచేశారు. పాలకుల అధికారిక భావజాలాన్ని సమర్థించడానికి మార్క్సిజాన్ని ఒక సార్వత్రిక సూత్రంగా ప్రచారం చేశారు. ఈ మూడు రకాల మార్క్సిజపు ప్రభావం దాని విభిన్న వస్తువు వల్ల విభిన్నంగా ఉంది.

అమెరికా పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న తాజా సంక్షోభంలో ఒకవైపు పెరిగిపోతున్న నిరుద్యోగం, మరొకవైపు దిగజారుతున్న ద్రవ్యోల్బణం ఎంతోమంది నిపుణులు అనుకునే వాళ్లను గందరగోళ పరుస్తున్నాయి. చరిత్రలోకెల్లా అత్యంత బలసంపన్నమైన దేశం దారిద్ర్యాన్ని నిర్మూలించలేకపోతోంది. పూర్తి స్థాయి ఉద్యోగ కల్పన చేయలేకపోతోంది. అందరికీ మంచి గృహవసతి కల్పించలేకపోతోంది. తగినంత ఆహారం, మంచి ఆరోగ్య వసతి ప్రజలకు అందించ లేకపోతోంది. మరొక పక్క ధనికులు మరింత ధనికులు అయిపోతూ ఉన్నారు. ఈ రకంగా మౌలికంగానే హేతురహితమైన పెట్టుబడిదారీ విధానపు అసలు స్వరూపం హేతుబద్ధంగా బయటపడుతూ ఉన్నప్పుడు మన ప్రస్తుత సంక్షోభాన్ని మనకు అర్థం చేయించగలిగినది మార్క్సిజం ఒక్కటే. అర్థం చేయించడం మాత్రమే కాదు, వర్గపోరాటంలో ఈ సంక్షోభం నుంచి బయటపడే మార్గం చూపేదీ మార్క్సిజమే. ఇక మిగిలిన పని మనదే.

(న్యూయార్క్ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర శాఖలో ప్రొఫెసర్, ఎలీనేషన్ – మార్క్స్ కన్‌సెప్షన్ ఆఫ్ మాన్ ఇన్ కాపిటలిస్ట్ సొసైటీ, డాన్స్ ఆఫ్ డైలెక్టిక్ వంటి పుస్తకాల రచయిత బెర్టెల్ ఓల్‌మన్ 1990లో రాసిన మార్క్సిజం – అన్ అన్‌కామన్ ఇంట్రడక్షన్ పుస్తకంలో మొదటి అధ్యాయం) వీ

గిరిజనులకు ఆరోగ్య సేవలందిస్తున్న కొన్ని ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, క్రైస్తవ మిషనరీల కృషిని వివరిస్తున్నారు **పల్లెర్ల కల్పన, పసుల యాకస్వామి**

అటవీ ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు

ప్రపంచంలో ఆఫ్రికా తరువాత భారతదేశంలో గిరిజనులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో సువిశాలమైన అరణ్య ప్రాంతాలలో గిరిజనులు సుమారుగా 38 మిలియన్లకు పైగా ఉన్నారు. దేశం మొత్తం జనాభాలో గిరిజన ప్రజలు 7 శాతానికి పైగా ఉన్నారు. నేటి నాగరిక పరిస్థితుల్లో సమాజానికి దూరంగా, సహజమైన పరిసరాల్లో, కాలుష్యం కనబడని ప్రాంతాల్లో నివసిస్తూ తరతరాలుగా వస్తున్న సంప్రదాయ విలువలు, ఆచారాలు, నమ్మకాలతోనే జీవనం గడిపే వాళ్లు కూడా ఉన్నారు. వాళ్లే 'గిరిజనులు'. భారతీయ గిరిజనుల పరిస్థితిని అభివృద్ధి పరచడానికి బ్రిటిష్ వలస పాలనలో, గిరిజనుల సంక్షేమం కొరకు పలు స్వచ్ఛంద సంస్థలు ఆరోగ్యం, విద్య, జీవన విధానం, ఆహారం గురించి పలు స్వచ్ఛంద సంస్థలు, ముఖ్యంగా క్రైస్తవ మిషనరీలు కృషి చేశాయి.

బ్రిటిష్ వలస పాలనలో గిరిజనులు

బ్రిటిష్ వారు తమ ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా సైనిక, వ్యాపార రంగాలలో ఏర్పడిన అవసరాల రీత్యా గిరిజన ప్రాంతాలలో రోడ్లను విస్తరించక తప్పలేదు. రోడ్లు-రవాణా సౌకర్యాలు ఏర్పరచడంతో సైనికాధికారులు గిరిజన ప్రాంతాలను అప్పుడప్పుడు సందర్శించేవారు. ఈ రోడ్ల సహాయంతో మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతర్లు కాంట్రాక్టర్లుగా మారి అటవీ సంపదను కొల్లగొట్టడం జరిగింది.

గిరిజన ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారస్తులు గిరిజనులకు రుణాలు ఇచ్చి ఆ రుణాలు తీర్చే శక్తి లేని గిరిజనుల నుండి బలవంతంగా భూములను తమ వశం చేసుకున్నారు. ఈ దుర్భర దారిద్ర్యాన్ని గిరిజనులు భరించడం కష్టసాధ్యమైంది. ప్రతికార జ్వాలలు బయలు దేరి, కష్టాలకు గురైన మాల్ పగాడీలు 1772లో తిరుగుబాట్లను, పోరాటాలను ఆరంభించారు. గిరిజనులు జరిపిన ఈ పోరాటాల ఫలితంగానే బ్రిటిష్ వలస పాలన గిరిజనులకు 'పెన్షన్లు' ప్రవేశపెట్టారు.

గిరిజనులపై దోపిడి అధికంగా కావడంతో ఆందోళనలు, పోరాటాలు, ఉద్యమాలు తిరుగుబాట్లు పలు ప్రదేశాలలో సంభవించాయి. 1778లో బ్రిటిష్ ప్రభుత్వంపై చోటా నాగ్‌పూర్ ప్రాంతంలోని సహరియా సిర్దారుల తిరుగుబాటు, 1803 ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు గోదావరి ఏజన్సీ రంప ప్రాంతంలో కోయల తిరుగుబాటు, 1807చోటా నాగ్‌పూర్ గిరిజనుల తిరుగుబాటు, 1809-1828 బిల్లుల తిరుగుబాటు, 1829 ఖాసీల తిరుగుబాటు, మన రాష్ట్రంలో 1922లో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో కోయల తిరుగుబాటులో 1941 వలస రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కొమురంభీం నాయకత్వంలో కోయల తిరుగుబాటు, 1941 వలస రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా కొమరంభీం నాయకత్వంలో గోండులు, కొలామీ తిరుగుబాట్లు ఇలా అనేకం జరిగాయి.

1887-1914 మధ్యకాలంలో జరిగిన గిరిజన ఉద్యమాలను తిరుగుబాట్లను బ్రిటిష్ వలస పాలకులు గమనించి గిరిజనులను వడ్డీ వ్యాపారస్తుల దోపిడి నుంచి రక్షణ కల్పించడానికి వ్యవసాయ భూములు, కౌలుదారి, అటవీ హక్కులు, రుణగ్రస్తత, అడవులలో కూలీల పరిస్థితులు మొదలైన అనేక అంశాలకు సంబంధించి పలు శాసనాలను రూపొందించారు. గిరిజనుల భద్రత కోసం, రక్షణ కోసం, సంక్షేమం కోసం, షెడ్యూల్డ్ ప్రాంతాలను లేదా జిల్లాలను ప్రకటించి వారి అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపడుతున్నట్లు ప్రపంచానికి చాటాలని బ్రిటిష్ వలస ప్రభుత్వం తపన చెందింది. అయితే ఆచరణలో బ్రిటిష్ వలస ప్రభుత్వం "విభజించు-పాలించు" సూత్రాన్ని గిరిజనులలో కూడా అనువర్తింపచేసింది.

సేవలందించడంలో క్రైస్తవ మిషనరీల పాత్ర

1. భారతదేశంలోని గిరిజనులకు మొట్టమొదటిసారిగా సంక్షేమ కార్యక్రమాలను పరిచయం చేసిన ఘనత పాశ్చాత్య దేశాలకు చెందిన క్రైస్తవ మత ప్రచారక సంస్థలకు చెందుతుంది.
2. కె.ఎన్. సహాయ్ (1968) చెప్పినట్లు భారతదేశంలోని గిరిజనులు, ఇతర బడుగు వర్గాల సంక్షేమం కోసం కార్యక్రమాలు చేపట్టిన సంస్థలలో పురాతనమైనవి క్రైస్తవ మత సంస్థలే. తమ సంక్షేమ కార్యక్రమాలతోనూ, వాటి అమలులో కనబరచిన పట్టుదల, దీక్షలతోను క్రైస్తవ మత సంస్థలు ఆదర్శంగా నిలిచాయి.
3. గిరిజన ప్రాంతాల్లో మొదటిసారిగా ఆసుపత్రులను వారే ప్రారంభించారు. తాము కూడా ప్రగతి, అభివృద్ధి సాధించాలన్న పట్టుదల, ప్రేరణను గిరిజనుల్లో కల్పించిన వారు క్రైస్తవ మత ప్రచారకులే. అలాగే గిరిజనుల్లో వారి హక్కుల గురించి చైతన్యం కలిగించినవారు కూడా క్రైస్తవ మత ప్రచారకులే.
4. విద్యారంగంలో క్రైస్తవ మత ప్రచారకులే మార్గదర్శకులు.
5. ఈ క్రైస్తవ మత సంస్థలు ప్రధానంగా మధ్య భారతదేశంలోనూ, ఈశాన్య భారతదేశంలోనూ తమ కార్యక్రమాలను కేంద్రీకరించాయి.
6. చోటా నాగ్‌పూర్ ప్రాంతంలో మొదటి పరపతి సంఘం ఏర్పాటు చేసిన ఘనత కెథలిక్ మత ప్రచారుకులకే చెందుతుంది.

7. క్రైస్తవ మత సంస్కరణలు అనేక ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టాయి. అనుబంధ వృత్తుల ద్వారా అదనపు ఆదాయం సంపాదించే మార్గాలను సైతం ఈ మత సంస్థలు గిరిజనులకు బోధించాయి.
8. భారతదేశంలో అంత వరకు అశ్రద్ధకు గురైన గిరిజనుల దోపిడి నివారణకు, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి కూడా ప్రప్రథమంగా కృషి చేసినవారు క్రైస్తవ మత ప్రచారకులేనని చెప్పవచ్చు.
9. క్రైస్తవ మతంలో భారతదేశంలో గిరిజనాభివృద్ధికి, సంక్షేమానికి బలమైన ప్రేరణ శక్తిగా పనిచేసింది. క్రైస్తవ సంస్థలు మారుమూల ప్రాంతాల్లోనూ అవాసయోగ్యం కాని ప్రాంతాల్లోను పాఠశాలలు, ఆసుపత్రులు, వృత్తికేంద్రాలు ఏర్పాటు చేయడం చాలా హర్షణీయమైన పరిణామం.

1871లోనే భిల్ సేవా మండలి గుజరాత్‌లో ప్రారంభమైనది. బిల్లులు, రాణిపరేజ్ల సంక్షేమం కోసం పంచమహల్ జిల్లాలో మిరక్‌నది వద్ద ఆశ్రమాన్ని ఏర్పాటు చేసింది. సేవా మండలి సమర్ధవంతంగా నడిపించడంలో కీలకపాత్ర వహించిన వ్యక్తి ఎ.వి. దక్కర్. ఈయన క్రమంగా థక్కర్ బాపాగా ప్రసిద్ధి చెందాడు. ఆధునిక భారతదేశంలో అత్యంత ప్రసిద్ధుడైన గిరిజన సంఘ సేవకునిగా ఆయన గుర్తింపు పొందాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు భారతదేశంలో 21 గిరిజన సేవా మండలులను ఏర్పాటు చేశాడు. 1948లో ఆయన స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతి డాక్టర్‌రాజేంద్ర ప్రసాద్‌తో కలిపి ''భారతీయ ఆదిమజాతి సేవక్ సంఘ్‌ను'' ఏర్పాటుచేశాడు. భారతదేశంలో గిరిజన తెగలను సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా అభివృద్ధి చేసి భారత జాతీయ జీవనంలో ఇతరులతో సమానులైన పౌరులుగా వారికి గుర్తింపు లభింపచేయడం. ఈ సంఘ లక్ష్యం.

సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ రామకృష్ణ మిషన్‌ను కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా పేర్కొనవలసి ఉంటుంది. ఇటీవల కాలంలో ఈ రెండు సంస్థలు రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో గిరిజనుల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నాయి. వీరు ప్రధానంగా వైద్య సహాయం, మందుల పంపిణీ, సహకారం, అప్పుడప్పుడు స్థానిక స్వయం పరిపాలన రంగాల్లో గిరిజనులకు తోడ్పడుతున్నారు. 1. సర్వసేవా సంఘ్; 2. గాంధీ స్మారకనిధి; 3. కస్తుర్భాస్మారకనిధి; 4. ఆదిమజాతి సేవామండలి; 5. అశోక్ ఆశ్రమం; 6. టాటా సాంఘీక శాస్త్రాల సంస్థ; 7. భారతీయ లోక్ కళామందిర్ మొదలైనవి గిరిజన సంక్షేమ కార్యక్రమాలు చేపెట్టే స్వచ్ఛంద సంస్థలు.

ధర్మాపూర్ ఉత్సాస వాహిని (ధ్రువ) అనేది దక్షిణ గుజరాత్‌లో పనిచేసే ఒక స్వచ్ఛంద సంస్థ. ఎనిమిది రాష్ట్రాలలో అనేక స్వచ్ఛంద సంస్థలద్వారా తన కార్యకలాపాలను విస్తరించిన భారతీయ వ్యవసాయధార పరిశ్రమల సమాఖ్య (బైఫ్)కి 'ధృవ' అనుబంధ సంస్థ. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ మహాత్మునితో సన్నిహితంగా పనిచేసిన స్వర్గీయ మణిభాయ్ దేశాయ్‌పూణేలో1975 లో (బైఫ్) నుస్థాపించారు.

'ధ్రువ 1955లో బైఫ్ ఆధ్వర్యాన స్వతంత్ర స్వచ్ఛంద సంస్థగా అవతరించింది. దక్షిణ గుజరాత్ ప్రాంతంలో 15 ఏళ్లకు పైగా ఇది సేవలందించింది. దక్షిణ గుజరాత్‌లోని వల్సద్, నవ్‌సారీ, డాంగ్స్ జిల్లాలో ప్రస్తుతం 'ధ్రువ' 200ల గిరిజన గ్రామాలలో పనిచేస్తున్నది.

సాంప్రదాయకంగా గిరిజనులు అడవులపైన, పశుపోషణ, వ్యవసాయం వంటి వృత్తుల మీద ఆధారపడి జీవిస్తుంటారు. అయితే పట్టణాల అభివృద్ధి, ప్రపంచీకరణ విధానం జోరందుకున్న తరువాత అటవీ సంపద క్రమంగా క్షీణిస్తున్నది. జల వనరులు అడుగంటి, పశుగ్రాసం, ఇంధనాలకు కొరత ఏర్పడి, వ్యవసాయం, పశుగణాభివృద్ధి మందగించాయి. గిరిజనుల్లో బేరసారాల సామర్థ్యం, కొరవడి, తమ ఇళ్లు కూడా ఒకదానికొకటి దూరంగా నిర్మించుకునే వారి అలవాటు వల్ల గిరిజన జనాభా నష్టపోతున్నది. గిరిజనులకున్న చిన్నపాటి కమతాలకు సాగు వసతి కూడా లేక పంట ఉత్పత్తి కూడా అంతంత మాత్రంగానే ఉంది. వీటి ఆసరాతో లభించే ఆదాయంతో బతుకు వెళ్లదీయలేని గిరిజన కుటుంబాలుజీవనాధారం కోసం పొరుగు పట్టణాలకు వలసపోయాయి.

గిరిజన ప్రాంతాలలో ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వమేగాక స్వచ్ఛంద సంస్థలైన ఆంధ్రప్రదేశ్ యానాది అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ ఆదిమజాతి సేవక్ సంఘ్‌లు 1948 నుండి పనిచేస్తున్నాయి. ఇప్పుడు బంజారా సంఘాలు, ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ అసోసియేషన్ తదితర సంస్థలు వీరికొరకు పని చేస్తున్నాయి. ఇన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్నా కూడా ఈ 'పురాతన జాతులు' తమ లోకంలేనే వుంటూ జనజీవన స్రవంతికి దూరంగా వుంటున్నారు. కార్యక్రమాలు ప్రారంభమయినా నిధులకొరతతో మధ్యలోనే ఆగిపోతున్నాయి. గిరిజనలను గూర్చి పూర్తి అవగాహన అధికారులలో కొరవడడం వలన సరైన ఫలితాలు సాధించ లేకపోతున్నాయి. వీరి కొరకు ఒక ప్రత్యేక నాయకత్వం అంటూ వృద్ధి కాలేదు. గిరిజనులకు ప్రభుత్వ పథకాలు పలు కార్యక్రమాల గురించి తెలియపరచడానికి కావలసిన యంత్రాంగం తేదు. భాష కొరవడటం అవగాహన లోపం కారణంగా అవి వారికి ఉపయోగపడడం లేదు.

ఇందు నరిమిత్తం వీరికి ముందుగా అవగాహన ఏర్పరిచి చొరవగా వారి మధ్య చొచ్చుకునిపోయే నిస్వార్థ సేవకులు అవసరం. అప్పుడు వారిలో పేదవారు పూర్తి లబ్ది పొందగలరు. ప్రభుత్వంలోని స్తబ్దతకు వారు బలికాకుండా చూడడం పాలకుల, స్వచ్ఛంద సంస్థల బాధ్యత. ఈ కార్యక్రమాలను అమలు చేసే ముందు సరైన అవగాహనతో అవసరమైన గిరిజనులకు సహాయం అందేలా చూడాలి. త్వరలోనే వీరు వాస్తవిక అభివృద్ధి సాధించి వారి జీవన స్రవంతి మెరుగుపరచుకొ గలరని ఆశిద్దాం. ప్రగతి సేవా సమితి: ఈ సంస్థ ఎయిడ్స్ నియంత్రణ ప్రత్యేకంగా గిరిజనులైన స్త్రీ పురుషులకు 'ఎయిడ్స్ ప్రాజెక్టు' పేరుతో వారిలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నది.

నీళ్ళ విరేచనాలు, అమీబియాసిస్, స్కేబస్, కామెర్లు, మలేరియా, అల్సర్, పేగుపూత, చర్మ, శ్వాస సంబంధ వ్యాధులకు గిరిజనులు గురవుతున్నారు. అడవులు తగ్గిపోవడం ద్వారా అటవీ ఉత్పత్తులు తగ్గిపోవడం. దాంతో గిరిజనుల జీవనాధారం, వారికి ఆహార లభ్యత మీద కూడా విపరీతమైన ప్రభావం ఉంటుంది. తరచు వచ్చే వరదలు, కరువు కూడా గిరిజనుల ఆరోగ్యంమీద ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పై వాటన్నింటికి ఈ సేవా సమితి అవగాహన కల్పించింది.

మత్తు పానీయాలు తాగే అలవాటు, గుట్కా, పాన్ మసాలా తినే అలవాటు, ఆడవారు, మగవారు, చుట్ట తాగడం, అడ్డాకు తాగడం, పొగాకు నమిలే అలవాటు, నిరక్షరాస్యత, పరిసరాల పరిశుభ్రతను పాటించకపోవడం, స్వచ్ఛమైన నీళ్లు తాగకపోవడం, మద్యం తాగే అలవాటు, గుడుంబా, సారా, మొదలైనవి గిరిజనుల ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తున్నాయి. 'ప్రగతి సేవా సమితి' అనే స్వచ్ఛంద సంస్థ వాటి పై అన్నింటికి గిరిజనులకు అవగాహన కల్పించి, వారికి సలహాలు ఇచ్చి చైతన్య పరచింది. గిరిజనుల తల్లిదండ్రులకు వారి పిల్లలను బడికి పంపించేటట్టుగా వారికి నచ్చ చెప్పి పాఠశాలకు వెళ్ళేటట్టు చూడడం.

గిరిజనులు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆధునిక వ్యవసాయ పద్దతులు, యంత్రాలు, పనిముట్లు, ఎరువులు, క్రిమిసంహారక మందుల గురించి వివరించి పంటలు పండించే విధనము గురించి తెలిపి 'స్వచ్ఛంద సంస్థలు' సలహాలు ఇస్తుంది. భూమి అన్యాక్రాంతం కాకుండా వారిలో చైతన్యం కల్పిస్తుంది. నీటిపారుదల వినియోగంలో వారికి తగు సూచనలు చేస్తుంది. వంట చెరకు, చెట్ల పెంపకం, తునికి ఆకు సేకరణలో వారికి సూచనలు ఇస్తుంది.

గిరిజన కుటుంబాల్లో వారి అలవాట్లు, ఆచారాలు, సంప్రాదాయలకు విలువనిస్తారు. స్వచ్ఛంద సంస్థలు వారికి కొన్ని సూచనలు చేస్తుంది. బహు భార్యత్వం వలన కష్టాలు, అధిక సంతానం లేకుండా ఉండడం, స్త్రీలను వివక్షత గురికాకుండ చూడడం.

గిరిజనులు పండించిన పంటను సంతలో గిట్టుబాటు ధరకు అమ్మి, వారికి కావలసిన ఆహార పదార్థాలు తీసుకుంటారు. వడ్డీ వ్యాపారస్తుల నుండి, భూస్వాముల నుండి స్వచ్ఛంద సంస్థలు అన్యాయం జరుగకుండా కాపాడుతున్నాయి. తేనే, చీపుర్లు, చింతపండు, బంక, మోదుగు ఆకులకు గిట్టుబాటు ధర లభించేటట్లు చూడడం.

గిరిజనులకు స్వచ్ఛంధ సంస్థలు "గృహ వసతి" గురించి వరించి, గృహాలు నిర్మించుకునేటట్లు చేయడం. ఈ విధంగా బ్రిటిష్ వలస పాలకులు స్వచ్ఛంద సంస్థలు,సామాజిక కార్యకర్తలు గిరిజనుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారు. మూడ నమ్మకాలు, నిరక్షరాస్యత, అమాయకత్వం, దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించడం విచారకరం. క్రైస్తవ మిషనరీలు ముఖ్యంగా ప్రధాన భూమిక పోషించింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సంత, కుటుంబాల గురించి వివరించి అనేక సలహాలిచ్చి వారిలో చైతన్యాన్ని కలిగిస్తున్నాయి వీ

ప్రజాతంత్ర

సంపూర్ణ స్వతంత్ర వారపత్రిక



కె. బాలగోపాల్ 'నిగాహ్', దక్కన్.కామ్, జ్ఞాపకాలు, చెప్పుకోదగ్గ మనిషి వంటి వైవిధ్యభరిత శీర్షికలతో మరెన్నో విశేషాలతో, విశ్లేషణలతో వారం వారం మీ ముందుకు

చందా వివరాలు :

విడిప్రతి	రు.	5
సంవత్సరం	రు.	250
జీవిత సభ్యత్వం	రు.	2500

చిరునామా :
మార్కెటింగ్ మేనేజర్, 'ప్రజాతంత్ర' వారపత్రిక
ఇం.నెం. 12-1-62, విజయాగార్డెన్స్, బండ్లగూడ, నాగోల్,
రంగారెడ్డి జిల్లా - 500 068 ఫోన్ : 24222844
email : prajatantradaily@yahoo.com

తెలంగాణ టైమ్స్

A voice of Telangana People **వెల రు. 10**



తెలంగాణ టైమ్స్ మాసపత్రికగా వెలువడుతోంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎత్తిపడుతూ వివిధ వ్యాసాలు, కామెంట్స్, విశ్లేషణలను అందిస్తోంది. తెలంగాణ ఉద్యమ విశేషాలను, వార్తలను అందిస్తోంది. తెలంగాణ మేధావుల ఆధ్వర్యంలో వస్తూ తెలంగాణ ప్రజల గొంతును మనకు వినిపిస్తోంది.

రచనలు చందాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
సంపాదకుడు, తెలంగాణ టైమ్స్
జి-1, వరలక్ష్మి అపార్ట్‌మెంట్స్, రోడ్ నెం. 5, అలకాపురి,
హైదరాబాద్ - 500 035
సెల్ : 9949998912, 9866661239
website : http://times.discover-telangana.org

మహిళా మార్గం



కథలు, వ్యాసాలు, రిపోర్ట్‌లు, వివక్ష, స్పందన వంటి శీర్షికలు మహిళా పోరాటాలు, వార్తలు, విశేషాలతో ద్వైమాసిక పత్రికగా వస్తున్న 'మహిళా మార్గం' పత్రికను చదవండి, చదివించండి, చందాదారులు కండి

చందా వివరాలు :

విడిప్రతి	రు.	10
సంవత్సరం చందా	రు.	50
జీవిత చందా	రు.	500

చందాలు, రచనలు పంపవలసిన చిరునామా
బి. జ్యోతి, ఎడిటర్, మహిళామార్గం
3-6-779/6, వీధి నెం. 14, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040 - 27625245
Email : mahilamargam@rediffmail.com, jyothyapcms@yahoo.com

భూమిక

స్త్రీవాద పత్రిక భూమిక చదవండి, చందాదారులుగా చేరండి.
ఎంతమంది స్త్రీల దగ్గరకు ఈ పత్రిక చేరగలిగితే మాకంత సంతోషం




చందా వివరాలు :

విడిప్రతి	రు.	10
సంవత్సరం వ్యక్తులకు	రు.	100
సంస్థలకు	రు.	150
జీవిత సభ్యత్వం	రు.	2000

రచనలు, చందాలు పంపవలసిన చిరునామా :
హెచ్.ఐ.జి - 2, బ్లాక్-8, ఫ్లాట్-1, బాగ్‌లింగంపల్లి
వాటర్‌టాంక్ వెనక, హైదరాబాద్ - 500 044
ఫోన్ : 040-2766 0173 ఫాక్స్ : 040 - 27669401
Email : bhumikahyd@yahoo.com, kondaveetis@yahoo.com
www.bhumika.org

బహుజన కెరటాలు



'అంటరానివాడు ఒక మనిషిగా నిలబడే వరకు మంచి, చెడు, పొగడ్తలు, శాపనార్థాలు, గౌరవ అగౌరవాలకు అతీతంగా తుఫాన్లకెదురొడ్డి నిలబడ్డవాడే ధన్యజీవి'
అవిశ్రాంత పోరాటమే దళిత విముక్తికి
ఏకైక మార్గం, లేదు మరో మార్గం.


చందా వివరాలు :

విడిప్రతి	రు.	10
సంవత్సరం	రు.	150
జీవిత సభ్యత్వం	రు.	2500

చిరునామా :
కడియం నాగమణి
రాజగృహ, 4/15, ఆర్.టి.సి. స్టాఫ్ కాలనీ, సత్యనారాయణపురం,
ఒంగోల్ - 2. ప్రకాశం జిల్లా. ఫోన్ : 9849944170
email : bahujanakeratalu@gmail.com

స్వేచ్ఛ

పౌర ప్రజాస్వామిక హక్కుల వేదిక
'ప్రజా స్వేచ్ఛ'
చదవండి, చదివించండి



చందా వివరాలు :

విడిప్రతి	రు.	5
సంవత్సరం చందా	రు.	50
జీవిత చందా	రు.	500

చందాలు, రచనలు పంపవలసిన చిరునామ
టి. ఆంజనేయులు
డోర్ నెం. 27-17-25, పెద్దిభొట్లవారి వీధి,
గవర్నరుపేట, విజయవాడ - 2.

ముంబయి దాడులు

భారత ఆర్థిక రాజధాని ముంబయిపై ఉగ్రవాద పంజా మళ్లీ విరుచుకుపడింది. నవంబర్ 26న రాత్రి 10.15 గంటలకు దక్షిణ ముంబయిలోని తొమ్మిది చోట్ల ఉగ్రవాదుల బాంబు పేలుళ్లు, విచ్చలవిడి కాల్పులకు తెగబడ్డారు. ప్రధానంగా స్టార్ హోటల్లనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. ముంబయిలోని యూదుల ప్రార్థనా కేంద్రమైన నారిమన్ హౌజ్, తాజ్, ట్రిడెంట్-ఒబెరాయ్ హోటల్లపై దాడి చేశారు. ఉగ్రవాదుల దాడుల్లో యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఎటిఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఎన్ఎస్‌జి మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, హవాల్దార్ గజేంద్ర సింగ్‌తో సహా ఇరవై మంది పోలీసు ఉన్నతాధికారులు, మొత్తం 183 మంది బలయ్యారు. ఈ మొత్తం ఆపరేషన్‌లో పదిమంది ఉగ్రవాదులు హతమవ్వగా, కసబ్ అనే ఉగ్రవాది ప్రాణాలతో పట్టుబడ్డాడు. ఈ ఘటనలో నాలుగువేల కోట్ల ఆస్తినష్టం జరిగింది. కాగా ఈ పేలుళ్లకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి శివరాజ్‌పాటిల్ రాజీనామా చేశారు. హోంశాఖ బాధ్యతలను ఆర్థికమంత్రి చిదంబరంకు అప్పగించారు.

వీసా నిరాకరించిన బ్రిటన్

ఎండీఎంకే నేత వైగోకు లండన్ వెళ్లడానికి చుక్కెదురైంది. ఆయన నవంబర్ 24న లండన్ వెళ్లడానికి టికెట్ బుక్ చేసుకోగా తీరా ఒక రోజు ముందు వీసా జారీ చేయడానికి బ్రిటిష్ దౌత్య కార్యాలయం నిరాకరించింది. నిషేధిత ఎల్టీటీఈ సంస్థకు మద్దతు తెలుపుతున్నారన్న కారణంతో ఆయనకు వీసా నిరాకరించారని పోలీసు వర్గాలు తెలిపాయి.

ఏడుగురు పోలీసుల మృతి

చత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ జిల్లా కొండాగావ్-మర్ధపాల్ మార్గంలో నవంబర్ 25న మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో ఏడుగురు పోలీసులు మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రీపోలింగ్ సందర్భంగా పోలీసులు బందోబస్తుకు వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగింది. అనంతరం గాలింపు చేపట్టిన పోలీసులకు గ్రామస్తుడొకరు కనిపించగా, నక్సలైట్‌గా అనుమానించి కాల్చి చంపారు.

భూసేకరణ వద్దు

అత్యవసరమంటూ బాధిత ప్రజల అభ్యంతరాలు పరిశీలించకుండా ప్రభుత్వాలు భూసేకరణ జరపరాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. హర్యానా రాష్ట్ర సర్కార్ ప్రజా అవసరాల పేరుతో ప్రైవేట్ భూములు సేకరించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో జస్టిస్ కేసీ ఠాకూర్, డీకే జైన్‌లతో కూడిన ధర్మాసనం నవంబర్ 25న ఈ వ్యాఖ్యలు చేసింది. హర్యానాలోని పానిపట్ జిల్లా ఖేరినంగల్ గ్రామంలో అత్యవసర నిబంధనతో సర్కార్ భూ సేకరణకు ప్రయత్నించింది. దీంతో స్థానికులు భూసేకరణను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. భూ సేకరణకు సంబంధించి అత్యవసర కారణాలను వివరించడంలో హర్యానా ప్రభుత్వం విఫలమవడంతో సుప్రీం భూసేకరణను నిలిపివేసింది.

మాజీ ప్రధాని విపి సింగ్ కన్నుమూత

సంకీర్ణ సర్కార్‌కు ఆద్యునిగా నిలిచిన మాజీ ప్రధాని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (77) నవంబర్ 27న కన్నుమూశారు. దాదాపు 17 ఏళ్లుగా బ్లడ్ క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆరు నెలల క్రితం ఢిల్లీ అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నవంబర్ 28న అలహాబాద్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. బిజెపి మద్దతుతో 1989 డిసెంబర్ 2న ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విపి సింగ్ తన పదవీకాలంలో మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని ప్రయత్నించారు. అయితే ఈ విషయమై బిజెపి మద్దతు ఉపసంహరించడంతో 1990 నవంబర్ 10న ఆయన సర్కార్ పతనమైంది.

ఇందిరా గోస్వామికి డచ్ పురస్కారం

ఈశాన్య భారత విభిన్న సంస్కృతులను, అల్పసంఖ్యాకుల సమస్యలను, రాజకీయాలను ఇతివృత్తంగా చేసుకుని కథలు, నవలలు రాసిన అస్సామీ రచయిత్రి ఇందిరా గోస్వామికి నెదర్లాండ్ అత్యుత్తమ సాహిత్య పురస్కారం 'ప్రిన్సిపల్ ప్రిన్స్ క్లాస్'కు ఎంపికయ్యారు. ఈ అవార్డు కింద ఆమెకు లక్ష యూరోలు (రు.64 లక్షలు) నగదు పురస్కారం అందజేయనున్నారు. ఆమె తన స్వగ్రామం అమ్రాంగలో ఆసుపత్రిని నెలకొల్పాలనుకుంటున్నట్లు ప్రకటించారు.

శాసనసభ ఎన్నికల ఫలితాలు

ఐదురాష్ట్రాలకు నవంబర్, డిసెంబర్‌లలో జరిగిన శాసనసభ ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 8న వెలువడ్డాయి. ఢిల్లీ, రాజస్థాన్, మిజోరాంలలో కాంగ్రెస్ అధికారాన్ని కైవసం చేసుకోగా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లలో భారతీయ జనతా పార్టీ అధికారం నిలుపుకుంది.

	రాజస్థాన్	ఢిల్లీ	మిజోరాం	మధ్యప్రదేశ్	చత్తీస్‌ఘడ్
మొత్తం సీట్లు	200	70	40	230	90
ఫలితాలు ప్రకటించినవి	200	69	40	228	90
కాంగ్రెస్	96	42	32	70	38
బిజెపి	78	23	0	142	50
బిఎస్‌పి	6	2	0	7	2
ఇతరులు	20	2	1	9	0
ఎం.ఎన్.ఎఫ్.	0	0	3	0	0
యు.డి.ఎ.	0	0	4	0	0

ఎస్‌జిపిసి అధ్యక్షుడి ఎన్నిక

శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జిపిసి) అధ్యక్షుడిగా లుధియానాకు చెందిన జితేందర్ అవతార్ సింగ్ మక్కార్ ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగుతారు. స్వర్ణమందిరం ప్రాంగణంలోని తేజ్‌సింగ్ సముద్రి హాల్‌లో నవంబర్ 22న జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీ

బుష్‌కు బూటు దెబ్బ

అంతర్జాతీయ యుద్ధనేరస్తుడు అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ తన పదవికాలం చివరి రోజుల్లో ఇరాక్‌లో తీవ్ర అవమానానికి గురయ్యాడు. ఇరాకీ విలేకరి చేతిలో 'బూటు' దెబ్బ తిన్నాడు. ఇరాక్ ప్రధాని నౌరీ అలీ మాలిక్‌తో కలిసి హాజరైన విలేకర్ల సమావేశంలో ఆయనకు ఈ పరాభవం ఎదురైంది. ఈ సమావేశంలో విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చాడు. ఇరాక్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరాటం పూర్తయిందా? అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు 'ఇంకా కాలేదు' అని బుష్ బదులిచ్చాడు. ఇంతలో ముంతదార్ అలీ–జైదీ అనే ఓ టి.వి. విలేకరి 'ఇప్పుడు పూర్తవుతుంది' అంటూ తన రెండు కాళ్లకు ఉన్న బూట్లను ఊడదీసి బుష్ మీదకు విసిరాడు. మొదట విసిరిన బూటు బుష్ మీదకు నేరుగా దూసుకెళ్లింది. బుష్ ఈ దెబ్బ నుంచి చాకచక్యంగా తప్పించుకున్నాడు. ప్రభుత్వాధినేతల వెనుక ఉన్న ఇరు దేశాల జాతీయ పతాకాలకు తాకి అది పడిపోయింది. 'భర్త చనిపోయినవాళ్లు.. అనాథలు, మీ కారణంగా చనిపోయిన ఇరాకీల తరపున విసురుతున్నా.. కుక్కా ఇదే నీకు వీడ్కోలు ముద్దు' అంటూ జైదీ రెండో బూటును విసిరాడు. అది గురితప్పి ఎటో వెళ్లిపోయింది. అప్పటికే ఇరాక్ ప్రధాని భద్రతా సిబ్బంది ఆయనపై విరుచుకుపడ్డారు. సంఘటన స్థలంలోనే పెడ రెక్కలు విరిచి, కుళ్లపొడిచారు. ఇరాకీల తోపాటు ప్రపంచ ప్రజానీకం జైదీకి జేజేలు పలికి, బాసటగా నిలిచింది.

థాయ్ ప్రధానిపై ఐదేళ్ల రాజకీయ నిషేధం

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో థాయ్‌లాండ్‌లో అధికారంలో ఉన్న మూడు పాలక పక్షాలపై ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం నిషేధం విధిస్తూ డిసెంబర్ 2న తీర్పునిచ్చింది. గత 2007 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో సోమ్‌చాయ్‌కు చెందిన పీపుల్స్ పవర్ పార్టీ (పీపీపీ) మచితా తివతాయ్ పార్టీ, చార్ట్ థాయ్ పార్టీ అక్రమాలకు పాల్పడినట్లు న్యాయస్థానం అభిప్రాయపడింది. అలాగే ప్రధాని సోమ్‌చాయ్ వాంగ్‌సావంత్ ఐదేళ్లపాటు రాజకీయాల్లో పాల్గొనకూడదని నిషేధాజ్ఞలు జారీ చేసింది. నిజాయితీలేని థాయ్ రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు ప్రయత్నించాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

విదేశాంగ మంత్రిగా హిల్లరీ

అమెరికా విదేశాంగ శాఖ మంత్రిగా హిల్లరీ క్లింటన్‌ను నియమిస్తున్నట్లు ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికైన ఒబామా డిసెంబర్ 1న ప్రకటించారు. రాబర్ట్ గేట్స్‌ను రక్షణ శాఖ మంత్రిగా కొనసాగించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జాతీయ భద్రతా సలహాదారుగా జేమ్స్ జోన్‌ను, అటార్నీ జనరల్‌గా ఎరిక్ హోల్డర్, ఐరాస దౌత్యవేత్తగా సుసన్ రైస్‌ను నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

డిప్యూటీ స్పీకర్‌గా ప్రవాస భారతీయుడు

బ్రిటన్ పార్లమెంట్‌లోని ఎగువసభ 'హౌస్ ఆఫ్ లార్డ్స్'కు ఉప సభాపతి (డిప్యూటీ స్పీకర్) పదవికి ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్త స్వరాజ్యపాల్ ఎన్నికయ్యారు. బ్రిటన్ కేబినెట్‌లో భారత సంతతి వ్యక్తులు మంత్రులుగా పనిచేసినప్పటికీ పార్లమెంట్‌లో అత్యున్నత పదవి పొందడం ఇదే తొలిసారి. బ్రిటన్‌లో ప్రవాస భారతీయుల్లో ప్రముఖుల్లో ఒకరైన స్వరాజ్యపాల్‌ను 1983లో పద్మభూషణ్‌తో భారత్ సత్కరించింది. ఈయన 1979లో 'కేపారో' అనే బహుళజాతి కంపెనీని స్థాపించారు.

నాగరాజుకు యావజ్జీవ శిక్ష

ఏడు నెలల క్రితం బ్రిటన్‌లో దారుణ హత్యకు గురైన విజయవాడ విద్యార్థిని వెంపల సామ్రాజ్య జ్యోతిర్మయి హత్యకేసులో అసలు దోషి తెలుగువాడైన నల్లూరి నాగరాజు కుమారేనని అక్కడి కోర్టు నిర్ధారించింది. బర్మింగ్‌హామ్‌లోని హాండ్స్‌వర్త్‌లో ఆమె ఫ్లాట్‌లోనే ఉండే అతను హత్యకు ముందే ఆమెపై అత్యాచార యత్నం చేశాడని కోర్టు పేర్కొంది. ఇంతటి కిరాతకానికి ఒడిగట్టిన నాగరాజుకు బర్మింగ్‌హామ్ క్రౌన్ కోర్టు యావజ్జీవ శిక్ష విధిస్తూ డిసెంబర్ 12న తీర్పు వెలువరించింది. 25 ఏళ్ల శిక్ష పూర్తయ్యేవరకు నాగరాజుకు కనీసం పెరోల్ అంశం పరిశీలించేది కూడా లేదని స్పష్టం చేసింది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే. **(21 నవంబర్ నుండి 20 డిసెంబర్ వరకు)**

జిల్లా	ఆత్మహత్యలు			హత్యలు				గుర్తు తెలియని	ఆకలి	ప్రమాదాలు			చికిత్స అందక, అనారోగ్యం	పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
	వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు	ఫ్యాక్షన్	కులం	మతం	తగాదాలు			పనిచేసే స్థలంలో	రహదారి	ఇతరాలు		ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)
ఆదిలాబాద్	4	–	21	–	–	–	4	4	–	4	17	22	5	–	–	–	1	–
హైదరాబాద్	–	–	39	–	–	–	21	16	–	–	62	28	–	–	–	–	26	–
కరీంనగర్	4	4	48	–	–	–	7	8	3	–	30	10	32	–	–	–	1	–
ఖమ్మం	2	–	26	–	–	–	4	6	–	3	23	8	44	–	–	–	–	–
మహబూబ్‌నగర్	9	2	41	2	–	–	1	5	–	4	59	31	9	–	–	–	–	–
నిజామాబాద్	–	–	20	–	–	–	14	5	–	14	32	29	–	–	–	–	–	–
నల్గొండ	5	3	9	–	–	–	2	6	–	–	25	27	1	–	–	–	–	–
మెదక్	14	–	34	–	–	–	12	8	–	12	24	16	11	–	–	–	–	–
కర్నూల్	12	–	31	–	–	–	6	11	–	9	43	26	23	–	–	–	–	–
అనంతపురం	6	4	27	4	–	–	1	4	–	5	33	12	11	–	–	–	–	–
చిత్తూరు	–	–	15	–	–	–	6	–	–	22	40	–	13	–	–	–	–	2
తూర్పు గోదావరి	3	1	30	–	–	–	5	9	–	–	33	50	10	–	–	–	4	–
గుంటూరు	2	–	6	–	–	–	18	2	–	14	17	12	2	–	–	–	1	8
కృష్ణా	–	–	12	–	–	–	–	6	2	2	18	27	1	–	–	–	–	1
విజయనగరం	–	–	5	–	–	–	3	–	–	2	12	4	2	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	10	–	–	–	4	6	–	5	18	7	2	–	–	–	–	2
శ్రీకాకుళం	–	–	6	–	–	–	10	–	–	–	21	17	14	–	–	–	–	–
*ఇతర జిల్లాలు	–	–	6	–	–	–	1	–	–	–	1	–	–	2	–	–	–	–
మొత్తం	**61**	**14**	**386**	**6**	**–**	**–**	**119**	**134**	**5**	**96**	**508**	**326**	**180**	**2**	**–**	**–**	**33**	**13**

అందిస్తున్నవారు : హైదరాబాద్ – డి. విజయభాస్కర్; మహబూబ్‌నగర్ – ఏసురత్నం; ఆదిలాబాద్ – శ్రీమన్నారాయణ మూర్తి; కరీంనగర్ – ఎల్. సంతోష్; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నల్గొండ – డి. మహేష్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; ఖమ్మం – సి.ఎచ్. కృష్ణ; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – కె.వి. రమణ; కృష్ణా – బి. రమేష్‌బాబు; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహిమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; అనంతపురం – ఆదిశేషు; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి

* ఇతర జిల్లాల సమాచారం

RNI Regn.No.APTEL/2003/11482 • Published 29/12/2008 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10

మహిళా సాధికారత సాధనలో రాష్ట్ర ప్రభుత్వం.

పావలా వడ్డీ - మహిళా సంఘాలు	: 10 లక్షల మహిళా స్వయం సహాయక బృందాలు ఏర్పాటు ఈ ఏడాది పావలా వడ్డీ కింద 10 వేల కోట్ల రుణాలు
ఇందిరమ్మ ఇళ్ళు	: మహిళలకే అంకితం
బాలికా సంరక్షణ పథకం	: మహిళా వివక్షను రూపుమాపే ప్రయత్నం
జనని సురక్ష యోజన	: పేద గర్భిణీ మహిళలకు వెయ్యి రూపాయల వరం
పింఛన్లు	: వృద్ధ మహిళలకు, వితంతువులకు ఆర్థిక వెసులుబాటు
భూపంపిణి	: మహిళల పేరుమీదే పట్టాలు





ఇన్నాళ్ళకు మాకు ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది





"ఇంటిని తీర్చిదిద్దాలన్నా, దేశాన్ని అభివృద్ధిబాటలో నడిపించాలన్నా మహిళల సహకారం ఎంతో అవసరమని నమ్ముతాను నేను. అందుకే ఏ పథకానికి రూపమిస్తున్నా అది నా అక్కాచెల్లెళ్ళకు ఎంత మేలుచేస్తుందన్న దాని మీదే దృష్టి పెడతాను. 115 రూపాయలకే నిత్యావసర వస్తువుల పంపిణీ పథకంలోనూ మహిళల సంక్షేమానికే పెద్దపీట వేశాం. ముఖ్యంగా పేదమహిళలకు ఆర్థికస్వాతంత్ర్యం కలిగించడం కోసం ప్రవేశపెట్టిందే పావలావడ్డీ పథకం.

మా ప్రభుత్వ పథకాలన్నీ మహిళల ఆర్థికఅభ్యున్నతికి తోడ్పడుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను.మహిళాసంఘాల ద్వారా పొందే పావలావడ్డీ రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించి ప్రతి మహిళా ఒక లక్షాధికారి కావాలనేదే నా ఆకాంక్ష.

మీ వై.యస్.రాజశేఖరరెడ్డి.

ప్రతి ఇల్లాలి ముఖంలో చిరునవ్వు నింపడానికి

- రెండురూపాయలకే బియ్యం
- 50 రూపాయల భారం తగ్గిన వంటగ్యాస్
- 45 రూపాయలకే పామాయిల్
- 30 రూపాయలకే కిలో కందిపప్పు



జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

R.O.No. 810/Sou/Advt.I/2008-09

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao